# ప్రపంచీకరణ కవిత్వం - వస్తు శిల్పాల పరిశీలన

**హైదరాబాదు విశ్వవిద్యాలయానికి పి.హెచ్.డి. పట్టం కోసం**

**సమర్పించిన సిద్ధాంత గ్రంథం**


**పరిశోధకుడు**

**పెద్దింటి ముకుందరావు**

**తెలుగు శాఖ**

**మానవీయశాస్త్రాల విభాగం**

**హైదరాబాదు విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్,ఇండియా.**


**డిసెంబర్ - 2013**

# PRAPANCHEEKARANA KAVITVAM - VASTU SHILPAALA PARISHEELANA

**A Dissertation Submitted to the University of Hyderabad in Partial Fulfillment of the Degree of**

**Doctor of Philosophy**

**In**
**Telugu**
**By**

**PEDDINTI MUKUNDARAO**

**DEPARTMENT OF TELUGU**
**SCHOOL OF HUMANITIES**
**UNIVERSITY OF HYDERABAD**
**HYDERABAD - 500046**
**DECEMBER - 2013**

# DECLARATION

I, **Peddinti Mukundarao,** hereby declare that this dissertation entitled **"Prapancheekarana Kavitvam - Vastu Shilpaala Pariseelana"** submitted by me under the guidance and supervision of Professor **R.V.R.Krishna Sastry** is the original research work and it has not been submitted previously either in part or in full to any University or Institution for the award of any Degree or Diploma.

Signature of the Student

Reg. No. 08HTPH07

Place: Hyderabad

Date: 31st.Dec.2013

# CERTIFICATE

This is to certify that the thesis entitled "PRAPANCHEEKARANA KAVITHVAM VASTHU - SHILPAALA PARISHEELANA" Submitted by PEDDINTI MUKUNDARAO Bearing Reg. No. 08HTPH07, in partial fulfillment of the requirement for the award of Doctor of Philosophy in TELUGU is a bonafide work carried by him under my supervision and guidance. The dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

**Research Supervisor** **Head**

**Prof. R. V. R. Krishna Sastry**

**Dean**

# కృతజ్ఞతలు

నా అభిరుచిని గమనించి పల్లె నుండి పట్టణ ప్రాంతానికి ఉన్నత చదువులు చదివించాలి అన్న కోరికతో నన్ను చదివించిన అమ్మ నాన్నలకు,

నాకు విద్యను బోధించిన గురువులకు శ్రేయోభిలాషులకు హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో చదువుకొనే అవకాశం లభించినందుకు వివిధ సంస్కృతులకు నిలయమైన ఈ విశ్వవిద్యాలయం తీపిజ్ఞాపకాలు మరువరానివి.

నా పరిశోధనకు అవకాశం కల్పించిన అప్పటి తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు, కేవలం చదుకుంటే సరిపోదు జీవితానికి సంబంధించిన విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలి అన్న స్పృహను కలిగించిన ప్రస్తుత తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి గారికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

ప్రధానంగా నా ఆసక్తిని మన్నించి తమ పర్యవేక్షణలు పరిశోధన చేయడానికి అవకాశం కల్పించి, సకాలంలో సిద్ధాంతవ్యాసం పూర్తికావడానికి అమూల్యమైన సలహాలు, మార్గదర్శక సూత్రాలను అందిస్తూ ముందుకు నడిపించిన ఆచార్య రేమిల్ల వెంకట రామకృష్ణశాస్త్రి గారికి,
తెలుగు అధ్యాపకవర్గం ఆచార్య పరిమి రామనరసింహం(పుర్వశాఖాధ్యక్షులు), ఎన్.ఎస్.రాజు గారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ఆచార్య జి.అరుణకుమారి గారికి, డా.పిల్లల మర్రి రాములు గారికి, డా.దార్ల వెంకటేశ్వరరావుగారికి, డా.డి.విజయలక్ష్మి గారికి, డా.పమ్మి పవన్ కుమార్ గారికి, డా.బి.భుజంగరెడ్డి గారికి, డా.అద్దంకి శ్రీనివాస్ గారికి, డా.విజయకుమారి గారికి, కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

తెలుగుశాఖ బోధనేతర సిబ్బందికి భావానీశంకరం, రాంబాబు, కిషన్ లకు కృతజ్ఞతలు.
నాకు కవిత్వంపై మొగ్గు చూపి తన అమూల్యమైన సూచనలు, సలహాలు అందించిన డా.అద్దేపల్లి రామమోహనరావు గారికి, తన తమ్ముడిలా ఆదరించి మంచి సూచనలు చేసిన అన్న చింతకింది కాశీం అన్నకు కృతజ్ఞతలు.

నా అభివృద్ధిని కాంక్షించే నా తల్లిదండ్రులు అమ్మ కురుములమ్మ నాన్న అప్పలనాయుడు గారికి మనఃపూర్వక కృతజ్ఞతలు.

అలాగే నిరంతరం నా బాధ్యతలను గుర్తుచేస్తూ నాకు చేదోడు వాదోడుగా ఉంటూ నాకు సహకరించిన నా జీవిత భాగస్వామి 'జ్యోతి'కు హృదయపూర్వక కృతజ్ఞతలు.

అదే విధంగా నా కుటుంబ సభ్యులు అన్నయ సింహాచలం వదిన లక్ష్మి వారి పిల్లలు పావని మౌనికలకు, ఆత్మీయ బాల్యమిత్రుడు శివప్రసాదుకు మరియుఅన్న మిత్రుడు రాజుకుమార్ కు కృతజ్ఞతలు.

నా పరిశోధనకు సహకారాలు అందించిన ఐ.జి.ఎం. గ్రంథాలయ సిబ్బందికి, సెంట్రల్ లైబ్రెరీ సిబ్బందికి, గోపాలపట్నం(వైజాగ్) గ్రంథాలయ సిబ్బందికి కృతజ్ఞతలు.

నా అభివృద్ధిని కాంక్షించే నా తరగతి మిత్రులకు, ప్రత్యేకంగానూ, పరోక్షంగాను సహకరించినా వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

పి.ముకుందరావు

# ముందుమాట

**ఉపక్రమం:** ఆధునిక తెలుగు సాహిత్యంలో గత రెండు దశాబ్దాల కాలం నాటి తెలుగు సాహిత్య పరిణామాల్ని గమనిస్తే ప్రతి ప్రక్రియలోనూ ప్రపంచీకరణ అనే పదం కనిపిస్తూనే ఉంది. కథ, నవల, మొదలగు ప్రక్రియల కంటే కవిత్వంలోనే ప్రపంచీకరణ ఎక్కువగా కన్పిస్తుంది. ప్రపంచీకరణ సాహిత్యంలో కవులు, రచయితలు అనుకూలత కంటే వ్యతిరేక దృక్పథంతో నిరసన వ్యక్తం చేసారు. ఆయా కవులు రాసిన కవితా సంకలనాలను పరిశీలించిన మీదట నా పరిశోధనకు సంబంధించి భాగాలు చేయడం జరిగింది. అగ్రరాజ్యాలు, పెత్తనం దారులు, గుత్తాధిపత్యం వహించి సమాజాన్ని పట్టి పీడిస్తున్న వ్యవస్థను మార్చే దిశగా ఉన్న కవిత్వం చదివాక ప్రపంచీకరణ కవిత్వంపై పరిశోధన చేయదలచుకున్నాను.

ప్రపంచీకరణ సాహిత్యం ఒక ముఖ్య భూమికతో వెలువడింది. సాంఘిక, ఆర్థిక, రాజకీయ,సామాజిక, సాంస్కృతిక రంగాలు దెబ్బతింటున్న నేపథ్యంలో ఎల్.పి.జి నమూనా(1991) రావడంతో యావత్ భారతదేశంలో ఉన్న కవులంతా నిరసన తెలుపుతూనే ఉన్నారు. నా సిద్ధాంత వ్యాసంలో ఆయా కవులు పేర్కొన్న నిర్వచనాలు, లక్షణాలతో మొదలు పెట్టి అంతర్జాతీయంగా, 15వ శతాబ్దం నుండి నేటి వరకు వచ్చిన సాహిత్యాన్ని బాగా పరిశీలించి ప్రపంచీకరణ అంటే ఏమిటో మొదటి అధ్యాయంలో పేర్కొన్నాను.

ఒకప్పటి పరిస్థితికి నేటి పరిస్థితికి కారణమైన ఈ ప్రపంచీకరణ తెలుగు కవిత్వంలో ఉవ్వెత్తున లేచి పడింది. ఆయా కవులు, రచయితలు రాసిన కవితా సంపుటాలలో పేర్కొన్న వివిధ రంగాలపై ఎలాంటి ప్రభావం చూపిందో, ఆయా రంగాలపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, పరిశ్రమలలో జీవిస్తున్న కార్మికులు, కుమ్మరి,కమ్మరి, వడ్రంగి,మొదలైన వారి జీవితాలు ఏ రకంగా రోడ్డున పడ్డాయో చెప్పడం జరిగింది. ముఖ్యంగా సాంస్కృతిక రంగంలో భారతీయ

సంస్కృతి, తెలుగు సంస్కృతి ప్రపంచీకరణ నేపథ్యంలో విదేశీ సంస్కృతికి అలవాటు పడి తనదైన సొంత సాంఘిక ఆచారాలు ఏవిధంగా నాశనం అవుతుందో వెల్లడించాను. మనపైన జానపద కళలు ఎలా అంతరించి పోతున్నాయో చెప్పను.

ప్రపంచీకరణ సాహిత్యం అనేది కేవలం వ్యతిరేకమే కాదు అనుకూలత కుడా ఉంది అనడానికి రెండుగా విభజించి మొదట వ్యతిరేకత తెలిపి ఆతరువాత అనుకూలత చెప్పడం జరిగింది. అయితే ఇందులో వ్యతిరేకతే ఎక్కువగా ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధితో కొంత మేరకు అభివృద్ధి సాధించినప్పటికీ, దాని వల్ల నష్టాలు కూడా ఎక్కువగానే కనిపిస్తున్నాయి.

కవిత్వం సృజనాత్మక ప్రక్రియ. కవి చేసిన సృజన కావటం వలన కవి, కవిత్వ, కవిత్వం, ఆధునిక కవిత్వం, వచన కవిత్వం ఇలా వాటిని కొంచెం స్పృశిస్తూ, ప్రపంచీకరణ కవిత్వం గూర్చి చెబుతూ, తెలుగు కవితంపై ప్రపంచీకరణ ప్రభావం ఎట్టిదో తెలపడం జరిగింది. తర్వాత ప్రపంచీకరణ కవిత్వంలో కవులు వారి భావాలను ఎలా కూర్చారో చెప్పటం జరిగింది.

ప్రపంచీకరణ వ్యతిరేక నిర్మాణ కవిత్వంలో వస్తువు,రూపం, శిల్పాలని గూర్చి ఆయా కవులు పేర్కొన్న నిర్వచనాలు లక్షణాలు పేర్కొంటూనే కవులు స్వీకరించిన అంశాలని వివరించాను.

చివరిగా ప్రపంచీకరణ వివిధ దృక్పథాలు అయినటువంటి విప్లవం, స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీ వాదం, ప్రాంతీయ అస్తిత్వవాదం మొదలైన అంశాలపై ఎలాంటి ప్రభావం చూపిందో వ్యక్తం చేయటం జరిగింది. ఆయా అంశాలన్నీ పరిశీలించాక కొంత మేరకైన సామాజానికి ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.

ప్రస్తుత దశాబ్ది కవిత్వాన్ని గురించి సహృదయులు ఒక అవగాహన ఏర్పరచుకోగలిగితే నా సిద్ధాంత వ్యాసం సఫలమైందని తలుస్తాను.

# విషయ సూచిక


## 1. ప్రపంచీకరణ అంటే...... 1 - 15

1. ప్రపంచీకరణ పరిచయం

2. నేపథ్యం

3. నిర్వచనాలు

3.1 పాశ్చాత్యులు

3.2 భారతీయులు

4. ప్రపంచీకరణ లక్షణాలు

## 2. వివిధ రంగాలపై ప్రపంచీకరణ ప్రభావం 16 - 83

**2.1. భారతీయ సమాజంపై ప్రభావాలు**

**2.2. ఆర్థికరంగం**

2.2.1. వ్యవసాయరంగం

2.2.2.కార్పోరేట్ వ్యవసాయం

2.2.3.కాంట్రాక్టు వ్యవసాయం

2.2.4.ప్రపంచీకరణ రైతు సంక్షోభం

2.2.5.ప్రాజెక్టులు

2.2.6.బ్యాంకింగ్

2.2.7. పత్తి

2.3. పారిశ్రామిక రంగం

2.4. విద్యారంగం

2.4.1.విద్యాలక్ష్యం

2.4.2.నేటి విద్యావిధానం పర్యవసానాలు

2.4.3.సమాజం కోసమే విద్య

2.4.4.ప్రకృతిని చూసి నేర్చుకుందాం

2.4.5.ఉపాద్యాయుడు నిజమైన విద్యావంతుడై ఉండాలి

2.4.6.ప్రపంచీకరణ నేటి విద్య

2.5. సాంస్కృతికరంగం

2.5.1.సంస్కృతి - నిర్వచనం

2.5.2.ప్రపంచీకరణ - సంస్కృతి

2.5.3.ప్రపంచీకరణ సంస్కృతి ముఖ్యాంశాలు

2.5.4.మానవ సంబంధాలు

2.5.5.ప్రేమ

2.5.6.ప్రపంచీకరణ సంస్కృతి విధ్వంసం

2.5.7.జానపద కళలు

2.6.రాజకీయరంగం

**3. ప్రపంచీకరణ సాహిత్యం** **84 - 111**

3.1.పరిచయం

3.2.ఆర్థిక అసమానతలు

3.3.ధరల భారం

3.4.వ్యవసాయ సంక్షోభం

3.5.సాహిత్యం - సమాజం

3.6.ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం

3.6.1.ఆరంభం

3.6.2.ప్రారంభదశ

3.6.6.సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం

3.7.ప్రపంచీకరణ అనుకూలత

3.7.1.పరిచయం

3.7.2.ప్రపంచీకరణ-సామాన్య ప్రజలు

**4. ప్రపంచీకరణ తెలుగు కవిత్వం 112 - 138**

4.1.కవి

4.2.కవిత

4.3.కవిత్వం

4.3.1.కవిత్వంలో భాష

4.3.2.కవిత్వం ప్రయోజనం

4.4.తెలుగు వచన కవిత్వ ప్రక్రియ

4.5.ఆధునిక కవిత్వంలో తిరుగుబాటు ధోరణులు

4.6.కవిత్వంలో భావాల కూర్పు

4.7.కవిత్వంలో సమాజం

4.8.ఆధునిక తెలుగు కవిత్వంపై - ప్రపంచీకరణ ప్రభావం

**5. ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం నిర్మాణం 139 - 179**

5.1 కవిత్వంలో వస్తువు

5.1.1 వస్తువు నిర్వచనం

5.1.2వస్తువు లక్షణాలు

5.1.3.వస్తువు-రూపం

5.1.4.కవితావస్తువు నవ్యత

5.1.5.తెలుగు కవిత్వంలో వస్తు పరిణామ క్రమం

5.1.6.వస్తువు రకాలు

5.7. ప్రపంచీకరణ కవిత్వం - వస్తువు

5.2.కవిత్వంలో- రూపం

5.2.1రూపం- నిర్వచనం

5.2.2. లక్షణాలు

5.2.3 రకాలు

5.2.4 రూప-ప్రాధాన్యత

5.2.5.రూప - విశిష్టత

5.3.శిల్పం

5.3.1.శిల్పం నిర్వచనం

5.3.2.శిల్పం సాహిత్య విలువలు

5.3.3.శిల్పం లక్షణాలు

5.4.భావచిత్రాలు

5.5.ప్రతీకలు

5.3.5.1.ప్రతీక లక్షణాలు

5.6.పాత్రల చిత్రణ

5.7.చమత్కారాలు

5.8.సూక్తులు

5.9.నుడికారాలు - సామెతలు

5.10.నూతన ప్రయోగాలు

5.11.ధ్వని

5.12.ఉపమానాలు

5.13.శైలి

**6. ప్రపంచీకరణ కవిత్వం భిన్న ధోరణులు 180 - 230**

6.1.విప్లవ దృక్పథం

6.1.1.నేపథ్యం

6.1.2.విప్లవ - నిర్వచనం

6.1.3. విప్లవంలో ప్రపంచీకరణ దృక్పథం

6.1.3.1.ప్రాంతీయ అసమానతలు

6.1.3.2.వ్యవసాయ విప్లవోద్యమం

6.1.4.విప్లవ వర్గీకరణ

6.1.5.వాదోపవాదాలు

6.2 దళితవాద దృక్పథం

6.2.1.ప్రతిఘటన చైతన్యధార దళితసాహిత్యం

6.2.2.దళిత కవిత్వం

6.2.2.1.దళిత సంగీభావ కవిత్వం

6.2.2.2.దళిత కవిత్వం వాదోపవాదాలు

6.3.స్త్రీ వాద దృక్పథం పరిచయం

6.3.1.నేపథ్యం

6.3.2.స్త్రీవాదం నిర్వచనం

6.3.3.స్త్రీవాదం నేపథ్యం

6.3.4.స్త్రీవాద కవిత్వంలోని ప్రదాన వస్తువులు

6.3.5.స్త్రీవాద ప్రపంచీకరణ

6.3.6.మహిళలపై ప్రపంచీకరణ దుష్ఫలితాలు

6.4.మైనారిటీవాద దృక్పథం

6.5.ప్రాంతీయ ఆధునికాంతరవాదం వాదం

6.5.1.ప్రాంతీయ అస్థిత్వవాద కవిత్వంలో ఉండే ప్రధానాంశాలు

6.5.2.ప్రపంచీకరణ ప్రభావం

6.6.ఆధునికానంతర వాద దృక్పథం

6.6.1.ఆధునికం;ఆధునికత

6.6.2.ఆధునికతావాదం;గతితార్కిక భౌతికవాదం

6.6.3. ఆధునికాంతరవాదం

6.6.4.ఆధునికాంతరవాదం; తెలుగు కవిత్వం

6.6.6.ఆధునికాంతరవాద ప్రభావం

6.7.ప్రపంచీకరణ కవిత్వంలో వివిధ ధోరణుల ముగింపు

**7.ముగింపు 231 - 239**

7.1 ఉపయుక్త గ్రంథసూచి

# 1.ప్రపంచీకరణ అంటే

'గ్లోబలైజేషన్' అనేది ఈమధ్య కాలంలో బాగా ప్రచారంలోకి వచ్చింది. దీనికి అనువాదంగా తెలుగులో వ్యాప్తిలోకి వచ్చిన పదం 'ప్రపంచీకరణ' దీని తాత్పర్యం చాలా గందరగోళాన్ని, అలజడిని సృష్టించింది. 'వసుధైక కుటుంబం' అన్నది దేశీయమయిన ఒక గొప్ప భావన - మానవీయ - ఆధ్యాత్మికతల సంపుటి, ప్రధానంగా మనోభూమికలకు చెందింది.

ప్రపంచం మొత్తాన్ని ఒక/తమ కుటుంబంగా భావన చేసి ప్రవర్తించటం దీని తత్త్వం. సరిగ్గా దీనికి వ్యతిరేక దిశ 'ప్రపంచీకరణ'. ఇది అచ్చంగా సామ్రాజ్యవాదంతో ముడిపడిన ఆర్థిక, రాజకీయాంశాలకు సంబంధించిన ఒకానొక నిరంకుశ ధోరణి - ప్రవృత్తి. ఇది సంపన్న దేశాల దురహంకారానికి సంబంధించిందే తప్ప సాత్త్విక దేశాల స్వాభిమానానికి చెందింది కాదు. ఇది దేశీయ సాంస్కృతిక జీవనంలో విపరీతమైన అలజడి సృష్టించింది.

**గ్లోబలైజేషస్ అంటే.. దేశాలను తాకట్టు పెట్టడమేనా..?**




సోము: ఒరేయ్ రాముా..గ్లోబలైజేషన్ అంటే ఏంటిరా..?

రాము: ఆఁ.. ఏముందిరా...! మొన్న ఒబామా భారత్‌కు వచ్చాడా.. నిన్న కామెరూన్ చైనా వెళ్లాడా..నేడు మన్మోహన్ సింగ్ దక్షిణకొరియా వెళ్తున్నాడా...!

సోము: అంటే దేశాలు తిరగడమారా.. రాముా...!

రాము: అది కాదురా మట్టిబుర్రా..! ఒబామా వచ్చి మన ఉద్యోగులను వాళ్ల దేశానికి తీసుకు వెళ్లాడా.., మరి కామెరూన్ ఏమో.. తమ దేశంలోని వస్తువులను చైనాలో అమ్ముకోవడానికి కాంట్రాక్టు

కుదుర్చుకున్నాడా.., అలాగే మన ప్రధాని కూడా దక్షిణకొరియా పెట్టుబడులను భారత్‌కు తీసుకురావడానికి పెళ్తున్నాడు కదా..!

సోము: ఓహో... ఇప్పుడు అర్థమైందిరా.. పూర్వం వస్తుమార్పిడి అనే పద్ధతి ఉండేది కదా..! అదేనా..!

రాము: ఆ(... ఇంచుమించు అలాంటిదే రా.. సోమూ..!

సోము: అప్పుడు వస్తువులు తాకట్టు పెట్టుకునే వాళ్లం ఇప్పుడు దేశాలు తాకట్టు పెట్టుకుంటున్నాం అన్నమాట. బావుందిరా.. గ్లోబలైజేషన్.

**1.1.ప్రపంచీకరణ పరిచయం:** తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణ అనే పదం 15వ శతాబ్దం నుంచి వాడుకలో ఉంది. అందులోను సాహిత్యం సామాజిక శాస్త్రాలలో బాగా వాడుకలో ఉంది. చారిత్రకంగా పరిశీలిస్తే భారతదేశం ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకరకంగా దాడులకు గురవుతూనే ఉంటుంది.

ముస్లిముల దండయాత్రలో వారి సామ్రాజ్యవాదకాంక్ష, పరమత అసహనం వలన భారతదేశం చిన్నాభిన్నమై, తిరిగి పోరాటాల వలన నిలదొక్కుకుంది. తరువాత వచ్చిన బ్రిటిషు వారిది వలసవాదంపై ఇరువురు మనుషులు కాబట్టి వారి దాడిని ఉద్యమాల ద్వారా పారద్రోలగలిగారు భారతీయులు.నీ నేడు మన దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలకి కమ్ముకున్న మేఘాలు ప్రపంచీకరణ విధానాలు.

**1.2.ప్రపంచీకరణ నేపథ్యం:** సమాజం ఉన్నది ఉన్నట్లుగా కవితామయమయింది కాదు. కానీ కవి చేతిలో ప్రపంచం కవితాత్మకంగా మారుతుంది. ఈ ప్రపంచాన్ని కవితాత్మకంగా చేసే పనిలో ఉండే కవి, ఒక్కొక్కసారి ఈ ప్రపంచానికి వ్యతిరేక దిశలో ఉంటాడు. నిద్రిస్తున్న ప్రపంచాన్ని కవితాత్మకంగా మేల్కొల్పుతాడు. అందుకే మన జీవితాలలోని వివిధ రంగాలలో చోటు చేసుకున్న సంక్షోభం, విలువల పరాధీనతకు కారణమైన ప్రపంచీకరణను ఎదిరిస్తూ కవులు తమ కలాలకు పదునుపెట్టారు. మనుషులను ఏకాకులను చేస్తున్న దుర్మార్గాన్ని, మానవ సంబంధాలను నిలువునా చీల్చుతున్న పైనాన్ని కవులు గుర్తించి ఆవేదన చెందుతున్నారు. జీవితాలలో ఆవరించిన చీకట్లను కవిత్వం చేయటం వలన ప్రజలు వాటిని చదివి తమ అనుభవాల్లోకి తెచ్చుకొనేట్లు కవిత్వం చేస్తుంది. ప్రపంచీకరణ ముసుగులో పెట్టుబడిదారీ ఆర్థిక, సాంస్కృతిక ఆధిపత్యాన్ని నిరశిస్తూ తృతీయ ప్రపంచ దేశాలలో కవిత్వం వస్తున్నది. ఏ సమాజంలోనైనా కవిత్వం పొగడడానికి, విమర్శించడానికి,

నిరశించడానికి కవికి మేధో ఆయుధంలా పనికొస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో గ్లోబంతా మారిపోయింది. విలువలు, నమ్మకాలు అదృశ్యమవుతున్నాయి.

తెలుగునేలపై వచ్చిన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక మార్పులకు రచయితలు స్పందిస్తూనే ఉన్నారు. కవులు నిర్దిష్ట అంశాలపై కవిత్వం రాస్తున్నారు. ప్రపంచీకరణను నిరశిస్తూ చాలా కవిత్వం వచ్చింది. ప్రముఖ కవులు నుంచి కొత్తగా కలం పట్టిన కవుల వరకు దాదాపు ప్రతీ కవీ ప్రపంచీకరణ ప్రతిఘటిస్తూ కవితలు రాయటం విశేషం.

ప్రపంచ స్థాయిలో జరిగే ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఐక్యతనే ప్రపంచీకరణ అని అంటారు. ప్రపంచంలోని దేశాల మధ్య వాణిజ్యసంస్థలను మెరుగు పరచుకోవడం 1940లో అంతర్జాతీయ వాణిజ్యసంస్థ ఏర్పడింది(ITO). కొంత కాలానికి అమెరికా సెనేట్ ఈ సంస్థను రద్దు చేసింది. దీని స్థానంలో 1947లో గాట్ (జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్ అండ్ ట్రేడ్) అనే అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేశారు. తదనంతర కాలంలో అమెరికా నిరుద్యోగం, ఆర్థికమాంద్యం ఏర్పడటం వలన 1986వ సంవత్సరం నుండి డంకెల్ ప్రతిపాదనలపై చర్చలు జరిగాయి. ఫలితంగా 1994 డిసెంబర్లో దాదాపు 120 దేశాలు డంకెల్ ప్రతిపాదన ఒప్పందాలపై సంతకాలు చేసాయి. దీనితో 1-జనవరి-1995 నుండి గాట్ స్థానంలో WTO (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్) ఏర్పడింది. ఈ WTO వలన వివిధ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య విధానం అమలులోకి వచ్చింది. దీనినే నేడు ప్రపంచీకరణగా పిలవడం జరుగుతుంది. ఈవిధంగా ప్రపంచదేశాల మధ్య ఏర్పడిన స్వేచ్ఛా వాణిజ్య విధానం భారతదేశంలో ప్రవేశించడానికి 1990లో వచ్చిన ఆర్థికమాంద్య పరిస్థితులే కారణం.

భారతదేశంలో ఏర్పడిన ఆర్థికమాంద్య పరిస్థితులును అధిగమించడానికి 1991లో నాటి ప్రధాని పి.వి.నరసింహారావు నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానంలో LPG పద్ధతిని పాటించారు.(L-లిబర్లైజేషన్,P-ప్రైవేటైజేషన్G-గ్లోబలైజేషన్) ఈ మూడింటిలో గ్లోబలైజేషన్ విస్తృత ప్రభావం చూపింది. ప్రపంచీకరణ వలన భారతదేశం లాంటి మూడవ ప్రపంచ దేశాలకు లాభాలు, నష్టాలు కూడా ఉన్నాయి. ప్రపంచీకరణ భారతదేశంలోని అన్నిరంగాలపై ప్రభావాన్ని చూపింది.

**1.3.ప్రపంచీకరణ నిర్వచనం:** గ్లోబలైజేషన్ అనే పదాన్ని తెలుగులో ప్రపంచీకరణ అంటున్నాం. కొందరు వేళాకోలంగా గోలీకరణ అన్నారు. ఇది క్రియనామవాచకం. ఒక క్రియ జరగడం సూచిస్తుంది. ఏదో ఒకటి ప్రపంచమంతటికి చెందటమనేది ఆక్రియ. వర్తమాన కాలంలో వర్తక వ్యాపారాలు ప్రపంచీకరణకి చెందుతున్నాయి. అంటే ఏదేశ పౌరులైన ఏదేశంలోనైన సరుకులు ఉత్పత్తి చేసుకోవచ్చు, అందుకు కావలసిన శ్రమను ఏదేశం నుంచైనా కొనుగోలు చేసుకోవచ్చు. కావలిసిన పెట్టుబడిని ఏదేశ పౌరులైనుంచైనా స్వీకరించవచ్చు, ఏదేశపు ద్రవ్యవిలువులనైన వినియోగించవచ్చు, ఆ సరుకులని ఏదేశంలోనైనా అమ్ముకోవచ్చు, ఈరకమైన ఏర్పాటుకి వివిధ దేశాల ప్రభుత్వాలు ఒడంబడుతున్నాయి, ఒప్పందాలు చేసుకుంటున్నాయి.

## 1.3.1. ప్రపంచీకరణ నిర్వచనాలు: (పాశ్చాత్యులు - భారతీయులు)

**1.** ఏ విషయమైనా ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ప్రభావాన్ని నెరిపితే దానిని ప్రపంచీకరణ అన్నారు. ప్రపంచంలో ఒక మూల నుంచి ఇంకో మూలకి సరుకులు వనరులు ఎటువంటి ఆంక్షలు లేకుండా తరలించటం. ఈ తరలింపు అంతర్జాతీయ వర్తకరూపంలో అనేక దేశాల్లో విస్తరించినపుడే బహుళజాతి సంస్థల రూపం తెలుస్తుంది.

**2.** ఆంక్షలు లేని వెసులుబాటు, విశ్వస్వేచ్ఛా వ్యాపారాలు ఎల్లలు దాటి ప్రవహించటాన్ని ప్రపంచీకరణ అన్నారు.

**3.** సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో ప్రపంచ వ్యాప్తంగా ఏకరూపతను సాధించటాన్ని ప్రపంచీకరణ అని అన్నారు.

4.ప్రపంచ సంబంధాల విస్తృతిని, సామాజిక జీవన వ్యవస్థని, ప్రపంచ చైతన్య అభివృద్ధిని తెలియజేస్తుంది.

5. ఉత్పత్తిదారుల గమనశీలతను, శ్రామికుల గమనశీలతను సూచించేది.

6. ఆర్థికరంగంలో ప్రవేశించి రాజకీయరంగు పులుముకొని జనజీవనంలో చొచ్చుకు పోయి సాంస్కృతిక మార్పులకు దారితీసేదే ప్రపంచీకరణ.

7. ఒక దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేయటమే ప్రపంచీకరణ

8. పెట్టుబడిదారీ అభివృద్ధి యొక్క వస్తుగత నియమమే గ్లోబలైజేషన్. అభివృద్ధి చెందుతున్న దేశాలను తిరిగి ఆర్థిక వలసలుగా మార్చుకోవడానికి సామ్రాజ్యవాద దేశాలు రూపొందించుకున్న బ్లూప్రింట్ పేరే గ్లోబలైజేషన్ .

9. థామస్ ఫ్రీడ్మన్ 'లెక్సాస్ ఆఫ్ ది ఆలివ్ ట్రీ' అనే గ్రంథంలో ప్రపంచీకరణ అనేది మైక్రోచిప్ ఆధారిత సాంకేతిక ఆర్థికవ్యవస్థ అని అన్నారు.

10. చారిత్రక భౌతికవాదం ప్రపంచీకరణను, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధికి సంబంధించిన అంశంగానే చూస్తుంది.

11. గతంలో రాజకీయ సామ్రాజ్యవాదంగా ఉండేది. ఇప్పుడు దాని స్థానాన్ని సాంస్కృతిక సామ్రాజ్యవాదం ఆక్రమించింది.

12. మాట కొత్తదే చరిత్ర పాతది. స్వభావంలో వచ్చిన మార్పులు సంక్లిష్ట ప్రభావాలు పరిణామాలు చోటు చేసుకున్నాయి. మానవ నాగరికత అంతా ప్రపంచీకరణే. అమెరికైజేషనే ప్రపంచీకరణ.

13. ఇదొక సామాజిక ప్రక్రియ అని రాజకీయ ప్రతిచర్య అని చారిత్రాత్మక పరిణామమని కొందరన్నారు. ప్రపంచీకరణ అన్నిరంగాలను స్పృశించింది. ఏ కోణంలో నుండి చూసిన ప్రపంచీకరణ అనువర్తిత దృక్పథాలు కనిపిస్తాయి. ప్రపంచీకరణ అనేది సామాజిక వేత్తలకు సామాజిక ప్రక్రియగా, ఆర్థిక వేత్తలకు ఆర్థిక ప్రక్రియగా, రాజనీతిజ్ఞులకు రాజకీయ ప్రతిచర్యగా, చరిత్రకారులకు చారిత్రక పరిణామంగా ఇలా పలురంగాల వారికి ప్రదర్శితమౌతుంది.

14. వర్ధమాన దేశాల వ్యూహమని, వాణిజ్యం చేయడం ద్వారా దేశ సంపదను దోచుకోవడమే ప్రపంచీకరణ.

15. ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ, సామ్రాజ్యవాద వ్యక్తీకరణే ప్రపంచీకరణ.

16. ప్రపంచీకరణ అనేది అసమానతల ఏకీకరణ అనీ, అవినీతి సరళీకరణ అనీ పలువురి అభిప్రాయం.

17. ప్రపంచీకరణ అంటే బాహ్య అభివ్యక్తి.

18. ప్రపంచీకరణ అనేది ఒక సహజ ప్రక్రియ.

19. ప్రపంచీకరణ ఒక అసహజ ప్రక్రియ. పైనపేర్కొన్న అనుకూల ప్రతికూల నిర్వచనాలన్నింటినీ గమనించినట్లయితే ప్రపంచీకరణకు ఆధారం ఆర్థికరంగం అనే విషయం విశదమౌతుంది.[1]

" అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడుల చోదకత్వంలో, సమాచార సాంకేతిక శాస్త్ర సహాయంతో, వివిధ దేశాల ప్రజలు, కంపెనీలు, ప్రభుత్వాల మధ్య ఏర్పడే పరస్పర సంబంధం, సమైక్యతల ప్రక్రియే ప్రపంచీకరణ."

Globalization is a process of interaction and integration among the people, companies and governments of different nations, a process driven by international trade investment and aided by information technology.

1. స్వేచ్ఛావాణిజ్యం/పెట్టుబడుల తరలింపు
2. వనరుల విశ్వీకరణ
3. కార్పోరేట్ సంస్థల అధికార విస్తరణ
4. సాంస్కృతిక ఆదాన ప్రధానాలు
5. సమాచార సాంకేతిక విప్లవం

మొదలైన అంశాలు ఈ ప్రక్రియలో ఇమిడి ఉన్నాయి. పైపైన చూస్తే ఇంత వరకు జంగుబిల్లి మనోహరంగానే వుంది. ప్రపంచంలోని వనరులన్నీ అందరివి కావటం, ఎవరైనా ఎక్కడైనా స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకోవటం, శాస్త్ర సాంకేతిక సంపత్తి అందరికీ అందుబాటు కావటం - అంతా బహు సుందరంగా ఉంది.

ప్రపంచీకరణకు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక కోణాలున్నాయి. ఆర్థికాంశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఆ రాజకీయార్థిక  స్వభావం అర్థమైతేనే అందులోని రాక్షసత్వం కనబడుతుంది. జంగుబిల్లికి కనబడని కొమ్ములున్నాయి, కోరలున్నాయి. గత రెండు దశాబ్దాల కాలంలో ఇంటర్నెట్ ప్రవేశించాక మనుషుల మధ్య సంబంధం పెంచగల్గిందే కానీ, సంస్కృతిని పెంచలేకపోయింది. అంతేకాదు. అది మనుషుల మధ్య సంబంధం పెంచే క్రమంలోనే సంస్కృతిని ధ్వంసం చేసింది. దాని అశ్లీల లీలలు అనంతం.

ప్రస్తుతం దీని వలన మంచి చెడుల ఫలితాలను అనుభవించేది. ప్రజలందరు, కాబట్టి 'ధనం మూలం మిదం జగత్' అన్నారు. ధనమ్ మూలమిదం ప్రాపంచిక అని అర్థం. ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక సాంకేతిక రంగాల గమనశీలతే పంచక ప్రపంచం. ప్రపంచం అనే పదానికి వ్యాపించుట, విస్తరణ, వైవిధ్యం, మోసం చేయటం, తలకిందులు అనే అర్థాలున్నాయి.

**1.4.ప్రపంచీకరణ లక్షణాలు:** 19వ శతాబ్దంలో ప్రపంచీకరణకి స్వేచ్ఛాయుత పోటీ ఉండేది. అంటే పాస్ పోర్టులు లేకుండా ఏ దేశమైన తిరిగిరావటం, కార్మికుల ప్రయోజనాలు నెరవేర్చే చట్టాలు లేకపోవడం, డబ్బు, మారకంలో పరిమితులు లేకపోవడం, ఇవన్నీ మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీసాయని ఈ క్రమంలోనే స్వేచ్ఛాయుత పోటి అంతమైందని చరిత్ర చెబుతుంది. ఇక రెండో ప్రపంచయుద్ధం తరువాత మొదలుకుని 90వ దశకంలో ప్రపంచీకరణ తిరిగి పుంజుకుంది. పెట్టుబడి, సరుకుల ఎగుమతి దిగుమతులు, సాంకేతిక పరిజ్ఞానం వలసపోవటం మొదలైనవన్నీ ప్రపంచీకరణ లక్షణాన్ని సంతరించుకుంటున్నాయి. 1970 తరువాత పెట్టుబడిదారి సమాజాలు సంక్షోభానికి గురైనాయి.ఈ సంక్షోభం నుండి బయట పడటానికి ప్రపంచీకరణ అనే నూతన వ్యాపార దోపిడీ ప్రక్రియను ముందుకు తెచ్చారు.

**లక్షణాలు:**

1.ఫైనాన్స్ మార్కెట్ ను నియంత్రించడం

2.సాంకేతిక పరిజ్ఞానాన్ని సొంతం చేసుకోవటం

3.పేద దేశాలలో దళారి వ్యవస్థను స్థాపించటం

4.మీడియాపై పట్టుసాధించి తనకు అనుకూల ప్రచారాన్ని చేసుకోవటం

5.పాశ్చాత్య ఆధిపత్య భావజాలాన్ని బలవంతంగా రుద్దటం

6.సమాచారాన్ని సేకరించి త్వరగా ప్రచారం చెయ్యటం

7.అధిక పెట్టుబడులను ప్రవహింప చేయటం

8.ప్రజాస్వామ్య ప్రక్రియలను నాశనం చేయటం

9.ప్రపంచ వ్యాప్తంగా అసమానతలు పెంచటం

10.దోపిడీ ప్రక్రియను విస్తరించి తీవ్రం చేయటం

11.ఆర్థిక కార్యకలాపాల నుంచి ప్రభుత్వాలను పక్కన పెట్టడం

12.వస్తువు సేవలవలెనే మానవ సేవలు వర్తకంగా మార్చటం

13.ప్రజల మేధోవలసను పెంచటం

14.స్వదేశీ వస్తువులను నాసిరకమైనవిగా ప్రచారం చేయటం

15. భిన్న సంస్కృతులను విధ్వంసం చేయటం.[2]

మానవ జీవితాలలో ఇంతగా ప్రవేశించిన ప్రపంచీకరణ ఇంకా సమగ్రంగా అర్థం చేసుకోవాల్సి ఉంది. అది ప్రారంభమైన దశాబ్దానికి కాని కవులు, రచయితలు దాని పట్ల ఒక స్పష్టతకు రాలేకపోయారు. ఒకప్పటి కమ్యూనిస్ట్ దేశమైన చైనా కూడా ప్రపంచీకరణకు ఆహ్వానం పలికింది. క్యూబా లాంటి చిన్న దేశాలేమో ఇప్పటికి దీనికి వ్యతిరేకంగా నిలబడ్డాయి. కొన్ని సవరణలతో ప్రపంచీకరణను ఆహ్వానించాలనే కమ్యూనిస్టులు ఇండియాలోనూ ఉన్నారు.  భిన్నాభిప్రాయాలుండటం చూస్తే ఇంకా ప్రపంచీకరణ పట్ల స్పష్టత లేనట్లే కనిపిస్తుంది. దాని రూపాన్ని, సారాన్ని అర్థం చేసుకోవటంలో తమ తమ భేదాభిప్రాయాలున్నాయి.

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచబ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థలు సామ్రాజ్యవాద దేశాల దోపిడీకి సాధనాలుగా పని చేస్తున్నపుడు, వాటి వ్యక్తీకరణ ప్రపంచీకరణ అయితే దానిలో మానవకోణం ఉండటం అసాధ్యమే. ప్రపంచీకరణ ద్వారా మరో ప్రపంచం సాధ్యం అనే నినాదం కూడా ముందుకొచ్చింది. ఈ మాయలో కూడా చాలామంది మేధావులు, దేశాలు, సంస్థలు పడినట్లుంది. ఎందుకంటే ఈ నినాదాన్ని ముందుకు తెచ్చింది కూడా NGO లను వెనకనుంచి నడిపిస్తున్న బహుళజాతి సంస్థలు. ఇట్లా వీటి మధ్య ఉండే గొలుసుకట్టు బంధాన్ని చూస్తే ఈ మరో ప్రపంచం ఎవరికోసమనేది స్పష్టమవుతుంది.

ఏ రూపంలో వచ్చిన ప్రపంచీకరణ విషతుల్యమని చెప్పేవారేమీ తక్కువగా లేరు. ఇప్పుడిప్పుడు సామాన్యుడి జీవితంలోకి ప్రపంచీకరణ ప్రవేశించడంతో విధ్వంసం జరుగుతున్నది. పదేళ్లకిందట ఈ మాటను అంతగా పట్టించుకోని వాళ్ళు ఇవ్వాళ దాని విశ్వరూపాన్ని కొద్దిగానైన అర్థం చేసుకుంటున్నారు. పరస్పర ప్రయోజనాల స్థానంలో ఏకపక్ష ప్రయోజనాలు ముఖ్యమైన చోట నష్టమే ఎక్కువగా జరుగుతుంది. అదే ఇవ్వాళ ప్రపంచీకరణ పని. కాబట్టి ఇది నిజమైన ప్రపంచీకరణ కాదు.ఇది సంక్షోభ ప్రపంచం. ఇది సంక్షోభ ప్రపంచీకరణ.

**1.5.తెలుగు సాహిత్యం ప్రపంచీకరణ:** గత రెండు దశాబ్దాలుగా తెలుగు సమాజాన్ని తెలుగు ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, పరమైన అంశాలపై తీవ్రమైన ప్రభావం చూపుతున్న కవితా ధోరణి ప్రపంచీకరణ కవిత్వం.

ఆధునిక కవులు ఎత్తిన కలం దించకుండా రాస్తూనే ఉన్నారు. ప్రపంచీకరణ అనేది అనేక కోణాలలో సాహిత్యంలోకి కవిత్వం, నవల, కథ ఇలా అన్నింటిని స్పృశించింది. ఎన్ని కోణాలలో

వచ్చినా దీని ప్రధాన కర్తవ్యం ఒకటే మానవతా సంబంధాలను, సాంస్కృతిక విలువలను కాపాడటమే. నేటి మనిషి మానవసంబంధాలను, అనుబంధాలను డబ్బుతోనే మారకం చేసుకుంటున్నాడనీ, మనిషి పరాయికరణకు గురైన వస్తువని, డబ్బు ఖర్చు పెట్టనిదే మనిషి శవం చుట్టూ చేరి కన్నీరు కార్చడానికి కూడా ఎవరికీ తీరికలేదని, సమాజపు సందుల్లో ఒక రోబోట్‌లా, పందిలా మిగిలాడని, నేడు మరో తెల్ల దేశపు బానిస కాబోతున్నాడనీ, బానిసగా అమ్ముడుపోబోతున్నాడని మానవ నైజాన్ని వివరించారు కవులు. చరిత్రలో వెనుక నడిచే వారికి బాట చూపించడానికి నేడు రక్త తర్పణ తప్పదనీ, రక్తంతోనే రహదారి వేయాలనీ, లేకపోతే దారి తప్పుతారనీ, పరోక్షంగా ఈ దేశంలోనే సాయుధ పోరాటాన్ని సమర్థిస్తూ చెప్పిన విషయాన్ని గమనించవలసి ఉంది. అలాసాగే ఈ క్రమంలో పతితులు, భ్రష్టులూ, మూలనున్న ముసలవ్వలు, దగాపడిన తమ్ముళ్ళు, దౌర్భాగ్యులు మరి జేబుదొంగలు అందరూ ఒకరుగా ఏకం కాక తప్పదనీ, ఈ సమాజం సృష్టించిన దిష్టిబొమ్మలు వాళ్ళు అని వాపోయారు.

"వస్తువు నిన్ను మెరిపించినట్టు
మనిషి మెరిపించడు
ఇక మార్కెట్ ప్రమాణాలే
అన్నివేళలా మానవ ప్రమాణాలు
మార్కెట్ మన కదలికల్నీ, కాంక్షల్నీ తీర్చిదిద్దే
కనపడని మేకప్మేన్ ఐంది"[3]

ప్రపంచీకరణ వరవడిలో అనేకమైన సంకలనాలు వచ్చాయి. ఇంచుమించుగా 100 కవితా సంకలనాలు నా పరిశోధనలో చూడటం జరిగింది. అందులో అనేక మంది కవులు, రచయితలు వ్యతిరేక దృక్పథాన్ని నొక్కి చెప్పారు. మొత్తంగా చూస్తే ఒక పదిహేను కవితా సంకలనాలు/కవితా సంపుటాలలో తీవ్రమైన నిరసన కవిత్వం ఉంది.

ప్రపంచీకరణ అనేది కేవలం వ్యతిరేక కోణంలో మాత్రమే కాక అనుకూల అంశాలను కూడా చూడటం జరిగింది. మారుతున్న కాలంతో పాటు మానవ సమాజంలో కూడా మార్పులు వచ్చాయి. వేగవంతమైన శాస్త్రసాంకేతిక రంగాల అభివృద్ధి వలన అతి సులువైన ధరకే అన్ని రకాల వస్తువులు

దొరుకుతుండటం వలన కొంత వరకు సామాన్య మానవుడు కూడా అభివృద్ధి చెందుతున్నాడు. నా దృష్టిలో ప్రపంచీకరణ ప్రభావం ఎక్కువగా ఉన్న కవితా సంకలనాలలో ......

1.అద్దేపల్లి రామమోహనరావు - పొగచూరిన ఆకాశం

2.గుడిపాటి - గ్లోబల్ ఖడ్గం

3.తైదల అంజయ్య - పునాస

4.వఝల - దాఖలా

5.వలభాపురం జనార్ధన్ - పహారా కాస్తున్న రాత్రి

6.సుదేరా - పొలికేక

7.వరవరరావు - కాగితప్పులి కళ్ళలో భయం

8.కొండేపూడి నిర్మల - మల్టీనేషనల్ ముద్దు

9.అప్సర్/వంశీకృష్ణ(సం.) - అనేక - పదేళ్ల కవిత్వం

10.ఎస్వీ.సత్యనారాయణ - ప్రపంచీకరణ ప్రతిధ్వని మొదలైన కవితా సంపుటాలు, గేయసంకలనాలు లాంటి అన్నింటినీ పరిశీలించాను. వాటన్నింటినీ పరిశీలించాక తెలుగు కవితంపై ప్రపంచీకరణ ప్రభావాన్ని గుర్తించాను.

**1.5.1.గ్రామీణ మూలాల్లో మార్పులు:** తెలుగు కవులు గ్రామీణ జీవన విధానాన్ని కవితా వస్తువుగా స్వీకరించి విత్తనాలు, పంటల పద్ధతి, ఎరువులు - వీటిలో వచ్చిన మార్పుల వల్ల వ్యవసాయం ఒడిదుడుకుల పాలైంది. తగిన ధరలు లేక సేద్యం జూదమైంది. చరిత్రలో ఎన్నడూ లేదు, ఈ 20వ శతాబ్దంలోనే రైతుల ఆత్మహత్యల పర్వం ప్రారంభమైంది.

"పూల పూల తోటలోపల
పురుగు ముట్టిందో - సెల్లేలా సఖులారా
సేను సెలక సొగసులల్ల

సేడుగు మోలిసిందో"[4] ఇవాల్టి సంపన్నదేశాల అవసరాలు మన చేలను శాసిస్తున్నాయి. ఈ నేలకి అనువుగాని పైర్లు రైతుల అంతు చూస్తున్నాయి. రైతుకూలీలు వ్యవసాయరంగాన్ని వదిలిపెట్టి, వేరే పనులు వెతుక్కుంటూ వెళ్తున్నారు. రైతుమీద ఆధారపడివున్న పంచవృత్తుల వాళ్లు (కమ్మర, కుమ్మర, వడ్రంగి, చాకలి, మంగలి) వ్యవసాయం సన్నగిల్లటం చేత, అత్యాధునిక సాధనాలు, ఉత్పత్తులు పల్లెలోకి రావటంచేత, దేశాలు పట్టి పోయే దశ వచ్చింది. తక్కిన కులవృత్తులు కూడా ధ్వంసమయ్యాయి. టీవీల్లాంటి సాంకేతిక సాధానాల వ్యాప్తితో, వెనకటి ఆదరణ కోల్పోయి, బొమ్మలాటలు, హరికథలు, బుర్రకథలు, పిచ్చుకగుంట్లు వంటి జానపద కళారూపాలు కూనరిల్లుతున్నాయి. పడమటి దిక్కునుంచి రెక్కల జంతువేదో పొలిమేరలో రంకేస్తుంది. పురుగు మందులు డబ్బాల్లో రైతుల్ని ముంచుకొని ఊరబావిలో దూకుతున్నాయి. కుమ్మరి సారె మీద కుండల వెంకన్నే గిరగిర తిరుగుతున్నాడు. నారాయణ పక్కజేబులో మంగలిపొది డొక్కలో తన్నుతుంది. తూర్పు వాగులో కోకాకోలా గట్టుల్ని ఒరుసుకొని పొంగి పారుతుంది.

పక్కవీధిలో చుక్కమ్మకి తొలిరూపంలోనే పండింటి కంప్యూటర్ పుడుతుంది. ఈ వైనం లేని మార్పులు కవుల్ని, కళాకారుల్ని కదిలిస్తున్నాయి.

"పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల
తల్లి బందీయై పోయిందో కనిపించని కుట్రల
కుమ్మరి వామిల తుమ్మలు మొలిసెను
కమ్మరి కొలిమిల దుమ్ము పేరెను
పెద్దబాడిస మొద్దు బారినది
సాలెల మగ్గం సడుగు లిరిగినవి
చేతి వృత్తుల చేతులిరిగిపాయె - నా పల్లెల్లోన
గ్రామ స్వరాజ్యం గంగలోన బాయె - ఈ దేశంలోన"[5]

ఈనాటి వ్యవస్థలో పల్లెలు ఏరకంగా అంతరించి పోతున్నాయో, వృత్తులు ఏవిధంగా కనుమరుగైపోతున్నాయో తన పాటలో తెలియజేసాడు.

"మాటల్లో తియ్యదనం లేదు...
ముఖం నిండా మో'డల్' మేకప్...

మట్టి వాసనలాంటి సంభాషణలు లేవు...

అప్పుల 'కోలా'హలంలో హైటెక్ అనారోగ్యాన్ని పెంచుకుంటూ...

...................................................

గ్లోబలైజేషన్ లో కూరుకుపోతు...

కూ...రు...కు...పో...తూ..."[6]అంటూ ప్రపంచీకరణ మానవజీవితాన్ని ఎలా అతలాకుతలం చేసిందో కొత్తకొత్త సంస్కృతులలో మనిషి ఎలా కూరుకుపోయాడో వ్యక్తం చేస్తున్నాడు.

ప్రపంచీకరణ నేపథ్యంలో 'ఒక్కటౌదాం మనం' అనే కవితలో బి.ఆర్. భగవాన్ దాసు ఎల్.పి.జి. వలన వచ్చే నష్టాలని, అమెరికా పన్నుతున్న కుట్రల్ని గట్టిగా నొక్కి చెప్పాడు.

"ప్రపంచీకరణతో పతనం ప్రారంభమై

ప్రమాదం అంచున దేశ ప్రజలు

ప్రైవేటీకరణతో పగుళ్ళు ప్రారంభమై

పతనం వైపు ప్రయాణం

స్వేచ్ఛా వ్యాపారంతో చెదలెక్కుతున్న దేశం

కలిమిని సృష్టించే కర్మాగారాలను అమ్ముతూ

లేమిని ప్రోత్సహిస్తూ నేటి పాలకులు

...................................................

ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణల సంబరాల చర్యలు

డొక్క చీల్చుదామంటూ ఒక్కటౌదాం మనం"[7]

సమాజంలో కొనసాగుతున్న అసమానతలు, పీడనలను చూస్తున్న ఏ హృదయమైనా ప్రపంచీకరణ కవిత్వం రాయడానికి స్పందిస్తుంది. అవిలేని నూతన సమాజం రావాలని కోరుకొంటుంది. ప్రపంచీకరణ కొత్తకొత్త కోణాలలో ఆలోచించడానికి మార్గ దర్శకమైనది.

'సైన్సు అనబడే ఒక మూఢవిశ్వాసం' అనేకవితలో అన్నివిషయాలు చాలా స్పష్టంగా తేటతెల్లమౌతాయి.

"భారతదేశం అమ్మగా పూజించే ప్రకృతిని

కీలుబొమ్మగా చేసి

అమ్మకానికి పెట్టగలను

విత్తనంలో తలదూర్చి

జీవంతో నిర్జీవాన్ని చేర్చి

ప్రచార సాధనాల విశ్లేషణలతో

ప్రజల కళ్లుమూసి

వ్యాపార వృక్షాన్ని

దేశం గుండె పగిలేదాకా పెంచగలను

బంగాళదుంపల్లో ప్రోటీన్లు కుక్కి

పేదబడి పిల్లల అన్నం మెతుకుల్ని

రూపాయలుగా మార్చగలను

.......................................

సైన్సు ముందుకెళ్ళిపోతోంది

ప్రజలు ముందుకెల్లిపోతున్నారు

ప్రపంచం గ్లోబలైజ్ అయిపోతోంది"[8]

అంటూ భారతదేశం గ్లోబలైజేషన్ చేతిలో కీలుబొమ్మగా మారిన విధానాన్ని, సైన్సు ఏవిధంగా నేడు దుసుకుపోతుందో ప్రపంచీకరణ తీసుకొచ్చిన కొత్తకొత్త విధానాలు ఎలా మారాయో చాలా చక్కగా వర్ణించారు.

ఈనాడు ప్రపంచీకరణ అన్ని వర్గాల ప్రజలకీ, అన్ని సిద్ధాంతాల ప్రతిపాదనలకీ వ్యతిరేకమైన అంశమే. దీన్ని ఎంతో తీవ్రంగా పరిగణిస్తున్నాడు కొండ్రెడ్డి. 'దుక్కిచూపు'లో ఉండుండి, ఉండుండి - ప్రపంచీకరణపై విమర్శల బాణాలు రివ్వున దూసుకుపోతూ ఉంటై, ప్రపంచీకరణ వల్ల అన్ని రంగాలు ఎలా దెబ్బతింటాయో చెప్పాడు.

'టెర్మినేట్ విత్తులతో

పర్మనెంట్ రోగాలతో'

'ప్రేమరాహిత్యాన్ని పెట్టుబడిగా

పెంచే కుటుంబ వ్యవస్థను సృష్టించి

కృత్రిమ మనుషులతో ఈ గ్రహాన్ని
నిర్వీర్యం చెయ్యబోతున్న కుట్ర'
'ప్రపంచం ఒక కుగ్రామమైతే
పేద దేశాలకు గ్రాసమే లేదు'
'ఈ ప్రపంచీకరణ కలం తీరే వేరు
మొసళ్ళతో కరచాలనం
అందమైన ఆర్థికమడుగుల్లోకి
అడుగులే అడుగులోకి దిగిపోతూ..."[9]

ఇందులో కవి తడవని చీకటికోణం లేదు. రైతుజీవితం ప్రాతిపదికగా తీసుకొని, సమకాలీనమైన అన్ని అంశాలను స్పృశించాడు.

ప్రస్తుత కాలంలో కేవలం తెలుగు కవులు మాత్రమే కాకుండా ప్రమంచీకరణను అర్థం చేసుకోవడంలో అందరూ మమేకమైనారు. ప్రపంచీకరణ సాహిత్యం అన్ని రంగాలలో ఉందని తత్త్వవేత్తలందరూ సూచించి ఆయా నిర్వచనాలు లక్షణాలను బట్టి అర్థమవుతుంది.

## పాదసూచికలు

1.జి.అరుణకుమారి - తెలుగు సాహిత్యంపై ప్రపంచీకరణ ప్రభావం వ్యాసం; పుట.1

2.గుడిపూడి విజయరావు - శృతి తప్పిన ప్రపంచీకరాణ; జనవరి.2003

3.దర్భశయనం- శ్రీనివాసాచార్య; ఆట.పుట.12

4.నందిని సిధారెడ్డి- పూలతోట; పుట.8

5.గోరటి వెంకన్న - పల్లె కన్నీరు పాట

6.ఎస్వీ. సత్యన్నారాయణ - ప్రపంచీకరణ ప్రతిధ్వని; పుట.75

7.ఎస్వీ. సత్యన్నారాయణ - ప్రపంచీకరణ ప్రతిధ్వని; పుట.78

8.అద్దేపల్లి రామమోహనరావు - పొగచూరిన ఆకాశం; పుట.52

9.కొండ్రెడ్డి - దుక్కిచూపు; పుట.23

# 2.వివిధ రంగాలపై ప్రపంచీకరణ ప్రభావం

మనం నివసించే ఈ యుగం అన్ని రంగాల్లో వైరుధ్యాల మాయం. సాహిత్యానికీ సమాజానికీ, మనస్సుకి మాటకీ, హృదయానికీ ప్రవర్తనకీ, గతానికీ వర్తమానానికీ, అన్నింటా వైరుధ్యమే. నిన్నటి అభిప్రాయానికీ నేటి అభిప్రాయానికీ వైరుధ్యం. వర్గాల వర్ణాల వైరుధ్యాలు సరేసరి. ఈవైరుధ్యాలన్నిటినీ దర్పణంలా ప్రతిబింబించేదే సాహిత్యం. సాహిత్యం సమాజ అభివృద్ధికి తోడ్పడుతుంది. సమాజానికి హితాన్ని చేకూర్చేదే సాహిత్యం. సమాజానికి సాహిత్యానికి అవినాభావసంబంధం ఉంది. తెలుగుసాహిత్యం కూడా సమాజాన్ని శాసిస్తుందనటంలో గొప్ప విశేషంగా భావించవచ్చు. ఈనేపథ్యంలో చూస్తే తెలుగు సాహిత్యానికి సమాజానికి కూడా చాలా దగ్గర సంబంధం ఉంది. ఆధునిక సాహిత్యంలో కవులు సున్నితత్వం, పసి మనసు కలగలసిన సుకుమార భావుకత్వం వ్యక్తపరిచారు. సమాజం గాయపడితే వీరి హృదయాలు గాయపడతాయి. కనిపించే సమస్త వస్తు సముదాయం వీరి కళ్ళకు ఒక్కోసారి సౌందర్యాత్మకంగా, రసాత్మకంగా, కళాత్మకంగా - చివరికి కవిత్వంగా కనిపిస్తుంది. ఇటీవలి కాలంలో చాలా మంది కవులు, కవయిత్రులు నిజాలను నిర్భయంగా వెల్లడిస్తూ తమ హృదయగత అనుభూతులను, ఆవేదనలను, ఆలోచనలను సున్నిత సుకుమార భావనలను మానవీయ దృక్పథంతో, ఆర్ద్రతతో, రసాత్మకంగా కవిత్వీకరిస్తున్నారు.

ఆంధ్రమహాభారతంలో తిక్కన, జూదానికి అలవాటుపడిన ధర్మరాజు మనఃప్రవృత్తిని వర్ణిస్తూ "ధర్మసూతి మెత్తనిపులి" అన్నాడు. అతి అమాయకుడిగా, అజాతశత్రువుగా పెద్దమనిషిగా పేరు ప్రతిష్టలున్న వాడుగా కన్పించే ధర్మరాజు జూదంలో తాను ఓడినందుకు తనకుతాను అమ్ముడుపోవాలి కాని కుటుంబాన్ని పాండవుల గౌరవాన్ని తాకట్టు పెట్టడానికి సిద్ధమయ్యాడు సరికదా ద్రౌపదిని కూడా అమ్మడానికి సిద్ధమయ్యాడు. తన స్వార్థం కోసం ఎంతటి పనికైనా తలపడ్డాడు. అందుకే అతన్ని "మెత్తనిపులి" అన్నారు. ఇది వ్యక్తిగత కథ.

ప్రపంచీకరణ నేపథ్యంలో భారతదేశంలోని కేంద్ర, రాష్ట్రపాలకులు పదవుల కోసం దేశాన్ని సామ్రాజ్యవాద దేశాల కనుసన్నల్లో మోగుతున్న ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలకు తాకట్టు పెట్టుకోవడానికి సాహసించారు.[1]

సామ్రాజ్యవాద దేశాలైన అమెరిక, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్, రష్యా లాంటి దేశాలు తమ సరుకులను వర్తమాన దేశాలలో అమ్ముకోవటం కోసం పడరానిపాట్లు పడుతూ పేదదేశాల మార్కెట్లు నిండా తమ వస్తువులనే నింపి అక్కడి స్థానిక ఉత్పత్తులకు రేటు లేకుండా చేస్తున్నారు.

ప్రపంచీకరణ వ్యవసాయ, పారిశ్రామిక, సామాజిక, రాజకీయ, విద్య, సాంస్కృతిక రంగాలపై ప్రభావం చూపిస్తున్నది. కాబట్టి కవులు రాసిన కవిత్వంలో ఈ అంశాల ప్రాతిపదికగానే విషయం విభజన చేశాను. వారి కవిత్వంలో వ్యక్తమైన ఈ కోణాలను వస్తువు, రూప విశ్లేషణగా వివరించే ప్రయత్నం చేశాను. కవిత్వం సృజనాత్మక ప్రక్రియ కావటం వలన ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్న ప్రపంచీకరణను కవిత్వీకరించడంలో కొన్ని సమస్యలున్నాయి. అయినా కొందరి కవితలు, కొన్ని సంపుటాలు, సంకలనాలు పరిశీలిస్తే తెలుగుకవి స్థూలంగా ప్రపంచీకరణను బాగానే అవగాహన చేసుకున్నాడని తెలుస్తుంది.

**2.1.భారత సమాజంపై ప్రభావాలు:** ప్రపంచీకరణ అనబడే సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల మూలంగా ఒనగూడే సంపదలు, సుఖాలు ప్రపంచంలో 20%మందికి మాత్రమే అబ్బుతాయని ప్రపంచబ్యాంకు తెగేసి చెప్పింది. అయితే మన ప్రభుత్వాలు, ప్రపంచీకరణను సమర్థించే మేధావి వర్గము, దళారీ పాలకవర్గాలు మాత్రం, మన సమాజ అభివృద్ధికి అది దోహదం చేస్తుందనీ, అది తప్పనిసరి మార్గమనీ, తద్వారా ప్రజాస్వామికీకరణ విస్తరిస్తుందనీ వాదిస్తున్నారు. ఉపాధి అవకశాలు పెరుగుతాయని, ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లి బతకవచ్చనీ, విదేశీ పెట్టుబడులు భారీగా వచ్చి చేరతాయనీ తద్వారా హైటెక్ పరిశ్రమలు, సేవారంగాలు విస్తరిస్తాయనీ అదంతా దేశ ఆర్థిక పుష్టికి తోడ్పడుతుందనీ అంటారు. ఈ మధ్య కాలంలో జీవనహక్కు రక్షణకోసం ఉద్యమించిన గిరిజనులు, రైతులు, కార్మికులపై పాశవిక అణచివేత సాగుతున్నది.

ఈ వైరుధ్యాల నడుమ సామ్రాజ్యవాద సంస్కృతి ట్రోజన్ హార్స్ రూపంలో నగరాలు, పట్టణాలలోనికి మాత్రమే కాకుండా మారుమూల గ్రామాలలోకి గిరిజన లోగిళ్ళలోకి కూడా ప్రవేశించింది. అంటే, ప్రపంచీకరణ ఒక ప్రధాన రక్షణ కవచాన్ని తన వెంటే తెచ్చుకుంది. తన ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను సాధించుకోవడానికి జాతీయ సంస్కృతీ మూలాల నుంచి ప్రజలు దూరమయి, విదేశీ సామ్రాజ్యవాద సంస్కృతికి ఆకర్షితులయ్యే విధంగా వారిని పరాయికరిస్తుంది. వేషభాషలు, కట్టుబొట్టూ, తిండితీర్థం, పండగలు పబ్బాలు, ఆలోచనలు, ఆచారాలు, మానవ

సంబంధాలు. విలువలు, ఇలా వ్యక్తుల స్పందనలను, ప్రవర్తనలను తెలియజేసే ప్రతి అంశంలోకి సామ్రాజ్యవాద అనుకూల సంస్కృతి చొచ్చుకు వచ్చి జాతీయ చైతన్యాన్ని వక్రీకరిస్తుంది. వినియోగ, విలాస వస్తువులేకాక, సంస్కృతి కూడా సరుకుల రూపంలో ప్రజలను చుట్టుముడుతుంది. సరుకుల కోసం సాధనాలుగా మానవులు మార్చబడతారు.

ప్రపంచీకరణలో భాగంగా ఆంగ్లమాధ్యమ విద్యాభోదన సార్వత్రికమవుతున్నది. మాతృభాషల నుండి దూరమైన విద్యార్థులు, విద్యావంతులు దేశీయ, స్థానీయ జీవిత మూలాలకు దూరమవుతారు. ప్రపంచీకరణ ప్రక్రియలోకి లాగబడతారు. ఇదంతా ఒక సహజ క్రమంగా జరిగిపోతుంది. బ్రిటీష్ వలసపాలన నాటి మెకాలే సూచించిన మాదిరి పనిగట్టుకొని ఆంగ్ల విద్యాధికులను తయారు చేయనవసరం లేదు. వారికి వారే తయారవుతారు. తయారయేలా ప్రపంచీకరణ తరుముతుంది. సంస్కృతి మార్కెట్ లో భాగంగా ప్రచలితమవుతుంది. ఆ సంస్కృతిని తిరస్కరించాలంటే ఆ మార్కెట్ను తిరస్కరించాలి. అది సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించడమే అవుతుంది. మార్కెట్లకోసం సామ్రాజ్యవాదం యుద్ధాలకు కూడా సిద్ధపడుతుంది. అయితే ఆ యుద్ధాల ద్వారా అది బలహీనపడుతుంది. పైగా అది ఎన్నో చోట్ల యుద్ధం చెయ్యజాలదు. వియత్నాం వంటి చిన్న దేశం చేతిలో ఓటమి చెందడం, ఇరాక్ లో సఫలీకృతం కాకపోవడం ఇటీవలి ఘటనలే. ఇది మనం పరిగణించ వలసిన ఒక ప్రధానాంశం.

**2.1.ఆర్థికరంగం:** ఏ దేశానికైనా ఒక ఆర్థికవ్యవస్థ ఉంటుంది. దాని మీదనే ఆ దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ఈ వ్యవస్థ సమృద్ధిగా ఉండాలంటే గ్రామం సుభిక్షంగా ఉండాలని మేధావులు అంటారు. భారతదేశం లాంటి వ్యవస్థలకు గ్రామమే పునాది. గ్రామమంటే ఒక పేరు, కొందరు మనుషులు, మరికొంత భూభాగమే కాదు, వృత్తులు, పాడిపంటలు, వ్యవసాయ పనిముట్లు, ప్రవహించేనీరు, కుటీర పరిశ్రమలు. ఈ గ్రామీణ వ్యవస్థను అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వానికి ఉంటుంది. కానీ ప్రపంచీకరణ ఒప్పందాలకు తలొగ్గిన ప్రభుత్వం ఈ ఆర్థికరంగాన్ని విధ్వంసం చేసింది. ఈ విధ్వంసాన్ని తెలుగు కవులు చైతన్యవంతంగా వ్యక్తీకరించారు. వ్యవసాయరంగంలో మార్పులు, విత్తనాలపై బహుళజాతి కంపెనీల ఆధిపత్యం, గ్రామాల విధ్వంసం, చేతివృత్తులు చతికిలబడిన తీరు, వస్తు వ్యామోహం, నీటి వ్యాపారం, ప్రకృతి కాలుష్యం మొదలైన అంశాల ఇతివృత్తంగా రాసిన కవిత్వం ఆర్థికరంగం కింద చేర్చాను. ప్రపంచీకరణ ఎన్నో జీవితాలను ధ్వంసం చేసింది. అభివృద్ధి నీడలో

మసిబారుతున్న మనుషులెందరో? ప్రపంచ మార్కెట్నంతా ఒక్కటి చేయటానికి పన్నిన కుట్రలో పంట పొలాలపై విస్తరించిన రోడ్లు ఏ అభివృద్ధికి సూచికలో తెలియనిస్థితిలో రైతులున్నారు. వస్తువులను తరలించటానికి మట్టి పరిమళంపై తారు పరుచుకుంది. పంట పొలాల నుంచి నేరుగా విమానాశ్రయాలకు రోడ్లు వెలిశాయి. ఈ రోడ్లయినా ఆ ప్రజలకు ఏమైనా పనికొచ్చాయా? అంటే అదీ లేదు. బహుళజాతి కంపెనీలకు అవసరమైన వస్తువులను పండించటానికి ఇక్కడి పంటపొలాలు పనికొస్తున్నాయేగాని మనిషికి పని దొరకటం లేదు. పైగా బైపాస్ రోడ్డు వచ్చి మట్టి రోడ్డుకు ఇరువైపులా బతుకుతున్న చేతివృత్తులను మింగేసింది. ఎన్.గోపి ఈ విషయాన్నే వివరించారు.

"ఇది వరకు
పల్లె గుండెల్లోంచి వెళ్ళేవాళ్ళం" అని పల్లె పట్ల ఆత్మీయతను ప్రకటించారు.

"అరుగు మీద దర్జీ
రోడ్డు పక్కన చెప్పులు కుట్టేవాడూ
గోడ నీడన
అద్దం బిళ్ళ ఆకాశంలోకి చూపిస్తూ
క్షౌరం చేసేవాడూ
.......................................
ఒక్క బైపాస్ రోడ్డుతో దూరమైంది"[2]

కేవలం నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన అగ్రదేశాలు వేల సంవత్సరాల చరిత్ర ఉన్న భారతదేశం లాంటి దేశాలను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నాయి. ఆర్థిక ప్రయోజనాల కోసం తాము చేసిందే ఒప్పు, ఇతరులు చేసేదంతా తప్పు అని కర్రపెత్తనం చేస్తున్నాయి. ప్రపంచీకరణ ఒప్పందాలకు కల్పించిన వెసులుబాట్లే వారి దేశాలకు వరమైనాయి.

"నీ రక్త దాహానికీ
అవిశ్రాంత మారణహోమానికి
నా అజ్ఞానపు వ్యామోహమే కదా కారణం?
.......................................
నీ విషపు నవ్వుల

ఆలింగనాల వంచన మధ్య

గుండెల్లోకి చల్లగా దిగుతున్న

పేటెంట్ పిడిబాకులు"[3]

చక్కటి ఉపమానాలతో విత్తనాలపై పేటెంట్ పొందిన సామ్రాజ్యవాద దేశాల కుట్రను ఈ రచయిత్రి గొప్పగా చెప్పారు.

ప్రపంచీకరణ ఫలితంగా తలెత్తుతున్న పరిణామాలు సామాజికంగా ఆర్థికంగా అణగారిన దళితుల బడుగువర్గాల వారికి శాపంగా మారిందని వివిధ రంగాలకు చెందిన పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేసారు. దేశంలో స్వేచ్ఛ మార్కెట్ విధానం వలన పేదవారుగా ధనికులుగా మారుతున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో పాశ్చాత్య దేశాల వ్యాపార ధోరణులు అడ్డుకోకపోతే స్వదేశీ ఉత్పత్తులు కుప్పకూలి ఆర్థిక స్తోమత లేని దళిత జీవనోపాధులు పూర్తిగా దెబ్బతింటాయి. పేదలపై పడగ విప్పుతున్న ప్రపంచీకరణను అడ్డుకోవడానికి స్వాతంత్ర్య పోరాటం వంటి మరో దీర్ఘకాల ఉద్యమం తప్పదని వారు స్పష్టం చేసారు. ప్రపంచీకరణను, స్వేచ్ఛా మార్కెట్ విధానాన్ని అడ్డుకొని స్వదేశీ ఉత్పత్తుల ఆవశ్యకతను పెంచడానికి ప్రజా ఉద్యమం అవసరమనే అభిప్రాయం ఉంది.

**2.1.1.వ్యవసాయరంగం:** భారతదేశం పేదదేశంగా, అధిక జనాభా కలిగిన దేశంగా, అభివృద్ధి చెందుతున్న దేశంగా చెప్పవచ్చు. సహజ భౌగోళిక సంపద కలిగిన ప్రాంతం కావటం వలన ఇక్కడి ప్రజలు ఎక్కువగా వ్యవసాయరంగంపై ఆధారపడి ఉంటారు. పారిశ్రామికరంగమైన, సేవారంగామైన, విద్యారంగమైన, వ్యవసాయరంగానికి అనుసంధానంగా అభివృద్ధి చెందుతాయి. ప్రజలు కూడా ఎక్కువ మొత్తంలో ఆహారపు పంటలనే పండిస్తారు.

నూతన ఆర్థికవిధానాలలో మన రాజకీయార్థిక వ్యవస్థలోకి బహుళజాతి సంస్థల చొరబాటులో భాగంగా మన వ్యవసాయరంగంలోకి కాంట్రాక్టు వ్యవసాయం, కార్పోరేట్ వ్యవసాయం ప్రవేశించాయి. భారత ఆర్థికవ్యవస్థలో వ్యవసాయరంగం బహుముఖ పాత్ర నిర్వహిస్తున్నది. అందువల్ల భారత వ్యవసాయరంగ మనుగడను, అది దేశ ప్రజల ఆహార అవసరాలు తీరుస్తుందా లేదా అనే అంశాల దృష్టి నుండే గాకుండా ఈరంగంపై ఆధారపడిన ప్రజల సంక్షేమం, వారికి జీవనోపాధి కల్పించటం అనే విస్తృత దృక్పథం నుండి కూడా పరిశీలించవలసి ఉంది. 82శాతం కంటే పైగా భూకమతాలు 2 హెక్టార్లు కంటే తక్కువ పరిమాణం కలిగినవే. అదే విధంగా 60శాతం భూకమతాలు 1 హెక్టారు కంటే తక్కువ

భూమి కలిగి ఉన్నాయి. ఏ దేశానికైనా ఒక ఆర్థికవ్యవస్థ ఉంటుంది. దాని మీదనే ఆ దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ఈ వ్యవస్థ సమృద్ధిగా ఉండాలంటే గ్రామం సుభిక్షంగా ఉండాలని మేధావులు అంటారు.

భారతదేశం లాంటి వ్యవస్థలకు గ్రామమే పునాది. గ్రామమంటే ఒక పేరు, కొందరు మనుషులు, మరి కొంత భూభాగమే కాదు, వృత్తులు, పాడిపంటలు, వ్యవసాయ పనిముట్లు ప్రవహించే నీరు, కుటీర పరిశ్రమలు. ఈగ్రామీణ వ్యవస్థను అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వానికి ఉంటుంది. కాని ప్రపంచీకరణ ఒప్పందాలకు తలొగ్గిన ప్రభుత్వం ఈరంగాన్ని విధ్వంసం చేసింది.

"ఈ ఇన్ స్టాంట్ కన్నీళ్ళు కంటి తుడుపుల తర్వాత
ఎక్స్ గ్రేషియా ప్రహసనాల తర్వాత
మళ్ళీ దృశ్యం ఎదురుపడి
ఆధార రహితమైన దిశమొలదరిద్రం
అభివృద్ధిని వెక్కిరిస్తుంది...
నిలదీస్తుంది...
వాళ్లకిప్పుడు ఉనికి కావాలి
ఉనికికి నిడపట్టే వృత్తి
వృత్తి నిలదొక్కుకునే నేల కావాలి
వాళ్ళ వృత్తి నైపుణ్యాన్ని ఆదరించి
గౌరవించే ప్రవృత్తి మనలో రావాలి".[4] ఆవిరైపోతున్న పల్లె వాతావరణంలో పక్షులు కూడా మటుమాయం అవుతున్నాయి. మన పల్లెను కాపాడుకొండంటూ కవులు గలమెత్తారు. ఈవిధ్వంసాన్ని తెలుగు కవులు చైతన్యవంతంగా వ్యక్తీకరించారు.

వ్యవసాయ రంగంలో మార్పులు, విత్తనాలపై బహుళజాతి కంపెనీల ఆధిపత్యం, గ్రామాల విధ్వంసం, చేతివృత్తులు చతికిలబడిన తీరు, వస్తువ్యామోహం, నీటివ్యాపారం, ప్రకృతి కాలుష్యం మొదలైన అంశాల ఇతివృత్తంగా రాసిన కవిత్వం ఆర్థికరంగం కింద చేర్చారు. ప్రపంచీకరణ ఎన్నో జీవితాలను ధ్వంసం చేసింది.

కులవృత్తుల వికాసంతోనే భారత గ్రామీణ జీవనశైలి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రకృతి చేరువలో మన చేతివృత్తులు ప్రపంచ ప్రసిద్ధిగాంచాయి. వ్యవసాయమే ప్రధానంగా, దాని అనుబంధంగా మిగిలిన వృత్తులు శాఖోపశాఖలుగా విస్తరించాయి. క్రమంగా అవి పారిశ్రామిక వివాదాల విధానంలో, విస్తరిస్తున్న ప్రపంచీకరణ నేపధ్యంలో కష్టనష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికి కొన్ని అంతరించే దశలో, అంపశయ్యపై కొట్టుమిట్టాడుతున్నాయి. కులవృత్తుల బతుకులు బుగ్గిపాలు కాకుండా కాపాడాలని ప్రభుత్వం స్వయంగా వేసిన మంత్రుల ఉపసంఘం చేసిన సిఫారసులు సైతం అమలుకి నోచుకోక నాలుగేళ్ళుగా మూలుగుతున్నాయి.

"రోజుకొక నేత కళాకారుడు
ఊరు దాటి పోతున్నాడంటే
ఊరికెంత అవమానం
మాయదారి మార్కెట్ గారడిలో పడిపోయి
మనుషులు మరమనుషులౌతున్నాగానీ
రేపు నీ గోరంచు పంచి లేకుండా
ఎంతటోడి శవమైనా గోలిదాటి ఎల్తాదా"[5]

చేనేత కార్మికులు వృత్తులను మాని వలసలుపోతున్నారు. కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చేతివృత్తులు వారికిది గడ్డు కాలం. భారీయంత్రాలు ప్రవేశించడం వారి కడుపుకి ఎసరు పెట్టినట్లైంది. ఉపాధి లేకపోవడంతో ఆత్మహత్యలే శరణ్యమయ్యాయి. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా చేతివృత్తులపైనే జీవనం సాగిస్తున్నారు. "ప్రస్తుతం వృత్తిదార్ల ఉత్పత్తులకు గిట్టుబాటు దొరక్క వారి జీవన వ్యవస్థ చిన్నాభిన్నమైనది. రోజులు గడవక, కుటుంబ అవసరాలు తీరక అప్పుల పాలౌతున్నారు. రుణగ్రస్తులైన కొంతమంది వాటిని తీర్చలేక, ఎదురయ్యే అవమానాలు భరించలేక బలవన్మరణాల పాలవుతున్నారు. మరికొంతమంది వృత్తుల్ని వదులుకొని నాలుగురాళ్ళు సంపాధించుకోవాలని వలస బాటపడుతున్నారు. మరికొందరు రోజువారి కూలీలుగా బతుకుతున్నారు"[6]

చేనేత కార్మికులు ఆత్మహత్యలు తెలుగు కవుల్ని కుదిపాయి. ఆత్మహత్యలు మూలాల్ని విశ్లేషించాయి.

"లోకుల్ని నాగరికుల్ని చేసి
మహత్తర వస్త్రాలు నేసి
మాన సంరక్షణ చేసింది వాళ్ళు
అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసిన
అద్భుత పనితనం వారిది
ఇప్పుడా అగ్గిపెట్టె
వాళ్ళను తగలబెట్టడానికి పనికొస్తున్నది...
పత్తిని పండించిన నేరానికి
.......... వస్త్రంగా మార్చి
మనిషి ఒంటి మీద అందంగా అలంకరించిన
నేరానికి నేతగాడు ఆత్మహత్య చేసుకుంటున్నాడు"[7]అంటూ నందిని సిధారెడ్డి చావు లెక్కలు తేటతెల్లం చేస్తాడు. శీలం సుభద్రాదేవి చేనేత కార్మికుల దైన్యాన్ని, మనోధైర్యాన్ని 'శేషవస్త్రం' కవితలలో వ్యక్తం చేసింది.

**2.1.2.కార్పోరేట్ వ్యవసాయం:** నూతన వ్యవసాయ విధానంలో భాగంగా రాష్ట్రంలోనూ దేశంలోనూ పెద్ద ఎత్తున కార్పోరేట్, కాంట్రాక్టు వ్యవసాయం చేపట్టాలని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నిశ్చయించాయి. ఈ నిర్ణయాల్ని ప్రభుత్వాలు ఒప్పుకోలేదు. చిన్నకమతాలు లాభదాయకం కావు. ఆ కమతాలపై ఆధారపడి చిన్నరైతులు జీవించడమూ కష్టమే.

వ్యవసాయానికి అవసరమైన వనరులు వారికి అందుబాటులో లేవు. పెట్టుబడి పెట్టే స్తోమత వారికి ఉండదు. చిన్న రైతులు పేదరికంలో జీవిస్తారు. ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించనూలేరు. ఎగుమతి ప్రధానమైన పంటలను వారు సాగు చేయలేరు. ప్రపంచీకరణ ఎంత దుర్భరమైన జీవితాన్ని సృష్టిస్తుంది. ప్రపంచీకరణ కారణంగా రైతు బక్కచిక్కిపోయాడు. అతని జీవితం అడకత్తెరలో పోకచెక్క. సమస్య సమస్యగానే ఉంటోంది కాని పరిష్కారానికి దారులు తెరుచుకోవడం లేదు. అందుకే రైతువ్యధను కవి నెత్తినవేసుకున్నాడు. 'నాగలి విరిగినప్పుడు' రైతు పురుగు మందు తాగి చనిపోవడం తప్ప ఏం చేస్తాడు..?

"నేనిప్పుడు నెపం

నేలమీదో గాలి మీదో తోసేస్తే కుదరదు

నేల మోసం చెయ్యదు

నేరం తప్పకుండా మనిషిదే

నేనిప్పుడు

వాడి చేతితో పంటనొల్లుకొని

కంట్లోకారం జల్లినవారినే ప్రశ్నిస్తాను"[8] అని ఎరువులు, సబ్సిడీలు. విద్యుత్, నీటివసతి వంటి సౌకర్యాల లేమి కారణమని సమస్యమూలాలను ప్రశ్నిస్తాడు.

"చేనుకంకుల్లో మానవ కంకాళాలను ఏరుకుతిన్న

భూస్వామి

కలగలసిన మధ్యదళారి

దేశం ముఖం మీద

ఉక్కుపాదాలతో తొక్కుతున్నప్పుడైనా

ముఖం చిట్లిందని దాక్కుంటావా

మట్టిని పెకలిస్తూ మేల్కొంటావా?[8] అని దళారి-భూస్వామి ఇద్దరు కలిపి ఆడుతున్న పంట నాటకానికి తెరదించమంటూ రైతును హెచ్చరిస్తాడు.

**2.1.3.కాంట్రాక్టు వ్యవసాయం:** రైతులకు విత్తనాలతో పాటు ఇతర సాగుదినుసులన్నీ సమకూర్చడంతో పాటుగా పండినపంటను కూడా అవి ఇచ్చిన వారే కొనుగోలు చేసే పద్ధతినే కాంట్రాక్టు వ్యవసాయం అంటారు. అంటే రైతులకు కంపెనీకి మధ్య ఒక ఒప్పందం అమలులో ఉంటుందన్న మాట. సాగుకు అవసరమైన విత్తనాలు పురుగు మందులు తదితరాల ధరలను, అలాగే వ్యవసాయోత్పత్తుల ధరలను ఎవరు నిర్ణయిస్తారన్నది కాంట్రాక్టు వ్యవసాయంలో చాలా కీలకమైన అంశం. అలాంటి సందర్భంలో రైతు తన పంటను అమ్మేసుకోవడం తప్ప వేరే గత్యంతరం ఉండదు. కాంట్రాక్టు వ్యవసాయంలో రైతుల నిలువ దోపిడీ ఖాయం.

**ఉదాహరణ:** కాంట్రాక్టు వ్యవసాయంలో చేరిన ఫిలిప్పైన్స్ రైతులు అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. వారు అటు తమ భూములు కోల్పోయారు. దాంతోపాటే తమ సామాజిక భద్రతనూ కోల్పోయారు.ఈ పరిస్థితి నుంచి సామాజిక అశాంతి, ఆందోళనలు పుట్టుకొచ్చాయి. కాబట్టి రాయితీల ప్రయోజనాలకు

కార్పోరేట్, కాంట్రాక్టు వ్యవసాయాలవల్ల హానితప్ప మేలు జరగదని అంతిమంగా తేలుతోంది. కార్పోరేట్ రంగానికి చిన్న రైతులను ఆహారంగా వేయటం తప్ప ఇది మరొకటి కాదు.

ప్రపంచీకరణ మన వ్యవసాయరంగాన్ని ఎక్కువగా దెబ్బతీసింది. ఇక్కడి ఉత్పత్తులు ఆగిపోతేనే 1400 విదేశీ వస్తువుల దిగుమతికి అవకాశం ఉంటుంది. ఒకవేళ ఇక్కడే పంటను పండించవలసి వస్తే భూమి మనది శ్రమ మనది కాని విత్తనాలు, ఎరువులు బహుళజాతి కంపెనీలవి. మొదట్లో వాణిజ్యపంటలో తక్కువలోనైనా లాభాన్ని చూపిన ధనికరైతుల డాలర్ కలల్లో మునిగిపోయారు. వెనక్కి తిరిగి చూసుకుంటే శూన్యం మిగిలింది. మట్టిశ్వాసను కూడా మర్చిపోయేస్థితి వచ్చిందని బీరం సుందరరావు అంటున్నారు.

"వాడు దోసెడు డాలర్లను నా కళల నేలపై చల్లి
దోపిడీకి కొత్త నిర్వచనం చెబుతున్నాడు
తల్లి విత్తనం మొలకను నియంత్రించి
"టెర్మినేట్" మంత్రాన్ని జపిస్తున్నాడు
వాడు గ్లోబల్ స్టెతస్కోప్ తో
నా గుండె చప్పుడును కొలిచినప్పుడల్లా
కుండటేరు తెగిపోతుంది".[9]

రైతు అన్నం ముద్ద నాగలి, ఆ నాగలిని రైతు నుంచి దూరం చేస్తుంది ప్రపంచీకరణ. యంత్రాన్ని పొలంలోకి ప్రవేశపెట్టాక నాగలి కర్రు పదును భూమికి దూరమౌతుంది. కొన్నాళ్ళకు నాగలి పురావస్తుశాలలో ప్రదర్శనగా ఉంటుంది. అయితే కవి ఆశాజీవి కావటం వలన ప్రపంచీకరణ అన్నం ముద్దను లేకుండా చేస్తే మట్టి పరిమళాన్ని ఊరూర చల్లుతానని గర్వంగా ప్రకటిస్తున్నాడు. ఎవరి దృష్టిపడని విషయాలపై కవి తన దృష్టిని సారిస్తాడు. జరుగుతున్న సంఘటనలకు అతడు సాక్షి భూతం కావాలి. రిలయెన్స్ హెయర్ కటింగుషాపుల్ని ప్రారంభించబోతుందని (18.11.2007) పత్రికల్లో వార్త వచ్చింది. ఇప్పటికే ఈ సంస్థ నిత్యావసర వస్తువులను సప్లయి చేసే రిలయెన్స్ ఫ్రెష్ నూ ప్రారంభించింది. దీని వలన పెద్ద పట్టణాలలో చిన్న వ్యాపారులు, తోపుడు బండ్లపై కూరగాయలు ఇతర సామానులు అమ్ముకొని జీవించే బడుగు జీవులు దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు.

ఇంకా రకరకాల షాపింగ్ మాల్స్ వచ్చి చిల్లర వ్యాపారుల కంచంలో రాళ్ళు కొట్టాయి. ఇదంతా ప్రపంచీకరణ పుణ్యమే అంటే తప్పు అన్న వాళ్ళది కాదు. ఈ మాల్ మాయాజాలాన్ని ప్రసన్నకుమారి కవిత్వీకరించారు.

"నాడు మెట్ట మాగాణి పొలాల్లో
పచ్చటి పసరిక నాట్యం చేసేది
నేడు బహుళ అంతస్తు భవనాలు
షాపింగ్ మాల్స్-మాయాజాలం
వారాంతపు సంతను మింగేసింది....."[10]

సంతలో సింగారించుకున్న తమలపాకుల కట్ట, తంబాకు తడిమట్ట, కూరగాయల తట్ట, బజ్జీల బుట్ట, గోలిసోడా మొదలైన గ్రామీణ జీవితమంతా మాల్స్ లో ప్రపంచీకరణ వేషం వేసుకొని తమ అస్థిత్వాన్ని కోల్పోయాయి.

"ఏమిటి
నా పొలాల్లో
నేను వెయ్యని విత్తనాలు మొలుస్తున్నై
నా జలాల్ల
నానా విదేశీ కల్మషాలు కలుస్తున్నై"[10] అని డాక్టర్ తిరునగిరి పరాయికరించబడుతున్న జీవితాన్ని చెబుతున్నారు. మనదే అనుకున్న గగనతలం కూడా పరాయిదయిందని బాధపడ్డాడు.

భారతదేశం ప్రధానంగా వ్యావసాయిక దేశం. రైతన్న దేశానికి వెన్నెముక వంటి వాడని గొప్పగా చెప్పుకుంటాము. కానీ నేడు రైతన్న నడ్డి విరిగిపోయి, బక్కచిక్కి శల్యమైపోయి, అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఆత్మాభిమానాన్ని చంపుకోలేక తనని తానే చంపుకుంటున్నాడు. ప్రపంచీకరణకు బలైపోతున్న రైతుదుఃస్థితి చూసి 'గ్లోబలైజేషన్'కు 'బలైపోకు' అని ఆక్రందిస్తున్నారు కవులు.

"మన విత్తనాల మీద మరొకడి పెత్తనం ఏమిటి?" అని,

"మన బియ్యాలను దయ్యాలకు, అంకితమివ్వడం దేనికి"[11] అని నిలదీస్తున్నారు. రైతు తన పొలంలో ఏది పండించాలో, ఎలా సాగు చెయ్యాలో మట్టిని నమ్ముకున్న రైతన్నకి తెలుస్తుంది. కానీ పరాయిదేశం వాడికేం తెలుస్తుంది. అయినా పెత్తనం చేస్తున్నాడు.

"వరల్డ్ ట్రేడ్ వుచ్చులకు
వ్రేలాడే బొమ్మ
అన్నపూర్ణమ్మ"[12]గా మారిన పైనాన్ని నిరసిస్తున్నారు కవులు.

"ఏండ్ల తరబడి పండించుకున్న విత్తనాలు
టర్మినల్ విత్తనాలవుతాయి"[13]అప్పుడు వ్యవసాయానికి కూలీగా మారి చివరికి బిచ్చగాళ్ళుగా మారే ప్రమాదముందని హెచ్చరికలు చేసారు కవులు.

ఆంధ్ర రైతులు అన్నప్రధాతలుగా ప్రసిద్ధి. కానీ ఇప్పటి యదార్ధస్థితి......

"ఏమని చెప్పను ఆంధ్ర రైతుల వ్యధలు
మధ్యతరగతి రైతన్న కన్నీటి కథలు
నకిలీ విత్తనాలు-కల్తీపురుగుల మందులు
కరెంటు కోతలు- చార్జీల మోతలు
గిట్టుబాటు ధరలులేని వ్యవసాయం
అప్పులపై వడ్డీలకు సరిపోదు వారి ఆదాయం"[14]

"బహుళజాతి విత్తనాలు కనిపించని కత్తికి రైతుల తలలు తెగి నేలరాలుతున్నాయి"[15]

**2.1.4.ప్రపంచీకరణ రైతు సంక్షోభం:** ప్రపంచీకరణ వలన రైతులకు కలిగిన సంక్షోభాన్ని వీలైనంత ఎక్కువ కోణాల్లో చూపగలిగింది. ప్రపంచీకరణ కవిత్వంలో రైతులకు ప్రపంచీకరణ వలన కలిగిన నష్టాలు, వారు పడేకష్టాలు, చిద్రమవుతున్న రైతుజీవితం గతితప్పుతున్న రైతుకుటుంబాలు మొదలైనవి స్పష్టంగా చెప్పబడ్డవి.

"మాకంకుల్నీ, కొడవల్నీ
దొంగిలించుకుపోయిన జెండాలిప్పుడు
తలల్లేని మొండాలపై తన్నుకు ఛస్తున్నై

యూరోలూ - యెన్లూ - డాలర్లూ కల్సికొన్న
హైబ్రీడు వంగాడాలిప్పుడు
మా మొలలపై మోయలేని వరిబీజాలైనై
.................................................
మా కంకులకి డంకెలోడి కాకి నగలక్కర్లేదు
మా నాగళ్ళకెవడు నగిషీ నలుగులెట్టక్కర్లేదు"[16] అని ప్రపంచీకరణ విధానాలైన గాట్ ఒప్పందం, డంకెల్ ప్రతిపాదన పేటెంటు హక్కులు అనేవి ప్రధానంగా రైతులను దెబ్బతీస్తాయి. వీటి వల్ల రైతులు ఎక్కువుగా నష్టపోయారు వీటిని నిరసిస్తూ మంచి కవిత్వం వచ్చింది. "పాము కరిస్తే బతకొచ్చు కుక్క కరిచిన బతకొచ్చు గాట్ కరిచిందో అంతే సంగతులు అది పేటెంటు కోరల్తో ట్రిప్ పంజాతో త్రీనాట్ వన్ నాలుకలతో తృతీయ ప్రపంచ దేశాల గుండెలు చీల్చి నొప్పిలేకుండా నెత్తురుతాగుతుంది[17]. ఇంతకుముందు రైతువ్యవసాయం చేయడానికి ప్రధానంగా కావలిసినవి విత్తనాలు వాటిని రైతు స్వంతంగా తయారు చేసుకొనేవాడు. ఇప్పుడు ఎరువుల కంపెనీలు ఎక్కువ కావడంతో రైతులు కంపెనీల సరుకునే ఎక్కువుగా వాడుతున్నారు. ప్రపంచీకరణ మూలంగా రైతు పూర్తిగా కంపెనీలకి దాసోహమైపోయాడు.

ప్రపంచ ఆర్థికవ్యవస్థపై ప్రపంచ ఉత్పత్తులపై మార్కెట్లపై ప్రపంచీకరణ ఫలితంగా బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యం పెరిగింది. బహుళజాతి కంపెనీలు మార్కెట్ వరకే కాక రాజకీయాలను కూడా ప్రభావితం చేసాయి. ఎగుమతికి పనికివచ్చే పంటలు ఎక్కువై ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గింది. కాంట్రాక్టు సేధ్యాల కారణంగా వినాశకర విధానాలు ఎక్కువై సహజవనరులు పాడై సారంలేని భూములు మిగిలాయి. అధిక రసాయనాలు వాడడం అవసరమైన జెనిటికల్లీ మాడిఫైడ్ ఫుడ్స్ సాగును ప్రపంచీకరణ పేరుతో వర్ధమాన దేశాలకు ఇచ్చి సమస్యలను కొనితెచ్చుకున్నారు. దీని వలన భూగర్భజలాల్లో నైట్రేట్లు చేరి నిస్సారభూములు నీటికాలుష్యం వాతావరణ కాలుష్యాలు ఏర్పడ్డాయి. రసాయనాల వలన వానపాములు నశించి దేశమైతే 50పైసాలకు విదేశీయమైతే 1రూపాయికి కొనుక్కొనే పరిస్థితి ఏర్పడింది. చేపల నీలివిప్లవాన్ని ఆక్వాకల్చర్, పసుపు పచ్చవిప్లవాన్ని పామాయిల్, శ్వేతవిప్లవాన్ని సింథటిక్ మిల్క్ ప్యాకెట్లు దెబ్బతీసాయి. జీవసంబంధాలు జీవసంబంధమైన వనరులుపైన అభివృద్ధి చెందిన దేశాలు పేటెంటుహక్కులను

పొందుతున్నాయి. పేటెంటు హక్కు పొందినవారికి జీవసంబంధమైన ఉత్పత్తులను అమ్ముకొనేహక్కు ఉంది. అల్లం, పసుపు, చింతపండు, వంకాయ, జామ, దానిమ్మ, అశ్వగంధ, తులసి, వేప మొదలైన వాటిపై పేటెంటుహక్కులను పొందారు. వర్ధమాన దేశాలు ముడిసరుకులను మన దేశం నుండి కొని మనకే విక్రయించే  స్థితి ఈస్ట్ ఇండియా కంపెనీని తలపిస్తుంది.

**2.1.5.ప్రాజెక్టులు:** ప్రాజెక్టులు నగరాలకు దగ్గర గల పారిశ్రామిక ప్రాంతాలకు నీటి సరఫరా ఉద్దేశించబడినవి. ప్రాజెక్టులోని భాగాన్నీ ప్రైవేటు కంపెనీలకు  అప్పగించారు. ఒక డామ్ ను నిర్మించేందుకు నీటిహక్కులు ఇవ్వబడ్డాయి. ఒప్పందాలు కుదిరిన మీదట ప్రభుత్వ సంస్థకు ప్రాజెక్టును నిర్వహించడానికి తగినంత డబ్బు లేకపోవడం వలన రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ భారీ ఎత్తున డబ్బు చెల్లించింది. ప్రపంచ బ్యాంకు షరతులకు అనుగుణంగా నీటిసరఫరా సంస్కరణలు కూడా విద్యుత్ రంగదిశలోనే ముందుకు వెళుతున్నాయి.  నీటివనరుల నిర్మాణం, అభివృద్ధి, నిర్వహణ, కౌలు, బదిలీ వంటి కార్యక్రమాల్లో ప్రైవేటురంగం భాగస్వామ్యాన్ని పరిగణలోకి తీసుకుంటారు.

ఉదా: బొలివియాలో నీటిప్రైవేటికరణ. వాన నీటిని పట్టుకోవడం కూడా చట్ట వ్యతిరేకంగా పరిగణించబడుతుంది. నీటి ప్రైవేటికరణ ప్రయోగం విఫలమైంది.

**2.1.6.బ్యాంకింగ్:** భారత ప్రభుత్వం బ్యాంకింగ్ రంగాన్ని సరళీకరించటం మొదలుపెట్టింది. ప్రైవేటు బ్యాంకులు వచ్చాయి. బ్యాంకింగ్ సరళీకరణ ఆర్థిక అభివృద్ధికి ఆస్తుల సృష్టికీ ఉపాధికల్పనకు ఉపయోగపడకపోగా సంక్షోభానికి దారితీసింది. రిటైల్ వ్యారంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వలన స్థానిక ఉత్పత్తిదారులకు గానీ ఎటువంటి మేలు జరగదు. దేశీయ మార్కెట్లోకి బహుళజాతి కంపెనీలు వస్తాయి.

విదేశాల నుండి చౌక వస్తువుల దిగుమతి కావడం, స్థానిక మార్కెట్లో తక్కువ ధరలకు కొనడం వలన స్థానిక ఉత్పత్తిదారుల ఆదాయాన్ని తగ్గించి వారిని నిర్వాసితుల్ని చేసింది.

ఉదా: నైకీ కంపెనీ 5 డాలర్లకు ఉత్పత్తి చేసే బూట్లు 50 నుండి 100డాలర్లకు అమ్ముకుంది. ఇండోనేషియాలో నైకీ బూట్ల తయారు చేయడానికి పనిచేసే మొత్తం కార్మికులకు చెల్లించిన దానికన్నా నైకీ ఉత్పత్తులకు వ్యాపార ప్రకటన ఇచ్చిన మైకేల్ జోర్డాన్ కు ఎక్కువ పైకం చెల్లిస్తుంది.

**2.1.7.పత్తి:** భారత దేశ వాణిజ్య పంటలలో అత్యంత ఆదాయం వచ్చే పంట పత్తి. పత్తి ఉత్పత్తి ధర కన్నా 47%తక్కువకు ఎగుమతి చెయ్యటం వలన రైతులు నష్టపోయారు. మన ప్రభుత్వం అమెరికన్ పత్తిని అమెరికన్ జొన్నలు పండించాలని ఒత్తిడి చేస్తుంది. కమ్యునికేషన్, ఐటి, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, రేడియో, ముద్రణ, రిటైల్ వ్యాపారం, పారిశుధ్యం, అంతర్గత జలమార్గాలు, రోడ్లు,విమాన మార్గములు మొదలైన సేవలు మామూలు ధరలకు ప్రభుత్వం అందిస్తుంది. ఈ సేవలు గాట్ పరిధిలోనికి వస్తాయి. ప్రభుత్వ స్థానంలోకి బహుళజాతి సంస్థలను ఈ సేవారంగాలను తీసుకువచ్చే బాధ్యతను ప్రపంచ వాణిజ్యసంస్థ వహిస్తుంది.

"రసం పీల్చు పురుగు తొలిసాగు పత్తిపైరుని
పీల్చిన పిప్పి చేసినపుడు
కన్నారు ఆమెకి తొడిగిన బంగారు గాజులు
కన్నీరు కరిగిపోయాయి"

అంటూ పత్తి రైతుల వ్యథలను ఇంటి ఇల్లాలికి పట్టిన దీనస్థితిని వర్ణిస్తున్నాడు కవి.

"మన ఈదేశంలో ప్రతి ఊరూ ఓ పత్తిచేసే
ప్రతిగుడిసె ఒకపత్తి మొగ్గ"[18]

ఇది పత్తి రైతుల జీవన వాస్తవికత. ఈ ఆత్మహత్యల నేపథ్యంలో ఆహార పంటలకు బదులు వాణిజ్య పంటలు పండించేలా ప్రోత్సహించే ప్రపంచబ్యాంకు ఆదేశాలు ప్రపంచీకరణ రూపంలో ఎన్నో విధ్వంసాలను సృష్టిస్తున్నాయి. కష్టించి పండించిన పంట అప్పుకే సరిపోకపోతే వలసపోవడమో, లేక తన పొలంలోనే కూలీగా మారడమో చేస్తున్నాడు. గాట్ ఒప్పందం కారణంగా పేటెంట్ హక్కులు వచ్చి మన రైతు పరాయీకరింపబడ్డాడు. అలాగే టెర్మినేటర్ గింజలొచ్చాక రైతు పరాధీనుడయ్యాడు. ప్రతీ పంటకు విత్తనం కోసం ఇతరులపై ఆధారపడడం, మోసానికి గురి కావడం నేటి రైతు స్థితి.

"చెమట చుక్కలను నాట్లు వేస్తూ పోతున్నారు
అందులో కన్నీళ్ళు మొలుస్తాయో

కడుపు మంటలు జ్వలిస్తాయో'[19] అనే సినారె కవితలో విత్తనాలు కొనలేని రైతు దీనస్థితి ప్రతిబింబిస్తోంది. అన్నింటికన్నా ముఖ్యంగా నేడు అదృశ్యమవుతున్న పల్లెజీవితం ఒక ప్రశ్నార్థకంగా మారింది.

“గాలిస్తున్న గ్లోబలైజేషన్ జల్లెడలో

పల్లె జరజరా జారిపోతోంది”[20]

రైతు జీవితం నానాటికీ దుర్భరమవుతున్న నేపథ్యంలో పంటలు పండక, గిట్టుబాటుధర లభించక, సకాలంలో వర్షాలు కురవక, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు స్వైరవిహారం చేస్తుంటే - పట్టణాలకు వలస అనివార్యమవ్వడంతో పచ్చధనం కరువైన పల్లెలు అనాథలవుతున్నాయి.

“రెండోసారేసిన పత్తిపంట

వెంటేసుకొచ్చిన నల్లమచ్చ తెగులు

ఆమె మెళ్ళోని నల్లపూసల గొలుసుని

తుడిచిపెట్టుకు తినేసింది”[20]

పత్తి పంటను నమ్ముకుని ఉన్న పత్తి రైతుల ఆవేదనను సుదేరా చాలా చక్కగా వ్యక్తం చేసాడు. సరైన ధర ప్రభుత్వం కల్పించక చాలా మంది రైతుల దీనస్థితిని వర్ణించాడు.

1988లో ఒంగోలు జిల్లాలో పత్తి పంట విఫలమవటంతో పత్తి రైతులు అప్పుల పాలై అనేక సందర్భాల్లో ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ తరువాతి పదేళ్ళలో రాష్ట్ర ప్రభుత్వం పార్టీల చేతులు మారినా రైతుకి వొరిగిందేంలేదు సరికదా రైతు పరిస్థితి మరింత క్షీణించింది. రైతు దేశానికి వెన్నెముక లాంటి నినాదాలు తుప్పు పట్టి పోయాయి. వాటి స్థానే దేశ వ్యాప్తంగా ఆర్థిక సంస్కరణలూ, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలూ రైతు జీవితాన్ని నిర్ధేశించనారంభించాయి. బహుళజాతి వ్యాపార సంస్థలు వ్యవసాయానికి మూలమైన విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల సరఫరాని నియంత్రించటం మొదలైంది. వీటికి తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా రైతులకీ స్థానిక వ్యవసాయానికీ బలాన్నిచ్చే పాలసీలని రూపొందించి అమలు చెయ్యటంలో పూర్తిగా విఫలమయ్యాయి. కొన్ని పరిస్థితుల్లో రైతునీ, రైతు బాధల్నీ నిర్లక్ష్యం చేశాయి.

ఇదిగాక 1998 నుంచీ 2002 వరకూ వరసగా జూన్ మాన్‌సూన్ విఫలమై ఆంధ్రదేశంలో తీవ్రమైన కరువు పరిస్థితి నెలకొన్నది. వాన పడకపోతే పంట నిలవదు. పంట నిలిచినా కోతకొచ్చేలోపు ఏ తుఫానో వచ్చి కొట్టుకు పోతుంది. ప్రకృతి కరుణించి, ఇలాంటి అవాంతరాలన్నీ దాటి పంట బాగా పండితే మార్కెట్లో గిట్టుబాటు ధర పలకదు. 1998లో పత్తి రైతులు మాత్రమే ఎదుర్కొన్న నిస్సహాయ స్థితి 1998 వచ్చే సరికి చెరకు, మిరప, ఇతర పంటల రైతులకీ

ఎదురయింది. రైతు జుట్టు షావుకారు గుప్పిట్లో ఉండటం కొత్త కాదు. కానీ గత పదిహేనేళ్ళలో ఈ పరిస్థితి మరింత విషమించిందని ఈ మధ్య కాలంలో పెరుగుతూ వస్తున్న రైతు ఆత్మహత్యల సంఖ్యే చాటుతోంది. దేశం వెలిగి పోతోందని, రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు పోతోందని నినదించటం ఆత్మవంచన చేసుకోవటమే. ఇది సభ్య సమాజమంతా అవమానంతో తలదించుకోవలసిన సందర్భం.

**2.1.7.1.పత్తి రైతుల ఆత్మహత్యలు:** ప్రపంచీకరణ దాటికి ఇటీవల కాలంలో చాలా మంది పత్తి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. యావత్ జాతి సిగ్గుపడేలా ప్రభుత్వాలు చేస్తున్నాయి.

శ్రీ ఆవంత్స సోమసుందర్ ఆత్మహత్యలకు గురైన పత్తిరైతులకు ఆకలి చావులకు గురైన చేనేత కార్మికులు స్మృత్యంజలితో రాసిన "తారాఫలితం" కవితలో........

"పత్తిరైతుల పురుగుమందులు
నిర్భాగ్యుల ఆత్మహత్యలకు
దారితీస్తే........ ఇంకేందారి?
నీ చేనేత పని నీకే
సాలెగూడుగా మారి బంధించి
నీ బ్రతుకును హతమారిస్తే వాళ్ళు మాయల మరాటీలు
శ్రద్ధాంజలులైనా ఘటించరు నీకు
నేటి పచ్చిక బీళ్ళలో
హాయిగా మేసే గొర్రెలకు
రేపటి ఉదయమే నోళ్ళు తెరిచే
కటేళాలు గుర్తుకురావు
పత్తే లేనప్పుడు
పచ్చడా లెక్కడవని
............................
మళ్ళీ మళ్ళీ ఆశలు కురుస్తాయి...
మృషారంజిత నయనాలై..."[21] అంటూ పత్తిరైతులపై తన ఆవేదనను వ్యక్తం చేస్తున్నాడు.

**2.2.పారిశ్రామిక రంగం:** ప్రపంచీకరణ పారిశ్రామికరంగానికి పుట్టిన వింతశిశువు. ఈ శిశువు దెబ్బకు కంపెనీలన్నీ చతికిలబడుతున్నాయి. మొన్న ఆల్విన్, నిన్న ఐడిపిల్ నేడు రామగుండం ఎరువుల కర్మాగారం. ఇలా ఎన్నో కంపెనీలు మూతపడి కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఆవిధంగా రోడ్డు మీద పడిన లక్షలాదిమంది కార్మికులలో ఈ కవి కూడా ఒకడు కావటం యాదృచ్ఛికమే కావచ్చు. కానీ వాస్తవం. ఏ గుణాలైతే కవికి శాంతి సుఖం లేకుండా చేస్తాయో అవే అతని కవిత్వాన్ని ప్రేరేపిస్తున్నాయని వజీర్ రహమాన్ అన్నట్లు ఇక్కడ కవి సాంబమూర్తికి ప్రపంచీకరణ సుఖశాంతులు లేకుండా చేసింది.

"నీ శ్రమను డాలర్లోనికి మార్చుకొని
మరుగౌతున్నారు వాళ్ళు"[22]

అని శ్రామికుడు దోపిడీకి గురైన తీరును కవిత్వీకరించాడు. పరిశ్రమలే కాదు ప్రకృతి కూడా ప్రపంచీకరణ సొత్తైంది. ప్రపంచీకరణ సందర్భంలో మనదిగా కనిపించేది ఏది మన సొంతం కాదు. ఎందుకంటే మనకు తెలియకుండానే మన ఇంటి వేపచెట్టు పై బహుళజాతి కంపెనీ పేటెంటు హక్కును పొందుతుంది. మన ఇల్లు మనది కాదు మనం చేస్తున్న ఉద్యోగం స్థిరమైనది కాదు. విదేశీ విధానాలకు జీవితం ఎటుపోతుందో తెలియని సందిగ్ధతను ఎదుర్కోవాల్సి వస్తుంది.

"ఇల్లు వస్తువులూ
బ్యాంకులో తాకట్టు పెట్టబడ్డాయి
గాలి నీరు
బహుళజాతి సంస్థలకు
బేషరతుగా ధారాదత్తం చేయబడింది."[23]

మన ప్రభుత్వాలు మంచినీటిని లీటరుకు 75పైసల చొప్పున బహుళజాతి కంపెనీలకు అమ్మి నీటివ్యాపారం చేస్తున్నారు. ఆ కంపెనీలు తిరిగి ఆ నీళ్ళను మనకు 14రూపాయలకు అమ్ముతున్నాయి. కానీ గ్రామాలలో మంచినీటికి ప్రజలు కటకటలాడుతున్నారు. ఇవ్వాళ నీళ్ళపై కంపెనీలకు హక్కు కల్పించారు. ఇంకొన్నాళ్ళు పోతే గాలిని కూడా స్వేచ్ఛగా పీల్చుకోలేని స్థితి వస్తుందేమోనని ఈ కవి ఆవేదన.

1988 నుంచి చేనేత కార్మికుల హత్యలు అధికమయ్యాయి. వస్త్ర వ్యాపారం విదేశీ సంస్థల గుత్తాధిపత్యంలోకి జారిపోగా - దేశీయమైన చేనేతపరిశ్రమ చావు దెబ్బ తిన్నది. ఫలితంగా కార్మికులు ఆత్మహత్యలు ఏటేటా పెరుగుతూ వచ్చాయి. ప్రపంచ వస్త్ర కళల్లోనే మన వస్త్రకళ చాలా గొప్పది. అగ్గిపెట్టెలో ఆరుగాజాల చీర దాచగల్గింది కానీ ఈనాడు కార్మికుల స్వరమెలికల్లో దాగింది అవమానఘోష మాత్రమే.

"అంచులేని నేత చీర నిర్మాణంలో
మడమలు మరమేకులై
మగ్గం గుంటలో నిలిచాయి
పడుగు పట్టలేని హస్తాలు
గాలిని మోసే భుజాలైనాయి
రహస్య స్పర్శ మునివేళ్ళతో
దుఃఖానుభవాల దోసిళ్లు
వెన్నంటిన కడుపులో జాకార్డ్ పేవుల మోత
రంగు దారాల నులక మంచంలో
తిప్పుడు రాట్నంతో తలతిప్పిన ముసలి గువ్వ
.................................................
శాశ్వత నిర్మాణ సంకేతాలు
రాత్రికి రాత్రే అందుతాయి"[24]

ఆశల సముద్రం కవితా సంపుటిలో ధేనువుకొండ శ్రీరామమూర్తి నేత కార్మికుల స్థితిగతులను కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. రంగు రంగు దారాలను కొత్తకొత్త యంత్రాలతో తయారు చేయడం మూలాన పల్లె ప్రాంతాలలో ఉన్న సాలెల మగ్గానికి పని కరువైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు.

**2.3.విద్యారంగం:** 1980వ దశకం నుండి ప్రపంచీకరణ అనేక రూపాల్లో కొనసాగుతూ వస్తుంది. ఏ రూపంలో పిలవబడ్డ దాని సారాంశం మాత్రం దేశాల మధ్య సరిహద్దులు లేని, ఆంక్షలు లేని వ్యాపార ద్రవ్యం పెట్టుబడి స్వేచ్ఛగా సంచరించేందుకు అవకాశం కల్పించడమే. విస్తృతార్థంలో ప్రపంచీకరణ అంటే దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపారం, పెట్టుబడి, సేవలు ఎటువంటి ఆంక్షలు ఆటంకాలు లేకుండా

దేశ సరిహద్దులు దాటి స్వేచ్ఛగా నిబంధనలతో ప్రవహించే వెసులుబాటు! ప్రపంచీకరణ అంటే సామ్రాజ్యవాదం యొక్క వ్యక్తీకరణ. వలస పాలకుల నుండి 1947లో రాజ్యాధికారం స్వీకరించిన భారత పాలక వర్గం 1960 కల్లా నిరక్షరాస్యత నిర్మూలిస్తానని రాజ్యాంగంలో హామీ ఇచ్చింది. ఈ కాలపరిమితి ముగిసి నాలుగు దశాబ్దాలు గడిచినా నిరక్షరాస్యత నిర్మూలన జరగలేదు. వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూనే ప్రజలందరినీ విద్యావంతుల్ని జేసే జాతీయ ప్రజాతంత్ర విద్యావ్యవస్థ కావాలని డిమాండు చేసారు. వలస విద్యావిధానాన్ని యధావిధంగా కొనసాగిస్తూ అందరికీ విద్యను అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నాయి.

5దశాబ్దాల తదుపరి కూడా విద్యలో అసమానతలు కొనసాగుతున్నాయి. పట్టణ ప్రజల కంటే గ్రామీణ ప్రజలు, పురుషులు కంటే మహిళలు, సంపన్నులు కంటే పేదబడుగు వర్గాలు అత్యధికులు నిరక్షరాస్యులుగా ఉన్నారు.

ప్రస్తుత విద్యావిధానాలు సామాజిక అవసరాలకు అనుకూలంగా లేవు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన సామాజిక వర్గాలను దృష్టిలో పెట్టుకొని విద్యాప్రణాళిక రూపొందించబడలేదు. అందువలన విద్య సామాజిక అంతరాలను రూపుమాపలేకపోయింది. మానవసమాజం ప్రగతికి అత్యంత దోహదకారిగా ఉండే మానవాలోచన కలిగించడమే 'విద్య' యొక్క ప్రధాన లక్ష్యం. గతం, వర్తమాన బంధనాల నుండి విముక్తి కల్గించే సామర్థ్యాలనూ విద్య ప్రసాదిస్తుంది. పాలకవర్గాల విలువలను, సమాజంలోని కట్టుబాట్లను ప్రశ్నించి, ఎదిరించే శక్తిని విద్య కలిగిస్తుంది.

విద్య ఏయుగంలోనూ రాజకీయాలకు అతీతంకాదు. ప్రతియుగంలో సమాజాన్ని శాసించదలుచుకున్నవ్యక్తులు తమ లక్ష్యసాధనకు విద్యను ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారు. ఒకనాడు చదువు మోక్ష సాధనమేనన్న లక్ష్యం చెప్పి ఆ చదువును తమ వరకే పరిమితం చేశారు. ఆ చదువును తమ పరిసరాల్లోనే కట్టేశారు. ప్రస్తుతం చదువును జ్ఞానం అంటున్నారు. సాంకేతిక విప్లవాలు వచ్చాక సాంకేతికమైన పరిజ్ఞానమే సంపదనకు మూలమని తెలిసి, ఆజ్ఞానాన్ని సాధించటం చదువు అని, ఆ జ్ఞానాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవడమే ప్రపంచీకరణ.

విద్య వ్యాపారమైంది. విజ్ఞానం మార్కెట్ సరుకైంది డాలర్ దారిలో గురుపీఠమ్ మునిగి పోతోందని తల్లడిల్లిపోతూ కార్పోరేట్ విద్యావిధానాన్ని తీవ్రంగా నిరసిస్తున్నాడు.

"పాఠాన్ని కొనేవారూ

బోధని అమ్మవారూ

ఒప్పందం చేతులు మార్చుకుంటూ

సరస్వతిని సంపాదనతోటి

బేరీజు వేసుకుంటున్నారు"[25]

"విశ్వవిద్యాలయం నాకు వేతనమివ్వకపోయినా ఫర్వాలేదు కానీ నాకు బోధించే అవకాశమివ్వాలి" అన్నారు ప్రొ. జార్జి హార్వర్డ్! ఎందుకంటే బోధించే అవకాశం లభిస్తే, సమాజాన్ని తీర్చిదిద్దే అవకాశం లభించినట్లే కదా! ఆచరణ ద్వారా విద్యార్థులకు ఆదర్శంగా వుంటూ విద్యాబోధన చేసే ఉపాధ్యాయుడు విద్యార్థులను, సమాజాన్ని అద్భుతంగా తీర్చిదిద్దగలడు.'మనిషి నిరంతరం పైపైకి ఎదుగుతుండాలి' అంటున్నది అధర్వణవేదం. అలా ఎదిగేందుకు మనిషి నిరంతరం జీవిస్తుండాలి అంటున్నారు విజ్ఞులు.

**2.3.1.విద్యా లక్ష్యం:** మనిషికి ఏది మంచి? ఏది చెడు? ఏది కర్తవ్యాకర్తవ్యమో? నిర్దేశిస్తూ మనిషిని ప్రగతి పథాన నడిపేందుకు ప్రయత్నిస్తుంది అతని అంతరాత్మ! అలాగే సమాజానికి సరైన దిశానిర్దేశం జేసే 'సమాజం యొక్క ఆత్మ విద్య! అని కొఠారీ కమిషన్ ఏనాడో చెప్పింది. విద్యా లక్ష్యానికి ఇంతకన్నా ఖచ్చితమైన నిర్వచనం ఇంకొకటి లేదు.

**2.3.2.నేటి విద్యావిధానం- పర్యవసానాలు:** నేటి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, మార్కెట్ వ్యవస్థ 'వ్యక్తిగతాభివృద్ధి, మార్కెట్ అభివృద్ధికే విద్య అంటూ, మార్కెట్ కోసం విద్యార్థుల్ని ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా భావిస్తున్నది. కేంద్రమానవవనరుల శాఖామాత్యులు పురంధరేశ్వరి అన్నట్లు, విద్యార్థులకు కేవలం పుస్తక సమాచారాన్ని బదిలీచేసే యంత్రాలుగా ఉపాధ్యాయులు, అందివచ్చిన అవకాశాలతో స్వేచ్ఛ, స్వీయ ప్రగతి పేరిట, నైతిక, మానవతా విలువలకు దూరంగా, గమ్యంలేని గాలిపటాలుగా విద్యార్థులు మారిపోయారు. తత్ఫలితంగా ఉన్నది అమ్ముకో, లేనిది కొనుక్కోమనే వ్యాపార వ్యవస్థగా మారింది సమాజం. అమ్ముకోటానికేమీ మిగలనివారు చివరకు, మానం, రక్తం, కిడ్నీలు కూడా అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. "డబ్బుతో అధికారం, అధికారంతో డబ్బు" అనే చట్రంలో ఇరుక్కుపోయింది మన రాజకీయం. రాజకీయ నాయకులు+ రాజ్యాంగ యంత్రం+ కార్పొరేట్ సంస్థలు= అవినీతి త్రిభుజం, ఆకాశమే హద్దుగా అవినీతిని కొనసాగిస్తూ లక్షల కోట్ల ప్రజాధనాన్ని విదేశీ బ్యాంకుల్లో మురగబెడుతున్నారు. ఇక సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన ఉపాధ్యాయులు,

ఉన్నతోద్యోగులు, కవులు, కళాకారులు, మేధావులు, మీడియా కూడా మనసా, వాచా, కర్మణా డబ్బు కోసమే కొండశిఖరాన కుమ్మరించిన బంగాళాదుంపల్లా ఉరుకులు, పరుగులు పెడుతున్నారు.

సమాజ భద్రత కోసం పెద్దలు నిర్దేశించిన ధర్మ, అర్థ(ధన),కామ, మోక్ష కర్తవ్యాల ఉద్దేశమేమిటంటే ధర్మ మార్గాన ధనం సంపాదిస్తూ కామం తీర్చుకుంటూ మోక్షం సాధించడం. మోక్షాన్ని వదిలేసి ఏం చేసైనా ధనం సంపాదించాలి, ఎలాగైనా కామం తీర్చుకోవాలి అన్న దుష్టసంస్కృతి నేడు రాజ్యమేలుతోంది.

పతన మార్గంలో దూసుకుపోతున్న మన సమాజాన్ని తిరిగి ప్రగతిబాట పట్టించేందుకు ప్రస్తుత విద్యా విధానాన్ని పునస్సమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే పిల్లల్ని మార్చుకున్నంత తేలికగా పెద్దల్ని మార్చలేము. స్వార్థపూరిత దురాచారాలను నిర్మూలించాలన్నా ప్రగతిశీల ఆశయాలను నింపుకోవాలన్నా, ముందు పాఠశాలలు, కళాశాలలు విశ్వ విద్యాలయాల మీద కేంద్రీకరించాలి. ఆ ప్రయత్నమక్కడి నుండే ప్రారంభం కావాలి!

శాస్త్రసాంకేతికరంగాలలో అభివృద్ధే దేశాభివృద్ధి. తదనుగుణంగా విద్యార్థులను ఉత్పత్తి చేయటమే విద్యాలక్ష్యంగా ఉండాలి. అసలు వ్యక్తి ప్రవృత్తిలోనే స్వార్థమున్నది. అందుకు విద్యా విధానాన్ని తప్పుబడితే ఎలా అంటున్నారు మిడిమిడి జ్ఞానపు మేధావులు!

సంపూర్ణ విద్యే శరణ్యం కార్బోహైడ్రేట్స్+ ప్రోటీన్స్+ విటమిన్స్, మినరల్సతో కూడిన ఆహారమే సంపూర్ణాహారం. అందులో ఏవి లోపించినా ఆ మేరకు శారీరక రుగ్మత లేర్పడతాయన్నది తెలిసిందే. సమాజ ప్రగతికి, భద్రతకు, భవితవ్యానికి తోడ్పడే అంశాలన్నీ కలిగి వున్న విద్యే సంపూర్ణ విద్య! అందులో ఏ అంశాలు లోపించినా ఆ మేరకు సామాజిక రుగ్మతలు తలెత్తుతాయన్నది జగమెరిగిన సత్యం. కావున సంపూర్ణ విద్యే మనకు అవశ్యం.

**2.3.3.సమాజం కోసమే విద్య:** విద్య వ్యక్తి కోసం కాదు. సమాజం కోసమే. ఎందుకంటే? అందరి శ్రమ, అందరి అనుభవాలు, సమిష్టి వనరులతో రూపొందినదే విద్య. ఢిల్లీకి రాజైనా... తల్లికి కొడుకే అన్నది ఎంత నిజమో, ఎంత గొప్ప మేధావి, రాజనీతిజ్ఞునికైనా సమాజమే పునాది అనేది అంతే నిజం. విద్యార్థులకు సమాజానికీ గల సంబంధం, మబ్బులకు, సముద్రానికి గల సంబంధం వంటిదే. సముద్రం ఆధారంగా నీటిని సేకరించి పరిపుష్టమైన మబ్బులు, వర్షించి తిరిగి ఆ మంచి నీటిని సముద్రానికే చేర్చుతాయి. అలా విద్యార్థులూ తమ విజ్ఞానాన్ని సమాజానికే అందించాలి. అందుకు

సామాజికుల నుండి ముట్టే కృతజ్ఞతలు సదరు విద్యావంతులకు మరింత శక్తిని, ఉత్సాహాన్నీ అందిస్తాయి.

**2.3.4.ప్రకృతిని చూసి నేర్చుకుందాం:** థాయలాండ్ బౌద్ధ గురువు బుద్ధదాసభిక్కు అన్నట్టు 'సమస్త విశ్వమూ ఒక సహకార సంఘం'' అందలి నక్షత్ర మండలాలు, సూర్య కుటుంబాలు, గ్రహాలు, పరస్పరాధారాలై సహకార సంఘ సభ్యుల్లా పనిచేస్తున్నాయి. ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్న ఈ సృష్టిలో దేనికీ స్వయం ప్రతిపత్తి లేదు. ఇందులో ఏ ఒక్కటైనా నిర్దిష్ట క్రమానికి భిన్నంగా స్వేచ్ఛగా సంచరించినా విశ్వ వినాశనమే.

'మానవులంతా ఒకే తండ్రికి జన్మించిన బిడ్డలే' అంటున్నది ఋగ్వేదం. దక్షిణాఫ్రికాలో జన్మించిన తొలిమానవ దంపతులే సమస్త మానవాళికీ తల్లిదండ్రులంటున్నది సైన్సు. ఇలా ఏ కోణంలో చూసినా సరే, తన శక్తియుక్తులను, విద్యావిజ్ఞానాలను సమాజంలోని తన సోదర మానవాళికి వినియోగించటం, ప్రతీ వ్యక్తి బాధ్యత. పశువులు తమ బిడ్డలకు సరిపడా పాలిచ్చుకుంటూనే ఎంతో మందికి తమ పాలనందిస్తున్నాయి! ఫల వృక్షాలు కూడా తమ ప్రత్యుత్పత్తి అవసరాల మేరకేగాక, ఎందరికో సరిపడా ఫలాలనందిస్తున్నాయి. వాటిలాగే మనమూ మన కుంటుంబంతోపాటు సమస్త మానవ సమాజానికీ మన చదువు, సంస్కార, విజ్ఞాన, వినోదాలను పంచిపెడదాము.

ఉపాధ్యాయుని విధి సమాజానికి సరైన దిశను నిర్దేశించటం, ఉత్తమ సమాజ నిర్మాణం, ఉపాధ్యాయుని అవశ్య కర్తవ్యం. ఎందుకంటే మన సమాజ సంస్కృతిలో ఒక మనిషి ఒక విధిని, ఇంకో మనిషి ఇంకో విధిని, ఇలా మానవులంతా తలొక విధిని నిర్వర్తిస్తుంటారు. ఉదాహరణకు ఏక కాలంలో ఒకే మనిషి డాక్టరు, ఇంజనీరు, ప్రొఫెసర్, టెక్నీషియన్, గాయకుడు, కవి, కళాకారుడుగా ఉండటం అసంభవం. కావున సమాజం శ్రమ విభజన ఆధారంగా పురోగమిస్తున్నదనే వాస్తవాన్ని గుర్తించి, ఉపాధ్యాయుడు కూడా సంపూర్ణ విద్యాబోధన ద్వారా సమాజ ప్రగతి, భద్రతకు, విద్యార్థులకు సర్వతోముఖాభివృద్ధికి బీజం వేయాలి. ఉపాధ్యాయ సంఘాలు కూడా ఈ దిశగా ముందుకు సాగాలి.

**2.3.5.ఉపాధ్యాయుడు నిజమైన విద్యావంతుడై ఉండాలి:** ప్రతివ్యక్తీ తన రంగంలో తాను నిరంతర కృషిలో మునిగి, తన మేధో మధనం ద్వారా సృజనాత్మక కృషి చేస్తూ మానవ జాతికొరకు కొత్తకొత్త ఆవిష్కరణలు చేయగల్గిన వాడే నిజమైన విద్యావంతుడు. తదితరులంతా మిడిమిడి జ్ఞానులే

నంటున్నారు విజ్ఞులు. కనుక ఉపాధ్యాయుడు తన విద్యార్థులకు కేవలం పుస్తక సమాచారాన్ని బదిలీ చేయడంగాక, వారిని నైతిక, మానవతా విలువలతో నిండిన పరిపూర్ణ మానవులుగా తీర్చిదిద్దాలి. ప్రజలందరికీ ఉత్పత్తి ఫలాలలో న్యాయమైన వాటా లభించేలా, అందరూ తమ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకునేలా, మానవాభివృద్ధి సూచికలైన ఉపాధి, విద్య, వైద్యాలకు సమాన అవకాశాలను అందించగలిగే సమసమాజ నిర్మాణానికి విద్యను ఒక సాధనంగా చేసుకోవాలి.

ఆకలికోసం పోరాడుతున్న ప్రజలకు కానరాని ఉరితాడుగా ప్రపంచీకరణ ఉచ్చుబిగిస్తుంది. ప్రపంచీకరణ ఒక వ్యాపారక్రియ. దానిప్రభావం ఇప్పటివరకు బ్యాంకింగ్ పైన, ఆర్థిక వ్యవస్థ పైన, రవాణా, రహదారులపైన ప్రసారసాధనాలపైన, వస్తువులపైన, కొన్ని సేవలపైన స్పష్టంగా కనబడుతుండేది. స్టాక్ ఎక్స్చేంజ్ ఒడిదుడుకులు కూడా విద్యారంగంలో ఉన్న వివిధ భాగాలపైన కనబడే అవకాశమున్నది.

ప్రపంచీకరణతో విద్య మార్కెట్ వస్తువైంది. విద్యమార్కెట్ వస్తువు కావడంతో దానికి వినిమయ లక్షణం వచ్చింది. విద్య కొనుగోలు వస్తువు కావటంతో దాన్నికొనుక్కోగలిగిన పరిస్థితి కొంతమందికే ఉంటుంది. మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇది ఎంతో కష్టతరంగా మారుతుంది. ప్రపంచంలో మార్కెట్ ప్రధానమైంది. మార్కెట్ కు తగినట్లు ప్రపంచ విలువలే మారాయి. విద్యారంగంపై ఆశలెంత పెరిగాయో అదే మోతాదులో విద్యపై మార్కెట్ శక్తుల ప్రభావం పెరిగింది. జోమిటైన్ కాన్ఫరెన్స్ ఆశలన్నీ మాయమైపోయాయి. మార్కెట్ శక్తుల చేతుల్లోకి ప్రపంచం వెళ్లిపోయింది. విద్యను కూడా ప్రపంచీకరణ లాక్కుపోయింది.ఈ నేపథ్యం లోంచి మన విద్యారంగాన్నిపరిశీలించవలసి వచ్చింది. ఇది నేటి విద్యావిధానం.

**2.3.7.ప్రపంచీకరణ నేటి విద్య:** విద్య మార్పుకు సంకేతం. విద్య ఏ యుగంలోనూ రాజకీయాలకు అతీతం కాదు. ప్రతీ యుగంలో సమాజాన్ని శాసించదలచుకున్న వ్యక్తులు తమ లక్ష్యసాధనకు విద్యను ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం చదువును జ్ఞానం అంటున్నారు సాంకేతిక విప్లవాలు వచ్చాక సాంకేతికమైన పరిజ్ఞానమే సంపదకు మూలమని తెలిపి ఆ జ్ఞానాన్ని సాధించటం చదువు అని. ఆజ్ఞానాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవడమే గ్లోబలైజేషన్ లేదా ప్రపంచీకరణ అంటున్నాము. ఈ విద్య ద్వారా తరతరాలుగా ఏర్పడ్డ అసమానతలను తుడిచివేయటం ఒక

లక్ష్యమైతే, నిర్లక్ష్యానికి గురైన వర్గంలోనున్న శక్తిని వెలికి తీయటం, ఆశక్తిని సమాజ అభ్యున్నతికి వినియోగించి గమ్యం వైపుకి నడిపించడం మరొక లక్ష్యం.

"ప్రాథమిక విద్య అందరికీ......

మాధ్యమిక విద్య అనేకమందికి .....

ఉన్నత విద్య కొద్దిమందికి ....."[26] అనే నినాదం నేటి ప్రపంచ నినాదం.

ప్రపంచీకరణ నేపథ్యంలో నేటి విద్యావిధానంలో శాస్త్రసాంకేతిక రంగాల ప్రభావంతో తెలుగు భాషపై అభిమానం తగ్గిపోతున్న తరుణంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి డిగ్రీకోర్సులలో పలుమార్పులు ప్రవేశపెట్టే యోచనతో కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టబోతుంది. ఉన్నత విద్యారంగాన్ని దేశ అవసరాలకు అనుగుణంగా, ఉపాధి అవకాశాలు కల్పించటానికి అనువుగా, ప్రమాణాలను పెంచటానికైతే ఎవరికీ అభ్యంతరం లేదు.

తెలుగు భాష విషయంలో చూస్తే డిగ్రీ స్థాయి విద్యార్థులకు ప్రాచీన సాహిత్యంపై ఒక అవగాహన కల్పించాలి. ముఖ్యంగా ప్రపంచీకరణ ప్రభావంతో నేటి సాహితీ విద్యార్థులు పద్యం పాడటం మానేసి పూర్తిగా వచనాన్నే ఆదరిస్తున్నారు.

ప్రపంచీకరణ నేటి విద్యాలోకానికి మత్తుమందులా దాపురించింది. ముఖ్యంగా తెలుగు భాష మాట్లాడే ప్రాంతం చూస్తే విద్యార్థులు ప్రపంచీకరణ అనే మత్తులో కూరుకుపోయారు. విద్యార్థులని నాశనం చేస్తున్న అంశాలలో క్రికెట్, సోషల్ నెట్వర్క్ సంస్థలు చాలా ఘోరమైన విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. నేడు డిగ్రీ స్థాయి పిల్లలు క్రికెట్ తప్ప వేరే ఏ ఆటలని ఆడటం లేదు. కిరికెట్టు కవితలో ఆ భావాలు చాల స్పష్టంగా కన్పిస్తున్నాయి.

"చెప్పేవి దేశభక్తి కబుర్లు

చూపేవి కాసురక్తి జబుర్లు

డాలరిస్తే డకౌట్

టాకావస్తే స్టంపౌట్

రియాలిస్తే రనౌట్

ఎం ఇస్తే నోబాలేస్తా

వందిస్తే వైడ్లే వేస్తా

.....................

.....................

ఇదండి కిరికెట్టు

ఇంతకాలం చేశారు కనికట్టు

ఇప్పుడు తెలిసింది లోగుట్టు

కాదంటే చెప్పండి కాస్తారు బెట్టు"[27] అంటూ అద్దేపల్లి ముందుమాటలు 1లో ప్రపంచీకరణ అనే పెనురక్కసి తెలుగు విద్యా లోకాన్ని ఎలా నాశనం చేసిందో ఏ స్థితికి దిగాజార్చిందో ఆవేదన వ్యక్తం చేసాడు. గత రెండు దశాబ్ధాలపాటు తెలుగు ప్రాంతంపై విపరీతంగా ప్రభావితం చూపుతున్న అంశాల్లో ముఖ్యమైనది ప్రపంచీకరణ అని గుర్తు చేసాడు.

ఆంధ్రప్రదేశ్ నేడు ప్రపంచీకరణకు, ప్రపంచబ్యాంకు ప్రయోజనాలకు కేంద్రమైంది. కొత్త ఉద్యోగాల పేరుతో విద్యాలోకాన్ని ఆకర్షింపజేస్తుంది. ఆ మోజులో పడి విద్యార్థులు కంప్యూటర్ ముందు కూర్చుని సోషల్ నెట్వర్క్ పైన దృష్టి పెట్టారు. ఎప్పుడైతే వీటికి అలవాటు పడ్డారో చదువుపైన ఏకాగ్రత తగ్గిపోయింది.

నేడు డిగ్రీస్థాయి విద్యార్థులని పరిశీలిస్తే ఎక్కడ చూసిన ఒకప్పుడు ఆర్కుట్, ఈ మధ్య కాలంలో ఫేస్ బుక్ విద్యార్థులు సర్వనాశనం అవుతున్నారు. దీని వల్ల లాభాల కన్నా నష్టాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

నేడు ప్రపంచీకరణ ప్రభావం వలన విద్యారంగం అనేక మార్పులకు లోనయ్యింది. ముఖ్యంగా తెలుగు భాషపై ప్రపంచీకరణ ప్రభావం చూస్తే కళాశాల స్థాయిలో విద్యార్థులు మాతృభాషని వదిలి సంస్కృతాన్ని తీసుకోవడం మొదలగు అంశాలు విద్యారంగంలో కనిపిస్తాయి.

"Everybody talks about the weather but nobody does anything about it" (వాతావరణం గురించి ప్రతీ ఒక్కరు మాట్లాడుతారుకానీ ఎవరు ఏమి చేయరు) విద్యారంగ అభివృద్ధి గురించి కూడా ఇలాంటి పరిస్థితే కన్పిస్తుంది. అందరు మాట్లాడేవారే అసలైన విద్యకు బీజాలు వేసేవాళ్ళు ఏ కొద్ది మంది మాత్రమే.

**2.4.సాంస్కృతికరంగం: సంస్కృతి** అనేది మానవ సమాజం జీవన విధానంలో ప్రముఖమైన విషయాలను - అనగా జీవనం, ఆచారాలు, వ్యవహారాలు, ప్రమాణాలు, మతం, సంబంధాలు, పాలన - వంటివాటిని సూచించే పదం. దీనికి ఆంగ్ల పదమైన Culture లాటిన్ పదం *cultura*లేదా *colere* అనేవి "to cultivate" అనగా వ్యవసాయం చేయడం నుండి ఉద్భవించాయి. ఒక సమాజంలో ముఖ్యమైన పద్ధతులు మరియు నిర్మాణాలు మరియు వ్యవస్థలు ఆ సమాజం యొక్క సంస్కృతిని సూచిస్తాయి. సంస్కృతిని సూచించే సంకేతాలు, నిర్మాణాలు, వ్యవస్థలు, ఆచారాలు, వ్యవహారాలు ఇదమిత్థమైన హద్దులు లేవు, అవి నిరంతరాయంగా మారుతుంటాయి. ఒకదానితో ఒకటి కలుస్తూ, విడిపోతూ పరిణామం చెందుతుంటాయి.

ఒక సమాజం జీవనంలో మిళితమైన కళలు, నమ్మకాలు, సంస్థలు, తరాలలో జరిగే మార్పులు, తరాల మధ్య వారసత్వంగా కొనసాగే విధానాలు అన్నీ కలిపి "సంస్కృతి" అంటారు. ఒక సమాజం యొక్క సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి అని నిర్వచింప వచ్చును.

ఆ సమాజంలో పాటించవలసిన ఆచారాలు, పద్ధతులు, అభివాదాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు - అన్నీ కలిపి సంస్కృతి అవుతాయి. గతించిన కాలం గురించి భవిష్యత్ తరాలకు అందించే వారధి సంస్కృతి

సంస్కృతిని గురించి మాట్లాడేటప్పుడు భారతీయ సంస్కృతి స్వరూప స్వభావాలను తెలుసుకోవాలి. వేదకాలం నుంచీ భారతదేశ చరిత్రను, నాగరికత, సృజనాత్మక నిర్మాణాల చరిత్రను ఒక వరుసలో చెప్పి వాటి మధ్య పూసలలో దారంలాగ కనిపించే ఏకసూత్రత భారతీయ సంస్కృతిలోని ప్రధానంశంగా చెప్పవచ్చు.

భారతదేశానికి సంబంధించి సంస్కృతి అనగానే చాలామంది మతపరమైన విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, కర్మకాండలు జ్ఞాపకం వస్తాయి. భారతీయ సంస్కృతి అనగానే ఆధ్యాత్మిక సంస్కృతి చాలామందికి జ్ఞాపకం వస్తుంది. భారతదేశంలోని తత్త్వం, చట్టం, సంగీతం, సాహిత్యం, ఇతరకళలు- అన్నీ ఆధ్యాత్మిక సంస్కృతినే ప్రతిబింబిస్తాయి. గతప్రాభావ స్మృతి, సనాతన వ్యవస్థ, స్థిరత్వం, సంతత్వం, శాశ్వతత్వం సంస్కృతికి ప్రధాన లక్షణం. వ్యవసాయ, పారిశ్రామికరంగాల తర్వాత ప్రపంచీకరణ ప్రభావానికి గురైన మరో ముఖ్యమైంది సాంస్కృతికంగం. ప్రతి దేశానికి ఒక సంస్కృతి

ఉంటుంది. మనిషి పుట్టిన నుంచి మరణించే వరకు అతని జీవితంలో నిర్వహించే ప్రతీది సంస్కృతి అవుతుంది. అయితే ఏదేశంలోనైన సంస్కృతి ఏకశిలా సాదృశ్యంగా ఉండదు. పురాణేతిహాసాలలోని రాముడు, దుష్యంతుడు మధ్య యుగం నాటి కావ్యనాటకాల్లోని రాముడు, దుష్యంతుడు భిన్నంగా కనిపిస్తారు. వైవిధ్యంలో ఏకత్వం భారతీయ సంస్కృతికి సంబంధించిన మరొక ప్రధాన లక్షణం.

ఒకప్పుడు ఆర్థికవ్యవస్థకు మూలాధారమైన ఉత్పత్తి కార్యక్రమాన్ని సూచించే culture అన్న పదం, ఆర్థికవ్యవస్థ పునాదిగా గల సామాజిక పరిస్థితుల భావప్రతిబింబాన్ని సూచించేపదంగా స్థిరపడింది. దానికి సమాన భావాన్నిచ్చే పదంగా సంస్కృతి వాడుకలోకి వచ్చింది.

"శ్రీరామ నవమికి కోకోకోలా పానకం
సంక్రాంతికి గొబ్బిళ్ళకి మాడ్ కౌ పేడ
కనుమకి కెంటకీ కోడికూర
దసరాకి మాగ్డోనాల్డ్ పిజ్జా
ఈ దీపావళి విత్ పెప్సీ
బహుత్ మజా ఆయేయార్
యే దిల్ మాంగోమోర్"[28]

**2.4.1.సంస్కృతి నిర్వచనం :** సమాజంలో, మానవ సమూహంలో ఒకతరం నుండి మరొకతరానికి సంక్రమించిన జీవనవిధానమే సంస్కృతి అంటే వ్యక్తుల భావాలు, నమ్మకాలు, వ్యవస్థా నిర్మాణం, కళాసృజన, ఆచార వ్యవహారాలు, వివాహాది విధానాలు, ప్రత్యేకంగా గుర్తింపదగిన మానవుల ప్రవర్తన విధానం మొదలగు అంశాలన్నింటిని సంస్కృతి అంటారు. నేడు సమాజంలో భూస్వామ్యవ్యవస్థ, నాటి ఉమ్మడికుటుంబ జీవనం ఇప్పుడు పోయింది. బాల్యవివాహాలు పోయాయి. విదవవివాహాలు జరుగుతున్నాయి. స్త్రీలు చదువుకొని ఉద్యోగాలు చేసుకోవటానికి అవకాశాలు ఏర్పడ్డాయి. మానవ సంబంధాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. మొత్తం మీద ఏ సంస్కృతి దేశ కాలాలతో నిమిత్తం లేకుండా, ఆర్థిక, సామాజిక వ్యవస్థలతో సంబంధం లేకుండా ఉండదు. ఒక సమాజానికి ఆధారమైన మానవ సంబంధాలు ఆ సమాజానికి  సంబంధించిన సంస్కృతిని తెలియజేస్తాయి.

ఆర్థిక అసమానతలు, ఆర్థికవిధానాలలోని వైరుధ్యాలు, జాతీయత పేరిట భూస్వామ్యయుగం నాటి భావాలు, జీవన విధానం, స్వాతంత్రయానికి ముందు వలసవాదం నాటి పోయిన

భ్రమాత్మకమైన సాంస్కృతిక ఆధిక్యతా భావన, ఆలోచనలు, మధ్యయుగం నాటి స్త్రీ,పురుష సంబంధాలను నేటికీ ఆదర్శంగా చూపే కౌటుంబిక గాధలతో వస్తున్న సినిమాలు, సినిమాలే పెంచుతున్న ప్రతీకార సంస్కృతి, విభిన్న సంస్కృతులు దేనికదే వేరువేరుగా గుర్తింపును పెంచుకోవడానికి దోహదంచేస్తూ కృత్రిమ ఐక్యతను ప్రచారంచేయడానికి ఉపయోగిస్తున్న ఆధునిక ప్రసార సాధనాలు, ఎంత ఎక్కువగా లాభం చేకూర్చిపెడితే అంత గొప్పదిగా చలామణి అయ్యే వ్యాపార సంస్కృతి, తదనుగుణంగా పెరుగుతున్న మానవసంబంధాలు, వ్యక్తుల ప్రవర్తన విధానాలు అరాచక సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయి.

జాతీయ సంస్కృతిగా ఈ రోజు చెప్తున్నది నూతన ఆర్థికవ్యవస్థ పునాదిగా ఏర్పడ్డ సమకాలీన సర్వసాధారణ సంస్కృతి కాదు. సంప్రదాయ సంస్కృతి పేరిట భూస్వామ్య సంస్కృతి, దేశఆర్థిక వ్యవస్థపైన పెత్తనం చేస్తున్న సామ్రాజ్యవాదం సంస్కృతులకు పుట్టిన వింత శిశువు అది.

**2.4.2.ప్రపంచీకరణ-సంస్కృతి:** మానవ జీవితంలో సంస్కృతి అనేది చాలా కీలకమైనది. మనం ఎలా జీవిస్తామనేదే సంస్కృతి. ఒకానొక చారిత్రక దశలో జీవనశైలి, వేషభాషలు, ఆచార వ్యవహారాలు, సాధారణ విశ్వాసాలు, కళాసాహితీ రూపాలు, కుటుంబజీవనం, మానవసంబంధాలు ఇవన్నీ సంస్కృతిలో భాగంగానే ఉంటాయి. ప్రపంచీకరణ ప్రధానంగా రాజకీయ, సైనిక, ఆర్థిక పెత్తనాన్ని విస్తరించుకోడానికి సంబంధించినది.కానీ ఈ పని చేయాలంటే సాంస్కృతికరంగాన్ని ఆక్రమించుకోవడం ముందుగా జరగాలని సామ్రాజ్యవాదులకు బాగా తెలుసు. మనుషులను లోబర్చుకుంటే మార్కెట్ విజయాలు సులభమనేది వారి తొలిపాఠం.

నేడు మానవ జీవితాన్ని వస్తుసంస్కృతి రాజ్యమేలుతుంది. ప్రత్యామ్నాయం, పోటీవ్యవస్థ వంటి వాటి ప్రభావం వల్ల పాతవాటి స్థానంలో కొత్తవి వచ్చి చేరుతున్నాయి. అధిక ప్రాధాన్యం గల విలాస వస్తువుల మోజులోపడి ఇల్లుగుల్ల చేసుకుంటున్న మనుషుల మధ్య నవనాగరికత ఊపిరి పోసుకుంటుంది. ఈ వారసత్వ ప్రభావం ఇప్పుడు పల్లెజీవితాల మీద పడుతోంది. ప్రపంచమంతా ఒక కుగ్రామంగా మారిపోతున్న నేపథ్యంలో ఈ రకమైన పరిణామాలు ఒక కొత్త సంస్కృతికి ఆహ్వానం పలుకుతున్నాయి.

### 2.3.3.ప్రపంచీకరణ సంస్కృతి ముఖ్యాంశాలు:

1. చిన్నారులు టామ్ అండ్ జెర్రీ వదలకుండా చూడటం

2. హెచ్.బి.వో సినిమాలని చాలా ఇష్టంగా చూడటం

3. మన బుల్లి పాపలు టీవీలలో ప్రకటనలు రాగానే చురుగ్గా స్పందించడం.

4. మన స్నేహితులు బ్యూటీక్లినిక్ లను ఇష్టపడటం.

5. వీధుల్లో పిల్లలు క్రికెట్ మ్యాచ్ గెలిచినప్పుడల్ల సైలెన్సర్లు తీసేసి హడావిడి చేయటం.

6. వ్యవసాయం చేసే మన కుటుంబాలు కాలం గడువక గడ్డు పరిస్థితిని ఎదుర్కోవడం.

7. సరైన సమయంలో వైద్యం అందక మన ఆరోగ్య కేంద్రాలలో చాలా మంది ప్రాణాలు పోగొట్టుకోవటం.

8. పనిచేసే ఫ్యాక్టరీలు మూతపడిపోవడం దానిపై ఆధారపడే కూలీల నిస్సహాయత.

9. నీళ్ళు లేక ప్రయాణాలలో కిన్లే మినరల్ వాటర్ వాడటం.

10. సరుకులు మామూలు కొట్లలో కాకుండా చైన్ షాపుల్లో కొనడం నయమని భావించటం.[29]

ఇందులో ఏదో ఒకటి మన నిత్యజీవితంలో తారస పడకుండా ఉండదు. ఎందుకంటే అవి మనచుట్టూ ప్రతిరోజు జరుగుతున్నవే. ప్రపంచంలో వివిధదేశాల మధ్య పరస్పరాధారిత, పరస్పర అనుబంధాలు ఏర్పడటం ప్రపంచీకరణ విజయమని యునెస్కో నివేదిక(2001)లో పేర్కొంది. ప్రపంచీకరణ ఇతరదేశాల సంస్కృతిని గుర్తించదు. సామ్రాజ్యవాద దేశాల సంస్కృతే గొప్పదని ప్రచారం చేస్తుంది. బహుళజాతి కంపెనీల ఉత్పత్తులను అమ్ముకోవడానికి కావాల్సిన పునాదిని ప్రపంచీకరణ తయారుచేస్తుంది. అందుకోసం పేదదేశాల సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తుంది. ఈ దేశాల ప్రజలను సామ్రాజ్యవాద దేశాల సంస్కృతికి అలవాటు చేస్తుంది. ఈ స్థితిలోనే విధ్వంసాన్ని ఇతివృత్తంగా కవులు తమ నిరసనను ప్రకటించారు. కంప్యూటర్, ఇంటర్నెట్ ప్రవేశం వలన మారిపోయిన జీవితం, అందాల పోటీల కోసం స్త్రీల పరుగులు, సెల్ ఫోన్ వచ్చాక మాయమైన ఉత్తరాల గురించి, టీవీల ప్రవేశంతో కాలుష్యమైన గ్రామీణ సంస్కృతి, డాలర్ సంబంధాలలో నలిగిపోతున్న ప్రేమ, స్నేహం, ఆంగ్లభాష వ్యామోహంతో మరచిపోతున్న మాతృభాష, తల్లిదండ్రులను ముసలితనంలో చూసుకోలేని డాలర్ కొడుకుల పరిస్థితి మొదలైన విషయాలపై వచ్చిన కవిత్వాన్ని సాంస్కృతిక రంగంలో చేర్చవచ్చు.

ప్రపంచీకరణ మార్కెట్లలోకే కాదు- పడకగదుల్లోకి కూడా ప్రవహిస్తుందని కొండేపూడి నిర్మల లేబర్ రూం కవితలో అంటుంది. ఈ మాటలలో దాని విపరీత ప్రభావం, విస్తృతి మనకు తెలుస్తాయి. నిజంగానే ప్రపంచీకరణ ప్రతిరంగంలోనూ మనకు ప్రత్యక్షమవుతుంది. కొన్నిరంగాలలో ప్రత్యక్షంగా కనిపిస్తే మరికొన్ని రంగాల్లో పరోక్షంగా వుండవచ్చు. చూడండి......" నిత్యజీవిత వస్తువులు - వాటి తాలుక ప్రచారాలు, కుటుంబ సంబంధాలు, లైంగిక విషయాలు, మానవ ప్రవృత్తులు, విద్య, ఉద్యోగాలు, వ్యాపార, పత్రికలు, చానళ్ళు ఇతర మీడియా, ఇంటర్నెట్, సినిమాలు, ఆటపాటలు, నృత్య సంగీతాలు, సాహిత్యం, కళలు, వైద్యం, ఆరోగ్యం, ఔషధాలు, ఆధ్యాత్మికత, మతం, వ్యసనాలు, వ్యామోహాలు, అందాల పోటీలు వగైరాలు, ఉత్సవాలు, ఆర్భాటాలు, రాజకీయ ప్రచారాలు, ప్రభుత్వ వ్యవహారాలు, ప్రజాసేవ, స్వచ్ఛంద సంస్థలు......మొదలగునవన్ని సంస్కృతిలో భాగం" పక్షితో కబురు పంపిన కాలం నుంచి, టెలిగ్రామ్, టెలిఫోన్ల దశదాటి మనం సెల్ఫోన్లు, నెట్ఫోన్లు దశకు వచ్చాం. వీధి బడుల కాలం నుంచి విశ్వవిద్యాలయం దశకు చేరాం.

ధన్వంతరీని తలచుకొని మందుబిల్ల ఇచ్చిన వైద్యం లేదా ఆకుపసరుపోయి కార్పోరేట్ వైద్యశాలల యుగంలో ప్రవేశించాం. వాత్సాయనుడు బోధించిన కామశాస్త్రం లేదా జానపద గీతాలలో శృంగారం నుంచి వయాగ్రా వరకు వచ్చాం. ఖజరహో నుంచి ఇంటర్నెట్లో అశ్లీలచిత్రాలు, మిడ్నైట్ మసాలాల వరకు చేరాం. సుప్రభాతాన్నే ఏపేస్టుతో పళ్ళు తోముకోవలనేది మొదలు రాత్రి ఏ మస్కిటో కాయిల్ తో పడుకోవాలనే వరకు అంతర్జాతీయ వాణిజ్య ప్రకటనలు భారతీయ సంస్కృతిని నిర్ధేశిస్తున్నాయి. పొలికేక లో సుదేరా గ్రామాలను గురించి గ్రామీణ సంస్కృతిని గురించి ఆయన మాటలలో..........

"పల్లెలంటే......
పచ్చనోట్ల పంటకై
నగరపు మురికి వాడల్లో
నారుమడై ఎదుగుతున్న వలసలు
పాలిథీన్ లేబుళ్ళు తొడుక్కున్న మిల్కుపొడర్లై
దూడల్నిడిచి లారీలెక్కుతున్న ఆవులపాలిళ్ళు"[30]

నేడు పల్లెల్లో డబ్బు వ్యామోహానికి పచ్చని పొలాలని నాశనం చేస్తున్నారు. తమ కూటి కోసం వాటిని అమ్మేయాల్సిన పరిస్థితి పొలాలను వలసలుగా మార్చేస్తున్నారు. నారుమడై ఉన్న పొలాలు ఫ్యాక్టరీలైపోతున్నాయి. దూడల్నిడిచి ఆవులని లారీలకి ఎక్కిస్తున్నారు. బుల్లి దూడలకి పాలు లేక ఎండిపోతున్నాయని కవి ఆవేదన వ్యక్తపరిచాడు.

"ఊరిప్పుడు అలుగుపోసిన ఊరచెరువు

సుడిగుండంలోకి బడ్డ బోనాలకుండ

మైసమ్మబండకు పడేసిన బలియారపు ముద్ద"![31] ఊరురును గురించి కవి ఎంతచక్కగా వర్ణిస్తున్నాడో తెలుగు సంస్కృతి ఎంత దిగజారిపోతుందో అర్థమవుతుంది.

**2.4.4. మానవ సంబంధాలు :** మనసు, మమత, మానవత ఈ పదాలు చెవికి ఇంపుగానూ మనసుకి ఆహ్లాదంగానూ ఉంటాయి. వాస్తవిక జీవితంలో వీటిని వెతికి పట్టుకోవడం కష్టతరమైన పనే . మానవ సంబంధాలు కూడా వ్యాపరమైపోతున్న ఈ తరుణంలో మనుషుల్లో మనసున్న మనిషికోసం, మానవ ప్రవర్తనలో మమత, మానవత కోసం అల్లాడిపోవల్సి వస్తోంది. వ్యక్తుల మధ్య స్నేహ సంబంధాలు కేవలం అవసరార్థమే నెలకొంటున్న మానవ వ్యాపారయుగం. అందులో ముఖ్యంగా స్త్రీ పురుషుల మధ్య స్నేహ సంబంధాలకు ప్రాధాన్యం వహిస్తున్నది శారీరక అవసరాలు మాత్రమే శారీరక అందచందాలకు, శారీరక కొలమానాలకు  నిలయమైన స్నేహంలో మనసుకి, మానసిక అనుభూతులకి తావులేకుండా పోతుంది. భౌతిక సౌందర్యానికి తప్ప ఆత్మసౌందర్యానికి విలువ లేకుండా పోతుంది.

ఇహ భార్యాభర్తల నడుమ అధికారం, అహంకారం తప్ప అనురాగం, అన్యోన్యత మచ్చుకైన కానరావటం లేదు. కారణాలు అనేకం ఉండవచ్చు. వాస్తవిక జీవితంలోని సమస్యలు వారిని ఆ దశకు చేర్చి ఉండవచ్చు.

మనుషుల్లో ఏ ఇద్దరి మధ్య చూసిన సహజ సంబంధాలు మాయమై అసహజ సంబంధాలే రూపుదిద్దుకుంటున్నాయి. పెరుగుతున్న శాస్త్ర ప్రగతికి మనిషికి మితం లేని భౌతిక సుఖాన్నిస్తుంటే, మానవ ప్రవర్తనలో పెరుగుతున్న అసహజత, జీవితాన్ని కృత్రిమంగా, నిర్జీవంగా చేస్తోంది. ఈనాడు మానవ సంబంధాల్లో పరస్పర ప్రేమ, ఆదరణ, ఆత్మీయత గౌరవం కొరవడి పరస్పర వంచనకు, పరస్పర వ్యక్తిత్వ నిర్మూలనకు దారితీసింది. ఒక మనిషిని నిజంగా అభిమానించడమంటే,

గౌరవించడమంటే, ఆ వ్యక్తిలోని గొప్పతనంతో పాటుగా, బలహీనతలను కూడా సమానంగా అభిమానించి, గౌరవించడం, నిజంగా బలహీనత లేని మనిషి లేడు. సాటి మనిషిలోని బలహీనతను అర్థం చేసుకొని అవగాహనతో మెలగటానికే మన విజ్ఞత ఉపయోగపడాలి. ఎన్ని బలహీనతలు ఉన్న సాటి మనిషిగా ఆ మనిషిని గౌరవించటం మన ధర్మం అయితే ఈ ధర్మాన్ని చేతగానితనంగా, అసమర్థతగా అవతలి వ్యక్తులు తీసుకున్నపుడే అసలు సమస్య ప్రారంభమౌతుంది.

మానవ సంబంధాలు వ్యాపారంగా మారిపోయిన కాలం ఇది. ఈ విషయాన్ని డా. సంజీవమ్మ గారు...

"మానవీయ విలువలకు కాలం చెల్లిపోతుంది. మనిషి కంటే వస్తువులకు విలువ పెరుగుతుంది. చౌకబారు సంస్కృతిని మప్పడానికి సకల ప్రయత్నాలు సాగుతున్నాయి. టి.వి లో వివిధ ఛానల్స్, పత్రికలూ కలిసి వ్యాపార సాహిత్యాన్ని, విషసంస్కృతిని విడుదల చేస్తున్నాయి. (ఫ్యాక్టరీల్లో విషపదార్థాలు విడుదలైనట్లు) ప్రైవేటు ఛానల్స్ లో ప్రసారమయ్యే వికృతమైన సెక్స్, ప్రేక్షకుల సంస్కారానికి పరీక్షపెడుతుంది. యువత, పిల్లలు సైతం ఈ ప్రభావంతో కొట్టుకుపోతున్నారు. భవిష్యత్ తరం ఎలా తయారవుతుందో ఊహించడానికే భయం వేస్తుంది"[32]అని అంటారు.

అదే విధంగా గుడిపాటి మానవసంబంధాలను గురించి మాట్లాడుతూ..... "సమస్తరంగాలను మార్చగల ప్రపంచీకరణ కుటుంబం, మానవసంబంధాల వ్యవస్థలను కూడా మార్చడం అంత ఆశ్చర్యమేమి కాదు. ఇప్పుడు సకలం ధ్వంసం కావడం అంగీకరించక తప్పని వాస్తవం. మానవీయ విలువలు, ఉద్వేగాలన్నీ హరించుకుపోతాయి. ప్రేమాభిమానాలు పుస్తకాల్లోని అందమైన పదాలుగా మిగిలిపోతాయి. బరువుగా, ఏదో తప్పదన్నట్లుగా బతకడం మనుషుల రీతి అవుతుంది, అయింది. ఆ విధంగా మనిషి జీవితాన్ని కోల్పోతాడని"[33] అంటారు.

### 2.4.4.1.మానవ సంబంధాల - వర్గీకరణ

**1.తల్లిదండ్రులు - పిల్లల మధ్య సంబంధాలు:** ప్రపంచీకరణ ప్రభావం వలన మానవసంబంధాలపై భిన్న ధోరణులలో కన్పిస్తుంది. ఈ రోజు తల్లికి కొడుకు లేడు, కొడుక్కి తల్లి లేదు. అదే విధంగా ఏ బంధానికి ఇంకో అనుబంధం లేదు. ఇవ్వాళ అంతా మనుషులకు డబ్బే ఒక బంధం, దాని సంపాదనే నిత్య కర్తవ్యంగా అవతరించింది.

సృష్టిలో అమ్మను మించిన బంధాన్ని ఈ రోజుకి కూడా ఎవరూ చూపలేకపోయారు. గుండెనైన పెకలించి ఇవ్వగల ప్రేమ తల్లిది. కాని నేడు ఇలాంటి తల్లిని మించి కూడా రూపాయిని ప్రేమించే సంస్కృతిని ఈ ప్రపంచీకరణ తెసుకొచ్చింది.

ఈ విషయాన్ని నాళేశ్వరం శంకరం 'కొత్తవారసత్వం' అనే కవితలో ఈవిధంగా చెప్పారు.

"రూపాయి కోతలో తెగిన రెండు తలుపు చెక్కలమైపోయాం
రెండురూపాల చుక్కల్ని దిగిన నిండు నీళ్ళ గ్లాసైపోయాం
విలువల విక్రయానికీడ్చిన సరుకులైపోయాం
.......................................................
తల్లీ! గుక్కెడనుబంధాల్లేని ఇసుకగూడు మనది
రూపాయి రూపమెత్తిన రక్తసంబంధాలు మనవి
డబ్బు దేహాలు మనవి
అమ్మా! నీలానే ఈ నేల తల్లి కంటున్న
రూపాయి సంస్కృతికి నేటి వారసులం మనమే"[34]

అంతేకాకుండా ఎదుటి వ్యక్తులు రక్తసంబంధీకులైనా లక్ష్యసాధనలో ఇతరులతో సమానమే. తల్లిదండ్రులు కూడా అందుకు మినహాయింపు కాదు. అందుకే ఈ మార్కెట్ అనే మాయబాటలో దారి తప్పిన కొడుకులను అన్వర్ 'వలస యవ్వనం' అనే కవితలో...

"ఇప్పుడు దారి తప్పినకొడుకుమీద దిగులు
పక్కింటికి మారాలన్న గుండె దిటవు కాని బతుకులు మనవైతే
వాడు దేశదేశాల వలసకు
ఇంటి గడప దాటినంత సునాయాసంగా ప్రయాణమౌతాడు
ఇవ్వాళ తల్లిదండ్రుల పాడె ముందు కొడుకు లేడు"[35]

అని విమర్శిస్తాడు. ప్రపంచీకరణ వలన వివిధ దేశాలకు అనేక మంది వలస వెళుతున్నారు. డాలర్ సంపాదన పరమవదిగా మారింది. స్వదేశాన్ని విడిచి కన్న వారిని వదిలి దోపిడీ దేశాలకు వలస వెళ్ళడం మధ్యతరగతి వారిని బాగా సంఘర్షణకు లోనుచేస్తుంది.

**2.తోబుట్టువుల మధ్య సంబంధం:** తల్లిదండ్రులు, సంతానం అనే బంధం విషయంలోనే ఇలా ఉంటే ఒక తల్లికి పుట్టిన సంతానం విషయంలో పరస్పర సంబంధాలు బలంగా ఉంటాయనే మాట మర్చిపోవాల్సిందే. ఈ విషయాన్ని కొండేపూడి నిర్మల 'మల్టీనేషనల్ ముద్దు'లో....

"తమ్ముడిదెప్పుడూ డాక్యుమెంటింగ్ బ్రెయిన్ కదా
నాన్న అంత్యక్రియల్ని, క్యాసెట్ తీసి పంపనందుకు
అలిగి మాట్లాడ్డం మానేసాడు
వాడి కంటే పది గంటల ముందు సూర్యోదయాన్ని చూడగల
ఒక భౌగోళిక అద్భుతం ఉన్న నేను
ఎక్కడో ఎందుకో వెనకబడిపోయాను"[36]

అంటూ మూగగా రోదిస్తుంది. ఇక్కడ అక్కాతమ్ముళ్ల మధ్య విస్తరించిన దూరం తమ్ముడి తప్పు వలన జరిగిందో అక్క తప్పు వలన జరిగిందో కాదు. అక్కాతమ్ముళ్ల సంబంధాలను మార్చిన ప్రపంచీకరణ తప్పు, దాని ప్రభావంతో బయటకు వచ్చిన మన చేష్టలివి.

**3.భార్యాభర్తల మధ్య సంబంధాలు:** ప్రపంచీకరణ ప్రభావం భార్యాభర్తల మధ్య ఎంతటి అగాధాన్ని సృష్టిస్తుందో షాజహానా కవిత్వీకరిస్తుంది. 'దూస్రా ఆస్మాన్' ఆమె రాసిన గొప్ప దుఃఖకవిత. వాస్తవజీవితానికి దగ్గరైన విషాద వస్తువు. భర్త డబ్బుసంపాదన కోసం అరబ్బు దేశాలకు వెళ్ళాడు. సంవత్సరాల తరబడి అక్కడే ఉండి పోయాడు. ఇక్కడ స్వదేశంలో ఉగ్గబట్టిన భార్య మనోవేదన-

"నువ్వు పంపే కరెన్సీ కాయితాలకు
నీ స్పర్శెలా వస్తుంది
ప్రతీ రాత్రీ ఖాళీగా వెక్కిరించే సగం పక్క
ఏ రెండు మూడేళ్ళకో/నువ్వు వస్తున్న కబురు
రోహిణి తర్వాత భూమి ఆకాశం వైపు చూసే చూపు నాది
నీ ఎన్ని రాకలకి చల్లబడతానో...
ప్రతీసారీ ఆకాశాన్ని చీల్చుతూ పైకెగిరే నువ్వు
ఒక్కసారి వెనక్కి తిరిగి చూడు
కిటికీ కివతల శూన్యం నింపుకున్న రెండో ఆకాశం..."

మన హృదయాలను స్పర్శిస్తుంది. భార్యాభర్తల సంబంధాలలోని సుదీర్ఘ విరహ విషాదానికి దుర్భర దుఃఖ ప్రతీక ఈ కవిత.

**4.వృద్ధాప్యం:** ఈ సృష్టిలో ప్రతిఫలం ఆశించని క్రియ తల్లిదండ్రులు పిల్లలను పెంచడం. దానిని వారు బాధ్యతగా నిర్వర్తించి, ప్రేమతో నెరవేరుస్తారు. కాని పిల్లలు తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నపుడు వారిని ఆదరించి సంతోషాన్ని ఇస్తారు. ఇది నాగరికత నేర్పిన మంచి లక్షణం. కాని ప్రపంచీకరణ ప్రభావంతో ఎక్కువ మంది పిల్లలు ఈ లక్షణాన్ని మర్చిపోయారు. పెంచిన పెద్దలను నిరాదరణకు గురిచేసి ఎవరి స్వార్థం వారు చుసుకుంటున్నారు.

వృద్ధాప్యంలో పిల్లలు చూపించే నిరాదరణను, దాని వలన కలిగే ఇబ్బందులను గురించి 'వృద్ధాప్యం' అనే కవితలో విజయలక్ష్మి పండిట్ ఈ విధంగా వర్ణించారు.

"ఆకు పచ్చని ఆకు పండుటాకయి
రాలిపోవడం ఎంత సహజమో
ప్రతి జీవి వృద్ధుడు కావడం
అంతే సహజం కాదా
................................
కన్నీళ్ళు కార్చింది
వృద్ధాప్యం"[37]

కనీసం పెంపుడు కుక్కకు జ్వరం వస్తే కంగారుపడి డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళిన సుబ్బారావు కొడుకు కోడలు వృద్ధాప్యంలో చితికిపోయిన తనను పట్టించుకోక పోవడం, చివరకు ఎందుకు పుట్టానా అని అనుకునేంత స్థాయికి అతన్ని దిగజార్చింది. పెంపుడు జంతువులకు ఇచ్చిన విలువ కూడా పెంచిన తల్లిదండ్రులను ఇవ్వకపోవడం మానవసంబంధాల పాలిట గొడ్డలి పెట్టు.

తల్లిదండ్రులను పెంచితేనే పెరిగిన మనం ఈ రోజు వారిని పట్టించుకునే స్థితిలో ఉండటం లేదు. వారితో మాట్లాడటానికి, వారి బాగోగులు చూసుకోవడానికి తీరికే లేకుండా పోయింది. వృద్ధాప్యంలో చేదోడువాదోడుగా ఉండాల్సిన కొడుకులు వారిని చూసుకోవడం భారంగాను, విసుగ్గాను తలచి శరణాలయాలపాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉదారి నారాయణ 'అవ్వలిగింది' అనే కవితలో ఈవిధంగా వర్ణిస్తాడు.

"సెలయేరులా గలగలా నవ్వాల్సిన అవ్వ
కఠిన శిలల్ని ఒరుసుకుంటూ
శోకసముద్రంలో సంగమమై పోతున్నది.
ఆధునికత కోసం అత్మీయతల్ని దూరంచేసుకుంటున్నాం
నిజానికి ఆమె మనలో కలిసిపోదనికాదు
మనమే ఆమెను అనాధ శున్యాలయంలోకి తోసేస్తున్నాం"[38]

ప్రపంచీకరణ ప్రభావం వలన ముసలి తల్లిదండ్రులను నేటి సమాజంలో ఎంతటి నిరాదరణకు గురిచేస్తున్నామో పై కవిత దానికి సాక్ష్యం.

ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలు ఏ విధంగా దెబ్బతింటున్నాయో ఈ కవితలో మనకు కనిపిస్తాయి.

**తాత..నాన్న..నేను..కొడుకు... మనమడు...**

బతకటానికి మా నాన్న పల్లె నుంచి పట్నానికి వచ్చాడు..
నేను పట్నం నుంచి నగరానికి వచ్చాను...
రేపు నా కొడుకు మహానగరానికి...
వాడి కొడుకు ఇంకో దగ్గరకి...
కానీ..
మా నాన్న విడిచి వచ్చిన పల్లెలో..
ఇంకా జనం బతుకుతున్నారు,సంతోషంగా ఉన్నారు..
జీవితంలో అంతకన్నా ఏదో ఉంటుందని మేము మాత్రం..
సంచారులమయ్యాం..
రేపు ఎప్పుడో మాకు చెందినవాడు మళ్లీ..
మా గడ్డ పై అడుగుపెట్టిన నాడు..
ప్రకృతి పక్కున నవ్వి చెపుతుందేమో..
"ఎక్కడ మొదలైంది మళ్లీ అక్కడకే వస్తుందని"...
కానీ నా ఊరివాళ్లే అడుగుతారేమో...

“ఎవరూ.....?.అని... పల్లెటూరి నుంచి పట్టణానికి వెళ్ళిన నేటి పిల్లల స్థితి గతులను వర్ణించే అంశంగా భావించవచ్చు.

ప్రతిదేశానికీ ఒక సంస్కృతి ఉంటుంది. మనిషి పుట్టిన నాటి నుంచి మరణించే వరకు అతని జీవితంలో నిర్వహించే ప్రతీదీ సంస్కృతి అవుతుంది. అయితే ఏ దేశంలోనైన సంస్కృతి సాదృశ్యంగా ఉండదు.

ప్రపంచీకరణ ఇతర దేశాల సంస్కృతిని గుర్తించదు. సామ్రాజ్యవాద దేశాల సంస్కృతే గొప్పదని ప్రచారం చేస్తుంది. బహుళజాతి కంపెనీల ఉత్పత్తులను అమ్ముకోవడానికి కావాల్సిన పునాదిని ప్రపంచీకరణ తయారుచేస్తుంది. ప్రపంచీకరణ జరిగిన ప్రధాన కుట్ర పేదదేశాల సంస్కృతిని దెబ్బతీయటం. అది సాధ్యమైతే ఇక్కడి ప్రజలు విదేశీ వస్తువులకు అంత తొందరగా అలవాటుపడలేరు. ఆ పనిని చడీచప్పుడు లేకుండా చేస్తున్న సాధనం కంప్యూటరని ప్రపంచీకరణను వ్యతిరేకిస్తున్న బుద్ధిజీవులందరు చెబుతున్నారు. “అత్యాధునిక మానవుడిని ఓ ‘రోబోట్’లా తయారు చేయాలనే ప్రపంచీకరణ సాంస్కృతిక వ్యూహం కనీసం రోజు వారి జీవితంలో మనం ఏమి పోగొట్టుకున్నాము,ఏమి పొందుతున్నామో తెలియని పరిస్థితిలో మనమున్నాము”.
మన సమయాన్ని, మన పనుల్ని కంప్యూటరే నిర్దేశిస్తుంది.

“దాని ముందు కూర్చుంటే
లోకం పట్టదు......
దానిలోకి చూస్తుంటే
సభ్యత తట్టదు”[39]

కవులు కూడా కొత్త శీర్షికలను, కొత్త పదాలను, పోలికలను, ప్రతీకలను సమకూర్చుకోవటం జరుగుతుంది. అట్లా వచ్చిందే ఈ కవిత.

“ఇప్పుడు నా అంగాంగం మల్టీనేషన్
ప్రోడక్ట్స్ కు మార్కెట్లా మారిపోయింది!
సోప్స్ యాడ్ లు మూడ్స్ ప్యాకులూ
షేవ్ లోషన్స్ కు ఫ్యాషన్ షోలకూ
అన్నీటికీ నేనే మోడల్ అందుకే నాకిపుడు
ప్రథమ స్థానాలు ప్రపంచ సుందరి కిరీటాలు!!”[39]

90వ దశకం తరువాత ప్రపంచ సుందరి కిరీటాలు ఎక్కువ మటుకు మనదేశానికే వచ్చాయి. ఆ కాలంలో ఇతర దేశాల అందగత్తెలు లేరని కాదు. ఈదేశ మార్కెట్ ను ఆక్రమించడానికి మల్టీనేషన్ కంపెనీలు వస్తువులు అమ్ముకోవడానికి మన దేశ స్త్రీల అందంతో యాడ్స్ ఇప్పించడానికి అందాల సుందరులను ఎంపిక చేశారు. మార్కెట్ అవసరం తీరింది. గత ఐదు సంవత్సరాల నుంచి ఈ దేశంలో అందగత్తెలు లేరు. ఇప్పుడు దక్షిణాఫ్రికా మార్కెట్ ను కొల్లగొట్టడానికి నలుపులో అందాన్ని వెతుకుతున్నారు. సచిన్ టెండూల్కర్ పది పరుగులు చేయలేకపోయిన విశ్వవిజేతనే. అందుకే ఆయన గాలిలో ఎగురుతున్న క్రికెట్ బాలును ఎగిరి అందుకుంటాడు. పసిపిల్లలు అందరూ సచిన్ నీ శక్తికి కారణమేంటి అని అడిగితే "బూస్ట్ ఈజ్ ది సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ" అని బదులిస్తాడు. అప్పుడు పిల్లలంతా తమ కండపుష్టికి బూస్ట్ నో, కంప్లానర్ నో తాగాలి. అంతిమంగా ఆ వస్తువు అమ్ముడుపోవాలి. ఇట్లా ఒక భ్రమలో ప్రజలను ఉంచి మల్టీనేషన్స్ తమ ఉత్పత్తులను అమ్ముకుంటున్నాయి. అమ్మ చేతి గోరు ముద్దల గురించి రాసిన కవి అనివార్యంగా ఇవ్వాళ సెరిలాక్ గురించి రాయాలి.

"తల్లి స్తన్యాన్ని చప్పరించాల్సిన
పసిపిల్లల పెదాలు జాన్సన్
పాలపీకలకు అతుక్కున్నవి
అమ్మచేతి ఉగ్గుపాల గిన్నెలన్నీ
సెరిలేక్ ఫారెక్సతో నిండిపోయినాయి
ఇప్పుడు పిల్లలంతా హార్లిక్స్ తింటూ
కాంప్లాన్ బాయ్ లుగా ఎదుగుతున్నారు"[40].

ఇప్పుడు ఆడపిల్లగా పుట్టిన "నామనసంతా సామ్రాజ్యవాద సంస్కృతిలో ఒలలాడుతున్నద" అని ఆవేదన చెందుతున్న మల్టీనేషన్ వు'మెన్' అంతరంగాన్ని ప్రతిబింబించటంలో ఈ కవయిత్రి విజయవంతమైంది. మనిషిని స్వార్థం కమ్మేస్తే మానవత్వం ఉండదు.

మనిషిలో స్వార్థాన్ని పెంచి సంకుచితంగా మారుతున్నది ప్రపంచీకరణ. ఆత్మీయబంధాలు లేవు. ప్రేమసంబంధాలు మచ్చుకైనా కానరావు. మనిషన్నవాడు రోజురోజుకు దిగాజారుతున్నాడు. కుంటుంబసంబంధాలు విచ్ఛిన్నం అయ్యేస్థితికి వచ్చాయి.

"ఏ మార్గంలోనైనా డబ్బు సంపాదించి వీలైనంత తక్కువ కాలంలో సంపద కూడబెట్టుకొని త్వరగా కోటీశ్వరులు అయిపోవాలన్న ఏకైక లక్ష్యం కుటుంబ భద్రతపై దుష్ప్రభావం చూపుతుంది. సాధారణంగా మనిషిలోని సూక్ష్మ స్పందనలను పట్టుకోగలిగిన కవి మనిషే మాయమైపోతున్నాడని ఆవేదన చెందాడు.

"ఇనుపరెక్కల డేగ విసిరినా పంజాకు
కోడిపిల్లై చిక్కి కొట్టుకుంటున్నాడు
ఉట్టికీ స్వర్గానికి అందకుండా తుదకు
అస్థిపంజరమై అగుపించనున్నాడు"[41]

ఇక్కడ ఇనుప రెక్కలడేగ అంటే ప్రపంచీకరణ. ఈ ప్రపంచీకరణకు మనిషి కోడిపిల్లలా చిక్కిపోయినాడు. సహజమైన పోలికలతో ప్రతీకాత్మకంగా కవిత్వీకరించారు. సామ్రాజ్యవాదం బ్రతుకు. కాబట్టి అది చివరికి మనిషిని అస్థిపంజరం చేయనుందని హెచ్చరించారు.

"అనగనగా.....
ఓ సంస్కృతి వుండేది
ఏ పడమటి గాలి కాటేసిందో
ఏమో
అది శిల్పారామంలో అవశేషమైపోయింది"[41] తూర్పుప్రజల సంస్కృతిని (భారతదేశం), పడమటి (అమెరికా) సంస్కృతి ధ్వంసం చేసింది. పోగా మిగిలిన అవశేషాలు యాత్రికుల కోసం శిల్పారామంలో భద్రపరిచారు.

ప్రతిదేశానికి ఒక నాగరికత ఉంటుంది. ఆ మాటకొస్తే భారతదేశం లాంటి చోట భిన్న సమూహాలకు ఒక జీవనవిధానం ఉంటుంది. అయితే ఆధిపత్య వర్గాలు వాటన్నింటిని రద్దుచేసి బలవంతంగా ఏకరూప సంస్కృతిని రుద్దాలని భావిస్తాయి. ప్రపంచీకరణ కూడా ఆధిపత్య భావజాలం కలిగిన భావన. కాబట్టి దీని ముసుగులో అభివృద్ధి చెందిన దేశాల సంస్కృతిని పేద దేశాలపై రుద్దుతారు. అట్లా దిగుమతి అయిన సంస్కృతి వలన ఎం జరుగుతుందో ఎస్వీ.సత్యన్నారాయణ వర్ణిస్తూ..

"ఇక్కడో నాగరికత ఉండేది

ఎవరు తడిచేశారు?

విశిష్టమైన సంస్కృతి ఉండేది

ఎవరు విషం కలిపారు?

విలక్షణమైన జీవనవిధానం ఉండేది

ఎందుకిలా మారిపోయింది?"[42]

అని పాలకులను ప్రశ్నిస్తున్నారు. కొన్నాళ్లైతే 'ఇక్కడో దేశముండేది' అని ప్రశ్నించుకొనే స్థితి వస్తుందని ప్రజలకు జాగ్రత్త చేస్తున్నారు.

"ఇంటింట్లోకి నాకంట్లోకి చొరబడ్డ చానళ్ళు

జంతువులనే కాదు మనుషులనే కాదు

సంస్కృతుల్ని సంకరిస్తున్న సంస్కృతికి ఆనవాళ్ళు"[43]

పదేళ్ల కిందట ఊళ్లో ఒక టీవీ ఉందంటే చాలా గొప్ప విషయం. ఇవ్వాళ ప్రతిపల్లెకు, గుండెకు టీవీతో పాటు డిష్ కనెక్షన్ చేరింది. ఇక మనిషి శ్రమను మర్చిపోవడానికి అల్లుకున్న జానపదాన్ని మూలకు విసిరేసి టీవీలో లీనమయ్యే జానపదులే ప్రతిపల్లెలో కనిపిస్తారు. పట్టణాలలో అయితే 24గం. టీవీ మాటనే వినిపిస్తుంటుంది. ఇది మనిషిని ఆనంద పరచటమే కాదు మనది కాని సంస్కృతిని అలవాటు చేస్తుంది. శ్రమ సంస్కృతికి పట్టం కట్టిన చోటే విలాస సంస్కృతి రాజ్యమేలుతుంది. ఇది దేశాల సరిహద్దులు దాటి సంస్కృతుల సంకరం మొదలౌతుంది.

భూగోళం ఒక గ్రామం. ఈ గోళంలోని దేశాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. ప్రపంచీకరణ కొత్త ప్రపంచపు దశ. ఇవి ప్రపంచీకరణను సమర్థించే మేధావులు ప్రచారం చేస్తున్న భావాలు. కాని వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. ప్రపంచీకరణ నూతన దోపిడీ సిద్ధాంతంగా మారింది. ప్రపంచమంతా ఒక గ్రామమైనపుడు, మనసు సంతోషపడాలి కానీ కన్నీటిలో కొట్టుకుపోతున్న శవమైంది. "నేడు సామ్రాజ్యవాద సంస్కృతే అసలుసిసలైన సంస్కృతిగా భ్రమింపజేస్తుంది. ఇది దేశీయ సంగీత నృత్యాలను కూడా ప్రభావితం చేస్తుంది".

"మైఖేల్ జాక్సన్ రాకతో పులకరించిన

కూచిపూడి తన పదగతుల్ని మార్చుకుంది

శాస్త్రీయ సంగీతం పరవశించి

నిలువెల్లా వంకరలు పోతుంది"[44]

ఇప్పుడు 'డే'ల సంస్కృతి అన్నింటిని ప్రభావితం చేస్తుంది. ఫ్యాషన్ షోలు, డిస్కోథెక్ ల కాలమొచ్చింది. జానపదం జానాబెత్తెడు బట్టలతో ఎగురుతున్నది. గుడిలో సంస్కృతంలో మంత్రాలు చదివే బ్రాహ్మణుడు ప్రపంచీకరణ వలన ఆంగ్లంలో చదువుతున్నాడు. లయబద్ధంగా ఉండే మంత్రం మైఖేల్ జాక్సన్ సంగీతంలా వినిపిస్తుంది. చదువు కూడా ప్రపంచీకరణ సంతలో సంస్కారం నేర్పటం మర్చిపోయి వస్తువును ఉత్పత్తి చేస్తున్నది. కృత్రిమ విలువలను కురుస్తున్న టీవీలు మనుషులను మార్కెట్ రొంపిలోకి తీసుకెళ్తున్నాయి. ఇది నడుస్తున్న ప్రపంచీకరణ సంస్కృతి. ప్రజల కళలను, స్త్రీలను సరుకులుగా ఉపయోగించుకుంటుంది. ప్రపంచీకరణ ఏ రూపంలోనైన రావచ్చు. ఇందుగలడు అందులేడని సందేహంబు వలదు.

"వాడు రెండు స్వప్నాల మధ్య పీడలా వస్తాడు" అని ఏ.వి.ఆర్.మూర్తి అన్నారు. వివిధ రూపాలలో వచ్చే ప్రపంచీకరణ ఏం చేస్తుంది. మింగుతుంది. ఎవరిని. నిన్ను, నన్ను, మనందరిని.

"రోజుకో నక్షత్రాన్ని తింటూ

భూమండలాన్ని

అమాంతం మింగేయాలని

తాపత్రయం వాడిది"[45] అంటూ మనిషి రోజురోజుకు కుంచించుకుపోతున్నాడు. స్నేహాలు దూరతీరాలకు వలసపోతున్నాయి. మనుషుల మధ్య అపనమ్మకాలు పొడచూపుతున్నాయి. సహజ స్పందనలను వదిలిన స్నేహం కృత్రిమంగా జడత్వం పొందింది. ఇదంతా పాడుకాలం.

"మట్టితో మనిషితో అనుబంధాలను

కొనసాగనివ్వాలని

మాయదారి సమయం ఇది

కదులుతున్న ప్రతి మనిషి తలమీద

కత్తిలా వేలాడుతున్న

ప్రపంచీకరణ సారం ఇది"[46]

ఈసారంలో 'రాలుతున్న ఖండితాల కంటే మనిషి రాల్చుకుంటున్న' విశ్వాసాల గురించే శివకుమార్ దిగులు చెందుతున్నారు. తలను తాకట్టు పెట్టినచోటే ఒక ఆయుధం మనపై వేలాడుతుంటుంది. మట్టి నుంచి దూరమైన మనిషి సమూహం నుంచి దూరమవుతాడు. బహుశ ఈ సంఘంలో దేనికి చేరువకాలేడు. చైతన్యాన్ని, అస్థిత్వాన్ని మర్చిపోయేటట్టు చేసే లక్షణం ప్రపంచీకరణ సంస్కృతికి వుంటుంది. పరాయికరించిన ఆలోచనలు స్థిరంగా ఉండవు. సొంతంగా ఉండవు. మనిషిలో ఈ బానిస లక్షణం పెరగడానికి గ్లోబల్ మీడియా ప్రధాన పాత్ర వహిస్తుంది. మనదైన ప్రతి దానిని తక్కువ చేసి చూపటం ఈ మీడియా చేసే పని, గింజల మీది ప్రేమ డాలరు మీదికి మళ్లించటం వలన అస్తిత్వం పోతుంది. ఈ పని చేసిన వాడిని గుర్తించి ఎండగట్టకపోతే నేరమవుతుందనే భావన సుదేరాది.

"పల్లె పేదల మీద కొట్టాడే
లొల్లాయి పదాల్ని పెంటకుప్పలోకి నెట్టి
పాడి కడవల చుట్టూ, పంట పొలాల చుట్టూ
కంపలా అల్లిన కేబుల్టీవీ తీగల వుచ్చుని
తెంపుకోవడం నేరమే"[47]

గ్రామం ఆత్మీయతను పరిమళించే మల్లెపువ్వు. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడో! పిల్ల బాటలో, డొంకల్లో విదేశీ నాగాసర్పాలు కాచుకూర్చున్నాయి. శీతల పానీయాలు కుండల్లో నిండుతున్నాయి. బీటికాటన్, టెర్మినేటర్ విత్తనాలు భూమి కడుపును విషపు గోళ్ళతో చీల్చుతున్నాయి. పల్లె ప్రేమను స్ట్రాతో లాగేస్తున్నాయి. ఇవ్వాళ ప్రతి ఊల్లో కిరాయికి లభించే సీడీలు, డివీడీల ద్వారా అశ్లీల హింసాయుత వ్యాపార సినిమా సంస్కృతి విషంలా శరీరాలను దాటి వాళ్ల తలల్లో కూడా పాగా వేస్తున్నది.

ప్రపంచీకరణ ఎన్ని రూపాలలో మన దేశ జీవితాన్ని, సంస్కృతిని విచ్ఛిన్నం చేయగలదో అన్ని పద్ధతులను ఎన్నుకుంది. వస్తువును అమ్ముకునే యావలో దుర్మార్గ దారులన్నింటిని ఆశ్రయించింది. మనల్ని మన సంస్కృతిని రక్షించుకొనే క్రమంలో తెలుగు కవికి ప్రతిఘటన ఒక్కటే ముందున్న మార్గమైంది. ఉత్పాధితాన్ని, సాంస్కృతిక ఉత్పాధితాన్ని సైతం, సజాతీయ పర్చాల్సిన అవసరమొకటి గ్లోబలైజేషన్ నీడలా అనుసరిస్తుంది. ఉత్పధితమెంత సజాతీయమైతే దాని మార్కెట్ అంత పెద్దదవుతుంది. ప్రపంచంలో ఎక్కడకు వెళ్ళినా అవే డబ్బులు అదే టూత్ పేస్ట్. బహుళజాతి

సంస్థల లాభాలు ఇనుమడించే ఆర్థికవ్యవస్థ ప్రపంచీకరణకు, ఉత్పత్తుల సజాతీకరణ మొదటి మెట్టు. ఉత్పత్తుల సజాతీకరణ సజాతి సంస్కృతికి బాటలు వేస్తుంది. సాంస్కృతిక ఉత్పాదితాలు, చిహ్నాలను సజాతీకరించడమే గ్లోబలైజేషన్ సంస్కృతి యొక్క సారం. భారతీయ సమాజం ప్రపంచీకరణ చెందుతున్న పర్యావసానంగా ఒక వైపు లక్షలాది మంది ప్రజల బతుకులు చితికిపోతున్నాయి. మరోవైపు దేశం తాకట్టులో కూరుకుపోతుంది. జమాఖర్చులను సమీక్షిస్తూ గత ఏడాది కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తేల్చి చెప్పిందేమంటే.

ఎ) దేశం విదేశీ అప్పుల ఊబిలో ఇప్పటికే కూరుకొని ఉంది.

బి) భారత ప్రభుత్వం తీర్చవలసిన ప్రస్తుత ఋణభారం కొన్ని లక్షలకోట్లుంది.దాని వల్ల లక్షలాది జనం నిత్యదరిద్రులయ్యారు. మౌలికసదుపాయాలూ కొరవడినాయి. దేశ ఆర్థిక సంపద ధ్వంసమైపోతుంది. దేశ ప్రజల ఆస్తులు, సంపద కొల్లగొట్టబడుతున్నాయి. సంస్కృతి నాశనమవుతుంది. ప్రపంచంలోని అన్నిరకాల పండమెంట్లిస్టులూ ప్రపంచీకరణ సంస్కృతికి ఆత్మబంధువులయ్యారు. గ్లోబలైజేషన్ ప్రభావానికి గురయ్యే మూడవరంగం సంస్కృతి. సంస్కృతిపై గ్లోబలైజేషన్ గాఢమైన ప్రభావం చూపనుంది. ఇందుకు దేశంలోని మతతత్వ శక్తుల సహకారం కూడా పుష్కలంగా లభిస్తున్నది.

సాంస్కృతిక ఉత్పాదితాన్ని దేశ సాంస్కృతిక వాతావరణాన్ని సజాతీయపర్చే గ్లోబలైజేషన్ లక్ష్యాన్ని ఇక్కడి మతతత్వ శక్తులు తమ ఎజెండా కొరకు వాడుకుంటాయి. ఉభయులూ కలిసి భారతీయ సమాజాన్ని ఉపద్రవంలోకి నెడుతున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలను తిరిగి ఆర్థిక వలసలుగా మార్చుకోవడానికి సామ్రాజ్యవాద దేశాలు రూపొందించుకున్న బ్లూప్రింటు పేరే గ్లోబలైజేషన్. సి.వి.కృష్ణారావు తన కిల్లారి అనే కవితలో ఈవిధంగా చెబుతున్నాడు.

> "అమ్మా, నీవు పొంగించిన పాలకుండ పదిలం
> నాయన యావర్తికి అవరోధం వచ్చింది
> చెల్లి కట్టిన గూడు చెల్లాచెదురైంది
> తమ్ముడు తల్లడిల్లి పోయాడు
> తెలియని వయస్సు
> కోడెదూడ గూటాన్నే గుంజుకుపోయింది"[48]

అంటూ కవి అమ్మవడిలో జీవించిన కాలాన్ని గుర్తుచేసుకుంటున్నాడు.

ఇది ఇల్లేనా అనే కవిత్వాంలో భగ్వాన్ ఈ విధంగా అంటున్నాడు.

"ఇది ఇల్లేనా
ఇది ఇల్లేనని ఎవరైనా బట్టకొట్టగలరా
మాటలేవి ఆటలేవి
చిలిపి చిలిపి పోట్లాటలేవి". అంటూ చిన్నతనంలో పిల్లలు ఆడుకునే సంస్కృతి ఎటు వెళ్ళిపోయిందని ఆవేదన వ్యక్తపరుస్తున్నాడు.

"ఈ ఎలక్ట్రానిక్ దృశ్య తరంగ మాయాజాలంలో చిక్కి
ఇంటిని పోగొట్టుకున్న మనిషీ
మనిషిని పోగొట్టుకున్న ఇల్లూ
సమాజం మెడలో
పుర్రెల దండలు కాక మరేమవుతాయి"[49]అంటూ ఎలక్ట్రానిక్ మాయాజాలంలో పడి సమాజంలో ప్రజల సంస్కృతి దెబ్బతింటుందని తెలియజేసాడు. వర్తమాన ప్రపంచీకరణ దశలో కొత్త అంశంగా భావిస్తున్నది ఏమంటే సంస్కృతి గురుంచి అన్వర్ పాటని ఉదా.. గా చూపించాడు.

"రాజ్యం- ఉరి తీసినా, తుపాకీ పేల్చి
సంకెళ్ళు వేసినా
పాట- ప్రజా వెల్లువవుతుంది.
పోరువదలని గొంతవుతుంది
పాట- తిరుగబడే చిరునామా!
మెరిసే నక్షత్రం
తలవంచని అరణ్యం"[50].

ప్రపంచీకరణ సంస్కృతిలో భాగంగానే సమాచార సాధనాలు, సత్వర ప్రయాణ సాధనాలు అనూహ్యవేగాన్ని సంతరించుకున్న దరిమేలా ప్రపంచం చాలా కుచించుకుపోయింది. పెట్టుబడి, సరుకులు, ప్రజలు, సమాచారం, భావాలు, భావచిత్రాలు ఒకచోటు నుండి మరొక చోటికి ప్రవహించడానికి తోడ్పడే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రపంచ స్థాయిలో 'స్వయం ప్రతిపత్తి' పొందాయనడంతో ఎటువంటి సందేహం లేదు. సమకాలీన బహుళ జాతీయకరణ, ప్రపంచ

ఏకరూపీకరణ ముసుగు తొలగించేందుకు మనుషులను సరుకుల ఉత్పత్తిదారులుగా చూసే స్థితి నుండి సరుకుగా మార్చిన సంస్కృతికి మోకరిల్లిన వినియోగదారులుగా మార్చివేస్తున్న చారిత్రిక క్రమాన్ని పరిశీలించడం ప్రపంచీకరణ సంస్కృతిని గూర్చి ఒక కొత్త మార్గం. ఈ మార్గాలలోని నడిచారు తెలుగు కవులు. సంస్కృతిని సరుకుగా మార్చే క్రమంపై ఎన్నో ఉపయుక్తమైన రచనలు వచ్చాయి. బహుళజాతి సంస్థలు, అడ్వర్ టైజింగ్, కంజూమరిజం కోరికలను కలిగించి అవసరాలను సృష్టించడం మొ.. ఎన్నో అంశాలు వచ్చాయి.

బహుళజాతి సంస్థలు టీవీషోలు, రేడియో ప్రసారాలు, అడ్వర్ టైజింగ్ మొ.. వాటి ద్వారా ప్రపంచంలోని చాలా ప్రాంతాలలోకి చొచ్చుకుపోయి సంస్కృతి పేరుతో ఒక పరిశ్రమను సృష్టించాయో తెలుగు కవులు చాలా విపులంగా వివరించారు. దీనినే మాస్ కల్చర్ లేక జనబాహుళ్య సంస్కృతిగా కార్పోరేషన్లు మనకు చూపుతాయి. ప్రజలు సంస్కృతికి సృష్టికర్తలుగా కాక కేవలం సంస్కృతి వినియోగదారులుగానే మార్చబడతారు.

సాంస్కృతిక పరిశ్రమ వస్తువ్యామోహాన్ని ప్రోత్సహించి ప్రజలను బుట్టలో పడవేస్తుంది. భారతదేశం లాంటి తృతీయ ప్రపంచ దేశాలు బహుళజాతి సంస్థలను స్వేచ్ఛగా అనుమతిస్తే దిగుమతయ్యేవి, పొట్లాలు కట్టిన నిర్జీవమైన సరుకులు మాత్రమేకాదు, యావత్తు సాంస్కృతిక పరిశ్రమే దిగుమతైపోయి ప్రజలను ఒక తరహా జీవన విధానానికి సమాయత్తం చేస్తుంది.[51]

"ఊరుకాలిపోయింది ఉనికి మారిపోయింది
గుండెల్లో రాజుకున్న మంటలు ఇళ్లను చుట్టేసాయి
ఒకే నిప్పులో గదులూ హృదయాలూ
బూడిదగా చల్లారి పోయాయి". అంటున్న కవి చివరగా అదే కవితలో

ఈ మట్టిని 'కన్నతల్లి' అని గొంతెత్తి పిలిచిన వాణ్ణి నా జీవన పుష్పానికి ఈ మట్టి రేణువుల్నే పుప్పొడిగా అద్దినవాణ్ణి....

"పొర్లాడి పొర్లాడి నాగుండెలో
ఈ మట్టిని ఒంపుకున్న వాణ్ణి
ఈ మట్టి నాకు దూరమైపోతున్నపుడల్లా
ప్రతి గుండె మీదమట్టిలా సృష్టిస్తాను"[52]

భారతదేశంలోని గ్రామీణ పట్టణ ప్రాంతాలలో అంతర్జాతీయ టీవీ ఛానెల్స్ చొచ్చుకుపోయి గ్లోబల్ సంస్కృతిని సరుకులను ఎలాంటి తేడాలు లేకుండా సమాజంలోని అన్ని వర్గాలకు కులాలకు, మతాలకు, స్త్రీ పురుష భేదం లేకుండా ఎక్కిస్తున్న చరిత్ర ప్రపంచీకరణ చరిత్రలో అడుగులో అడుగు వేసి నడుస్తున్నది. రాజకీయ సామ్రాజ్యవాద స్థానం సాంస్కృతిక సామ్రాజ్యవాదం ఆక్రమించింది. 'నాగరికతను పరిచయం చేసే బృహత్తరయత్నం, పేరిట రెండు శతాబ్దాలు వలసలను దోచుకునేందుకు పశ్చిమ దేశాలకు వలసవాదం, సామ్రాజ్యవాదం ఉపయోగపడింది. ప్రత్యక్ష రాజకీయ సామ్రాజ్యవాదం నిర్వహించిన పాత్రను ఇప్పుడు సాంస్కృతిక పరిశ్రమ పుణికి పుచ్చుకుంది.

ప్రస్తుత ప్రపంచీకరణ నూతన యుగంలో సాంస్కృతిక పరిశ్రమ రెండు విధులు నిర్వహిస్తుంది.

అవి ; 1. ప్రత్యామ్నాయ సిద్ధాంతాలను, దృక్పథాలను విశ్లేషించి మార్క్సిస్టు దృక్పథాన్ని ప్రభావ రహితంగా చేసేందుకు ప్రయత్నిస్తూనే మరో పక్క అమానుష పెట్టుబడి దారీ దోపిడీ యంత్రంగాలను వివరించే కీలక భావనలపై ఆధునికోత్తరవాద చర్చ ద్వారా ముఖాముఖి దాడికి పాల్పడుతుంది.

2. ప్రపంచ స్థాయిలో సంస్కృతిని సరుకుగా మార్చడాన్ని సమర్థించేందుకు సరికొత్త భావనలు, టెక్నాలజీలు, సైద్ధాంతిక చర్చలు ప్రపంచీకరణ సంస్కృతికి తోడ్పాటు.

ప్రపంచీకరణ ప్రజల మానసిక స్థితిపై, సాంస్కృతిక నీతిపై, విలువల వ్యవస్థపై ఇది దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపిస్తుంది. అందుకే ఈ క్రమాన్ని నేను సరుకుల సంస్కృతి నుండి సంస్కృతిని సరుకులుగా మార్చే పరిణామంగా వివరించదలచుకున్నాను. నేడు ప్రపంచీకరణ అనేది సామాజిక ప్రవర్తనను ప్రభావితం చేసే సాధనంగా సంస్కృతి రూపొందుతున్నది.

"క్రికెట్ నా దేశభక్తికి
తూనికా, కొలమానవుతుంది
నేను నా మాతృదేశాన్ని
ఎంతగా ప్రేమిస్తున్నానన్నది కాదు"[53] అంటూ దేశంతో క్రికెట్ మ్యాచ్ యొక్క ప్రభావాన్ని సంస్కృతిలో భాగంగా చెబుతున్నాడు. అలాగే

"వెండి తెరల మీంచి
రంగస్థలాల మీంచి
కలామర్మజ్ఞాల విచిత్ర విన్యాసాల మీంచి

నా విదూషక ఖలనాయకుని వేషం

అందరికీ వినోదాన్ని అందిస్తుంది

సాంస్కృతికంగా నన్నొక వికలాంగున్ని చేస్తుంది". అంటూ కవి తనకి కలిగిన ఆవేదనని వ్యక్తపరుస్తున్నాడు. సంస్కృతి అనేది ప్రపంచీకరణ అనే పెనురక్కసి చేతిలో నలిగిపోయింది.

**2.4.8. ప్రేమ:** యువతీ యువకుల్లోని బలహీనతల్ని రెచ్చగొట్టి, దీపం మీదికి శలభాలుగా మార్చి, ఒక ఆగని హింసాపూరిత అవివేక కార్యక్రమాలకి దారి తియ్యడం, ఈనాటి సినిమాలు, టీ.వీ.లు, సెల్లులో, ఇంటర్నెట్ మొదలైనవన్నీ చేస్తున్న విధ్వంసకర వాతావరణం ప్రేమ సంబంధాలని బోజంకి రవి చాలా చక్కగా వర్ణించాడు.

"పరోటా తింటావా

ఓల్డ్ ఫుడ్

పిజ్జాలంటావా

బోర్ బోర్

పోనీ 'లవ్ కోవా' తిను

ఆ ట్రెడిషినల్ఫుల్ చూడు

సిగ్గు తరగదు - చీర కట్టేసింది

.....................................

కన్నె కలలన్నీ చల్లబారాక

సభ్య నెలలో రాలుపూలమవుదాం కమాన్యార్" ప్రేమ పేరిట జరిగే దారుణ మారణకాండలకు చలించిపోయి బోజంకి రాసిన "ప్రేమంటే త్యాగమే" అన్న కవితలో కసి, ఆవేదన, ప్రబోధం ముప్పేటగా అల్లుకున్నై. మీడియా కల్పిస్తున్న 'భోగవస్తు' దృక్పథాన్ని చాలా బలంగా చెప్పారు.

"కెమెరా కన్నెప్పుడు కన్నెమేను మీదనే

అసభ్య చాయా చిత్ర ప్రదర్శనల, పదజాలాల

.....................................................

ఎరుక పరచే మీడియా ఏదీ? అని పచ్చి నిజాన్ని చెప్పాడు కవి. ప్రేమంటే ఏమిటో చెప్పాడు.

"ప్రేమంటే ఇచ్చేది
ప్రేమంటే క్షమించేది
ప్రేమంటే అర్థం చేసుకునేది
ప్రేమంటే కష్టనష్టాలలో తోడుండేది
ఒకరికి ఒకరుగ జీవించేది"[54]

తినే తిండిలో కూడా అనారోగ్యాన్ని గూర్చి ఆలోచించక, కేవలం నాగరికత అనే వ్యామోహంలో కొట్టుకుపోవడాన్ని, ప్రపంచీకరణ ప్రక్రియ సాధించగలగడం విషాదాల్లోకెల్లా విషాదం.

**2.4.9.కుటుంబ సంబంధాలు:** సమాజానికి ప్రాథమిక యూనిట్ కుటుంబం. వ్యక్తికీ, కుటుంబానికి సమాజానికి మధ్య సరైన సంబంధం వుంటేనే దేశం ప్రశాంతంగా వుంటుంది. ఇప్పుడు ప్రపంచీకరణ తాకిడికి అన్ని అనుబంధాలు, కుటుంబ సంబంధాలు కూడా బీటలు వారడం చూస్తున్నాం. తాము బతకడమే గగనమవుతున్న స్థితిలో పేద మధ్యతరగతి వారు రక్తసంబంధీకుల గురించి కూడా ఆలోచించే స్థితి లేదు. ఎవరికి వారిగా బతుకుపోరాటంలో మునిగితేలిపోతున్నారు. నమ్ముకున్న వ్యవసాయం చితికిపోయింది. వృత్తులు అంతరిస్తున్నాయి. పరిశ్రమలు, సంస్థలు మూతపడ్డాయి. చిన్నచిన్న వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. దాంతో చెట్టుకొకరు పుట్టకొకరుగా విడిపోతున్నారు. ఒకరి బరువు మరొకరు మోయలేక తెగతెంపులు చేసుకుంటున్నారు. విద్యా ఉద్యోగాలకోసం విదేశాలకు వెళ్ళడంతో సంపన్న కుటుంబాలలో కూడా పెద్దలు ఒంటరి పక్షులవుతున్న స్థితి. నెట్ ఫోన్లలోనే మనవలను చూసుకుని తృప్తిపడుతున్నారు. మిగిలిన ప్రపంచంతో సంబంధం లేని నువ్వు-నేను తరహా సినిమాలు ఒక విధంగా నేటి ఆలోచనా ధోరణికి అద్దం పడుతున్నాయి. ప్రపంచీకరణతో పాటు పెరిగిన వినియోగ సంస్కృతి కూడా వ్యక్తుల వ్యామోహాలను పెంచి మానవసంబంధాలను దెబ్బతీస్తోంది. ప్రతీది ధన దృష్టితో చూసే దౌర్భల్యం ప్రబలుతున్నది. ఒక్కముక్కలో చెప్పాలంటే వస్తువులు మనుషుల కన్నా హెచ్చు విలువ సంతరించుకుంటే మనిషి వస్తువు కన్నా కనాకష్టమై ఆ వస్తువులు సంపాదించి పెట్టవలసిన మరగా మారిపోతున్నాడు.

ఇదంతా కుటుంబ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తున్నది. పశ్చిమదేశాలస్థాయిలో కాకపోయినా ఇక్కడా విడాకుల కేసులు పెరిగిపోతున్నాయి. ఆధునిక వాతావరణ ప్రభావంతో చైతన్యవంతులైన

స్త్రీలు ఆత్మగౌరవం కోసం నిలబడుతుంటే సహించలేని పురుషాధిక్య ధోరణులు కూడా అనేక అనార్థాలకు కారణమవుతున్నాయి.

సమాజంలోని మిగిలిన ప్రభావాల నుంచి తమ పిల్లలను కాపాడుకోవడానికి, తమపైన విలువలు వారికి భోదించడానికి తల్లిదండ్రులు కృషి చేస్తుండేవారు. కాని ప్రపంచీకరణ దశలో మీడియా విస్తరణ పెద్దలకు తమ పిల్లలపై పట్టులేకుండా చేస్తోంది. పెరిగిన సాంకేతిక అవకాశాలు పిల్లలకు ఇదివరకటికన్నా ఎక్కువ జ్ఞానాన్ని అందిస్తున్న మాట నిజమే. గతంలో బాగా పెద్దవాళ్ళయిన తర్వాత కాని కనిపించని అవగాహన ఇప్పుడు చిన్నతనంలోనే చూస్తున్నాం. వాణిజ్య విలువలు పెరిగిన తర్వాత ఇప్పుడు పిల్లలను లక్ష్యంగా పెట్టుకుని ప్రచారం సాగుతుంది. అభిమన్యుడు తల్లికడుపులో ఉన్నప్పుడే పద్మవ్యూహంలోకి వెళ్ళడం తెలుసుకుంటాడు. అలాగే ఇప్పుడు పసివయస్సులోనే ఒక అడ్వర్టైజ్మెంట్ చూసిన పిల్లాడు గుర్తు పట్టగలడని ప్రపంచీకరణలో భాగంగా కార్పోరేట్ పరిశోధకులు తేల్చి చెప్తున్నారు.

**2.4.10.జానపదకళలు:** మన దేశ సంస్కృతిలో జానపద కళలకి పూర్వ కాలం నుంచి మంచి పేరుంది. ప్రస్తుత కాలంలో ప్రపంచీకరణ ప్రభావం వలన మన జానపద కళలు అంతరించే ప్రమాదం ఏర్పడింది. మనదేశపు ఉత్తమ జానపద కళలన్నీ మాయమైపోతున్న సందర్భంలో తెలుగు కవులు గట్టిగా స్పందించారు. ఒకరికి కలిగిన ఆలోచనను పలువురు అనుసరించే రీతి అధికంగా కనిపిస్తుంది. ప్రజలలో కళలు పట్ల అభిరుచి, ఆసక్తి సన్నగిల్లింది. సహజమైన రీతిలో కాక కృత్రిమ రూపాలు ధరిస్తున్న ప్రకృతి రీతిని వివరించారు. కళలు అంతరిస్తున్నాయనే వ్యధను కొందరు వ్యక్తం చేయగా కులవృత్తులు పోయాయన్న హర్షాన్ని వ్యక్తం చేసినవారు ఉన్నారు. ప్రపంచీకరణ వలన కొంత లాభం చేకూరిందనే ఆలోచన లేకపోలేదు.

"కోలాటాల పాట వెన్నెల కుప్పల ఆట
మిడ్ నైట్ మసాలాల్లో మునిగిపోతున్నారు".

కళలకు ఉనికి లేదని దానికి కారణం గ్లోబల్ సంస్కృతి అని నిఖిలేశ్వర్ అంటున్నారు.

"భాగోతాలు చిరుత లాటలు దసరా వేషాలు
మందెచ్చులు చిందు వేషాల్లేని

ఫ్యాషన్ టీవీలు స్టార్ టీవీల్తోనే మనకిక.[55]

"చిర్రా, చిటికెన పుల్ల తీసుకొని ఉదయిస్తున్న సూర్యనిపై

దండోరా వేయాల్సిన మాదిగ డప్పు మాయమైన దృశ్యాన్ని.

చర్మం లేని తప్పెట దరువు హోరెత్తుతోంది. బ్రేకేద్దామా!

చేతి కుట్టే లేని చెప్పులేసుకొని

చెరువులై పోయిన చేలల్లో ఈదుకుంటూ టెక్సాస్కి చెక్కేద్దామా![56] మన పిల్లలకి మన పల్లెలకి మన కలలకి మన కోరికలకి ముకు దాళ్ళేసి బహుళజాతి బందుల దొడ్లకి మూకుమ్మడిగా తరలించవలసిందే ప్రపంచీకరణకు, బహుళజాతి సంస్థల పేరుతో రాజకీయపు నీడలో బలి చేయబడుతున్న పల్లె డాలరమ్మోరు గుడిమెట్ల మీద ముష్టెత్తు కొనేవాడి సాయం వ్యవసాయానికి అక్కర్లేదు. ఇవ్వాల్సిన రాయితీలు హక్కులు తక్షణం ఇస్తే చాలంటున్నారు.

పొత్తూరి సుబ్బారావు 'కల్లాకపటమెరుగని కళలు' అనే తన కవితా సంపుటిలో ఆవేదనను వ్యక్తం చేస్తున్నాడు. ఈ కవితలో బుర్రకథలూ, తోలుబొమ్మలాటలూ, పగటివేషాలూ, గంగిరెద్దులూ మొదలైన జానపదకలల్ని పతన కారణాలతో వర్ణిస్తాడు. పల్లెటూల్లను గూడా పట్టణీకరణ చేసే ప్రయత్నాల్ని నిరసిస్తాడు.

"సంస్కృతికి పట్టుగొమ్మలైన పల్లెపట్టున

పుట్టగొడుగులై విస్తరిస్తున్న

పాశ్చాత్య సంస్కృతులుండగా

మన జానపదకళలు

ఇంకెక్కడ బతికి బట్టకడతాయి?

కల్లాకపటమెరుగని కళలన్నీ

ప్రపంచీకరణ ప్రవాహంలో కొట్టుకొని పోనిస్తే

పాత కవిలె కట్టల్లోనే చూస్తాం

మన సంస్కృతీ సంప్రదాయాల్ని"

ప్రపంచీకరణ దుష్ఫలితాల నేపథ్యంలో దేశానికి పట్టుగొమ్మలైన గ్రామీణ ప్రాంతాలుని ప్రాంతీయ భాషలని మర్చిపోకూడదనీ, ఆయా ప్రాంతాలకి పరిమితమైన జానపద కళలని కాపాడవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉందని గుర్తు చేశాడు.

**2.4.11.ప్రపంచీకరణ సంస్కృతి విధ్వంసం:** పెట్టుబడిదారి విధానం యొక్క ఉన్నత దశయే సామ్రాజ్యవాదం. ఒకప్పటి సామ్రాజ్యవాదం వివిధ దేశాలను ఆయుధ సంపత్తితో యుద్ధాలు చేసి ఓడించి వలస దేశాలుగా మార్చుకొని రాజ్యాధి కారం చలాయిస్తూ ఆయా దేశాల వనరులను దోచుకునే వారు. కాని మారిన పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి ఆయుధాలు ఉపయోగించకుండానే, యుద్ధాలు చేయకుండానే వెనుకబడిన దేశాల్లో, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పెట్టుబడులు పెడుతూ, ఆర్థిక వనరులు సమకూర్చుతూ ప్రపంచ వ్యాపితంగా మార్కెట్ ఏర్పాటు చేసుకుంటూ, వలస దేశాలుగా మార్చుతూ సామ్రాజ్యవాదం విస్తృతమవు తున్నది. ఇప్పుడు ఆయుధ యుద్ధాలకు బదులు భావ విస్ఫోటనాన్ని అత్యంత శక్తివంతమైన సాధనంగా ఉపయోగించుకుంటున్నది. మనుషులను తన మార్కెట్‌కు అనుకూలంగా మార్చుకోవడానికి సంస్కృతిని తన చెప్పుచేతల్లోకి తీసుకుంటున్నది. ఈ విధంగా మనిషి జీవన విధానమైన సంస్కృతిని సామ్రాజ్యవాద అనుకూల సంస్కృతిగా మార్చడానికి పెట్టుబడిదారి విధానాన్ని అమలు పరుస్తున్నది. ప్రపంచ వ్యాపితంగా కనబడని యుద్ధం కొనసాగిస్తుంది. అదే నయా సామ్రాజ్యవాదం. ఈ నయా సామ్రాజ్యవాదాన్ని భుజాల కెత్తుకొని ప్రపంచీకరణ ముసుగులో సాంస్కృతిక సామ్రాజ్యవాద ఆధిపత్యం ఆయా దేశాల సార్వభౌమత్వానికి, అస్థిత్వానికి, జీవన విధానానికి ప్రమాదంగా పరిణమిస్తుంది.

ఇప్పుడు సంస్కృతి ఎంతమాత్రం జీవన విధానం కాదు. ఈనాడు అది జీవితానికి ఒక సంపాదన సరుకు. సంస్కృతి అంటే మన జీవన విధానం. అంటే మన ఆచార వ్యవహారాలు, అలవాట్లు, సంప్రదాయాలు, విలువలు, నీతి నియమాలు, భాషా, సాహిత్యం, కళలు, మానవ సంబంధాలు తదితర అనేక అంశాలు ఇమిడివున్నాయి. వీటన్నింటిని కూడా వ్యాపారీకరణ చేయడమే సామ్రాజ్యవాద సంస్కృతి ప్రధాన లక్ష్యం.

ప్రపంచీకరణ ప్రభావం వలన మన సంస్కృతిలోని అనేక విభాగాలు వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నాయి. ముఖ్యంగా మన ఆహారం, మన అలవాట్లు, మన పండుగలు, మన పరిసరాలు, మానవ ప్రవర్తన అభివృద్ధి పేరిట అనూహ్య పరిణామాలకు గురికాబడుతున్నాయి. అందులో భాగంగానే మనదేశంలోని

ఆహారపదార్థాలు, అలవాట్లలో మార్పులు వస్తున్నాయి. కొంత కాలం క్రితం వరకు మనదేశంలోని పెద్ద పెద్ద నగరాలు, పట్టణాలు, గ్రామాలు పెద్దగా రెస్టారెంట్లను ఎరిగి వుండవు. ఒకప్పుడు రోడ్లపై యాత్రికులు గాని, ఇతర ప్రయాణీకులు గాని వంటలు చేసుకొని అక్కడే తినేవారు. కానీ ఇప్పుడు దారుల వెంట హోటళ్లు, రెస్టారెంట్లు వెలిశాయి. క్యాటరింగ్ పేరిట ఆహార సరఫరాలు జరుగుతున్నాయి. ఆహార పదార్థాలు ఒకప్పుడు స్థానిక రుచులతో సంప్రదాయంగా తయారయ్యేవి. వ్యాపారం చొరబడిన తరువాత మన ఆహార పదార్థాల రుచులు నియంత్రించబడ్డాయి. మెక్‌డోనాల్డ్స్, పిజా హాట్సు, డోమినోస్ పిజా, వాంపీస్ లాంటి సంస్థలు ప్రవేశించిన తరువాత మొత్తం ఆహారపు వ్యవస్థ మారిపోయింది. మహానగరాల్లో ఫాస్ట్ ఫుడ్‌ల ఉత్పత్తుల దిగుమతి మొదలైంది. స్థానికంగా ఇండ్లల్లో తయారుచేసుకునే వంటలకు బదులు పెద్ద పెద్ద కంపెనీల ఆహారపు ఉత్పత్తుల సరఫరా ప్రారంభమైంది. ఇండ్లల్లో తయారు చేసుకునే పచ్చళ్ళకు బదులు కంపెనీల పచ్చళ్లు ప్రవేశించాయి. ఈ విధంగా వ్యక్తులు తమకు నచ్చిన రుచులు, అలవాట్లకు బదులు మార్కెట్ నిర్ధారించిన రుచులు, అలవాట్లకు మారిపోతున్నారు.

గ్లోబల్ పెట్టుబడి ప్రవేశించిన తరువాత మన పండుగలు, వేడుకల సంస్కృతి స్థానాల్లో మదర్స్ డేలు, ఫాదర్స్ డేలు, వాలెంటైన్ డేలు తదితర పశ్చిమ దేశాల సంస్కృతులు చొరబడ్డాయి. ఇవి ఈనాడు మన పండుగలను మించిన వేడుకలుగా విషమిస్తు న్నాయి. సినిమా హాళ్ళు, రెస్టారెంట్‌లు, పబ్‌లు, సంగీత కంపెనీలు, గ్రీటింగ్ కార్డులు అన్నీ కూడా ఈ సంప్రదాయాన్ని విస్తృత పరుస్తూ టీనేజ్ జీవితాన్ని మార్కెట్ సంస్కృతిలోకి లాగడానికి కుట్ర చేస్తున్నాయి. పెట్టుబడి శక్తులు కేవలం మన సంస్కృతిలోకి మాత్రమే చొరబడలేదు, అవి మన ఆలోచనలు, అలవాట్లు, విలువలతో కూడిన పద్ధతుల్లోకి చొరబడి ఒక కొత్త మానవ ప్రవర్తనను సృష్టించి వినియోగ సంస్కృతిని రుద్దుతున్నాయి. సంగీతం, సాహిత్యం, నృత్యం, కళా, సినిమా, నాటక రంగాల్లో మునుపెన్నడు లేని వినిమయ మార్కెట్ సంస్కృతిని ఆవిష్కరించి తీసుకువచ్చాయి. ఈ రంగాల్లో భారీ పెట్టుబడులుపెట్టి జనాలను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. సంస్కృతి పెట్టుబడిగా మారిపోయింది.

ఇక భాషల విషయానికొస్తే ఇంగ్లీషు భాష ఒక్కటే ప్రపంచీకరణ భాషగా అభివృద్ధి చెందింది. ఈ భాషలో ప్రచురించిన సాహిత్యానికి మంచి గిరాకి, అమ్మకం మార్కెట్ కల్పించడం వల్ల ఇతర భాషలు వాటికవే కనుమరుగయ్యే పరిస్థితి కల్పించబడింది. వివిధ భాషల మధ్య అసమానతలను

పెంచి పోషించబడుతున్నాయి. వ్యాపార శక్తిని అనుసరించే భాషలకు, భాషా రచయితలకు ర్యాంకింగ్‌లు ఇవ్వబడుతున్నాయి. తద్వారా ఇతర భాషా రచయితలు కూడా ఇంగ్లీష్ సాహిత్యంలోకి మారేపరిస్థితిని కల్పించడం ద్వారా ప్రపంచీకరణ సంస్కృతి విధానం తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుంది. సాంస్కృతిక బహుళత్వాన్ని, వైవిధ్యాన్ని మూలాల నుండి పెకిలించాలని ప్రయత్నం చేస్తుంది. లాభదాయకంగా నిలబడగలిగే సాహిత్యమే మనగులుగుతుందనే పరిస్థితిని కల్పిస్తుంది. అలాంటి దాన్నే ఈనాడు సాహిత్యంగా నిలుపుతుంది. ఫిక్షన్‌కు పెద్దపీట వేస్తున్నది. కవిత్వం, నాటక ప్రక్రియలు చివరి అంచుకు చేరుకునేలా చేసింది. భాషా ప్రక్రియల్లో చాలా మార్పులు చేసుకుంటున్నాయి. ప్రచురణ (ప్రింటు) స్థానంలో దృశ్య శ్రవణం చోటు చేసుకుంటుంది. ఇప్పుడు ప్రచురణ, రాయడం అనేవి దృశ్య శ్రవణానికి సహాయకారులుగా మాత్రమే మారిపోయాయి. భాషా ప్రచురణ పదాలు మెల్లమెల్లగా ప్రభావాన్ని కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. వినడం అనే మౌఖిక పదాలు తెరమీదకు వచ్చాయి. రచయితలు తమ రచనల్లో సాహితీ సామాజిక విలువలతో గుర్తింపబడటానికి బదులు ఆ సాహితీ రచనతో ఎంతమేరకు వ్యాపారం చేసి సంపాదించ గలుగుతున్నారనే విలువతో మాత్రమే గుర్తించబడి పోటీ మార్కెట్‌లో ర్యాంకింగ్ చేయబడుతున్నారు. శాశ్వత విలువలకు బదులు తాత్కాలికంగా కొత్తగా పుట్టుకొచ్చేదే మంచిది అనే భావన మార్కెట్‌లో విలువైనదిగా తిష్ఠవేసింది.

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల రచయితలు పశ్చిమదేశాల్లో నివసిస్తూ వారి సొంతదేశాల వాస్తవాలను, ఆచారాలను ప్రపంచీకరణ విలువలకు జోడించి ఇంగ్లీషులో రచనలు చేస్తూ ప్రచురిస్తూ తిరిగి తమ స్వంత దేశాల్లోనే నయా సామ్రాజ్యవాద వ్యాపారపు కొత్త ముసుగులు ధరించి మార్కెట్‌లోకి వస్తున్నారు. దీని ద్వారా పాశ్చాత్య దేశాలు మాత్రమే రచయితలకు ఆశ్రయం కల్పించి వారికి ప్రపంచ గుర్తింపు తెచ్చిపెడతాయనే భావనను కల్పిస్తున్నారు. అనేక ప్రచురణ సంస్థలు ట్రాన్స్ నేషనల్ కంపెనీలుగా మారుతూ సంస్కృతి, సాహిత్యం ద్వారా సామ్రాజ్యవాద మార్కెట్ భావజాలాన్ని విస్తృత పరుస్తున్నాయి. భవిష్యత్ అడ్డంకులను తొలగించడానికి ఆయా దేశాల జాతీయతను బలహీన పరుస్తూ జాతీయ స్ఫూర్తిపై దాడికి పూనుకుంటున్నాయి. తద్వారా ఆయా దేశాల సాంస్కృతిక సార్వభౌమత్వాన్ని ఆయా సమాజాల నుండి పారద్రోలి తమ పెట్టుబడిదారి ప్రపంచీకరణ మార్కెట్ సంస్కృతిని చొప్పించడానికి పూనుకుంటున్నారు. ప్రజల్లో వ్యాపార వినిమయ కోరికలను పెంచుతున్నారు. ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదం ఈ సాంస్కృతిక ఆధిపత్యాన్ని

ప్రపంచ వ్యాప్తంగా విస్తృత పరుస్తుంది. ఇంటర్నెట్ సమాచార మార్పిడి, సమాచార సౌలభ్యం పేరున ప్రపంచ సంస్కృతి ప్రజల మెదళ్లలో విషాన్ని చొప్పిస్తుంది. దీని ద్వారా ఆయా దేశాల సమాజాల్లోని సంస్కృతికి సమాంతరంగా బూర్జువా సంస్కృతి ప్రసారం చేయబడుతుంది. ఈ విధానాల ఫలితంగా మన సంస్కృతిని బలహీన పరుస్తూ సామ్రాజ్యవాద సంస్కృతి కబళించి వేస్తుంది.

**2.4.12.మీడియా:** ప్రపంచీకరణ ప్రభావానికి అమితంగా గురైన రంగాలలో మీడియా ఒకటి. దాని ప్రభావం మరింతగా విస్తరించడానికి మీడియా సాధనమైంది. ప్రజాస్వామ్య సంస్థల నియంత్రణ నుంచి కార్పోరేట్ రంగాన్ని కాపాడేందుకు కార్పోరేట్ నియంత్రణలో మీడియాను విస్తరించడం జరుగుతుందని ఆస్ట్రేలియా మేధావి అలెక్స్ కేరీ విశ్లేషించారు. మీడియాలో భాగమైన సినిమాలు, పుస్తకాలు చాలా కాలంగా అంతర్జాతీయ మార్కెట్ కలిగి ఉండేవి. కాని గత పదేళ్ళలో జాతీయ మీడియాను అదుపు చేయగల గ్లోబల్ మీడియా రూపుదాల్చింది. వ్యాపారం ప్రపంచీకృతం కావడం, దాని వెంటనంటి అడ్వర్టయిజ్మెంట్ ప్రపంచీకరణ జరగడం, సాంకేతికాభివృద్ధితో సమాచార సంబంధాల మెరుగుదల ఈ క్రమాన్ని వేగిరపర్చాయి.

సాధారణ ప్రజానీకంలో విలువలు విశ్వాసాలు పెంచటానికి ప్రజా సమాచార వ్యవస్థ బలంగా వుండిన ఆసియా ఐరోపా దేశాలపై ఇది ఎక్కువ ప్రభావం చూపింది. ఫలితంగా ప్రజావరణం బాగా కుదించుకుపోయింది. ఉపగ్రహ ఛానెళ్ల విస్తరణ ద్వారా ఇది తారాస్థాయికి చేరింది. స్టార్ టీ.వీ అధినేత రూపర్ట్ మర్డోక్ వంటివారు నేరుగా దేశంలో ప్రవేశించారు. ప్రపంచీకరణను శక్తులకు అనుకూలమైన రాజకీయ సాంస్కృతిక ప్రసారాలు నేరుగా మన దేశ ప్రజలకు చేరుతున్నాయి. ఈ క్రమంలో గాంధీజీని, గోవును అగౌరపరిచే కార్యక్రమాలు వస్తే నిరసన వ్యక్తమైంది. అలాగే కొన్ని ఛానెళ్లు అశ్లీల కార్యక్రమాలను ప్రసారం చేయడం పట్ల కూడా ఆందోళన వ్యక్తమవుతున్నది. బ్రిటిష్ పద్ధతిలో ఇండియాలో పత్రికలు ప్రైవేటురంగంలోనూ, రేడియో టీవీలు ప్రభుత్వరంగంలోనూ ఉండేవి. ఈ కారణంగా అవి ప్రభుత్వ ప్రచార సాధనాలుగానూ, శృతిమించిన అధికార నియంత్రణలో నడుస్తుండేవి. ప్రపంచీకరణ ఈ వాతావరణాన్ని ఒక్కసారిగా మార్చేసింది.

**2.4.13.ఇంటర్నెట్:** ఈ పదేళ్లలోనూ బలంగా ప్రవేశించిన మరో అపూర్వ సాధనం ఇంటర్నెట్. దేశంలో 2005 నాటికి తొంబై లక్షల ఇంటర్నెట్ కనెక్షన్స్ వుండొచ్చని ఇటీవల బ్రాడ్ బ్యాండ్ విధాన పత్రంలో ప్రభుత్వం ప్రకటించింది. ఇది ప్రపంచం మొత్తంలో స్వల్ప భాగమే. అయితే వాస్తవంగా వీటిని

ఉపయోగించే వారిసంఖ్య అనేకరెట్లు ఎక్కువగా వుంటుంది. ఎందుకంటే పట్టణాలలో పెద్ద ఎత్తున వెలసిన సైబర్ కేఫ్ లు కంప్యూటర్లు లేని వారికి ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి తెస్తున్నాయి. ఆర్థికస్తోమత కారణంగా కంప్యూటర్లే తక్కువ మందికి వుండటం ఇందుకు కారణం. ఏమైనా ఇంటర్నెట్ భారతీయులలో కొన్ని తరగతులు వారి జీవితాలలోనైనా స్థానం సంపాదించింది. ఫ్యాక్స్, సెట్ ఫోన్, వైద్యం, విద్య, వివాహాది విషయాల వంటి వాటికి తోడు ఈ సేవల, ఇతర సదుపాయాలు కూడా కల్పిస్తోంది. అంతేగాక దినపత్రికలు కూడా తమ వెట్ ఎడిషన్లు ప్రారంభించి ఎక్కడైనా చూసుకునే అవకాశం కలిగిస్తున్నాయి. వాణిజ్యపరమైన ప్రయోజనం తక్కువైనా గుత్తాధిపత్యం నిలుపుకోవడం ముఖ్యమనే దృష్టితో దాదాపు అన్ని పత్రికలు ఇంటర్నెట్ రంగంలో పెద్ద ఎత్తున ప్రవేశించాయి. అదే సమయంలో అశ్లీలతకు కూడా ఇది కారణమవుతుంది. దాదాపు పదిహేనువేల అశ్లీల వెట్ సైట్లు నడుస్తున్నాయి. అలాగే టెర్రరిస్టు కార్యకలాపాలకు, సైబర్ మోసాలకు కూడా ఇది ఉపయోగబడుతుంది. అయితే ఇందుకు కారణం సామాజిక పరిస్థితులు తప్ప సాంకేతిక నైపుణ్యం కాదు.

ప్రపంచ సాంస్కృతిక విధానం మనదేశంలో ఇప్పటికే స్థిరీకరించబడిన భారత సమాజంపైన కుల, వర్గ ఎలైట్ సంస్కృతిని పెంచి వ్యత్యాసాలను అభివృద్ధి చేసింది. అస్తిత్వకుల మత ప్రాంతీయ త్వాలను పెంచి పోషిస్తూ ఒక నూతన, ఆర్థిక రాజకీయ వ్యవస్థను తీసుకువస్తుంది. తిరిగి అస్తిత్వాల మధ్య అంతర్గత వైరుధ్యాలను సృష్టిస్తూ సమస్యలపై అలజడిని ప్రేరేపిస్తుంది. అందులో అత్వ నాయకులను సృష్టించి వారిని తన పాలసీ కాపాలాదారునిగా చేసుకుంటూ వారికి తమ ప్రయోజనాలను కల్పిస్తుంది. ఫలితంగా అస్థిత్వంలో నడిచే ప్రజలు ఇంకా దోపిడికి గురవుతూ అట్టడుగుకు వెళుతుండగా, దాని నాయకులు అభివృద్ధి అందలాలపై ఊరేగుతున్నారు. ఐక్యత అనే ఆయుధాన్ని ముక్కలు చేసే కుట్రను ప్రపంచీకరణలో భాగంగా సాగుతున్నాయి. తద్వారా తదనుకూలమైన వాతావరణాన్ని సృష్టించు కుంటుంది. భారతదేశంలో అత్యంత గుర్తింపు పొందిన రచయితలు కూడా మార్కెటీకరణ తీర్థం పుచ్చుకుంటే తప్ప అంతర్జాతీయంగా గుర్తింపు పొందలేని పరిస్థితులను కల్పిస్తుంది. ఫలితంగా ఐక్యతకు విఘాతమైన అస్థిత్వ వాదాల్లో రచయితలు కొట్టుకొని పోతున్నారు.

అంతర్జాతీయ మార్కెట్ సంస్థలు భారతదేశంలోని గొప్ప రచయితల పుస్తకాలను అచ్చువేయడం ద్వారా వారిని ఆకర్షిస్తూ మన సాహిత్యాన్ని కూడా మార్కెట్ సరుకుగా చలామణి చేస్తున్నాయి. క్రూరమైన, దుర్మార్గమైన ఈ సామ్రాజ్యవాద సంస్కృతి, ఆధిపత్యం వల్ల మారుతున్న ఈ ప్రపంచీకరణ దుష్పరిణామాలను ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా వుంది. మేకముసుగు తగిలించుకున్న ఈ తోడేలు స్వభావ సంస్కృతిని విడిచిపెట్టి అందరు నాకేమిటని అనుకుంటే అది దీర్ఘకాలికంగా మన సంస్కృతి ఔన్నత్యాన్ని, జీవన విధానాన్ని, మన సార్వభౌమత్వాన్ని కబలిస్తుంది. ఇది కుల, మత, ప్రాంత, లింగ, భాషా వ్యత్యాసం లేకుండా అందరిపై అమలవుతున్న ప్రపంచీకరణ విధ్వంసకాండ. దీనిపై సమైక్యంగా కలాల కవాతు జరగాలి. గళాల గర్జనలు పెల్లుబీకాలి. ఆ దిశగా అందరూ కదలాల్సిన అవసరం ఎంతైనా వుంది.[57]

**2.5.రాజకీయరంగం:**సాంస్కృతికరంగాన్ని ఆక్రమించాక విధాననిర్ణయాలు చేసే రాజకీయరంగాన్ని కూడా ప్రపంచీకరణ తనకు అనుకూలంగా మార్చుకుంది. తన మాటవినని పాలకులను అంతం చేసింది. విన్నవారికి తాయిలాలిచ్చింది.

"ప్రపంచ సంతకి నెత్తుటి తివాచీ
అల్లుతున్న సామ్రాజ్య వాదం"

ఏదైనా దేశం తనకు చాతనైనంత వరకూ ఇతర దేశాల మీద ఆధారపడకుండా ఉండాలనే చూస్తుంది. కారణం...అమూల్యమైన దేశప్రజల సొమ్ము బయటకు పోకూడదనే..... అందువల్లనే, తప్పనిసరైన పరిస్థితులలో, తమ దేశంలో తయారు కానివి, దొరకనివి, కుదరనివీ మాత్రమే బయట దేశాల నుండి తెప్పించుకొంటుంది. అవి వస్తువులు కానీ, సేవలు కానీ; దీని వలన, దేశ ఎకానమీ బలంగా ఉంటుంది.... దేశానికి ఇలాంటి బలమైన ఆర్థికవ్యవస్థను, మంచి ఆర్థికవిధానంతో పరిపాలన చెయ్యవలసిన బాధ్యత అంతా పరిపాలకులదే...

"మాఫియా మంత్రసాని పురుడుపోసిన సైన్యం
కేసుల ఎత్తిపేత టానిక్కు తాగుతుంది
కల్తీ మద్యాల కవాతు
ఏలిన వారింటి బిడ్డగా ఏనుగెక్కుతుంది
దొంగనోట్ల టంకశాల

దొరతనాల ఇల్లరికపుటల్లుడుగా

రాజభోగాలతో మెరుగెక్కుతుంది".

దేశంలో ఎక్కడైన ప్రపంచీకరణ ప్రవేశించడానికి ఆంక్షలు లేకుండా రాజకీయ నాయకత్వాన్ని ఒప్పించింది. తనకు వ్యతిరేఖంగా తిరుగుబాటు చేసే ప్రజలను అణచివేయమని ప్రభుత్వాలకు డైరెక్షన్ ఇచ్చింది. అందుకే మన ప్రభుత్వాలు ప్రపంచీకరణకు అనుకూలంగా ప్రవర్తించటం ప్రారంభించాయి. అమెరికాకు అన్నిరకాలుగా సహకరిస్తున్నాయి. ఈ విషయాలకు వ్యతిరేకంగా వచ్చిన కవిత్వాన్ని రాజకీయరంగంలో వివరించవచ్చు. ప్రపంచీకరణ భూతం మార్కెట్ కోసం అది ప్రవేశించిన దేశాలలో పాలనను కూడా తనకు అనుకూలంగా మార్చుకుంటుంది. పాలనపై ఆధిపత్యం చేస్తేకాని తన ఆటలు చెల్లవు. ఈ ప్రపంచీకరణ అమెరికా రూపంలోనో, ఇంగ్లాండ్ రూపంలో ఉండవచ్చు. "నిజానికి ఆఫ్ఘనిస్థాన్ ఆర్థిక వ్యవస్థ తమ దోపిడి పీడనలకు ఉపయోగపడేదేమి కాకపోయినా ఆ దేశాన్ని సైనిక స్థావరంగా, ప్రభావ ప్రాంతంగా పెట్టుకోగలిగితే అటు అరబ్ దేశాలను, పైన రష్యాను ఇటు చైనాను, కింద భారత ఉపఖండాన్ని తన రాజకీయ చదరంగపు ఎత్తుగడల్లో భాగం చేసుకోవచ్చనేది అమెరికా కుటిలనీతి" ఇక సామ్రాజ్యవాద దేశాలకు లొంగిపోయిన పాలకులు MNCల ప్రయోజనం కోసమే చట్టాలు చేస్తారు.

"భారత ప్రజలకు కాదు

భారత పాలనే

బహుళజాతి సంస్థల సంక్షేమ రాజ్యమైంది"[58]

అని వడ్డెబోయి శ్రీనివాస్ చెప్పారు. ఈస్టిండియా కంపెనీ మొదట్లో ప్రజలను దోచుకోవడానికే వచ్చింది. కాని తరువాత ఈ దేశ పాలనపై అధికారం సంపాదించింది. ఇప్పుడు బహుళజాతి సంస్థల సంక్షేమమే ప్రజల సంక్షేమం కంటే పాలకులకు ముఖ్యమైంది. మల్టీనేషనల్ కంపెనీల సేవలో తరలిస్తున్న పాలకులను ఈ కవి ఎద్దేవ చేశారు.

రాజకీయరంగంలో క్షీణత చోటు చేసుకోవడమన్నది ప్రపంచీకరణ తక్షణ పర్యవసానం. భారతదేశంలో అవినీతికి సరికొత్త మార్గాలను గ్లోబలైజేషన్ సృష్టించింది. వాటి గురించి రెండు దశాబ్దాల క్రితం ఎవరికీ తెలియదు. వరద గేట్లు తెరచిన చందంగా ఉంది ప్రస్తుత పరిస్థితి. కమీషన్లు, ముడుపులకు అవకాశమున్న అన్ని విభాగాల ద్వారాలు తెరవటమే ప్రపంచీకరణ ముఖ్య ఉద్దేశ్యం.

ఈ క్రమంలో అవినీతి సంస్కృతి విప్లవాత్మక మార్పులకు లోనయ్యింది. కొత్త మార్గాల్లో వచ్చిపడుతున్న డబ్బు, పరిణామం రీత్యా పెరగటమే కాకుండా ఈ దేశ రాజకీయ జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. దీని వల్ల నిజమైన ప్రజాస్వామ్యానికి హాని కలుగుతుంది.

రాజకీయ ఆశావాదం పెరిగి రాజకీయ అస్థిరత్వం చోటుచేసుకుంటుంది. రాజకీయ అస్థిరత్వం దేశ రాజకీయాలను నిరంకుశవాదం వైపు తీసుకుపోతుంది. అది వారి రాజకీయం! మన రాజకీయ జీవనంలో సంభవించే పరిణామాలతో నిమిత్తం లేకుండా సంస్కరణల ప్రక్రియ దాని మానాన అది జరిగిపోవాలన్నది వారి అభిలాష. సంస్కరణల ప్రక్రియలో ఎవరు తలదూర్చకూడదన్నది వారి ముఖ్య ఉద్దేశ్యం. ఆర్థిక నిర్ణయాల నుంచి రాజకీయ జీవనాన్ని వేరుచేసే ప్రయత్నమన్నది గ్లోబలైజేషన్ ప్రక్రియ యొక్క ముఖ్యమైన పర్యవసానం.

ప్రపంచీకరణ అనేది రాజకీయరంగంపై విపరీత ప్రభావాన్ని చూపినట్లు తెలుస్తుంది. అదెలా అంటే పొలికేకలో కవి తన భావాన్ని ఈవిధంగా వ్యక్తీకరిస్తున్నాడు.

"డబ్బు గట్టి పాలోసుకుంటున్న వరిచేలో
దారినపోయే గొర్లమంద చొరబడినప్పుడు
మేం చేతికర్రల్ని ఈటెలుగా విసిరే యోధులవుతాం"[59] అంటూ నేడు దేశంలో రాజకీయాలు మారిపోయాయి. రాజకీయ నాయకులు డబ్బుకి అమ్ముడైపోయినారని ఆవేదనకి గుర్రైనాడు.

"తెల్లదోమ వలయాలు వలయాలుగా వాలి
కాండపు పసర్ని గటగట తాగేస్తున్నప్పుడు
మేం సద్దులేకుండా పేలే విష వాయుగులికలవుతాం"[60]

అందెశ్రీ మనిషి ఖండిక లో రాజకీయ నాయకుల ప్రవర్తనను గూర్చి వర్ణించిన తీరు గమనిస్తే ...

"రాజకీయాలలో రాటుదేలీ తుదకు
మానవత విలువలును మంటగల్పుకుంటూ నరుడు"[61]అంటూ అందెశ్రీ ప్రపంచీకరణ నేపథ్యంలో నేటి రాజకీయాల స్థితిని రాజకీయ నాయకుల చేష్టలని వర్ణించాడు.

ఒకప్పుడు ఉన్న రాజకీయాలు వేరు నేడు ఉన్న రాజకీయ వ్యవస్థ వేరు అప్పటి రాజకీయ నాయకులు స్వరాజ్యం కోసం పోరాటం సాగిస్తే నేటి నాయకులు డబ్బు కోసం ఎంతటి పనికైనా సిద్ధపడుతున్నారు.

పొగచూరిన ఆకాశంలో అద్దేపల్లి రామమోహనరావు గారు రాజకీయాలను గూర్చి చెబుతూ ....

"అమ్మ గుండెలోని సముద్రాలన్నీ
కెరటాల్ని రోడ్డు మీదికి రాల్చేసుకుంటై
ప్రజల కళ్ళలోని పాపాల్ని
లాగేసుకొని పారిపోయిన అతన్ని
సింహాసనాలు వెనక్కి పిలిచి
సత్కారాలు చేస్తాయి"[62]. అంటూ ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

ఈనాటి ప్రతీ సమస్య వెనకాల అధికార రాజకీయం తప్పనిసరిగా ఉంటుంది. ఆ రాజకీయ అవగాహన ఉన్న వారు కాబట్టే జనార్ధన 'అయ్యో' అని కన్నీరు కార్చే కవి కాకుండా, 'ఛీ' అని సమకాలీన ఆధిపత్య రాజకీయాన్ని నిర్భయంగా తుర్పారబట్టే కవి అయ్యారు. రాజకీయ భావాలు కసితో, వ్యంగ్యంతో కదం త్రొక్కారు కవి.

"పేదల నెత్తురు పిండిన సంపదను
మాయం చేసి స్కాము స్కాముల ఉసిల్లపుట్టగా
పేదరికం కాటుక పూసుకున్న గుడ్డితల్లిగా
స్వరాజ్యం స్వాహారాజ్యంగా
అజ్ఞానం దాచిన లాకరు పెట్టెగా మారింది
దుష్ట చతుష్టయ దర్శకత్వంలో
హింసాహీరోలు సాగిస్తున్న జైత్రయాత్రలో
మూడు ప్రసంగాలు, అరవైపదవులతో
మాడు పగలగొడుతుంటే

సామాన్యుని బతుకుకు గ్యారెంటీ ఎక్కడ".? అని జనార్దన తన కవితల నిండా ఇలాంటి వేగాన్నే ప్రవహింపచేసాడు.

నేటి రాజకీయ నాయకులకు వ్యవసాయ కూలీల సమస్యలు, దళిత సమస్యలు, విద్యార్థుల సమస్యలు, వాతావరణ సమస్యలు, పేదవారి సమస్యలు ఒకటేమిటి ఈనాటి అన్నిసమస్యలు జనార్ధన కవిత్వానికి గొప్ప విస్తృతిని తెచ్చిపెట్టాయి అంటూ అద్దేపల్లి, వల్లభాపురం జనార్ధన రాసిన పహరా కాస్తున్న రాత్రి పీఠికలో పేర్కొన్నారు.

"నేను ప్రజాస్వామ్యాన్ని
విశ్వ ప్రజాస్వామ్యాన్ని
విశ్వైక ప్రజాస్వామ్యాన్ని
...........................
ఆర్థిక సామ్రాజ్యవాద కబంద హస్తాల బిగింపు
నా రాజ్యంగ ప్రవేశిక సూత్రాలు
ఐరాస నా విజయాల బ్లూప్రింటు
భద్రతామండలి నా అంతరంగిక సర్వెంటు - నా పేరే ప్రజాస్వామ్యం"[63]

అంటూ అంతర్జాతీయ రాజకీయాల ధోరణిని తెలియజేస్తున్నాడు.

సమకాలీన కుళ్ళు రాజకీయాల మీద నాగేంద్రరావుకి చాలా కసీ కోపమూ ఉన్నై. వాటిని హాస్యము, వ్యంగ్యమూ వదలకుండానే కుండబద్దలు కొట్టినట్లు చెప్పే ఒక శైలి ఈ కవితలో కనిపిస్తుంది.

"ఎండాకాలంలో
మండే సూర్యుడి కింద
మంచు కొండ కొసపై
వేసిన కుర్చీ రాజకీయం"

ఇక్కడ 'మంచు కొండ' అంటే హిమవత్పర్వతం కాదు. పూర్తిగా మంచే కొండగా మారింది. ఆ కొండలో అంతా మంచు మాత్రమే. ఎండాకాలంలో, మండే సూర్యుడి కింద, మంచుకొండ శిఖరం మీద కుర్చీవేస్తే క్రమంగా మంచు పూర్తిగా కరిగిపోతుంది. కుర్చీలో రాజకీయమే మిగులుతుంది. కాబట్టి ఈ ఔన్నత్యమంతా భ్రమ, మోసం. చివరికి మిగిలేది శూన్యం. నాయకులు చెప్పే మాటలన్నీ కరిగి పోయే మంచులాంటివే.

చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలు  బయటి దేశలు అయితే, ప్రపంచంలోని ప్రజల కొనుగోలు మీద ఆధారపడి ఉన్నందున వారు "గ్లోబలైజేషన్" అన్న పదాన్ని పైకి తెచ్చారు.......గ్లోబలైజేషన్ పేరుతో బయట దేశాల అన్ని వస్తువులూ దేశంలోనికి వరదలా రావటం మొదలైంది....దేశంలో దొరికే వస్తువులు కూడా బయట దేశాల నుండి రావటం ...  పైగా, దేశంలోని వస్తువులకి పోటిని ఇవ్వటానికి, బయట దేశం వస్తువులు అతితక్కువ ధరలకే దొరికేట్లు చేస్తున్నారు. దీని  వలన దేశంలో దొరికే వస్తువులకి డిమాండు తగ్గింది. దీనితో దేశీయ వస్తువులు తయారీ దారుల పనికి తీవ్రమైన విఘాతం కలుగుతోంది.  వీటికి తోడు చిల్లర వర్తకాలకి సంబంధించి "విదేశీయులు డైరెక్టుగా పెట్టుబడులు పెట్టచ్చు" అనే చట్టం వలన పనీ పాటా చేసుకొనే ప్రజల పరిస్థితి

"మూలిగే నక్కపై తాటి పండు పడినట్లవుతోంది"

ప్రపంచీకరణ అనేది భారతదేశంలో అన్నిరంగాలపైన విపరీతమైన ముద్ర వేసింది. దాని యొక్క దాడికి సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలు తారుమారైనాయి. గత 20 సంవత్సరాలుగా పరిశీలిస్తే తెలుగు సాహిత్యంలో కవులు వివిధరంగాలపై ప్రపంచీకరణ ప్రభావిత రంగాలని కవితా వస్తువుగా స్వీకరించి ఆయారంగాలపై పరిశోధన చేసి ఆయా రంగాలలో ఎంచుకున్నటువంటి ప్రజల స్థితిగతులను, అలాగే సాంస్కృతిక, రాజకీయ, విద్య మొదలగురంగాల్ని ఆధారంగా చేసుకుని రాసారు.

2000 - 2010 మధ్య దశాబ్దంలో అనగా ఈ పదేళ్లలో జాతీయంగ, అంతర్జాతీయంగా జరిగిన ఘటనలకీ, వచ్చిన మార్పులకీ కవులు నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. కవి అంతర్నిహితం చేసుకుని కవిత్వంగా పలకటానికి ప్రయత్నించాడు. సమాజంలో కొనసాగుతున్న అసమానతలు, పీడనలను చూస్తున్న ఏ హృదయమైన స్పందిస్తుంది. అవిలేని నూతన సమసమాజం రావాలని కోరుకుంటుంది.

ఈ గ్లోబలైజేషన్ అన్న పదాన్ని ఒకప్పుడు వలసలని నిర్వహించిన వారి నిర్వాకమే....వారు ఎంత మంచి వాళ్ళంటే.....  వారు మన దేశానికి  పాలకులుగా ఉన్నప్పుడు..."ఏ సంస్థానంలో అయినా వారసులు లేక పోతే అది తమదే"  అన్న చట్టం చేసిన ఘనులు......అలా అవసరం కొద్దీ నీతి నియమాలను తప్పే జాతి వారికి,  మళ్ళీ ప్రపంచ దేశాల పైన వ్యాపార ఆధిపత్యం  చెయ్యవలసిన అవసరం పడింది.  కారణం...వలసలుగా ఉన్న దేశాలు అభివృద్ధి చెందటం మొదలవటం;  దానితో

వీరి దేశంలో వారికి పని తగ్గింది... అందుకని, ఇది వరలో తాము చేసిన వారసత్వపు చట్టం లాంటిదే గ్లోబలైజేషన్ అనేదాన్ని పైకి తెచ్చారు.

ఇప్పుడు "చట్టాలు చేసేస్థితిలో" లేవు కనుక...."చట్టాలని చేయించే"పనిలోపడ్డారు..... అవును మరి, వారి దేశాల కోసం వారు చేసుకొంటున్నారు. అయితే అసలు విచారకరమైన విషయం ఏమంటే, ఒకప్పుడు మనదేశానికి చెందిన రాజులూ, సుల్తానులూ వలసదార్లకి సహకరించినట్లు, ఇప్పుడు రకరకాలైన రాజకీయ పార్టీలూ, రాజకీయ నాయకులూ సహకరించటమే.... ఈ వలసదార్ల దేశాలు రాజకీయ నాయకులను ఎలా లొంగదీసుకొన్నారో మనం వేరే చెప్పుకోవక్కర్లేదు...ఎందుకంటే, చరిత్రలో రాజులూ, సుల్తానులూ తమ ఆధిపత్యాల కోసం కాని, విలాసాల కోసం కానీ, దురాక్రమణల కోసమైతే కానీ ఈ వలసదార్లతో ఎలా సహకరించారో, అలాగే, అలాంటి బలహీనతలున్న, ప్రస్తుత రాజకీయ పార్టీలూ, రాజకీయ నాయకులూ మళ్ళీ వారితోనే జత కట్టి తమ శత్రువులను{???} సాధించటానికి పూనుకొన్నారు... దీనితో, వలస దారుల పని "మళ్ళీ" చాలా తెలికైంది. మన దేశంలోని పాలక ప్రతిపక్షాలు ఒకరికొకరు శత్రువులులాగా ప్రవర్తిస్తున్నారే కానీ, ఇద్దరి పనీ ప్రజలకి సేవలందించటం అన్న సంగతి మర్చేపోయ్యారు. పాలక ప్రతిపక్షాల పరిస్థితి ఎలా ఉన్నదంటే; ప్రతిపక్షం వద్దంది కాబట్టి, ఇది చేసి తీరాలి అన్న పట్టుదలతో ఒకప్పుడు తాము ప్రతిపక్ష హోదాలో FDI లను వద్దన్నామన్న సంగతి కానీ, ఇందులో ప్రజాప్రయొజనాలున్నా, లేకపోయినా దీర్ఘ కాలంలో మన ప్రజలకి కీడు చేస్తుందన్న స్పృహ కానీ పాలక పక్షానికి లేదు.... ఒకప్పుడు పాలక పక్ష హోదాలో ఈ పాడు పని తామే మొదలు పెట్టామన్న సంగతి ప్రక్కన పెట్టిన ప్రతిపక్షం......ఈ సందర్భాన్ని తమ రాజకీయ ప్రయోజనాలకి వాడుకొంటున్నదే కానీ, ప్రజలకోసం కాదు...

స్వతంత్రం వచ్చి రెండు మూడు దశాబ్దాల వరకూ బాగానే ఉన్న ప్రజలు, తరవాతి కాలంలో అనేక ప్రలోభాలకి గురవుతూ వస్తున్నారు....దానితో ప్రజలు, స్వయం సిద్ధంగా బ్రతకాలిసిన వారు, ఉద్యోగాలకోసం ఎగబడటం, కొట్టుకోవటం చేస్తున్నారు....ఈ ఉద్యోగాల పేరుతో కులాలుగా, మతాలుగా విడిపోయి ఒకరికొకరు శత్రువులుగా భావించుకొంటున్నారు, ఎవరి దారి వారిదే అన్న చందాన తయారైనారు. ప్రజావసరాలకి సంబంధించిన వ్యాపారస్తులు చూస్తే, అధిక లాభాల కోసం తమ వ్యాపారాలని నీతినియమాలు లేకుండా చేస్తున్నారు....దీంతో మంచి క్వాలిటీ వస్తువు అన్న

విషయమే మరచి చాలా రోజులైంది....ఎవరన్న బాధ పడతారని కానీ, ఇబ్బంది పడతారని కానీ, ఏమైన అంటారని కానీ లేకుండా.....సిగ్గు సిరం లేని వ్యాపారాలు చేస్తున్నరు.....కొనుగోలు చేసేటప్పుడు గుంపుగా ఏర్పడి వస్తువు తయారీదారులని, ముఖ్యంగా వ్యవసాయ దారులనూ మోసం చేస్తూ తక్కువ ధరలకి కొని, అదే పద్ధతిలో ప్రజలకి ఎక్కువ ధరలకి అమ్ముతూ నీతిలేని వ్యాపారాలు చేస్తున్నారు......వీరికి ప్రస్తుతం ఉన్న అవినీతి పరిపాలనా వ్యవస్థ కూడా సహకరిస్తుంటం జరుగుతోంది.

ఈ వ్యవస్థలో అంతా అవినీతి పేరుకుపోయిందని, బయట దేశం వాళ్ళని పిలిచే వారు, రేపు పరిపాలనలో కూడా విదేశీయుల సహకారం తీసుకొంటే అప్పటి పరిస్థితి ఏమిటీ...? అయితే మన పరిపాలకులు "ఇది దేశ మరియు ప్రభుత్వ సార్వభౌమత్వానికి సంబంధించిన విషయం" అనీ, తమదాకా రానియ్యరనే అనిపిస్తోంది ఇప్పటికీ........!!! అలాగే ప్రజాసామ్య దేశంలో ప్రజలకి సంబంధించిన వాటిల్లో విదేశీ జోక్యం ఉంటే "ప్రజా సార్వభౌమత్వం" దెబ్బతిన్నట్లు కాదా........!!! కాబట్టి, మన నాయకులకి చిత్త శుద్ధి ఉంటే... ఎలుకలకోసం ఇల్లు తగలబెట్టకుండా.... వారు వస్తే....వీరు వస్తే... అనే బలహీనం మాటలు మాట్లాడకుండా, దేశంలో ఉన్న పరిపాలనా వ్యవస్థను చక్కగా ఉపయోగించుకొని, దేశంలోని ఎలుకల కోసం మరిన్ని కఠినమైన చట్టాలని తెచ్చి, ఆ చట్టాలని స్వార్థం కోసం నిర్వీర్యం చెయ్యకుండా, సమర్థ పరిపాలనతో దేశ ప్రజలందరికీ న్యాయం చెయ్యవచ్చును....... అంతే కానీ, దేశీయ ఎలుకల కోసం, విదేశీ ఏనుగులని తెచ్చి ప్రజల నెత్తిమీద పెట్ట కూడదు. అలా చేసినట్లయితే FDI అంటే FOREIGN DIRECT INVESTMENT అని కాకుండా,"FOOLS DIRECT INDIANS" అని అర్థం వచ్చేటట్లు, మన ఘనత వహించిన రాజకీయ నాయకులే చేసిన వారవుతారు.......!!!

**ఇతర ప్రభావాలు:** ప్రపంచీకరణ ఇతర రూపాలలో కూడా సంస్కృతిపై ప్రభావం చూపుతున్నది. సరకుల రవాణాపైన, రాకపోకలపైన కూడా ఆంక్షల సడలింపు ఇందుకు ఒక ముఖ్యకారణం. ముఖ్యంగా మనదేశం టూరిజం పెంపుదలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. అలాగే ఇక్కడకు పెట్టుబడులను ఆహ్వానించడం, వ్యాపారపరమైన ఒప్పందాల వల్ల కూడా రాకపోకలు పెరిగాయి. 1994లో ప్రభుత్వం హాలీవుడ్ చిత్రాలను డబ్బింగ్ చేసేందుకు, నేరుగా దిగుమతి చేసుకునేందుకు అనుమతిచ్చింది. రామోజీ ఫిలింసిటీ వంటిచోట్ల విదేశీ చిత్ర నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి.

అలాగే ఆఫ్రో ఏషియన్ గేమ్స్ వంటివి జరిగాయి. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, రూపర్ట్ మర్డోక్, జాకీచాన్ వంటి వారు వచ్చి వెళ్లారు. మన దేశం నుంచి పెద్ద సంఖ్యలో యువతీయువకుల్లో విదేశాలకు ముఖ్యంగా అమెరికాకు వెళ్ళడం జరుగుతుంది. ఈ మధ్య అమెరికా ఎన్నికలలో భారతీయుడొకరు సెనెట్ కు ఎన్నిక కావడం ఇందుకు ఒక ఉదాహరణ మొత్తం రెండున్నర కోట్లమంది భారతీయులు 130 దేశాలలో ఉన్నట్లు ఒక అంచనా.

గతంలో విదేశాలకు వెళ్ళడం మేధావలస(బ్రెయిన్ డ్రెయిన్)గా భావించేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వాలే విదేశాలకు వెళ్లే అవకాశాలు సరళతరం చెయ్యడానికి ఏజన్సీలు ఏర్పాటు చేశాయి. ఔట్సోర్సింగ్ పద్ధతిలో అమెరికా కోసం ఇక్కడి నుంచే పని చేస్తుండడం కూడా పెరిగింది. ఇవన్నీ సాంస్కృతకంగానూ చాలా ప్రభావితం చూపుతున్నాయి.[64]

ప్రపంచీకరణ ఆయారంగాలను ఎత్తి పరుగులెత్తించింది. దాని దాటికి సామాన్య కుటుంబాలు, చిన్న చిన్న వృత్తులు వారు వలస బాట పట్టా వలసిన పరిస్థితి ఏర్పడింది. చేతివృత్తులు వారి చేతులు కాలిపోయినాయి. రైతు బక్కచిక్కి పోయాడు. ప్రపంచీకరణ విధ్వంసాన్ని ఎదిరించడానికి కవులు కాలాన్ని జులిపించారు.

# పాద సూచికలు


1.ఎ.బి.కె. ప్రసాద్ - ఆంధ్రప్రభ; 06.05.2010,పుట.5

2.ఆదివారం - ఆంధ్రజ్యోతి;01.05.05, పుట.31

3.పుట్ల హేమలత - ఆదివారం వార్త;31.06.04,పుట.23

4.సుదేరా - పొలికేక; పుట.18

5.కందాపు రామినాయుడు - రేపు నీ గోరంత పంచి లేకుండా; పుట.13

6.ఆడారి వెంకటరమణ - సూర్య పత్రిక 25.05.2011

7.డా.వి.వీరాచారి - తెలుగు సాహిత్యంలో వివిధ శాస్త్రంశాల ప్రతిఫలనాలు;పుట.159

8.పాపినేని శివశంకర్ - నిశితాసి-ఇప్పుడైనా మేలుకో; పుట.12,27

9.ఆధునిక కవిత - 2004; పుట.30

10.డా.తిరునగిరి - కాలాలు-గాలాలు; పుట.42,48

11.డా.కలవకుంట రామమూర్తి - ఆంధ్రజ్యోతి; పుట.03

12.డా.టి.ఏం.ఆర్.రమణారెడ్డి - గ్లోబల్ హైకూ

13.టి.కృష్ణముర్తి యాదవ్ - జాగ్రత్త బక్క రైతులు; పుట.18

14.ఐ.శ్రీనివాసరావు - మేలుకోరైతన్న; పుట.24

15.దార్ల రామచంద్ర - స్వాహతంత్రం; పుట.31

16.విద్యాసాగర్ - దిష్టిబొమ్మ; పుట.27.

17.నాళేశ్వరం శంకరం- చేలోకి పురుగులొస్తున్నాయి; పుట.41

18.ఎం.విజయబాస్కర్ - నేల పొత్తిళ్ళలో;పుట.25

19.సుదేరా - పొలికేక;పుట.24

20.శ్రీ ఆవంత్స సోమసుందర్ - తారాఫలితం; పుట.17

21.ఆరాట కెరటాలు: పుట. 18

22.జూకంటి జగన్నాథం - ఆంధ్రభూమి; 17.10.05

23.కవితా దశాబ్ది - 1991-2000; పుట.144

24.దేనువుకొండ శ్రీరామమూర్తి - ఆశల సముద్రం కవితాసంపుటి;పుట.13

25.రాదేయ - తడినిప్పు కవిత; పుట.05

26.చుక్కా రామయ్య - ప్రపంచీకరణ విద్య;పుట.18

27.అద్దేపల్లి రామమోహనరావు - ముందుమాటలు;పుట.27

28.అద్దేపల్లి ప్రభు - పారిపోలేం;పుట.41

29.సుదేరా - పొలికేక; పుట. 26.

30.షాజహానా - నఖాబ్; పుట.53

31.కొండేపూడి నిర్మల - మల్టీనేషనల్ ముద్దు; పుట.67

32.పి.సంజీవమ్మ; 2001,పుట.107

33.గుడిపాటి - గ్లోబలైజేషన్ వ్యాసాలు; 2004,పుట.44

34.అమ్మ పుట; 142

35.అన్వర్ - తలవంచని అరణ్యం; పుట.96

37.శంకరరావు శెంకేసి - ఆదివారం వార్త; 27.02.05

38.సహచరి - వివిధ ఆంధ్రజ్యోతి; 16.05.06

39.సహచరి - వివిధ ఆంధ్రజ్యోతి; 16.05.06

40.అందెశ్రీ - వివిధ ఆంధ్రజ్యోతి; 05-06-2006

41.ఆదివారం వార్తా

42.ఎస్వీ,సత్యనారాయణ - జీవితం ఒక ఉద్యమం; పుట.102

43.నూటెంకి రవీంద్ర - జాడ; పుట. 2

44.కుమారస్వామి - ప్రపంచీకరణపై పోటెత్తిన సంద్రం; పుట.13

45.కందుకూరి శ్రీరాములు - ప్రపంచీకరణ ప్రతిధ్వని; పుట.22

46.వఝుల శివకుమార్ - దాఖల; పుట.80

47.సుదేరా - పొలికేక; పుట.38

48.సి.వి.కృష్ణారావు - కిల్లారి కవిత పుట.31

49.భగ్వాన్ - ఇది ఇల్లేనా కవిత.

50.ఎ.పి.ఎస్.భగ్వాన్ - బల్లకట్టు కవితా సంస్కృతి; 2002 పుట.27

51.అన్వర్ - తలవంచని అరణ్యం;పుట.47

52.అట్లూరి మురళీ - ప్రపంచీకరణ పదేళ్ల అనుభవాలు;1991-2000

53.డి.శ్రీనివాసాచార్య - ఊరు ఊర్లోలేదు;ఆంధ్రప్రభ దినపత్రిక,6.9.1993

54.కవిత దశాబ్ది; పుట.45

55.బోజంకి - ప్రేమంటే త్యాగమే కవిత

56.బోజంకి వెంకటరవి - తడినిప్పు; 2010,పుట.8,9

57.పొత్తూరి సుబ్బారావు - కల్లకపట మెరుగని కళలు; పుట.19

58.వివిధ ఆంధ్రజ్యోతి; 14.08.2005

59.వడ్డెబోయిన శ్రీనివాస్; పుట.36

60.సుదేరా - పొలికేక

61.అద్దేపల్లి రామమోహన రావు - పొగచూరిన ఆకాశం

62.అద్దేపల్లి, వలభాపురం జనార్ధన్ రాసిన - పహారా కాస్తున్న రాత్రి పీఠిక

63.ఎటురి నాగేంద్రరావు - డమరుక్స్; పుట.23

64.తెలకపల్లి రవి - తెలుగు పసిడి; పుట.290

# 3.ప్రపంచీకరణ సాహిత్యం

సాహిత్యం మంచిని నేర్పుతుంది. వికాసాన్ని కలిగిస్తుంది. చైతన్యాన్నిస్తుంది. చెడును అడ్డుకుంటుంది. అన్యాయాల్ని ఎదుర్కొంటుంది. సమాజాన్ని మారుస్తుంది. భావజాల విప్లవాలను సృష్టిస్తుంది. విప్లవోద్యమాలకు సహకరిస్తుంది. సమసమాజ శాంతియుత సర్వసమాన సహజీవనం కోసం పోరాడుతుంది. అటువంటి సాహిత్యంలో నుంచి ప్రపంచీకరణ సాహిత్యం పుట్టింది. అది కవిత్వంగా, నవలగా, కథగా అనేక రూపాలలో వచ్చింది.

1995 ప్రాంతాలలో ఈ రాష్ట్ర పాలకులు ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టటం, సంక్షేమరంగాన్ని ఉపేక్షించడం, ప్రైవేటురంగాన్ని పెంపొందించడం, తాము పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు వ్యాపార పంటలవైపు మొగ్గుచూపడం, నీటివసతి ఏర్పాటు చేసుకునే ప్రయత్నంలో అప్పులపాలైన రైతులు ఆత్మహత్యలు - ఇలాంటివి ఎన్నెన్నో ప్రపంచీకరణ సాహిత్యం ఆవిర్భవించడానికి దోహదపడ్డాయి.

కమ్యూనికేషన్ సౌకర్యం అనూహ్యంగా విస్తరించడం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృద్ధికావడం, వరల్డ్ వైడ్ వెబ్ సైట్ సృష్టి [1989] ఆ తర్వాత కొద్ది సంవత్సరాలలోనే ఇంటర్నెట్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి రావటం, మధ్యతరగతి వారు డాలర్ స్వప్నాల్లో తేలియాడడం, ఇంజనీరింగ్ లేదా వైద్యవిద్యలు మాత్రమే ఉన్నత విద్యకు పర్యాయపదాలుగా మారడం, విద్య, వైద్యం అంగడి సరుకులుగా మార్చబడడం, సామాజికశాస్త్రాలు కొరగానివి కావడం, అదనపు సౌకర్యాలు, ఆనందాలు అవసరాలుగా మారినస్థితిలో అధిక ధన సంపాదన అనివార్యం కావడం - ఇలాంటివన్నీ మధ్యతరగతివారి జీవన దృక్పథాలను, జీవిత విధానాలను నిర్దేశించాయి.

జాతీయ, ప్రాంతీయ ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయరంగంలో, వ్యవసాయ కార్మికరంగంలో అసంఘటిత కార్మిక వ్యవస్థలో, చేతివృత్తుల రంగంలో పొడసూపిన దుష్పరిణామాలు అన్నిరంగాలలోను ప్రపంచీకరణ సాహిత్య ప్రతిఘటనకు దారితీశాయి. ఈ దశాబ్ది ఆరంభంలో

కేంద్రప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు కొన్ని వ్యవసాయవాదుల జీవితాన్ని ప్రత్యక్షంగా, మధ్యతరగతి ప్రజలజీవితాన్ని పరోక్షంగా ప్రభావితం చేశాయి.

అనేక రకాలుగా ప్రభుత్వరంగ వైఫల్యం సరళీకృత ఆర్థికవిధానంలోని ప్రధానాంశం ప్రైవేటీకరణ. ప్రభుత్వరంగ సంస్థలను పాక్షికంగా (కొన్ని సందర్భాలలో) ప్రైవేటు యాజమన్యాలపరం చేయడం. ప్రభుత్వరంగ సంస్థలను లీజుకు ఇవ్వడం ప్రపంచ వాణిజ్య సంస్థ(W.T.O.1995) ఏర్పడిన తర్వాత ప్రపంచీకరణ కోరుకొనే శక్తులు ఏకంకావడం, అంతకు ముందురి డంకెల్ ప్రతిపాదనలు, GATT(General Agreement on Trade and Tariff) వ్యాపార సుంకాల సాధారణ ఒడంబడిక) ఒప్పందంమీద భారతదేశం సంతకం చేయడం. లాంటివి పరిగణించదగిన కొన్ని ముఖ్యాంశాలు. కులవృత్తులు, చేతివృత్తులు క్షీణించడం, గ్రామీణ వాతావరణంలో వచ్చిన మార్పులు, వ్యవసాయరంగంలో సంక్షోభంలో ప్రతి ఒక్కరినీ తమ మూలాలను వెతుక్కునేలా చేశాయి.

1990లో విప్లవ రాజకీయ పార్టీల మీద అప్రకటిత నిషేధం తొలగింపబడటం వల్ల బహిరంగ కార్యకలాపాలకు అవకాశం చిక్కింది. వివిధ ప్రజాసంఘాల బ్యానర్లతో ప్రజలు కదిలి విప్లవోద్యమం వైపు నిలబడ్డారు. కుల సమస్యను, స్త్రీ సమస్యను తగినంతగా పట్టించుకోలేదని విరసం ప్రతికూల విమర్శలను ఎదుర్కొన్నది. విప్లవ రాజకీయులు అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ అణచివేతలను, రాజ్యహింసను బూటకపు ఎన్కౌంటర్లను నిరసిస్తూ బలమైన విప్లవకవిత్వం వచ్చింది. సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించడం, వ్యక్తిజీవితంలోని బహుపార్శ్వాలను స్పృశించడం, సజీవ మానవ సంబంధాలకోసం తపన, వస్తు వ్యక్తీకరణల్లో వైవిధ్యమూ ఈదశాబ్ది కవిత్వంలో గమనించదగినది.

ప్రపంచీకరణ క్రమంలో బహుళజాతి సంస్థలు సహజ వనరులను నిర్మూలించడం ప్రజల ఆరోగ్యానికి కీడుచేసే రసాయనిక పదార్థాలను ఉత్పత్తి చేయడం, వ్యవసాయంలో కృత్రిమ ఎరువుల వాడకం, అనేక కారణాలవల్ల వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగడం మొదలైన వాటివల్ల ఏర్పడుతున్న దుష్పరిణామాలను కవులు ఎత్తిచూపారు. పర్యావరణ స్పృహ పెరిగింది రూపురేఖలు మారిపోతున్న గ్రామీణ జీవితాన్ని గ్లోరిఫై చెయ్యడానికి ప్రయత్నించారు ఇది నాస్టాల్జియం అంచులు తాకే స్థితికి చేరింది. అభివృద్ధి జరగాలి కాని గ్రామాలూ, జీవన విధానమూ, సంస్కృతీ మారకూడదనడంలోని వైరుధ్యాన్ని కొందరు కవులు ఎత్తిచూపారు.

ప్రపంచీకరణ సాహిత్యంలో మగువల మానసిక భౌతిక సంఘర్షనలతోపాటు, పురుషుని సంఘర్షణలు, తల్లితోపాటు 'తండ్రి' ఆవేదనలూ కవితా వస్తువులైనాయి. ఈ దశాబ్దంలో చిత్తశుద్ధి కలిగిన కొత్తకొత్త కవులు, కళాకారులూ వెలుగులోకి వచ్చారు. కొందరు కవులలో పెరిగిన గుర్తింపు కాంక్ష, అసహ్యం, అవాంఛనీయ ధోరణులకు, అవాంఛనీయ రచనలకు దారితీసింది. 1990 తరువాత వస్తు, భాష, భావ వ్యక్తికరణలలో ఆత్మగౌరవ పోరాటాలు, ప్రపంచీకరణ, అమెరికానైజేషన్ సాంస్కృతిక కాలుష్యాలు, ఆధిపత్యాలకు ప్రతిగా స్థానియతా స్పృహ పెరిగింది.

ఏది ఏమైన 20వ శతాబ్దంలోని చివరి దశాబ్దం 21వ దశాబ్దానికి ప్రవేశ ద్వారంగా అమరింది. పుట్టుమచ్చ- కవితలో ఖాదర్ మొహియుద్దీన్ చెప్పిన కవితా రీతిని చూస్తే - చిన్న తనం నుంచి అంటే అమ్మవడి నుంచి-సమాజ నడవడికలోకి అడుగుపెట్టే దిశని చూపించాడు

"పసితనంలోనే
నన్ను పరిహసించాయి
పాఠ్యపుస్తకాలు " అంటూ పసితనాన్ని గుర్తుచేస్తాడు.

"ఆడపిల్ల అందాల్ని బంధించినట్లు
నా ఆకారాన్ని అంకెల్లోకి దట్టించి
నా ఇంట కన్ను తెరచిన
నవజాతి శిశువు తెగ్గోసుకున్న
తల్లి పేగు చివర తడియారని నెత్తుటి బొట్టులో" 1947ని దర్శిస్తుంది వర్తమానం అంటూ సంచుల్లో తల్లినీ బిడ్డను కవితా వస్తువును స్వీకరించారు.

"కేవలం నా మత విశ్వాసాల కుట్ర
నా సామూహిక ప్రార్ధనా సమావేశాలు కుట్ర
నేను మత్తుగా పడివుండటం కుట్ర".[1] ఇలా ప్రపంచీకరణ సాహిత్యాన్ని సృష్టించాడు కవి. ప్రపంచీకరణ ఒకప్పుడు తప్పకుండా వేసుకోవాల్సిన మాత్రగా ప్రచారమైంది. ఇప్పుడది కాస్తా ప్రమాదకర మందుగా తయారయింది. సంపన్నదేశాల్లో వివిధ శ్రేణుల్లో వున్న ధనికులకు మాత్రమే అది ఉపయోగపడుతుంది. దేశాల మధ్య, ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరిగిపోయి సంక్షోభాలకు దారితీసింది. అమెరికాకు, మొత్తం సామ్రాజ్యవాదానికి అనుకూలమైన ప్రపంచీకరణను

ప్రపంచ దేశాలపై రుద్దిన ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థలు భ్రష్టుపట్టాయి. ఈ సంస్థలకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ సంస్థలు ఏర్పడుతున్నాయి.

ప్రపంచీకరణ సాహిత్యంలో కవులు రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం, పరిశ్రమలు మూతపడటం, నిరుద్యోగం, పేదరికం, ప్రపంచీకరణ పర్యవసానాలు. అమెరికాకి జలుబు చేస్తే ప్రపంచమంతట ఆర్థిక సంక్షోభాలకు కారణమవుతున్నాయి.

1991 తర్వాత వివిధ ప్రభుత్వాలు అమలు చేసిన విధానాలని తెలుగుకవులు కవితా వస్తువులుగా స్వీకరించారు.

నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగటం, ఆహార సంక్షోభం ప్రపంచీకరణ పుణ్యమే. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విలువలు అడుగంటి పోతున్నాయి. డబ్బు సంపాదనే పరమార్థంగా ఉంది. ఉగ్రవాదం పెరిగిపోయి సామూజిక జీవనం అస్తవ్యస్థమైంది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు మహిళల జీవనంపై ప్రతికూల ప్రభావం ఏర్పడింది. ధనిక దేశాలు వాతావరణాన్ని విషతుల్యం చేస్తూ భూమండలానికే ముప్పుతెస్తున్నాయి.

ప్రపంచీకరణ విధానాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం యూజర్ చార్జీలు పెంచింది. నీటిపన్నులు, ఆసుపత్రి ఫీజులు, సబ్సిడీ బియ్యం ధరపెంపు, రేషన్ కార్డుల కోత, విద్యుచ్ఛక్తి చార్జీల పెరుగుదల, తదితర భారాలన్నీ ఇతర పేదవర్గాలతో పాటు గిరిజనులు కూడా భరిస్తున్నారు.

**3.1. ఆర్థిక అసమానతలు:** ప్రపంచీకరణ వలన ధనికులకు పేదలకు మధ్య ధనిక దేశాలకు అభివృద్ధి చెందుతున్న దేశాలకు మధ్య అసమానతలు ఎక్కువయ్యాయి. ప్రపంచ జానాభాలో కేవలం ఒకశాతంగా ఉన్న ధనికులు ప్రపంచ సంపదలో 40% శాతం వాటాను చేజిక్కించుకోగా నూటికి 50 మంది పేదలకు మొత్తం సంపదలో 1% మాత్రమే వాటా దక్కింది. వ్యవస్థీకృత సర్దుబాట్లు, మార్కెట్ సంస్కరణలు, ప్రపంచీకరణ మరియు ప్రైవేటికరణ వలన ఆర్థిక, సామాజిక రంగాలపై పడిన ప్రభావంపై ఐ.రా.స 2003లో నివేదికను విడుదల చేసింది. 1980వ దశాబ్దం నుండి అత్యధిక దేశాల్లో ఆర్థిక అసమానతలు తీవ్రమయ్యాయని నివేదిక పేర్కొంది. ధనిక దేశాలు-పేదదేశాల మధ్య దూరం మరింత పెరిగిందని తేల్చింది .

ప్రపంచ వ్యాపారం, పెట్టుబడులలో ధనిక దేశాలలో పైచేయి కావడంతో ప్రపంచ సంపద అంత ధనిక దేశాలలో పోగుపడుతున్నది. దాంతో అభివృద్ధి చెందిన దేశాలకు అబివృద్ధి చెందుతున్న

దేశాలకు మధ్య తారతమ్యం పెరుగుతున్నది. ప్రపంచీకరణ విధానాలు దీన్ని మరింత పెంచాయి. మొత్తం ప్రపంచ వ్యాపారంలో 70% అమెరికా, పశ్చిమ యూరప్, జపాన్ దేశాలు కంట్రోలు చేస్తున్నాయి.

**3.2.ధరలభారం:** ప్రపంచీకరణ ప్రభావాల్లో ఒక ముఖ్యమైన సమస్యగా ధరలు ముందుకొచ్చాయి. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు ధరల పెరుగుదలలో ప్రత్యక్ష పాత్ర పోషిస్తున్నాయి. చమురు, ఆహార సరుకుల రంగంలో జరుగుతున్నా స్పెక్యులేషన్ వ్యాపారమే ధరల పెరుగుదలకు కారణమని అందరూ అంగీకరించాల్సి వచ్చింది.ఈ ధరల పెరుగుదలలో అమెరికన్ ఫైనాన్స్ పెట్టుబడుల ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. సరుకులు, డబ్బులు, చేతులు మారకుండానే ఒకే సరుకును అనేకసార్లు కొనుగోళ్ళు అమ్మకాలు చేస్తుండటంతో ఆహార సరుకుల ధరలు కృత్రిమంగా పెరుగుతున్నాయి. చమురు వ్యాపారంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది.

"ఆకాశాన్నంటిన ధరలు
అన్ని సరుకులనూ కరువు
అలముటించే ప్రజలు
బావి నీళ్లు కూడా కొనే రోజులు
భావిలో గాలిని కూడా కొనాల్సి వస్తుందేమో
తస్మాత్ జాగ్రత్త![2]

నేడు నిత్యవసర సరుకుల ధరలు ఏ రకంగా పెరుగుతున్నాయో, సామాన్య ప్రజల స్థితి గతులు ఎలా మారిపోతున్నాయో ఇందులో వ్యక్తం చేసింది.

ఆహార తలసరి వినియోగం 1990-1991 లో 468గ్రాముల నుండి 2005-06 లో 412గ్రాములకు పడిపోయింది. పప్పుల తలసరి వినియోగం 42 గ్రాముల నుండి 33గ్రాములకు పడిపాయింది. దేశంలో 50% మంది బాలలు, 78% మంది గర్భిణీస్త్రీలు పోషకాహార లోపంతో బాధపడుతుండగా ప్రజాపంపిణీ వ్యవస్థను కుప్పగూలుస్తున్నారు. ప్రజలందరికీ ప్రజాపంపిణీ వ్యవస్థను అందుబాటులోకి తేవాలన్న ప్రపంచీకరణ వ్యతిరేక దృక్పథం ప్రజలలో ముఖ్యంగా కవులలో రచనలు చేయడానికి ప్రేరణకలిగింది.

**3.3.వ్యవసాయ సంక్షోభం**: ప్రపంచీకరణ విధానాలు వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం ప్రధాన సమస్య. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుండగా పండిన పంటకు గిట్టుబాటు ధర రావటం లేదు. విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద ప్రపంచీకరణలో భాగంగా పన్నులను పూర్తిగా తొలగించడమో, 10%నికి తగ్గించడమో చేశారు. పరిణామాత్మక ఆంక్షలను కూడా ఎత్తేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయం పెద్ద ఎత్తున అస్థిరతకు గురవుతుంది. సరళీకరణ విధానాల వలన వరి, వేరుశనగ, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పత్తి దిగుమతి పైన పన్నులు పూర్తిగా ఎత్తివేయడంతో రాష్ట్రంలో పత్తి ధరలు పడిపోయాయి. వర్షపాతం తక్కువ, సాగునీటి సౌకర్యం తక్కువ ఉన్న దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలలో బోరుబావులు తవ్వి, నీళ్ళు పడక పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారు అని తెలంగాణ కవులు తమ కవితా రచనలలో ఆవేదన వ్యక్తం చేశారు.

**3.4.సాహిత్యం-సమాజం:** మన ప్రాచీన సాహిత్యమంతా సామాజిక సాహిత్యమే అది సమాజాన్ని విస్మరించలేదు. ఆనాటి రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితిని చిత్రీకరించింది. మార్క్సిజపు తాత్వికత రాకముందు వుండే ఆనాటి ఆలోచనా విధానం వేరు. తాత్వికత వచ్చిన తరువాత ఏర్పడిన విధానం వేరు. ఆ రెండింటిని పోల్చుకోలేం అందువలన ప్రాచీన సాహిత్యం సామాజిక సాహిత్యంగానే వచ్చింది. ఆ తరువాత ఆంగ్లసాహిత్య ప్రభావంతో వ్యక్తివాద, భావవాద సాహిత్యం వచ్చింది. అది సమాజాన్ని విస్మరించింది. అయితే గురజాడ ఆధునిక సాహిత్యాన్ని ఆధునిక సమాజం వైపు మళ్ళించాడు.

సామాన్య ప్రజలు సాహిత్యంలో పాత్రలుగా ప్రవేశించిందో ఆవిధంగా సాహిత్యం సమాజానికి దగ్గరవుతూ సమాజానికి దర్పణంగా పరిణామం చెందింది. కళలు సమాజానికి అద్దాలు. అద్దాలు పగిలిపోతాయి. ఆ అద్దాలు కళలే అయితే, అవి పగిలిపోవు అయితే సాహిత్యం అక్కడే ఆగిపోతే, అది సాధించే సామాజిక ప్రయోజనం అంతగా ఏమీ ఉండదు. మార్క్సిజపు తాత్వికత సాహిత్యంలో ప్రవేశించాక ఆదర్పణస్థితి మారిపోయింది. సాహిత్యానికి సమాజాన్ని మార్చేశక్తి ఉందని ప్రజామేధావులు గుర్తించారు. పీడించే వర్గప్రజలనూ పాత్రలుగా సాహిత్యంలో ప్రవేశపెట్టారు. స్వరూప స్వభావాలనూ, మనస్తత్వాలనూ, సంఘర్షణలనూ సృజనాత్మకంగా చిత్రీకరించారు. వర్గపోరాట చైతన్యమే ప్రధాన లక్ష్యంగా ప్రజాజీవనంలో ప్రజాశత్రుశిబిరంలోకి ప్రపంచీకరణ చొచ్చుకుపోతుంది.

సాహిత్యం దర్పణస్థితి నుండి, సాహిత్యం ప్రజాఉద్యమాలకు పనికొచ్చే ప్రజాభావాల విప్లవాలను సృష్టించగలదనే ప్రజాఉద్యమ చైతన్యాన్ని చైతన్యం చేసుకుంటూ సాగుతోంది. ప్రపంచీకరణకు సాహిత్యానికి చాలా దగ్గర సంబంధం ఉంది. ప్రపంచీకరణ మన ప్రజాజీవితాన్ని బహుముఖంగా అల్లకల్లోలం చేస్తోంది. ప్రజలు ఇద్దరుశత్రువుల వ్యవస్థలో సతమతమౌతున్నారు. ప్రజాజీవితం దుర్భరమైపోతుంది. ఇది అంతిమంగా ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కోల్పోయే దుర్భరస్థితికి దారితీస్తుంది. ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ కొంత మేరకైన మంచి సాహిత్యమే వస్తోంది. అయితే ప్రజా ఉద్యమాలు బలపడలేదు. ప్రజా ఉద్యమాలు ఎందుకు బలపడలేకపోతున్నాయో, సాహిత్యం విశ్లేషించి ఇంత వరకు ఏమి చెప్పలేకపోతుంది. అది చెప్పలేనంత కాలం, ప్రపంచీకరణ వ్యతిరేఖ సాహిత్యం సాధించిందేమిటి అనే ప్రశ్నార్థకం ఉండిపోతూనే ఉంటుంది. ప్రజాచైతన్యం ఉద్యమంగా విస్తరించలేకపోతుంది.

ప్రపంచీకరణ వ్యతిరేకవాదం, అలాగే కుల, మత, ప్రాంత, స్త్రీవాదాలు దోపిడీ రాజకీయ వ్యవస్థలో భాగస్వాములుగా ఉంటూ, రాజ్య,రాజ్యేతర దోపిడీ శక్తులకు సహకరిస్తూ ఉండటం వల్ల ప్రజా ఉద్యమాలు బరపడలేదు.

## 3.5. ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్యం:

3.5.1.**పరిచయం:** తెలుగు సాహిత్యంలో ఏ కొత్త ధోరణి అయినా ముందుగా కవిత్వం రూపంలోనే వ్యక్తమవుతుంది. ప్రపంచీకరణ  కూడా దీనికి మినహాయింపు కాదు. తెలుగు కవులే గ్లోబలైజేషన్ నూ చాలా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కొత్తపాత అనే తేడా లేకుండా కవులందరి నుంచి నిరసన కవిత్వం పెద్ద ఎత్తున వస్తుంది.

మనిషికి మనిషికి మధ్య సంబంధాలు డాలర్ కట్టల మీద నలిగిపోతున్న దృశ్యం మనిషి ఐన ప్రతి ఒక్కరిని కదలిస్తుంది. మార్కెట్ సంబంధాలే మానవ విలువలను నిర్ధేశిస్తున్న అమానవీయ సంస్కృతి ప్రపంచీకరణ ప్రభావమే.2000సంవత్సరం వరకు పరిమితంగా వచ్చిన ప్రపంచీకరణ వ్యతిరేఖ కవిత్వం తరువాతి కాలంలో విజృంభించింది.

**3.5.2. ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం ఆరంభం:** మనుషులు, దేశాలు, సమాజం, సంస్కృతులు, వివిధ అనేక అంశాల మధ్య వైరుధ్యాలున్నాయి. నూతన వ్యాపార పద్ధతులలో భాగంగానే ఇవ్వాళ మానవ జీవితాలలోకి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రవేశించిందని సామాజిక

శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వలసవాదం, దాని కొనసాగింపైన సామ్రాజ్యవాదం, రెండు దశాబ్దాలుగా అది అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాలు పెరసి సామ్రాజ్యవాద ప్రపంచీకరణగా రూపాంతరం చెందటం జరిగింది.

1980తరువాత ప్రపంచమంతటా పెట్టుబడిదారీ ధోరణులు ప్రబలాయి. కార్మికవర్గ ప్రయోజనాల్ని పణంగా పెట్టే వాదనలు తలెత్తాయి. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద దేశాల మధ్య పోటీ అధికమైంది. దాని ఫలితంగా రెండవ ప్రపంచయుద్ధం జరిగిందని చెబుతారు చరిత్రకారులు. అంతర్జాతీయ రాజకీయాలలో పెత్తందారులే వల్లించడం, దేశాల మధ్యన వివాదాల పరిష్కారానికి ముందుకు రావటం అమెరికా తన పెద్దన్న పాత్రను ఎంత చాకచక్యంగా నిర్వహిస్తుందో అర్థమవుతుంది. తన ప్రయోజనాలను నెరవేర్చు కోవడానికి ఇతరదేశాల ప్రయోజనాలను పణంగా పెట్టడం సామ్రాజ్యవాద నీతి ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్. సర్వప్రయత్నం చేస్తున్నావనే రాజకీయ పరిశీలకుల భావన. ఆయుధాల అమ్మకంతో ముడిపడిన అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచంలో చాలా ప్రమాదకారనే విషయాన్ని ఇప్పటికే చాలా మంది పేర్కొన్నారు. గ్లోబలైజేషన్ విషయంలో అమెరికా ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఇంగ్లాండ్ లాంటి రవి అస్తమించని సామ్రాజ్యవాద దేశాలను సైతం తలదన్నిన చరిత్ర అమెరికాకు ఉంది.

పొద్దున్న లేచింది మొదలు నిద్రపోయ్యేవరకు ప్రపంచీకరణ ప్రభావం నుండి ప్రతి పల్లె తప్పించుకోలేని స్థితిలో కూరుకుపోయింది. ఇది ఒక భారతదేశానికి మాత్రమే వచ్చిన క్లిష్ట పరిస్థితి అనుకోవటానికి వీలు లేదు. ప్రపంచ దేశాలన్నింటినీ తన గుప్పెట్లో పెట్టుకొని అమెరికా ఆడుతున్న నాటకంలో, అనివార్య పరిస్థితుల్లో కూరుకుపోయిన, పాత్రదారులవుతున్న దేశాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ప్రజలు పోరాటాలు చేయక తప్పని పరిస్థితే తలెత్తిందనవచ్చు.

"సిడ్నీ, బీజింగ్, ఢిల్లీ, శ్రీకాకుళం, చైనా,
క్యూబా, మెక్సికో, అర్జెంటీనా, ఇథియోపియా
నికరాగువా.... ఇంకా ఇంకా....
మనిషి బాధలొక్కటే, వెతుకులొక్కటే, కతలొక్కటే"[3]

**3.5.3.ప్రారంభదశ:** రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం భారతదేశాన్ని రెండువందల సంవత్సరాలకు పైగా పరిపాలించింది. ప్రజలను బానిసలుగా మార్చుకొని కనీస హక్కులు లేకుండా చేసారు. అలాంటి సమయంలో ప్రజాస్వామ్య, జాతీయ భావాలతో చైతన్యపరమైన బుద్ధిజీవులు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేఖంగా స్పందించటం ప్రారంభించారు కవులు, రచయితలు కూడా ఉండటం ఉత్తేజకరమైన అంశం.

20వ శతాబ్ది ప్రారంభం నుండే వివిధ రాష్ట్రాలలో పరిపాలకులకు వ్యతిరేఖంగా జాతీయ చైతన్యం పెల్లుబికింది. భారత స్వాతంత్ర్యోద్యమ ఘట్టాల్లో వందేమాతర ఉద్యమం ఎందరో కవులను, కళాకారులను వక్తలను తయారుచేసింది. 1907లో బిపించంద్రపాల్ గారి ఆంధ్రదేశ పర్యటన ఎంతోమంది తెలుగు కవులకు నూతనోత్తేజాన్ని నింపింది.

తెలుగులో మొదటిసారిగా జాతీయోద్యమ భావాలతో రచనలు చేసిన చిలకమర్తి లక్ష్మీనరసింహం భారతదేశంలోని సంపదలు భారతీయలకు దక్కకుండా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దోపిడీ చేస్తున్న విధానాన్ని చెబుతూ......

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవాడు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"[4]

ఆంగ్లప్రభుత్వం పన్నుల విధానాన్ని నిరశిస్తూ......

"నేలదున్నుదామన్న జాలతరముపన్ను
నీరుగావలెనన్న నీటిపన్ను
సరుకులమ్ముదామన్న సంతపన్ను
కర్రలమ్ముదామన్న గలప కింకొకపన్ను
ఉన్న మట్టుకు తినకుండ ఉప్పుపన్ను"[4]

ప్రజలు ప్రకృతిలో లభించే వస్తువులు ద్వారా జీవిద్దామన్న ఆంగ్లంలో పాలకులు పన్నులతో ప్రజలను కష్టాల పాలు చేసినారు.

1907లో ప్రారంభమైన దేశభక్తియుత కవిత్వం బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక ధోరణి తెలుగు కవిత్వంలో పుంఖాను పుంఖాలుగా వెలువడింది.

"పేదల గుండెల నెత్తురు పీల్చి పీల్చి"[4] అంటూ సామ్రాజ్యవాదుల రాక్షస స్వభావాన్ని కవిత్వీకరించాడు.1921లో గరిమెళ్ళ సత్యన్నారాయణ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సూటిగా విమర్శిస్తూ వారి దోపిడీ పాలనను ఎండ గడుతూ రాసిన కవిత చాలా ప్రసిద్ధిగాంచినది.

"మాకొద్దీ తెల్లదొరతనము
దేవ మాకొద్దీ తెల్ల దొరతనము
మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించే
పన్నెండు దేశాలు పండుచున్న విగాని
పట్టెడన్నం లోపమండీ
నోట మట్టిగొట్టి పోతాడండి
ఆడికుక్కలతో పోరాడి
కూడు తింటామండి".[4] వలస పాలకులు వారి స్వార్ధం కోసం భారతీయులను ఏ విధంగా దోపిడీ చేశారో త్రిపురనేని రామస్వామిచౌదరి "సుతాశ్రమ గీతాలు" అనే కావ్యంలో తెలియజేస్తూ, అదేవిధంగా ప్రజలందరూ పోరాటయోధులు వారి దౌర్జన్యాలను మర్చిపోవద్దని హెచ్చరించారు.

"పగవారు మనపైకి వచ్చిపడ్డారు
కోయండు మన యూళ్ళు కొల్లగొట్టారు
గూటిలో పిట్టల్ని కూల్చివైచారు
పొలములో పసిలేళ్ళు పొడిచి చంపారు
మరచిపోవద్దోయ్ మరచిపోవద్దు
మనజాతి యగచాట్లు మరచిపోవద్దు" అంటూ

దేశ దాస్యాన్ని తొలగించాలని ప్రతిజ్ఞ చేస్తూ.[5]
ఆంగ్లపాలన అంతం కావడమే సామ్రాజ్యవాదం అంతమయినట్లని ప్రకటించిన మొదటికవి.

"నా జాతికోసమై
నా హక్కుకోసమై

ప్రాణాన్ని తృణముగా పణంగా బెట్టిస్తాను

కుటిల రాజ్యాంగాన్ని కూల్చి పారేస్తాను

సామ్రాజ్యవాదాన్ని సదమదం చేస్తాను".[5]

తెల్లదొరల సామ్రాజ్యవాదానికి వ్యతిరేఖంగా పోరాడిన యువతరం విద్యార్థుల పాత్ర చరిత్రలో ఉన్నతమైనది.

కవిత్వ రచన వృత్తిగా చేపట్టిన చాలామంది కవులు జాతీయ కాంక్షను బలంగా వెలిబుచ్చుతూ భారతదేశాన్ని తమ కవితల్లో ఆవిష్కరించేవారు. విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, గుఱ్ఱంజాషువా మొ.గు వారు కనిపిస్తారు.1939-45సం.రాల కాలంలో రెండవ ప్రపంచయుద్ధం రాబోతుందనగానే శ్రీశ్రీ ప్రవక్తవలె నూతనుత్తేజంతో బీభత్సకవిత్వం రాసినాడు.

**3.5.4.సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం :** నేడు ప్రపంచీకరణ వ్యతిరేకంగా ప్రపంచవ్యాపిత సవాలు ఎదరవుతున్నది. ప్రపంచీకరణ పట్ల అసంతృప్తి వ్యక్తమవుతున్నది. అలా వ్యక్తమవడంలో తప్పులేదు. ప్రపంచీకరణ అనేది మంచి కోసం ఉపయోగపడే శక్తిగా కూడా ఉన్నది. ప్రజాస్వామ్యం, పౌరసమాజం గురించి ప్రపంచీకరణ వ్యాప్తి చేసిన భావాలు ప్రజల ఆలోచనలో మార్పు తెచ్చాయి కనీ తెలుగు కవికి ఆమార్పులు రుచించలేదు. ఎందుకంటే అది అన్నిరంగాలనూ మార్చేసింది. సామాన్య ప్రజలు దాని దాటికి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకోవడం పల్లెలు విడిచి పట్టణాలకు వలసలు వెళ్ళడం లాంటివి కవులుపై ఎక్కువ ప్రభావం చూపించాయి.

2001-2010లలో తెలుగు సాహిత్యానికి సంబంధించి కథలైనా, కవిత్వమైనా నాలుగు అస్థిత్వ ప్రధాన స్రవంతులు కులం, లింగం, మతం, ప్రాంతం ప్రాతిపదికలుగా విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన, వస్తున్న కవులు తమ వైయుక్తికం మరియు సామాజిక అనుభవాలను, అభ్యంతరాలను పూనికతో అక్షరరూపంలో పొదిగిన దశాబ్దం ఇది. ఇదే సమయంలో దారి దీపమయ్యే ఏ సైద్ధాంతిక భావజాలాన్ని, తమతమ వాదనల్లో పొందుపర్చుకుని, తమ దృక్పథాలను సంపన్నమూ, బలోపేతము చేసుకునే ప్రయత్నాలు లేకుండానే, తమతమ సమస్యలకు ఒక పరిష్కారం ఎక్కడి నుంచో లభ్యమవుతుందనే దృష్టి కలిగి వుండడం విచిత్రం. ప్రపంచీకరణ వినాశకర ప్రభావం మొత్తం దేశం మీదే వుండగా ఈ సామాజిక వర్గాలేవీ దానికి అతీతం కావు.

2000 నుంచి 2010 వరకూ ప్రపంచీకరణ విజృంభణ ఎంతటిదో, మొత్తంగా ఒక కవిత్వ సంపుటిలో అదేప్రధాన విషయంగా వెలువడినరచన 'పొగచూరినఆకాశం'. విభిన్న అంశాలపై కవిత్వాస్త్రాలు సంధించిన డా.అద్దేపల్లి రామమోహనరావు బహుముఖ నిరసనలకు ఒక చిన్న వ్యాసంలో చోటు కల్పించడం కష్టం. ఈకవిత్వపు సామాజిక వాస్తవం ప్రపంచీకరణ కనుక, ఏదైనా ఒక్కమాటలో ఒకసాంఖేతిక ఆవిష్కరణను ఇవాళ ఉపయోగించుకుంటున్న తీరుతో, దాని స్వభావంతో, ఈ గ్లోబలైజేషన్ ను సంకేతించగలం, ప్రతిబింబించగలం అనుకుంటే - అది కవి అద్దేపల్లి "పొగచూరినఆకాశం"లో శక్తివంతంగా ప్రయోగించిన ఆవిష్కరణ- 'కెమెరా'.ఇది కెమెరాయుగం. ఇది గ్లోబలైజేషన్‌కు ఒక సార్వత్రిక ప్రతీక. మంచీ చెడూ రెండూ వున్నా, చెడు సహస్రముఖాలుగా, ప్రపంచాధిపత్యాల ప్రచార వాహికగా ఇవాళ కెమెరాని మించిన ఉదాహరణ ఇవ్వడం కష్టం. "ఈనాటి హీరో''గా కెమెరాని పేర్కొంటున్న కవిత కటు వాస్తవికతను తెలిపే రచన. మన దిగంబర కవులు ఒకనాడు చేసిన నిరసనలకు తక్కువ రాదు. కెమెరా యుగం మొదలై ప్రపంచ సమాజాలు అన్నింటా 'ఇందుగలదండులేడను' సందేహం అక్కర లేకుండా తన ప్రమాదకర విశ్వరూపం చూపిస్తోంది. అలా కెమెరా యుగపు విప్లవాన్ని, తమ కార్పొరేట్ సంస్కృతి అభివృద్ధి పరిరక్షణలో వాడుకునే వర్గాలను గుర్తించి, అభ్యంతరం తెలుపడం అద్దేపల్లి ఈ కవితలో సాధించిన సాఫల్యత.

1826లో తొలి కెమెరాఫొటోను జోసెఫ్ నైస్ఫోర్ నీప్సె తీసారు. 1860ల తర్వాత నుంచి విస్తృతంగా, మొదటి ప్రపంచ యుద్ధకాలం (1909-1915) మధ్య కాలపు ఆయుధ ప్రయోగాల బీభత్సం, జన మరణం, సైనికుల దుర్మరణాలు తదితరాలను పౌర సమాజాలకు అందేందుకు కెమెరా ఉపయోగించింది. ఆధునిక యుద్ధాల వినాశన పాటవం ఎంతటిదో ప్రజలు ఎరిగేలా చేసినవి కెమెరాలే. వాటిని చేతబూని యుద్ధరంగాలకు వెళ్ళి, యుద్ధాల్ని షూట్ చేసిన పాత్రికేయ కెమెరా మెన్‌ల పాత్ర గణనీయమైనది. 1950లకే శాస్త్రీయంగా అందుబాటులో వున్న టెలివిజన్, పరిమిత ప్రాంతాలలోనే శాస్త్రీయ, సాంకేతిక, సైనిక వినియోగాలకే చెందినదిగా ఇంకా ఆకాశవాణి, బిబిసి, వాయిస్ ఆఫ్ అమెరికా, రేడియో రష్యాలుగా శబ్దఆధారిత సమాచార ప్రసార వ్యవస్థ రాజ్యం చేస్తుండేది. ముడి సరుకుగా వాడాల్సిన ఫిల్మ్ రీల్లస్థానే డిజిటల్ సాంకేతిక విప్లవం ఐ.టి. రంగం తీసుకురావడంతో, కెమెరా ఆధారిత

సమాచార ప్రసారయుగం 1980ల నుంచి కొన్ని అభివృద్ధి చెందిన దేశాలకేకాక సమస్త ప్రపంచానికీ  విస్తరించింది.

పెట్టుబడులు, వ్యాపారం, అనైతికమైన పోటీ, లాభదృష్టి ఇవన్నీ గుండు సూది నుంచి, అంతరిక్ష నౌకదాకా, ఆవకాయ నుంచి ఆటంబాంబుల విస్ఫోటక పదార్థం దాకా, సత్యనారాయణవ్రతం నుంచి శాంటాక్లాజ్ దాకా ఆరుబయట మొక్కల పెంపకంతో మొదలై, పడకగది చిక్కుల దాకా, సాధారణ దొంగతనాల నుంచి రాజకీయ కోటానుకోట్ల కుంభకోణాల దాకా, వీధి చివరి అల్లర్ల నుంచి పెనువేగంతో విరుచుకుపడే విమాన క్షిపణుల దాకా, అన్ని వర్గాల ప్రజల్ని ఆకట్టుకునే, కట్టిపడేసే, కట్టుబానిసల్ని చేసే, ఒక దృశ్యాల కాంతివేగపు గానుగలో ప్రపంచాన్ని పడేసి నలుపుతున్న డిజిటల్ యాంత్రికత... ఇదీ కెమెరా ఇవాళ చేస్తున్నది. మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, డిజిటల్ యుగాల దాకా ప్రస్తావించి, కొత్తకొత్త అవతారాలు ఎత్తి, రంగురంగుల దృశ్యాల వరద ఐనాక్సుల నుంచి సెల్‌ఫోన్ తెరల దాకా ఏక వరదై ముంచెత్తే ఈ వెల్లువ - నిజానికి - నూటయాభై ఏళ్ళ క్రితం మొదలయింది. చల్లని ఎసి హాల్‌లో కూచుని, ఒక దుర్మార్గమైన యుద్ధం చూస్తూ, మీకు ఇష్టమైన ఆహారాలు, పానీయాలు సేవించే జాతి, ప్రపంచమంతటా తన అస్తిత్వాన్ని బలోపేతం చేసుకోగలిగింది.

అనేక సామాజికాంశాలు, పొగచూరినఆకాశంలో ప్రస్తావించినవి ఇవాళ నిజరూపంలో, అప్పటికన్నా వేలరెట్లు ఎక్కువ ప్రమాదకారులుగా పరిణమించిన ఈ ప్రాపంచిక సందర్భంలో, ప్రపంచీకరణ దుష్ప్రభావాలను, ఇవాళ్టి సంక్లిష్ట సన్నివేశంలో కొంత పోరాటశీల స్పష్టత కోసం పునఃదర్శించడం, అంచనాలు వేయడం అనే పెద్ద పనికి ఈ కవితా సంపుటి పిలుపునిస్తున్నది.[6]

"పరదేశీ బూట్లనాడల క్రింద ప్రజల తలరాతల్ని పరిచిన
మీర్ జాఫర్వి నువ్వు జయ చంద్రుడివి నువ్వు
అంబివి నువ్వు విభీషణుడివి నువ్వు
విదేశీ మీడియాల విరాద్రుపానివి నువ్వు"[7]

ప్రపంచీకరణ అత్యాధునిక పైనాన్ని, అత్యంత ప్రమాదకరమైన వ్యూహాత్మక సర్దుబాటుని తెలుగుకవులు గొంతువిప్పి సాహితీపరంగా ఎదుర్కోవడానికి ముందు పరిస్థితులను కారణాలను పసిగట్టడం చైతన్యానికి సంకేతం.

సమకాలీన తెలుగు సాహిత్యంలో విప్లవ, దళిత, స్త్రీవాద, మైనారిటీ కవిత్వ ధోరణులు కొనసాగుతుండగా తమతమ లక్ష్యంతో కూడిన ఆలోచన అవగాహనను పదునుపెట్టే క్రమంలో కవులు ఉండగా, చాపకింది నీరుల గ్లోబలైజేషన్ పంజా ప్రతి శిబిరాన్ని, వ్యక్తుల్నీ ఎలర్ట్ చేసింది. దాని ప్రతిబింబమే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం.

1990-96 సంవత్సరాలలో ఏర్పడిన మంజీర రచయితల సంఘం ప్రచురించిన "మొగులైంది" కవితా సంకలనం మొదటిది కాగా 2000, 2001 సంవత్సరాలలో వికసించిన విద్యుత్తేజం 2001లో 'గ్లోబల్ ఖడ్గం', 'కాగితప్పులి కళ్ళలోభయం' మొదలగు కవితా సంపుటాలు వెలసినాయి.

అల్లం నారాయణ తన రచన లో........

"ఒక మొలతాడు లేని దెయ్యం
మార్కెట్లో తారాడుతున్నది
దానిపేరు యుద్ధం...రక్త పింజెర
దాని పేరు అమెరికా
దాని పేరు వరల్డ్ బ్యాంకు"[8] అంటూ తన కవితను చెప్పాడు.

ప్రపంచ మార్కెట్ ను జయించడానికి సామ్రాజ్యవాద దేశాల మధ్య నిత్యం పోటీ ఉంటుంది. అయితే ఆ పోటీ రాజీపూర్వకమైనది.

భారతదేశంలో మౌలికమైన మార్పులు వస్తున్నాయి. మార్పులేని భావాలు మీద పాతనమ్మకాల మీద, సామాజిక రాజకీయవ్యవస్థల మీద జనం తిరగబడుతున్నారు. గందరగోళం నుంచి నవసమాజం కోసం అప్రమత్తం అవుతున్న తరుణంలో ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం పుట్టుకొచ్చింది.

నేడు భారతీయ జనజీవనంలో వస్తున్న మార్పులను చిత్రించడం తెలుగు మేధావుల ముఖ్యకర్తవ్యం. దేశ అభ్యుదయానికి తోడ్పడటం వారి బాధ్యత. పూర్వ సంస్కృతి విచ్ఛిన్నం అయిన తర్వాత పుట్టిన సాహిత్యంలో జీవిత వాస్తవాలకు భీతిల్లే భ్రష్ట నష్ట పైఖరి ప్రబలింది. ఒకవైపు దుర్భర

దారిద్ర్యంతో బాధపడుతున్న పేదప్రజల గుండెలు బద్దలవుతుంటే మరోవైపు ఆకర్షణీయమైన వస్తు సంస్కృతులు, దేశ ఆర్థిక వ్యవస్థని సామాన్య ప్రజల జీవితాలని ముక్కలు చేస్తున్న ధోరణులు కవులు హృదయాలను తాకాయి. ఇది 1930 దశకంలో జగత్ప్రళయంగా వాటిల్లిన ఆర్థిక, సాంస్కృతిక కల్లోల పరిస్థితిల్లో సంస్కృతినీ, మానవతను రక్షించాలనే ఆకాంక్ష వివిధ దేశాల రచయితలలో ఉద్భవించింది.

“లోకం సుభిక్షం
నెక్లెస్ రోడ్డులో
జనసంరంభం
పంజాగుట్ట చౌరాస్తాలో
మార్కెట్ మహోత్సవం
మాల్స్ లో మనీ పరవళ్లు
కలలుగనే భూతల స్వర్గం
కళ్ళెదుటే”[9] ననే సత్యాన్ని ఈ కవి ఆవిష్కరించాడు. కథలా మొదలుపెట్టి కవితను ప్రారంభించి ప్రపంచీకరణ చేస్తున్న ధ్వంసాన్ని వివరించాడు. ‘మనీ పరవళ్ళు’ లాంటి ప్రయోగాలతో కవిత్వానికి నిండుదనం చేకూరింది.

90వ దశకం ఆర్థిక సంస్కరణల దశకం. మనల్ని దోచుకునేవాడు భూస్వామిలాగానో కంపెనీ యజమానిలాగానో మనకంటే భిన్నంగా ఉన్న దశలో శత్రువును గుర్తించినట్లు సాధ్యంకాదు. భారతదేశాన్ని మొత్తంగా అమెరికా సామ్రాజ్యవాద దాహానికి ఆహారంగా సమర్పిస్తుంటే అది మొత్తం జీవన సంస్కృతిలో మనకు తెలియకుండానే చాపకిందనీరుల ప్రవేశించి విలువల విధ్వంసం చేస్తుంటే ఆ విషాదాన్ని గుర్తించి కవిత్వీకరించటం ప్రపంచీకరణ వ్యతిరేక దృక్పథంలో భాగంగానే వచ్చింది .

గాట్ ఒప్పందం భారత రైతాంగ జీవితంలోకి తెస్తున్న ప్రమాదాన్ని గురించి ఆందోళనపడుతూ

“రూపాయికిక పూర్తి మారకం
బ్యాంకు వడ్డీ తగ్గింపు
పశువులును వదశాలలకమ్మండి
తోళ్ళకు మంచిగిరాకి ఉంది

మాంసానికి మా మంచిధర పలుకుతుంది
నాగళ్ళను ఎక్కడికక్కడ నరికి పొయ్యిలో పెట్టి
ఏదో పరిశ్రమను స్థాపించుకోండి
ఇంట్లో కడుపులు గుద్ది
బజార్లో వీపు మీద చెయ్యేసి
శబాష్ అంటుంది రాజ్యం"[10]

అని గాట్ ఒప్పందంపై సంతకం చేసిన ప్రభుత్వ వైఖరిని గుర్తించి చెప్పాడు.

బహుళజాతి కంపెనీలే మన దేశీయ విధానాలను, సంస్కృతిని నియంత్రించగలిగిన పరిస్థితులు బలపడే కొద్దీ భారతదేశపు సర్వసత్తాక గణతంత్ర స్వభావం అభావం అయిపోదా అన్నప్రశ్నను సంధించిందీ కవిత. ప్రపంచీకరణ పర్యవసానం దైనందిన కార్యకలాపాల మీద కూడా అగ్రరాజ్యాల నియంత్రంగా మారటాన్ని సరుకు, సంస్కృతి అన్నీ కూడా మనిషిని బిగించి కుదించి ఆడించటానికి భరించలేని దేశపతి శ్రీనివాస్ ఆ పరిస్థితిని తుడిచి పెట్టడానికి మూడవ ప్రపంచ దేశాలలో ఒక గాలివాన కోసం ఆశ పడతాడు.

"పరాయితనాన్ని బట్వాడా చేస్తున్న
ఛానెల్స్ ని ధ్వంసించకుండా
మనల్ని మనం చేరేదెట్లా
మనకు మాటనిచ్చిన మట్టికి దగ్గరయ్యేదెట్లా"[11] అని ప్రశ్నిస్తూ ప్రశ్నలోనే కర్తవ్యాన్ని సూచించాడు.

"అమెరికా సామ్రాజ్యవాద విషపునీడలో శిథిలమవుతున్న మానవసంబంధాల వైపు పప్పుల రాజిరెడ్డి వేలుపెట్టి చూపిస్తే ప్రపంచబ్యాంకు అప్పులకు బతుకుల్ని దానోహం చేస్తున్న దేశీయ విధానం మీద ధిక్కారంతో సామ్రాజ్యవాదంపై తిరుగుబాటులు సన్నద్ధం చూపాడు".[12]

ప్రపంచీకరణ వ్యతిరేక దృక్పథంలో భాగంగా 11-సెప్టెంబర్-2001 నాడు అమెరికాలని వరల్డ్ ట్రేడ్ సెంటర్ మీద, పెంట్ గాన్ మీద జరిగిన దాడిని అమెరికా సామ్రాజ్యవాద దురహంకారం మొదటి దెబ్బగా భావిస్తూ ఈ దాడులకు పత్రికా టెర్రరిజమ్ నిరసిస్తూ వచ్చిన కవితలను ''కాగితప్పులి కళ్ళలో భయం'' అనే సంకలనంగా 2001 లో విరసం ప్రచురించింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా వచ్చిన కవిత్వం రాయటం, దేవరశెట్టి జనార్దన్ వంటివారు ఇప్పుడిప్పుడే, సాంస్కృతిక ప్రత్యేకతలను కాపాడుకోవాలన్న ఆకాంక్ష ఈ కవిత్వంలో గాడంగా వ్యక్తం కావటానికి  ప్రాదేశిక సంస్కృతులను విధ్వంసం చేసే ప్రపంచీకరణపట్ల వ్యతిరేక దృక్పథం కూడా కారణమై ఉంటుంది. (తెలంగాణ,తండాట్ల మొదలగునవి) ప్రాంతీయ అస్తిత్వ స్పృహ దేశభాషాభిమానం ఎక్కువైనాయి..[13]

ప్రపంచీకరణ వ్యతిరేకత, సామ్రాజ్యవాద వ్యతిరేకత వాచ్యంగానే ఉన్నాయి. వర్గభేదాల ప్రస్తావన వుంది. ఆకలి, దారిద్ర్యం, అవిద్య వంటి సామజిక జీవిత అవలక్షణాలను పేర్కొనడమూ జరిగింది. నూతన సామాజిక వ్యవస్థను గమ్యంగా చూపడమూ వుంది. లేనిదల్లా పదును, స్పష్టత, ముసుగు మాటలను ఆశ్రయించడం. ఎందుకంటే ప్రజాసంఘం కాబట్టి భారతీయ సామజిక జీవితంలో తీవ్రమైన మార్పులు జరుగుతున్నవి. అభివృద్ధి నిరోధకతత్వం క్షీణించి అవసానదశలో  ఉన్నపటికీ పూర్తిగా నశించలేదు.

ప్రజల మేలుకోరే మేధావులందరు ప్రపంచీకరణ విషప్రభావాన్ని బలంగా వ్యతిరేఖిస్తున్నారు. మన సమాజంలో జరుగుతున్న మార్పుల్ని గుర్తించి వాటి అభివృద్ధిని ప్రతిబింబింప చేసే సాహిత్యాన్ని సృష్టించడం భారతీయ రచయితల విధి. సారస్వతలలో శాస్త్రీయమైన హేతువాదాన్ని చొప్పించి దేశంలోవున్న అభివృద్ధికర శక్తులకు చేయూతనివ్వాలి. కుటుంబ జీవితం, సమాజము, మతం, సెక్సు, యుద్ధం మొదలైన సమస్యలమీద వ్రాయబడ్డ రచనలలో కనబడే అభివృద్ధి నిరోధకత్వాన్ని అరికట్టాలి. కుల మతకక్షలు, జాతి విద్వేషం, వర్గదోపిడీ వాటిని పురిగొల్పే వ్రాతల్ని ప్రతిఘటించాలి. యుద్ధవ్యతిరేక, భావస్వాతంత్ర్యం, వాక్ స్వాతంత్ర్యం, విద్యార్థుల విజ్ఞానాభివృద్ధి, వయోజన విద్య, స్త్రీలఅభివృద్ధి - వీటికి సంబంధించిన తీర్మానాలు ప్రపంచీకరణ భాగంగా జరిగాయి.

గ్రామ గ్రామం నుంచి వచ్చిన తెలుగుకవులు వ్యతిరేక నిర్మాణకవిత్వాన్ని చెప్పారు. కరువు వచ్చింది, గ్రామజీవితం విచ్ఛిన్నమైంది, తమ ఇళ్లనూ, వాకిళ్ళనూ విడిచి కుటుంబాలకు కుటుంబాలు తిండి కోసం పట్టాణాలకెగబ్రాకారు. ఈ దృశ్యాన్ని కవి ఎలా వర్ణిస్తున్నాడో చూడండి.

"వెళ్ళిపోదామా? మామ
వెళ్ళిపోదామా పట్నవాసపు
కళ్ళు వీధుల లోబడి

ఈన మోపై వున్న పైరులు
ఏటి మున్కల పాలుజేసి
కొంప గోడి విడిచి పట్టెడు
కూటికై వూరేగ వలేరా...
ఒడలు పెంచిన గడ్డిమీదే
ఒరిగిపోయ్యే రాతలేదో!
ఊరుగాని ఊరులో చితి
పేర్చుకొమ్మని నుదిటి వ్రాలో....."[14]

ఈనాడు మన ప్రజల కర్తవ్యాన్ని గురుంచి కవి చేస్తున్న ప్రబోధం చూడండి.

"చేయెత్తి జేకొట్టు తెలుగోడా!
గతమెంతో ఘనకీర్తి గలవోడా!
సాటిలేని జాతి ఓటమెరుగని జాతి
నివురుగప్పీనేడు నిదుర పోతుండాది
జైకొట్టి మేల్కొల్పు తెలుగోడా!
గతమెంతో ఘనకీర్తి గలవోడ![15]

మనిషి వసుదైక కుటుంబంలో జీవించాలని హిందువులంటారు. కమ్యూనిస్టు రాజ్యం రావాలని మార్క్సిస్టులంటారు. ఏది ఏమైనా ఎల్లలన్నీ పోవాలన్నది వారి భావన. "ఎల్లలోకం ఒక్క ఇల్లై" అని గురజాడ చెప్పిందే వీళ్ళు చెబుతున్నారు. అయితే అది ఇపుడు సాధ్యమయ్యేలా లేదు. ప్రపంచీకరణ మార్కెట్లను దగ్గర చేసిందే కాని మనుషులను మాత్రం దూరం చేసింది. ఆదిమ సమాజాలలో మనిషికి దేశం లేదు. ఇపుడు దేశమున్నా పరాధీనత.

"ఒకప్పుడు దేహానికి తనదైన దేశం లేదు
ఇపుడు దేశీయతకు దేహమే లేదు
అంతా కొనుగోల్మాల్"[16]

కొనటం - అమ్మటం మధ్యనే మనిషి తిరుగుతున్నాడు. దేహానికి దేశం లేదా? దేశానికి దేహం లేదా? అంటే ఇప్పుడంతా దేహం లేని దేశీయతలే. "సామ్రాజ్యవాదం ఆధిపత్యానికి, దోపిడీకి అత్యున్నత

రూపమే నేటి ప్రపంచీకరణ" అని కాసుల ప్రతాపరెడ్డి నిర్వచించారు. దేశాలను, మనుషులను తన ఆధిపత్యం కిందకి తీసుకొని దోపిడీ చేయడానికి బహుళజాతి కంపెనీల సాధనమే ఈ ప్రపంచీకరణ అని కూడా చెప్పవచ్చు. అందుకే వఝల శివకుమార్

''వలస ఒక వంక మాత్రమే

ధ్యాసంతా మీది పాలముంతపైనే"[16] అని రాశారు. పిల్లి చూపు ఎప్పుడూ ఉట్టి మీది పాలముంత పైననేఅనే బహుళజాతి కంపెనీల కుట్రను బట్టబయలు చేశారు.

ప్రపంచీకరణ వ్యతిరేకత అంటే వలసవాదాన్ని వ్యతిరేకించటం. వలసలు రెండు రకాలు. ఒకటి అంతర్గత వలస తెలంగాణాకు ఆంధ్రావాళ్లు వచ్చినట్లు. రెండు బహిర్గత వలస. బహుళజాతి కంపెనీలు ఇండియాకు వచ్చినట్లు. తెలంగాణలో ఆంధ్ర దోపిడీ వ్యతిరేక ఉద్యమమంటే అది అంతిమంగా ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమమే. ఎందుకంటే ''ప్రాంతీయతకు, ఆయా ప్రాంతాల భాషా సంస్కృతులకు ముప్పుగా పరిణమించింది గ్లోబలైజేషన్. ఈ పరిస్థితుల్లో ప్రాంతీయ స్పృహతో వస్తున్న కవిత్వాన్ని కూడా గ్లోబలైజేషన్ ను వ్యతిరేకించే సాహిత్యంగానే పరిగణించాలనీ"[17]అంటున్నారు. ఈ కోణంలో చూస్తే సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన 'దాలి' దీర్ఘకవిత గ్లోబలైజేషన్ వ్యతిరేక దృక్పథం కలిగినదే.

డిస్కుల కాలం డిస్కోల కాలం

డాలర్ రథయాత్ర కింద వరియెన్ను నుగ్గు నుగ్గు అయిన కాలం

వేలెడు ఫ్లాపీ ముందు మడి బలాదూర్ అయిన కాలం

కన్నెమ్మ సెరలు పడి మడి పురివిప్పితే మార్కెటు మంత్రగత్తె"[17]

ఈ కవి నుగ్గు, నుగ్గు, సెరలు(బాధలు)లాంటి పదాలు వాడి తెలంగాణ జీవితం ధ్వంసమైన తీరును చెప్పాడు. మార్కెట్ రంగులు కన్నెమ్మ కుంకుమ, దాసెన వ్యాపారం కూలిపోయింది. డాలర్లు పండించే వ్యాపారపు పంటలు ముందు వరిసేను తలలు వాల్చింది. ఇవి ప్రపంచీకరణ కాలంలో నడుస్తున్న పంటలు.

సామాన్య ప్రజల స్థితిగతులను కళ్లకు కట్టినట్లు వర్ణించడంలో సూర్య వంశీకి ఒక ప్రత్యేకత ఉంది. ప్రపంచీకరణ వరవడిలో రైతుల దీనపరిస్థితిని గుర్తు చేస్తూ....

"బండి

గుట్ట ఎక్కుతోంది

బండిలో
గడ్డిమోపుల బరువు
ఆకలి ఎద్లు
ఎలాగో... ఎలాగో
బరువు బండిలాగుతున్నాయి
కొరడా దెబ్బలు తింటున్నాయి.
ఆ దున్నపోతుది
డంకెల్ బ్రీఫ్ ఫిలాసఫి
గ్లోబల్ ఫిలాసఫి
ఆ దున్నపోతు ఫిలాసఫీ
పార్లమెంటరీ పాఠం
తోటను తాకట్టు పెట్టేవాళ్ళు
పిచ్చుక గూళ్ళను
ఎలా కాపాడుకుంటారు?[19]

పై కవిత్వ పంక్తుల్లో ప్రపంచ బ్యాంకు నీడన పెరిగే సాంస్కృతిక సామ్రాజ్యవాదంతో పాటు పెరిగే భూస్వామ్య విలువలతో కూడిన దేశీ సాంస్కృతిక సామ్రాజ్యవాదాన్ని కూడా ప్రశ్నిస్తున్నాయి.

'తోట' మనుషులు నిర్మించుకున్న కళ, జీవితం తోటను పోగొట్టుకున్న రైతు అంటే మనం నిర్మించుకున్న నేల మన చేతుల్లోంచి, మనది కాకుండా పోతుందనే ఆవేదన వ్యక్తం అవుతుంది. ప్రపంచీకరణను వ్యతిరేఖించే క్రమంలో కవులు తమ కవితల ద్వారా నిరసనను తెలియజేయడం వల్ల వస్తువు నవ్యతను పొంది తెలుగు కవిత్వంలో చోటు చేసుకుంది.

ఈ విధంగా వివిధ సందర్భాలకు, కల్లోలాలకు కవులు స్పందిస్తూనే, బలంగా వీచిన, వీస్తున్న ఆనేక ఉద్యమాలతో పాటు ప్రపంచీకరణ కూడా ఒక ఉద్యమంగా తన వంతు కర్తవ్యాన్ని ఘనంగానే నెరవేర్చింది. మానవీయ దృక్పథం కొరవడి అమానవీయ కల్లోల వాతావరణం స్వైరవిహారం చేస్తున్న తరుణంలో గ్లోబలైజేషన్ విద్యుత్తు సంక్షోభం లాంటి సమస్యలన్నీ తలెత్తాయి. అసమానతలు, ఆధిపత్యాలు లేని జీవన యోగ్యమైన సమాజాన్ని ఆశించే కవులంతా సహజంగానే ప్రపంచీకరణపై

నిరసన వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కృతీ విధ్వంసాల నేపథ్యంలో 'గ్లోబల్ ఖడ్గం' కవితా సంకలనం వెలువడింది.

"గ్లోబల్ పాటలు పాడలేను
డాలర్ ఆటలు ఆడలేను
అప్పుల పిండితో తలంటుకోలేను
విదేశీ పెట్టుబడుల సుగంధాలను
ఒంటి నిండా పులుపుకోలేను
వడ్డీ సుఖపాన్పుల మీద మేను వాల్చలేను
సుంకాలు చెల్లించలేను"[20]అని నాళేశ్వరం శంకరం గ్లోబల్ ఖడ్గం యొక్క తీరు తెన్నులను విశదపరుస్తాడు.

## 3.6. ప్రపంచీకరణ అనుకూలసాహిత్యం:

**3.6.1.పరిచయం:** "ప్రపంచీకరణ" అనే పదం సాంఘిక శాస్త్రాలలో 1960లోనే ఉపయోగించబడినప్పటికీ ఆర్థికవేత్తలచే 1980నుండి ఉపయోగించబడుతుంది. ఏది ఎలా ఉన్నప్పటికీ 1980 మరియు 1990 చివరి సగం వరకు దీని విధానాలు ప్రసిద్ధి చెందలేదు. ప్రపంచీకరణ గురించి ముందుగా రచించబడ్డ సిద్ధాంతపరమైన విధానాలు మంత్రిగా మారిన ఒక అమెరికన్ వ్యాపారవేత్త అయిన **చార్లెస్ తేజ్ రుస్సేల్** చే లిఖించబడ్డాయి, 1987లో ఇతను 'వాణిజ్య భూతాలు' అనే పదాన్ని ప్రవేశపెట్టాడు.

ప్రపంచీకరణ భారతదేశ ఆర్థికవ్యవస్థలో ఒక నూతన శకానికి నాంది పల్కిందని చెప్పవచ్చు. ప్రపంచీకరణ ఒక దేశంలోని వర్తక వ్యాపారాలను, ప్రపంచంలో నలుమూలల ఉన్న అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకు వెళ్లడానికి దోహదం చేస్తున్నది. అందుకే సత్వరంగా ఆర్థిక అభివృద్ధిని సాధించడానికై ప్రపంచంలో అనేక దేశాలు మూడు విధానాలను అమలుపరుస్తున్నాయి. అవి సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ.

ఒక దేశ ఆర్థికవ్యవస్థను ప్రపంచ ఆర్థికవ్యవస్థతో సంఘటితం చేయడాన్ని ప్రపంచీకరణ అంటారు. ఒక రకంగా చెప్పాలంటే ఒకదేశ **ఆర్థికవ్యవస్థను** అంతర్జాతీయం చేయడమే ప్రపంచీకరణ అనవచ్చు. అందుచేతనే కొంత మంది ఆర్థిక శాస్త్రవేత్తలు ప్రపంచీకరణను "అంతర్జాతీయాకరణ" అని

కూడా పిలిస్తున్నారు. ప్రపంచీకరణ మూలంగా ఒకదేశానికి విదేశీ పెట్టుబడిదారులు రావడానికి అవకాశం ఉంటుంది. అలాగే ఒక దేశంలో ఉన్న పెట్టుబడిదారులు మరొక దేశానికి వెళ్ళవచ్చు. ఎగుమతులు, దిగుమతులు స్వచ్ఛంగా సులభంగా కొనసాగుతాయి. అంతేకాదు విదేశీమారక ద్రవ్య వ్యవహారాలపై నియంత్రణ ఉండదు.

1991 నాటికి భారతదేశ ఆర్థిక పరిస్థితి చాలా విషమంగా ఉంది. ముఖ్యంగా మన దేశం చెల్లింపుల్లో సమతౌల్యం ఘోరంగా దెబ్బతిన్నది. విదేశాల ఎగుమతులు తగ్గిపోయాయి. అట్లని విదేశీ దిగుమతులు తగ్గించుకుందామా అంటే, సాధ్యం కాకుండా పోయింది. మనదేశ కరెన్సీ మారకపు రేటు ఎక్కువగా ఉండటం వల్ల మనలను మరింత కృంగదీసింది. ఆనాడు మనదేశంలో విదేశీమారక నిల్వల మొత్తం అత్యంత అల్పం. వీటికి తోడు గల్ఫ్ దేశాల సంక్షోభం భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. ప్రపంచ బ్యాంకు రుణాలు, అంతర్జాతీయనిధి నుండి తీసుకున్న రుణాలు, భారతదేశ విదేశీమారక ద్రవ్య అవసరాలను తీర్చలేకపోయాయి. ద్రవ్యోల్బణం ఏడాది ఏడాదికి పెరిగిపోయింది. ఆర్థికాభివృద్ధి కుంటుపడిపోయింది. బడ్జెట్ లోటు తారాస్థాయిని అందుకున్నది. అంతేకాదు-ప్రభుత్వం భరించే సబ్సిడీల ఖర్చు తలకు మించిన భారమైపోయాయి. నిరుద్యోగ సమస్య తీవ్రతరమైంది.

ఇటువంటి దారుణమైన ఆర్థికపరిస్థితి నుండి దేశాన్ని సంరక్షించుకోవడానికై నాటి ఆర్థికమంత్రి డా.మన్మోహన్ సింగ్ చొరవతో ప్రభుత్వం ఆర్థికసంస్కరణలు చేపట్టింది. సరళీకృత ఆర్థిక విధానాలను ప్రతిపాదించింది. పారిశ్రామికరంగంలో పన్నుల విధానంలో మౌళిక మార్పులు తెచ్చింది. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనధి సూచించిన ఆర్థికప్రణాళికలను అమలుపరిచింది. భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థతో సంఘటితం చేయడానికై అనేక చర్యలు చేపట్టింది. ఈ విధంగా శ్రీ పి.వి.నరసింహారావు గారి ప్రభుత్వం నిజమైన ప్రపంచీకరణకు 1991లో నాంది పలికింది.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకై ప్రభుత్వం నిబంధనలను సడలించింది. అనేక ప్రోత్సాహకాలు ప్రకటించింది. విదేశీ పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కల్పించింది. “విదేశీ పెట్టుబడిదారుల ప్రోత్సాహక బోర్డు”ను నెలకొల్పింది. భారతీయ ఎగుమతులకు ప్రపంచ మార్కెట్ ను విస్తృత పరిచింది.

ప్రపంచీకరణ ఫలితంగా - భారతదేశంలో ఎగుమతి, దిగుమతులు పెరిగాయి. విదేశీమారక ద్రవ్యనిల్వలు గణనీయంగా అభివృద్ధి చెందాయి. ద్రవ్యోల్బణం రేటు తగ్గింది. చెల్లింపుల సమతౌల్య స్థితి చాలా అనుకూలంగా మారింది. భారతదేశంలో పారిశ్రామిక ఉత్పత్తుల నాణ్యత పెరిగింది. భారతీయులకు విదేశాల నుండి నాణ్యమైన వస్తువులు లభించాయి. మొత్తం మీద ప్రపంచీకరణ ప్రయోజనాలు ఈ క్రింది విధంగా సమీక్షించవచ్చును.

### 3.6.2. ప్రపంచీకరణ ప్రయోజనాలు :

- విదేశాల నుండి వచ్చే పోటీని తట్టుకునేందుకై నాణ్యత, ఉత్పాదకత, సమర్థతలను పెంపొందించుకొనవచ్చును.
- ప్రపంచీకరణ వల్ల దేశాల మధ్య వాణిజ్యం నిర్ణిబంధంగా సాగుతుంది. కాబట్టి దేశాల మధ్య ఎగుమతులు పెరిగాయి.
- ప్రపంచీకరణ వల్ల వివిధ దేశాలలోని పరిశ్రమలలో పోటీతత్వం పెరిగి తమ సామర్ధ్యాన్ని పెంపొందించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.
- సరసమైన ధరలకు నాణ్యమైన వస్తువులను అందించాలి కాబట్టి వర్తమాన దేశాలలో నూతన సాంకేతిక విధానం, ఆధునిక పద్ధతులు ఉపయోగించడం జరుగుతుంది.
- పేదరికాన్ని నిర్మూలించడంలో ప్రపంచ ఏకీకరణ ఎంతో సమర్ధవంతంగా పని చేస్తుంది. ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి.
- ప్రపంచీకరణ నేపథ్యంలో విదేశాల నుండి పెట్టుబడులు భారతదేశ పరిస్థితులను ఆకర్షిస్తున్నాయి. ఉదా: కమ్యునికేషన్లరంగం, భీమారంగం

మన స్వదేశీ పరిశ్రమలకు దెబ్బతగలనంత కాలం, ధనిక, పేద వర్గాల మధ్య అంతరాలు పెరగనంత కాలం, నిరుద్యోగ సమస్య తీవ్రం కానంతకాలం ప్రపంచీకరణ భారతదేశ ఆర్థికభివృద్ధికి దోహదం చేస్తుందని చెప్పవచ్చు. ప్రపంచీకరణ అనేది గడచిన 50 సంవత్సరాలలో నాటకీయంగా అధికవేగంగా అభివృద్ధి చెందిన మానవ జనాభా విస్తరణ మరియు నాగరికత యొక్క పెరుగుదల వంటి వాటిని గుర్తించటం ద్వారా ఒక శతాబ్ద కాలంనాటి పద్ధతిగా చూడబడింది. పట్టు రహదారిచైనాలో మొదలై పార్థియన్ సరిహద్దులను చేరుకొని రోమ్ వైపు కొనసాగినప్పుడు ప్రపంచీకరణ యొక్క పూర్వ నమూనాలు రోమన్ సామ్రాజ్యం, పార్థియన్ సామ్రాజ్యం మరియు హాన్

రాజవంశంలలో కనిపిస్తాయి. ఇస్లామిక్ బంగారు కాలం కూడా ఒక ఉదాహరణగా చెప్పవచ్చు,ఈకాలంలో ముస్లిం వర్తకులు మరియు పరిశోధకులు పాత ప్రపంచంలో మొదటి ప్రపంచ ఆర్ధికవ్యవస్థను స్థాపించటం వలన పంటలు, వాణిజ్యం, జ్ఞానం మరియు సాంకేతిక పరిజ్ఞానంలా ప్రపంచీకరణ జరిగింది మరియు తరువాత మంగోల్ సామ్రాజ్య కాలంలో పట్టు రహదారి గుండా గొప్ప అనుసంధానం జరిగింది. ఇబెరియన్ పెనిన్సుల యొక్క రెండు రాజ్యాలు అయిన-పోర్చుగల్ రాజ్యం మరియు కాస్తిలే రాజ్యంలతో 16వ శతాబ్ధం అంతానికి కొంత కాలం ముందు ప్రపంచీకరణ ఒక విస్తారమైన విధానంలో మొదలయ్యింది.

16వ శతాబ్దంలో పోర్చుగల్ యొక్క ప్రపంచ పరిశోధనలు, ముఖ్యంగా, అనుసంధానించబడ్డ ఖండాలు, ఆర్ధిక వ్యవస్థలు మరియు సంప్రదాయాలు ఒక సామూహిక స్థాయిలో జరిగాయి. చాలామటుకు ఆఫ్రికాతీరం, తూర్పు, దక్షిణ అమెరికా మరియు దక్షిణ మరియు తూర్పు ఆసియాలతో పోర్చుగల్ యొక్క పరిశోధన మరియు వాణిజ్యం ప్రపంచీకరణ యొక్క మొదటి ప్రముఖ వాణిజ్య ఆధారిత పద్ధతి. ప్రపంచ వాణిజ్యం, సమూహాలుగా ఏర్పడటం మరియు వివిధ సంప్రదాయాలను కలిగి ఉన్న ఒక కెరటం ప్రపంచ నలుమూలలను తాకింది. ముందుగా పోర్చుగీసు మరియు స్పానిష్ సామ్రాజ్యాలు తరువాత కొంత కాలానికి ఫ్రాన్స్ మరియు ఇంగ్లాండ్ అమెరికాలో సమూహాలుగా ఏర్పడటం వల్ల 16వ మరియు 17వ శతాబ్దాలలో యురోపియన్ వాణిజ్యం యొక్క విస్తరణ ప్రపంచ అనుసంధానం ద్వారా కొనసాగించబడింది. ప్రపంచ వ్యాప్తంగా సంప్రదాయాలపై ముఖ్యంగా స్వదేశపు సంప్రదాయాలపై ప్రపంచీకరణ ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. 15వ శతాబ్దంలో నూతన కల్పనల కాలంలో యూర్పియన్లచే ఇతర ఖండంలో స్థాపించబడ్డ మొదటి అధికారిక వాణిజ్య సంస్థలలో పోర్చుగల్ యొక్క గినియా సంస్థ ఒకటి, మసాలా దినుసులతో వ్యాపారం మరియు వస్తువులకు ధరలను నిర్ణయించటం దీని పని.

17వ శతాబ్దంలో తరచుగా మొదటి బహుళజాతి సంస్థగా పిలువబడే బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ (1600 లో స్థాపించబడింది), అదే విధంగా డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ (1602లో స్థాపించబడింది) మరియు పోర్చుగీసు ఈస్ట్ ఇండియా కంపెనీ (1628లో స్థాపించబడింది)లు స్థాపించబడటం వల్ల ప్రపంచీకరణ అనేది ఒక వ్యాపార విషయం అయిపోయింది.

అంతర్జాతీయ వాణిజ్యంతో కూడుకున్న భారీ పెట్టుబడి అవసరాలు మరియు అధిక రాబడి జారీ చెయ్యటం ద్వారా సంస్థల యొక్క ఉమ్మడి యాజమాన్యత్వంకు తెరతియ్యటం మరియు అపాయాలను పంచటంలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రపంచంలోనే మొదటి సంస్థ అయ్యింది: ఇది ప్రపంచీకరణకు ఒక ప్రధాన ముందడుగు.

21వ శతాబ్దంలో సమాచార విప్లవం మానవ మనుగడలోనూ భద్రత విషయంలోనూ అభివృద్ధి పరంగా అనేక పెనుమార్పులు ప్రపంచీకరణ తీసుకొచ్చింది. సామాజిక, ఆర్థికపరమైన అంశాలలో దేశాలమధ్య ప్రపంచ వ్యాప్తంగా అనేక మార్పులు తీసుకురాగల శక్తి, శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధిలో మనిషి సాధించిన విజయాలు ప్రపంచీకరణ నేపథ్యంలోనే జరిగాయి.

**3.6.3.ప్రపంచీకరణ - సామాన్య ప్రజలు**: ప్రతి నాణానికి బొమ్మా- బొరుసూ ఉన్నట్లే ప్రపంచీకరణతో సామాన్య ప్రజలకి నష్టంతో పాటు లాభం కూడా సహజంగా ఉంటుంది. ప్రపంచీకరణని నివారించటం అనేది ఒక దేశంతో సాధ్యమయ్యే పని కాదు. ఎందుకంటే శాస్త్ర సాంకేతిక పరమైన పెనుమార్పులు దీనిని అనివార్యంచేస్తూ

ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి ఒక ఉద్యమంలాగా కొనసాగుతుంది. కొన్ని ప్రభుత్వాలు వ్యతిరేకించినా, కొన్ని వర్గాల ప్రజలు వ్యతిరేఖించిన సైన్స్ అండ్ టెక్నాలజీ పరంగా అనివార్యంగా సంభవిస్తున్న పరిణామం. ఒకప్పుడు రేడియో సామాన్య మానవుడికి అందని ద్రాక్షపండు. ఆ తరువాత టి.వి, కాని ఇప్పుడు ప్రపంచీకరణ మూలంగా పోటి తత్త్వం పెరిగి ధరలు తగ్గి మేలైన వస్తువులు అనేకం సామాన్యుడికి కూడా అందుబాటులోకి వస్తున్నవి. అదే విధంగా ఇంకో వైపు చూస్తే మనోఫలితో సామాన్యుడిని దోచుకుంటున్నారు. అనే వాదన కూడా ఉంది. ఆరోగ్య సంరక్షణ ఇప్పుడు సామాన్యుడికి పేదవర్గాలకీ అందని ద్రాక్షపండు. కార్పోరేట్ ఆసుపత్రుల ద్వారా ఉన్నత ఆదాయ వర్గాలకు పరిమితమైపోయింది. అయినా బయోటెక్నాలజీ ఆధారంతో ఆధునిక పరిజ్ఞానం ఆధారంగా, నూతన పరికరాలతో, కొత్త ఆపరేషన్ పద్ధతులతో సామాన్యుడికి అందుబాటులోకి రాబోతోంది. ఇది ప్రపంచీకరణతో మాత్రమే సాధ్యం అయ్యే విషయం. పేద దేశాలు ఇలాంటి ఆధునిక వ్యవస్థలని కనుగొనటం, అభివృద్ధి పరచటం అనేది చాలా సమయం పట్టడంతో పాటు అనేక వనరులు కూడా అవసరం.

ఆధునిక పద్ధతులలో పాలు పంచుకొని ప్రపంచీకరణలో భాగస్వామ్యులు కావటమా? లేక వెనుకబాటుతనంతో దూరంగా ఉండటమా? తేల్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఒక్క ఆరోగ్య విషయంలోనే కాదు అక్షరాస్యత విషయంలో ఇంకా అనేక రంగాలలో ఆధునిక పద్ధతులు అనుసరించటం అనేది ప్రపంచీకరణకు అనుకూలంగానే చెప్పాలి.

సృజనాత్మక ప్రక్రియలలోకి అడుగుపెట్టిన ముఖ్యమైన వాటిలో ప్రపంచీకరణ ఒకటి. 1993 తర్వాత తెలుగు సాహిత్యంలో ఒక భావోత్తేజం ప్రవేశించింది. ముఖ్యంగా కవిత్వంలో ఇది స్పష్టంగా కన్పించడం మొదలైంది. వికసించిన విద్యుత్తేజం గ్లోబల్ ఖడ్గం, ప్రపంచీకరణపై ప్రతిధ్వని వంటి కవితా సంకలనాలతో కవులు సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేఖిస్తూ కవిత్వం వ్రాశారు. గాట్ ఒప్పందం తర్వాత వర్తమాన దేశాల అస్థిత్వం ప్రశ్నార్ధకమైంది. గాట్ ఒప్పందం ప్రధానంగా IMF, WTO, WORLD BANK వంటి రంగాలలో అమలు జరుగుతుంది. ఈ మూడింటి పైన అమెరికాదే పెత్తనం. అందువలన కవులలో అమెరికా వ్యతిరేఖత కూడా ఒక పార్శ్వం అయింది. గ్లోబలైజేషన్ అనే పదాన్ని ప్రపంచ వ్యాప్తం చేసింది అమెరికాయే .

సమాజం నిరంతరం మారుతుందనే గతితార్కిక నియమాల ప్రకారం ప్రతీది మారుతుందనటంలో సందేహం లేదు. సమాజంలో మార్పులు రావటమంటే, మనిషి జీవితం మారటం అంటే, సామాజికజీవితం నుండి విడవడి వైయుక్తిక జీవితంలోకి మార్చటం పెట్టుబడిదారీ విధాన లక్షణం. పెట్టుబడిదారీ సమాజం ఈ వ్యక్తిగత విధానానికి నాంది పలికింది. పెట్టుబడిదారీ సమాజం తెచ్చిన సమస్యలలో సామ్రాజ్యవాదం సమాజ ప్రయోజనాలను కోరుకోదు. మిగులు ఉత్పత్తులు అనే మార్కెట్లు లేకపోవడంతో సామ్రాజ్యవాదులు కొత్త అవతారాలెత్తి ప్రపంచీకరణ అనే నూతనపదాన్ని ప్రవేశపెట్టారు. మార్కెట్ల కోసం అన్వేషించింది. వర్ధమాన దేశాలను లొంగదీసుకోవడం కోసం ప్రపంచ బ్యాంకు ద్వారా అప్పులిప్పించడం మొదలుపెట్టింది.

బ్రిటీష్ సామ్రాజ్యవాదులు నాడు దేశాన్ని దోపిడీ చేస్తుంటే తెలుగు కవులు దాన్ని వ్యతిరేఖిస్తూ కలాలకు పదును పెట్టారు. 1807 నుంచి మొదలుకొని ఈ నాటి ప్రపంచీకరణను నిరశిస్తున్నారు.

గ్లోబలైజేషన్ పేరుతో మూడవ ప్రపంచ దేశాల్లో నువ్వు సృష్టిస్తున్న విధ్వంసం కన్నా తీవ్రమైందా ఈ ఉగ్రవాదపు విధ్వంసం.

"ఎవడో పొట్టి వంగడాలను

రక్తంలో ముంచి నాట్లేస్తున్నాడు" అని రైతుల పరాధీనతను తెలుగుకవి గానం చేస్తున్నాడు. ప్రస్తుత కాలంలో కథలు, నవలలు, కథానికలు వచ్చాయి. ప్రపంచీకరణ ప్రభావంతో దళిత, స్త్రీవాద, విప్లవ, మైనారిటీకవుల స్పందన ప్రపంచీకరణలో భాగంగానే పరిశోధనలు జరగాల్సి ఉంది.

**ముగింపు:** మొత్తంపైన ప్రపంచీకరణ వ్యతిరేకత, అనుకూలత రెండింటిని బేరీజు వేసుకొని చూస్తే కవిత్వంలో వ్యతిరేక దృష్టితోనే ఎక్కువ శాతం కవిత్వం వచ్చింది. అనుకూలత చాలా తక్కువ అందులోనూ తెలుగు కవులు సామాన్య ప్రజల కోణం నుంచి ఆలోచించి కవిత్వాన్ని సృష్టించారు. కానీ అనుకూల విషయాలు చాలానే ఉన్నాయి. ఇంటర్నెట్, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి పరంగా కొంత వరకు మేలే జరిగింది. నేడు విజ్ఞాన వంతులు ఎక్కువైనారు. ఇలాంటివన్నీ అనుకూలతలో భాగమే. మరి వ్యతిరేకత చూస్తే ప్రపంచీకరణలోని అసమానతలకు వ్యతిరేకంగా ఇప్పటికే ఉధృత స్థాయిలో సాగుతున్న ఉద్యమాలు, పోరాటాలు రానున్న కాలంలో మరింత తీవ్రమౌతాయి. సోషల్ నెట్ వర్కు ఎక్కువ కావటం మూలాన సైబర్ నేరాలు ఘోరంగా పెరిగిపోతున్నాయి. సంస్కృతి నాశనం అవుతుంది. విద్యార్థుల భవిష్యత్ ఘోరంగా తయారవుతుంది. సాంకేతికాభివృద్ధి సాంస్కృతిక వికాసానికి, విశ్వమానవ సౌభ్రాత్రతకు బాటలు వేయాలి.

## పాదసూచికలు

1.ఖాదర్ మొహియుద్దీన్ - పుట్టుమచ్చ కవిత

2.వొడ్నాల సూర్య - వొడ్నాల సూర్య కవితలు; పుట.78

3.దుప్పల రవికుమార్ - వందనం; పుట. 97

4.త్రిపురనేని రామస్వామిచౌదరి - సుతాశ్రమ గీతాలు;పుట.13,27

5.అయ్యపు వెంకట కృష్ణయ్య- మనది భారతదేశం గేయసంకలనం; పుట.42

6.అద్దేపల్లి రామమోహనరావు - పొగచూరిన ఆకాశం; కెమెరా, కవిత

7.సుంకిరెడ్డి నారాయణరెడ్డి - గ్లోబల్ ఖడ్గం, కాగితప్పులి కళ్ళలో భయం కవితా సంపుటాలు;

8.అల్లం నారాయణ - మొలతాడు లేని దెయ్యం; పుట.31

9.గుడిపాటి - సాహిత్య ప్రస్థానం;జనవరి.2005

10.ఇండియా ప్రైవేట్ లిమిటెడ్; నయనం ప్రచురణలు,జులై - 1996,పుట.2

11.దేశపతి శ్రీనివాస్ వ్యాసం(ఆంద్ర ప్రభ)

12.పోగుల రాజన్న - ముగులైంది; మంజీరా రచయితల సంఘం,జులై.1996

13.తెలుగు కవిత్వోద్యమాలు ; పుట.170(తెలుగు అకాడమి)

14.కొనకళ్ళ వెంకట రత్నం - మిసిమి మాస పత్రిక; పుట.9

15.శ్రీకృష్ణ  చేయెత్తి జైకొట్టు కవిత - ఆంధ్ర ప్రదేశ్ మాస పత్రిక; పుట.17

16.వఝుల శివకుమార్ -  దాఖలా; పుట - 97

17.సుంకిరెడ్డి నారాయణ రెడ్డి - దాలి

18.గుడిపాటి - పర్యాయపదం; పుట.13

19.సూర్యవంశీ - డంకెల్ పాఠం కవిత

# 4.ప్రపంచీకరణ తెలుగు కవిత్వం

**4.1. కవి:** కవి అనగా “కావ్యకరౌ సురౌకవిర్వాల్మీకి శుక్రయోః” అని విశ్వకోశం. ‘కావ్యం గ్రంథే’ అని కూడా విశ్వకోశం తెలుపుతుంది. ‘కవితా’ అనే సంస్కృత పదానికి, మోనియర్ విలియమ్స్ సంస్కృత - ఇంగ్లీషు నిఘంటువులో poetry ornate style whether verse, or prose), a poem అనే అర్థాలున్నాయి. కావ్యం అనే పదం కవి నుండి వచ్చిందని కావ్యం a poetical work(ఋగ్వేదంలో) a poem, a poetical composition with a coherent plot by a single author అని ఆ నిఘంటువులోనే వివరించబడింది.

కవిత్వం యొక్క స్వరూప స్వభావాలను చర్చించుటకు ముందు కవి అనగా ఎవరో పరిశీలిస్తే ‘కవిర్మనీషీ పరిభూః స్వయం భూః’ అని కవి శబ్ధం ‘పరమాత్మ’అను అర్థమున కనిపిస్తుంది. క్రమముగా అది ‘ఋషి’ పరముగా వాడబడినది. ‘నానృషిః కురుతే కావ్యం’ ‘కవయః క్రాంత దర్శః’ అను లోకోక్తులు కవి అనగా ఋషియనే బలపరుస్తున్నాయి.

“ఏ భాషలోనైనా
ఏ కాలంలోనైనా ఏ దేశంలోనైనా
కవి అనేవాడు కళ్ళు మూసుకు వుండడు
బాధ ఎక్కడ ఉంటుందో
అక్కడ వాలుతాడు
దుఃఖం ఎక్కడ గుండె పగులుతుందో
అక్కడ అక్షరమై ఓదార్చుతాడు
అన్యాయం ఎక్కడ ఒళ్ళు మరచి ప్రవర్తిస్తుందో
అక్కడ ఎద్దులను తోలే వార్ కట్టై ఆగ్రహిస్తాడు.[1]

**4.2.కవిత:** చిన్నచిన్న పదాలలో ఎక్కువ భావం స్ఫురించేలా, తక్కువ నిడివి గల ప్రామాణిక సాహితీ ప్రక్రియ..... కవిత! ప్రాసానుప్రాసలతో, రాగయుక్తీకరణలో, మధ్యలో అంతం గాకుండా....... ఒక విషయవస్తువు ప్రారంభిస్తూ చివరగా అదే రీతిలో ముగిసే సాహితీ ప్రక్రియ కవితగా రూపుదిద్దుకుంది.

ఛందో వ్యాకరణాలతో పూర్వపురాణ కవుల నేపథ్యంలో ప్రారంభమైన కవిత్వం- కాల బంధనాలకు చిక్కిన సదృశ్యంలో 'శిల్పం' మాత్రం చెక్కుచెదరలేదు. వస్తు - రూపాల వైవిధ్యం మినహా కవితలో వచనకవిత్వం, గేయం, ఖండికలు, గల్పికలు మొదలైనవి కవితాదీనంలో సామంత ప్రాభావాన్ని చాటుకున్నాయి.

**4.3.కవిత్వం:** ఆధునిక సాహిత్యయుగంలో కవిత్వం 'కవిత' శబ్దరూపమై ప్రాణం పోసుకుంది. పద్య, గేయ, వచన కవితారీతులలో విహరిస్తోంది. ఆధునిక తెలుగుకవిత పట్టుచీరల, బరువులు, అలంకారాది సింగారాలు, శ్లేషాది విశేషాలు వదిలి, తేటతెల్లని నూలు చీరలు కట్టి కొత్తరుచులు సంతరించుకుంది. పాత సాంప్రదాయ పద్ధతులను, పాతకావ్యరూపాలను వదిలి పాశ్చాత్య కవితా ప్రభావంతో తెలుగుకవిత్వం కొత్తరూపుదిద్దుకుంది. అధునాతన పోకడలతో తెలుగుసాహిత్యాన్ని సుసంపన్నం చేస్తోంది. మహారాజుల చరిత్రలు వదిలి, సామాన్య ప్రజల సజీవ చిత్రాలనే కవితావస్తువుగా స్వీకరించింది. కష్టాలైన, నష్టాలైన, సుఖాలైన, దుఃఖాలైన వారి వెంటనంటి నడుస్తోంది. ప్రజాఉద్యమాలకు ఊతకర్రగా నిలిచి వస్తువులో, రూపంలో, శిల్పంలో నిర్దిష్టమైన కొత్తపోకడలు సంతరించుకుంది.

కవిత్వం అనేది వైయుక్తిక సృజనాత్మక ప్రక్రియ. అన్ని కళల్లాగే కవిత్వం కూడా ఒక నిరంతర సాధన కాబట్టి. సాధన ద్వారా కవిత్వాన్ని మెరుగు పరుచుకోవచ్చు కవిత్వం అంటే అక్షర హింస కాదు. అక్షరాల కుంటి నడక అంతకంటే కాదు. కవిత్వం అంటే అక్షర తాండవం. కవిత్వం అంటే ఒక అన్వేషణ. ఒక తీరని వేదన. సంకోచాలు, మొహమాటాలు కవిత్వానికి తీరనిహాని చేస్తాయి. చెప్పేదేదైనా బలంగా ఉండాలి. నంగిమాటలు, నత్తి చేష్టలు వద్దు. అంతా రాస్తున్నారు కాబట్టి మనమూ రాద్దామన్న కుర్రతనపు వికారాలు వద్దు. కీర్తి కాంక్ష అసలే వద్దు . ఇక ఈ క్షణంలో ఈ కవిత రాయకపోతే చచ్చిపోతాం అన్నంత ఆవేశం వస్తేగాని ఒక మంచి కవిత జన్మించదు. నిన్ను నువ్వు పూర్తిగా అర్పించుకుంటే తప్ప కవిత నిన్ను కరుణించదు. కవిత పాఠకుడిని కదిలించడానికి ముందు కవిని కదిలించాలన్న విషయం మర్చిపోకూడదు. రసమయ ఘడియల్లో సృజించిన కవిత, కొన్నాళ్ళాగి చదివితే రాసినప్పటి మానసిక స్థితిలోకి తీసుకువెళ్తోందో లేదో చూసుకోవాలి. అలా తీసుకువెళ్ళినట్లైతే అది కవిత అయినట్లే.

ఆధునిక తెలుగు సాహిత్యంలో కవిత్వం అనగానే పద్యం పోయి వచనకవిత్వం మాత్రమే కవిత్వంగా వస్తుంది. కవితా శాఖలోలాగానే వచన కవిత తరం నుంచి తరానికి రచనా విధానం, ఇతివృత్తం స్వీకరించే పద్ధతి పాత్రచిత్రణ, సిద్ధాంత ప్రవచనం మందగమనంతోనైనా మారుతూ వచ్చాయి. నిజానికి ఏ ఉద్యమం అయినా అది ముందు కవితాశాఖలో ప్రతిబింబించి తరువాత వచనంలోకి ప్రవేశించడం ఆధునిక తెలుగు సాహిత్యంలో సర్వసాధారణంగా మనం చూస్తూ ఉంటాం. కవిత్వం గురించి బెల్లంకొండ రవికాంత్ మాటల్లో.....

"ఊహలు ఊసులు వెన్నెల జలకాలు
చలిగదులు వెచ్చని కలవరింతలు
పొడిపొడి పదాలుగా పల్లవించి
చప్పట్ల దుప్పట్లలో ఒరగడమే కవిత్వమైతే
.................................................
రక్తాన్ని రుచిమరిగిన తూటాలు దొంగదెబ్బ తీస్తే
కొండల్లో ఏకాకిగా మిగిలిన వీరుడి శవమే అద్భుత కవిత్వం
................................................
వరికోత కోయడమే జీవితానికి పొడిగింపయితే
ఆ తల్లి పాదాల కింద నలిగిన మట్టే మహాద్భుత కవిత్వం".[2]

ఒకనాటి సామాజిక సమస్యల్నీ, అభిరుచుల్నీ, సుఖ దుఃఖాలన్నీ చిత్రించాలంటే, ఆ సమాజం, ఆ రచనలో ప్రతిబింబించాలన్నమాట. అంటే రచయిత ఈపరిధిలో ఆత్మాశ్రయ దశకు చేరుతున్నాడు. కవిత్వం ఒక సమాజంలో నివసించే 'వ్యక్తి' హృదయాన్ని చెపుతుంది. ఇతర ప్రక్రియలలో సమాజ హృదయాన్ని 'వ్యక్తి' ఆవిష్కరిస్తాడు.

**4.2.1.కవిత్వంలోభాష:** మానోనేత్రిణి బాహ్య ప్రపంచాన్ని చూపించేది, బాహ్య ప్రపంచాన్ని గురించిన అవగాహన కలిగించేది, అవసరమైనప్పుడు బాహ్య ప్రపంచాన్నుంచి దాన్ని రక్షించేది భాష. కవిత్వానికి ఒక ప్రత్యేకమైన భాష, పరిభాష (Parlance) ఉంటాయి. ఉండాలి కూడా. భావం గొప్పది లేక అందమైనదైతే చాలు, దాన్ని వ్యక్తీకరించటానికి ఉపయోగించే భాష ఎలా ఉన్నా ఫరవా లేదు అనే అభిప్రాయంతో రాసే కవిత్వం అంత ప్రభావవంతంగా ఉండదు. అసలు భావసౌందర్యమే అంత

అవసరం కాదు పో- అని వాదించే వాళ్లకు ఇక భాషా సౌందర్యపు ఆవశ్యకతను విడమర్చి చెప్పటం వల్ల ప్రయోజనమేముంటుంది అందాన్ని ఆవిష్కరింపజేసేదే కవిత్వం అయినప్పుడు అందమైన లేక గొప్ప భావాన్ని కలిగి ఉండడంతో పాటు అందమైన భాష ద్వారా వ్యక్తీకరణ జరిగినప్పుడే కవిత్వం బాగా రూపుదిద్దుకుంటుంది. భాష ద్వారా అందమైన వ్యక్తీకరణ జరగాలనటం వరకు మాత్రమే సమంజసం అని ఇదే విషయాన్ని మరో విధంగా చెప్పుకున్నా భాష కనీసం విశిష్ఠంగా ఉండాలనే విషయం మన అవగాహనకు వస్తుంది. అందమైనదో, విశిష్ఠమైనదో, ప్రత్యేకమైనదో కానటువంటి మామూలు భాష కవిత్వానికి విఘాతం కలిగిస్తుందనేది మాత్రం వాస్తవం. కథ, వ్యాసం, నవల వంటి వచన ప్రక్రియలకు ఇది వర్తించక పోవచ్చు. కవిత్వంలో ప్రత్యేక భాష ఉండాలన్నప్పుడు కవి తప్పక పెద్దపెద్ద పదాలను ఉపయోగించాలని కాదు దాని అర్థం. అట్లాంటి పదాలు పూర్తిగా అనవసరమని కూడా చెప్పలేం. సరైన స్థానంలో సరైన పదం (Right word in right place) ముఖ్యం. కవిత్వానికి కేవలం గొప్ప, లేక అందమైన ఊహే చాలు అనే భావన సరైనదైతే కవులు కాని విద్యావంతులు రాసేది కూడా కవిత్వంగా చెలామణి అయ్యే ప్రమాదముంటుంది. ఎందుకంటే కవులు కాని వాళ్లకు కూడా గొప్ప భావాలు స్ఫురించవచ్చు. అందమైన భాష అంటే అది మనసుకు హాయిని గొలిపే విధంగా ఉండడం అనివార్యమని ఉద్దేశం కాదు. ఉద్రేకాన్నీ, కోపాన్నీ, వేదననూ, అశాంతినీ రగిలించటం కూడా అందమైన భాష చేసే పనే.

కవిత్వంలో అనుభూతిని ప్రభావవంతంగా ఆవిష్కరింపజేసి రసాన్ని అనుభవింప జేయటం సరైన భాష లక్షణం. వ్యక్తీకరణకు సంబంధించిన ఈ అంశాల పరిగణన తర్వాతే మిగతా లక్షణాలు ఒక రచనలోని కవిత్వ స్థాయిని నిర్ధారిస్తాయి. ఈ వాక్యం ఒక రచన కవిత్వం అవుతుందా కాదా అనే విషయాన్ని తేల్చటానికి మాత్రమే ఉపయోగపడుతుంది తప్ప వస్తువు కన్న శిల్పం ముఖ్యం అని ప్రతిపాదించదనే విషయాన్ని ఇక్కడ గమనించాలి. కవిత్వానికి వస్తువు, శిల్పం రెండూ ముఖ్యమైనవే. శిల్పానికి అవసరమైన అభివ్యక్తిని సాధించటానికి ఉపయోగించే భాషది ఎంత ముఖ్యమైన పాత్రో గుర్తించక, దాన్ని చాలా తక్కువగా అంచనా వేయటంతోనే వస్తుంది యిబ్బంది అంతా. అభివ్యక్తి శిల్పానికి దారి తీస్తే శిల్పం అభివ్యక్తిని మెరుగు పరుస్తుంది, లేక పరిపుష్ఠం చేస్తుంది. అంటే ఈ రెండూ పరస్పర పూరకాలు (Mutually -- complementary) అన్నమాట.

కవిత్వం రాసేటప్పుడు సంస్కృత పదాలను పరిహరించి అన్నీ అచ్చతెలుగు పదాలనే ఉంచాలనడం విడ్డూరం. సంస్కృతాన్ని పూర్తిగా బహిష్కరిస్తే తెలుగు భాష జవసత్వాలతో మనగలుగుతుందా అనేది ఆలోచించాల్సిన విషయం. అసలు కొన్ని సందర్భాల్లో సంస్కృత పదాలను వాడడం అనివార్యమౌతుంది.'వసంత బీజాన్ని గర్భీకరించుకున్న స్వప్న శకలాన్ని' అనే కవితా పంక్తి ఉందనుకోండి. ఇందులోని ఐదు పదాలూ సంస్కృత సమాలే. వీటిలోంచి ఎన్నింటిని తీసేసి వాటి స్థానాల్లో సౌందర్యం, భావస్ఫోరకత తగ్గకుండా అచ్చతెలుగు పదాలను పెట్టగలం.

కవిత్వం చాలా ఆధునికంగా, తాజాగా ఉండాలంటే గతంలో కవులు తరచుగా వాడిన పదాలను, పదబంధాలను ఉపయోగించకూడదనే వాదన ఒకటుంది. ఇది ఆమోదయోగ్యమైనదే కాని ఏది బాగా అరిగిపోయిన పదం అనేవిషయమై అభిప్రాయాల్లో భేదాలు ఉండవచ్చు. రెండు మూడు పదాలతో కూడిన పదబంధాలను అవి అంతకు ముందే చాలా సార్లు వాడబడితే వాటిని మళ్లీ వాడకపోవటం ఒక ఉదాహరణ ఐతే, కొంత మార్పు చేసి పదే పదే వాడిన ఒకపదాన్ని ఉపయోగించకుండా ఉండటం మరొక ఉదాహరణ. శ్రీశ్రీ వాడిన 'బాధాసర్ప దష్టులు' అనే పదబంధాన్ని యథాతథంగా ఉపయోగిస్తే ఆ కవితా పంక్తి తాజాదనాన్ని కోల్పోతుందని ఒప్పుకుంటాం. కాని కన్రెప్పలు అనే పదాన్ని ఆధునిక వచన కవిత్వంలో బాధాసర్పదష్టులు కంటె తరచుగా చూస్తున్నా అది అరిగిపోయిన పదమని ఆరోపించే వాళ్లు తక్కువ. ఎందుకంటే మహాప్రస్థానం అత్యంత విస్తారంగా చదివే పుస్తకం కావడం మూలాన పఠితల మెదళ్లలో ఆ పదబంధం (బాధాసర్ప దష్టులు) లోతుగా ప్రతిష్ఠితమైంది. కన్రెప్పలు అని కాక కనురెప్పలు అనే పదం ఉందనుకోండి. ఎక్కువగా వాడినా దానికి అరిగిపోయిన తనాన్ని అంటగట్టలేము.

**4.3.కవిత్వం ప్రయోజనం:** ఆదిమ మానవ వ్యవస్థలో కవిత్వం సౌందర్యాన్ని ఆరాధించి ఆనందించే ఒక సాధనంగా కనిపిస్తుంది. చరిత్రకి, మతానికి, న్యాయశాస్త్రానికి, ఇతరేతరమైన శాస్త్రాలకి కవిత్వమే ప్రధాన వాహికగా పని చేస్తుంది. సామాజిక వ్యవస్థలో కనిపించే పరిణామం సాహిత్యవ్యవస్థలో కూడా ప్రతిబింబించింది. ఒక ప్రత్యేక కాలంలో వచ్చిన కవిత్వం తత్కాల సామాజిక వ్యవస్థ యొక్క భావాలకు, ఆశయాలకు, ఆశలకు, అవసరాలకు ప్రతిబింబమనే అభిప్రాయాన్ని మనం

అంగీకరించినట్లయితే కవిత్వానికి ఒక ప్రయోజనం ఉంటుంది. ఒక విధమైన కవిత్వం ప్రయోజనాన్ని ఆశించి ఉంటుంది. మరొక రకమైన కవిత్వం ప్రయోజన రహితంగా ఉంటుంది.

"నేనేదో విరచిస్తానని
నా రచనలలో లోకం ప్రతిఫలించి
నా తపస్సు ఫలించి
నా గీతం గుండెలలో ఝూర్ని ల్లగా
నా జాతి జనులు పాడుకొనే
మంత్రంగా మోగించాలని,
నా ఆకాశాలను
లోకానికి పేరుచేయగా
నా ఆదర్శాలను
సోదరులంతా పంచుకొనే
వెలుగుల రవ్వల జడిగా ..."[3]

ఇలా తన కవిత్వ ప్రయోజనాన్ని గురించి చెప్పాడు. శ్రీశ్రీ కవిత్వంలో కవిత్వప్రయోజనం, కవిత్వశిల్పం ఒకదానిలో ఒకటి ఇమిడిపోయాయి.

శ్రీశ్రీ తన కవిత్వం ద్వారా ఒక ప్రయోజనాన్ని సాధించదలిచాడు కాబట్టే అతని కవిత్వలోకానికి ప్రతిబింబంగా ఉండాలని ఆశించాడు. తానురాసే కవిత్వానికి, సమకాలీన జీవన చైతన్యానికి అవినాభావ సంబంధముంది. శ్రీశ్రీ తాను ఆశించినట్లుగానే తనకాలంనాటి సామాజిక వాస్తవికతను ప్రతిబింబించే కవిత్వం రాశాడు.

"ఒక వ్యక్తిని మరొక వ్యక్తి
ఒకజాతిని వేరొక జాతి
పీడించే సాంఘిక ధర్మం ఇంకానా, ఇకపై సాగాదు"[4] అంటూ తన సామ్యవాద సిద్ధాంతాన్ని బలంగా చెప్పాడు.

**4.4.తెలుగులోవచనకవిత్వ ప్రక్రియ:** తెలుగు వచన కవిత్వ ప్రక్రియ కుందుర్తితో ఆరంభం కాలేదు. కానీ వచన కవిత్వం గురించి ప్రస్తావించిన వెంటనే కుందుర్తి గుర్తుకు రావడం సహజం. 20వ శతాబ్ది తెలుగు పద్యవిధాన చరిత్రలో ప్రత్యేక అధ్యాయాలు నిర్మించుకున్న విశ్వనాధ సత్యనారాయణ, గుఱ్ఱం జాషువాల శిష్యుడు కుందుర్తి. కానీ ఆయన తన గురువుల మార్గాన్ని విడిచి స్వీయపథాన్ని ఎంపిక చేసుకున్నారు. వచన కవిత్వ వికాసానికి కుందుర్తి ఎంతో నిబద్ధతతో కృషి చేశారు. శిష్ట్లా ఉమామహేశ్, పఠాభి, శ్రీశ్రీ, నారాయణబాబు, పాలగుమ్మి పద్మరాజు వంటి ప్రతిభావంతులు ప్రయోగంగా ఆరంభించిన వచన కవిత్వ ప్రక్రియకు సుస్థిరతను అందించే క్రమంలో కుందుర్తి కృషి ఎంతో విలువైంది. ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసుతో కలిసి నరసరావుపేట నుండి నయాగరా సంకలనాన్ని వెలువరించడం మొదలుకుని తుది శ్వాస వరకు కుందుర్తి వచన కవిత్వ ప్రక్రియనే నమ్ముకున్నారు. తన గురువు విశ్వనాధ పట్ల అపరిమిత గౌరవంతో ఒకే ఒక్కసారి పద్య రచన చేశారు 1960లో కుందుర్తి ఆరంభించిన ఫ్రీవర్స్ ఫ్రంట్ వచన కవిత్వ విస్తరణకు ప్రేరణ నందించింది. ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఒక సాహిత్య సభలో 'వచన కవితా పితామహుడు' అంటూ చేసిన వర్ణన కుందుర్తికి బిరుదువలె నిలిచింది.

కుందుర్తి తాత్వికతతో ఖచ్చితత్వం తక్కువ. ఆయన అటు శ్రోత్రియ మార్క్సిస్టు కాదు, ఇటు మార్క్సిజాన్ని తీవ్రంగా నిరసించే సంప్రదాయవాదుల కోవాలోనూ చేరలేదు. మానవీయ స్పర్శ ప్రగాఢంగా ఉండే సంవేదనల్ని, కరుణనూ ఆయన బాగా ఇష్టపడ్డారనిపిస్తుంది. ఇది ఆయన యావత్ కవిత్వంలో అంతర్లీనంగా గుర్తించవచ్చు. నాలుగు దశాబ్దాల కుందుర్తి వచన కవితా యానంలో ఉల్లేఖనీయమైన విజయాలున్నాయి. వాటిని వెంటాడిన అపజయాలూ కనపడతాయి.'సమీక్షకులు నానా చీవాట్లు పెట్టినా రసజ్ఞుల ప్రశంసల వానలు కురిపించినా దూషణ భూషణ తిరస్కారాలకు దూరంగా ఉండగలవారు ఆత్మవిశ్వాసపు కండగలవారు కొందరున్నారు లోకంలో. అందులో నేనొకణ్ణి' అని కుందుర్తి నిండు హృదయంతో ప్రకటించుకున్నారు. ఆయన హైదరాబాద్ చేరుకునే నాటికి (అంటే 1950వ దశకం ఆరంభం) తెలుగు సాహిత్యంలో వచన కవిత్వం అంతగా ప్రాచుర్యమున్న ప్రక్రియ కాదు. ఈ పరిస్థితుల్లో వచన కవిత్వ వ్యాప్తికి కుందుర్తి నడుం బిగించారు. కుందుర్తి ఇచ్చిన ప్రోత్సాహంతో కవి సమ్మేళనాలలో వచన కవిత్వాన్నే పఠించే సంప్రదాయం ఆరంభమైంది. కుందుర్తి కవిత్వంపై ప్రత్యేక అధ్యయనం చేసిన అద్దేపల్లి రామమోహనరావు పేర్కొన్నట్టు "వచన కవితను

ద్వేషించే సంప్రదాయకుల్ని దూషించి ముందుకు దూసుకుపోయే విధానం కుందుర్తికి నచ్చలేదు. సంప్రదాయికుల్ని కూడా మనస్ఫూర్తిగా ఒప్పించే సాత్త్వికమైన ప్రచార పద్ధతిని కుందుర్తి అవలంబించాడు. తెలుగు దీర్ఘ కావ్యరచనా విధానం కుందుర్తి 'తెలంగాణ' కావ్యంతో బలపడింది.

వచనకవిత్వం ఇంకా తెలుగు సీమలోని అన్ని ప్రాంతాల్లోనూ స్థిరపడని రోజుల్లో దీర్ఘకావ్య రచనకు ఉపక్రమించడం గొప్ప విషయమే. పలువురు రచించిన వచన కవితలకు, కావ్యాలకు పీఠికలు రచించారు. దేవరకొండ బాల గంగాధర తిలక్ 'అమృతం కురిసిన రాత్రి'కి కుందుర్తి రచించిన పీఠిక ఆయన కవిత్వం వలనే నిరలంకారంగా గంభీరమైన రీతిలో ఉంది. ఇట్లా అభిప్రాయాలు, పీఠికలు, సమీక్షల ద్వారా వచన కవిత్వపు సానుకూల విమర్శకు కుందుర్తి పాదులు వేశారు. అయితే కుందుర్తికి ఎందుకో ఏమో సీరియస్ విమర్శకుడిగా గుర్తింపు రాలేదు. "విమర్శలో శాస్త్రీయ పరిభాష అభివృద్ధికి అంతగా దోహదం చేయకపోవడం వల్ల సాధారణ సాహిత్య పాఠకలోకంలోనూ ఆయన వ్యాసాలు అంతగా సంతృప్తిని ఇవ్వకపోవచ్చు కానీ కుందుర్తి వ్యాస సంకలనాన్ని ఒకఊపులో చదివిన వారికి ఆయన దృక్పథం, చలనంలేని భావాలు, సమాధానపడలేని ఆలోచనలు స్పష్టంగా బోధపడతాయి అన్నారు కె.కె.రంగనాథాచార్యులు. దీనితో చాలామంది ఏకీభవించవచ్చు. వచన కవిత్వానికి సాహిత్య విమర్శను మౌలిక స్థాయిలో అందించగలగడం కూడా కుందుర్తి విజయంగానే నమోదవుతుంది.

ప్రపంచీకరణ తరంలో 'సిద్ధాంతేర' కవిత్వం రాస్తున్న నవ వచన కవుల మీద కూడా కుందుర్తి ప్రభావం పెద్దగా కనిపించదు. నగ్నముని, శేషేంద్ర, శివారెడ్డి, నందిని సిధారెడ్డి, వరవరరావు, వీరందరూ కుందుర్తి తర్వాత తరంలో స్వంత గొంతుకను వినిపించినవారే. సి.నారాయణరెడ్డి, మాదిరాజు రంగారావు వచన కవితలు కుందుర్తి శైలికి (కొంతవరకు) దగ్గరగా ఉంటాయి. కుందుర్తి 'సులువైన వచన కవిత్వం' రాసారనే విమర్శ ఉంది. పద్య కవిత్వంలో తిక్కన మార్గం ఎటువంటిదో, వచనకవిత్వ రచనలో కుందుర్తిది అదే పద్ధతి అని అద్దేపల్లి రామమోహనరావు అభిప్రాయం. ఒకసారి చదివినప్పుడు ఎంతో సులభమనిపించే కుందుర్తి కవిత్వంలో ఎన్నో లోతైన అర్థాలు, గాఢమైన నిగూఢమైన భావాలు ఉన్నాయో అద్దేపల్లి రచించిన 'కుందుర్తి కవితా తత్వం' చదివితే అర్థమవుతుంది. భాషా ప్రయోగం కుందుర్తికి ఇష్టమని ఆయన కవితలు చదివితే తెలుస్తుంది. వచన కవిత్వంలో కథాకావ్యాలు వెలువడాలని కుందుర్తి బలంగా కోరుకున్నారు. కుందుర్తి కథాకావ్యాలను

పరిశీలించినపుడు వాటికంటే ఆయన ఖండకవితలే ఎక్కువ సాంద్రంగా ఉన్నాయన్న భావన కలుగుతుంది. ఈ నిజాన్ని బేరీజు వేసుకున్న వర్ధమాన వచనకవులు కథా కావ్యరచనకు సాహసం చేసి ఉండకపోవచ్చు. తాను ఎంతగానో ఇష్టపడిన కథా కావ్యప్రక్రియకు వచన కవులనుండి ఆశించిన స్పందన పొందకపోడం కుందుర్తి వైఫల్యమే. ఆయన కవిత్వాన్ని అనుకరించిన వారికన్నా అధ్యయనం చేసినవారే ఎక్కువమంది. అదే ఆయన కవిత్వ విజయ వైఫల్యాల సమ్మేళన సూచిక.

**4.5.ఆధునిక కవిత్వంలో తిరుగుబాటు ధోరణులు:** కవిత్వ వ్యవస్థలో ఆధునిక శబ్దం రూఢమైన పరిభాషలో వినబడటం లేదు. "ఆధునికం" అనే మాటను ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ఉపయోగిస్తున్నారు. నవ్యత, సమకాలీనత, ఆధునికత ఈ మూడు సమానార్థంగాను, పర్యాయ పదాలుగాను ఉపయోగింపబడుతున్నాయి. ఇట్లా మూడు విభిన్న బోధకాలైన పదాలను ఏక బోధకంగా వాడటం వలన ఒక అవ్యవస్థ ఏర్పడుతోంది. ఎంచేతంటే - సాహిత్యకారులతోపాటు విశ్వవిద్యాలయాలు కూడా కవిత్వానికి సంబంధించినంత వరకూ ఆధునికతను ఏర్పరుచుకోలేకపోతున్నాయి. అంటే మేధావులు కూడా ఈ అవ్యవస్థకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కారణమవుతున్నారని అర్థం.

సమకాలీనులంతా ఆధునికులు కారు అని ఇప్పటికీ ఇంకా చెప్పుకోవటం హాస్యాస్పదమైన విషయం. సమకాలీనులలో ఆధునిక సంప్రదాయానికి చెందినవాళ్ళు ఉంటారు. ఆధునిక, ప్రాచీన సంప్రదాయాలు కవిత్వ వ్యవస్థలోనూ, సంపూర్ణంగా మార్పును ఆశించేవాడు, ఆ మార్పుకోసం ప్రయత్నం చేసేవాడు ఆధునికుడు. వాడి రచన ఆధునిక రచన; వాడి 'ఆలోచన' ఆధునిక ఆలోచన. ఈ కాలంలోనే జీవిస్తూ గతించిన కాలాల సాహిత్య, సామాజిక సంప్రదాయాలను పరిరక్షించుకోవాలనుకునేవాడు ప్రాచీనుడు. వాడి రచన, ఆలోచన ప్రాచీనమైనవని వేరే చెప్పనవసరం లేదు. ఇది నేను స్థూలంగా చేసిన విభజన.

**4.6. కవిత్వంలోభావాలకూర్పు:** ఆధునిక కవిత్వంలో భావాల కూర్పు అనేది ప్రాచీనకవులని మార్గదర్శకులను కావించి ఆధునిక కవితా ధోరణులయిన భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ, స్త్రీ, దళితవాద కవితా ధోరణులు అనుభూతి ప్రధానమైన ప్రక్రియలుగా కవులు తన అనుభూతిని అందించే కవిత్వాంశముగా నిలుస్తుంది. గురజాడ కాలం వరకు తెలుగు కవిత్వం, తెలుగు సాహిత్యం

గుణ యతి ప్రాస నియమాలతో, పాదనియమాలతో,సంస్కృత శబ్దాడంబరాలతో, దీర్ఘసమాసాలతో పాండితీప్రకర్షలతో చంపూకావ్య పద్ధతులతో విరాజిల్లింది.

గురజాడ రాకతో తెలుగు కవిత్వం ముత్యాలసరమనే మాత్రా ఛందస్సులో కొత్త పాతల మేలు కలయికగా ఒదిగిపోయింది. గురజాడ మొదట్లో ఆంగ్లంలోకవిత్వం రాశాడు. సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు శంభూచంద్రముఖర్జీ సూచనతో మాతృభాషలో, వాడుకభాషలో రాసేందుకు పూనుకున్నాడు. బహుశ గురజాడ ప్రజలు మాట్లాడుకొనే భాషలో కవిత్వం రాసుండకపోతే నవ్య, భావ, అభ్యుదయ, విప్లవోద్యమ కాలాల్లో తెలుగు కవిత్వం అంతగా విస్తరించి ఉండేది కాదేమో అని టి.ఎల్.కాంతారావు తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. గురజాడ అందించిన నీలగిరిపాటలు, ముత్యాలసరాలు, కన్యక, పూర్ణమ్మ లాంటి రచనలు పరిశీలిస్తే అద్భుతమైన భావాలను కూర్చడంలో గురజాడని మించిన కవులు ఆధునిక కాలంలోను, ఆధునిక కవిత్వంలో మనకి అరుదుగా కనిపిస్తారు.

గురజాడ ఆధునికతకు ఆద్యుడనడంలో సందేహం లేదు. రాయప్రోలు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, బాపిరాజు, చలం వంటి వారి రచనల్లో కాల్పనికత దర్శనమిచ్చింది. సాహిత్యంలోని భావాలను కూర్చడంలో గురజాడ తరువాత అంతటి ఎక్కువ సమాజాన్ని అర్థం చేసుకొని సమాజ శ్రేయస్సే తన శ్రేయస్సుగా భావించిన కవి శ్రీశ్రీ. శ్రీశ్రీ గురజాడ వేసిన మార్గాన్ని ప్రచారస్థాయిని, ఉద్యమదీప్తిని కలిగించాడు. అందుకే శ్రీశ్రీ నవ్యకవిత్వోద్యమ సారథి అయ్యాడు.

గతితార్కిక భౌతికవాదం, వర్గపోరాటం కార్మిక నియంతృత్వ రాజ్యస్థాపన అభ్యుదయ కవిత్వ లక్ష్యం. శ్రీశ్రీ ఆధునిక భావాలను ఆధునిక ఛందస్సులో వెలువరించాడు. కవిత్వానికి జీవధాతువు రసం. శ్రీశ్రీలో కవితారసం పుష్కలంగా ఉంది. అందుకే నూతనసమాజ చైతన్య స్ఫూర్తిని ఇవ్వగలిగింది.

"కవీ ఎక్కడున్నాను నేను
నీ సముద్రపు కన్నీటితో నిలువెల్లా తడిశాను
నీ చీకటి నిట్టూర్పుల్లో అణువణువూ మండాను
నీ మూగ నెత్తుటివేదనలో తనువంతా మోగాను
సమాధిగోడల్ని చీల్చుకువచ్చి
సరికొత్త రూపాన నీ చేతుల్లో మెరుస్తాను"[4]

ఇదంతా కవి తన అంతర్గత జగత్తులో జరుగుతున్న విషయాన్ని చెబుతున్నాడు. ఇక్కడ కలం కవి భావాలకు ప్రతినిధి. సముద్రమంత లోతును, చీకటి వంటి అస్పష్టతను భావోదయం ముందు కవి పొందుతాడు ఇది సమాధిస్థితి. ఇక్కడి నుంచీ భావం ఆవేశంగా, తీవ్రంగా, ఉద్విగ్నంగా తన చేతుల్లోకి ప్రవహిస్తుంది. ఇక్కడి చేతులు వ్యక్తమైన భావాలకు ప్రతినిధి. ఇక్కడ చెప్పదలచిన విషయం ఏమిటంటే కవి తన భావాలను వెతుక్కునే క్రమంలో ఉద్విగ్నతకు లోనయ్యాడు. అందుకే వాస్తవ ప్రపంచంలో కనిపించే వస్తువులను తన మనోప్రపంచంలో ప్రశ్నించాడు. ఈ ఉద్విగ్నత భావ తీవ్రతకు కారణమైంది. కవి ఉద్విగ్నస్థితి స్పాంటినిటికి కారణమైంది.

ప్రపంచీకరణ కవిత్వానికి పునాదులు మార్క్సిజ సాహిత్యంలో కనిపిస్తాయి. శ్రీశ్రీ, కుందుర్తి మొదలగు కవులు రాసిన అభ్యుదయసాహిత్యం మార్క్సిజ భావాలతోనే వచ్చింది. ఈ మార్క్సిజ సాహిత్యం అనే దానినే నేడు మనం ప్రపంచీకరణ అనే ధోరణిలో వాడుకలోకి తీసుకొచ్చాము.

"మానవమంతం" కవిత ఒక ఉజ్జ్వల గేయం. సకల కల్మషాకీర్ణం చిందరవందర చేయడానికి అడుగు పొరల(పీడిత వర్గం) నరులంతా చీల్చరండి, కాల్చరండి అంటూ ప్రపంచీకరణ భావాలుని వ్యక్తపరిచాడు కవి.

"లేచిరండి వైశ్వానర
దీప్తులుగా కీలలుగా
త్రెంచుకొండి నిగాళాలను
ధనస్వామ్య కృతక్రాదుల
స్వార్థ పర్వతాగ్రాలను
పేల్చిరండి - డైనమేట్లై"[5]

సోమసుందర్ చిత్తశుద్ధికీ, లోక ప్రమేయతకు ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. కవిత్వం సంకేత నిబద్ధం. అందుకే ఆలోచనామృతం అన్నారు. రాసానందానికి ముఖ్యం. కవిత్వం చదివినపుడు ఆనందం కలగాలి. అనుభూతి పొందాలి. దుర్భర జీవితాన్ని ప్రపంచీకరణ భావాలలో కవితావస్తువుగా, చుట్టూ అలుముకొన్న చీకటి ఎంత భయానకంగా, క్రూరంగా వుందో, సగటు మనిషి ఈ పరిస్థితులును తట్టుకోలేక ఎట్లా కొట్టుమిట్టాడుతున్నారో నవనవోన్మేషంగా, చక్కని భాషలో, చిక్కని పదచిత్రాలతో అభివర్ణిస్తారు.

ఆధునిక భావాలు మార్క్సిస్టు దృక్పథంతో గురజాడతో ఆరంభమైన నూతన కవిత్వోద్యమం భావకవిత్వంలోంచి మళ్లీ శ్రీశ్రీతో ఊపందుకుంది. నూతన ఛందస్సులు నూతన భావాలు, నూతన ప్రతీకలు ప్రపంచీకరణ నేపథ్యంలో కనిపించాయి.

"కవిత్వమే తోడు నీడగా"! అనే కవితలో కవిత్వమే జీవితమైన వాడు చేయవలసిన విధికృత్యాలను విపులంగా వివరిస్తాడు కవి. మంచి భావాలు కూర్చడంలో తన ప్రతిభా చాతుర్యాన్ని ప్రదర్శించాడు రాధేయ....

"అగ్గిసెగలోంచి
నిప్పు కణికల్ని వెలికితీసినట్లుగా
భావోద్వేగం నుంచి
భాషను పిండుకోవాలి
వూట చెలమలోంచి
భావధారను చేదుకోవాలి
గాయాల కొలిమిలోంచి"[6]. వాస్తవాల్ని సానబెట్టాలి అంటారు.

"సిద్ధాంతం కన్నా
అనుభవం గొప్పదని రాయాలి
సమిష్టి అనుభవాల్ని
స్వానుభావాలుగా మార్చుకొని
శిశిరంలోంచి వసంతంలోకి
అడుగుపెట్టేదే కవిత్వం"[6] అంటే కవిత్వానికి సమయోచితమైన సరికొత్త నిర్వచనమిస్తాడు కవి.

"కవిత్వం నాకు కన్ను మూతపడని జ్వరం
కవిత్వం నాకనైప్పుల మీద వాలిన నమ్మకమైన కల
ఒక్క కవితా వాక్యం
ఈ గుండె లోతుల్లోంచి
పెల్లుబికి రావాలంటే
ఎన్ని రాత్రుల నిద్రని తాకట్టు పెట్టాలో"

అంటూ ఆషామాషీగా కవిత్వం రాయొద్దంటూ ఒక హెచ్చరిక లాంటి అనుభవాన్ని ఆవిష్కరిస్తాడు కవి. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిరాదరణకు గురిచేసే బిడ్డల వైఖరిని ''క్షమయాధరిత్రి" అనే కవితలో ఎత్తి చూపుతాడు కవి"[6]

"నీ చెమట చుక్కల్ని.....

కూడేసుకొని

చెప్పించిన చదువుకు సాక్ష్యం వాడు

కార్పొరేట్ విజ్ఞానచ్ఛాయల్లో ఎదిగి

బుద్ధి జీవుడైన నీ ఏకైక కుమారుడు

అమ్మా నాన్నలకింత అన్నం పెట్టలేనివాడు

డాలర్ల వేటలో అగ్రరాజ్యాలకు

దాస్యం చేయడానికైనా

సిద్ధమౌతాడు" అంటూ తల్లిదండ్రుల మీదకంటే 'ఫారెన్' మీద పెంచుకునే మోజు నేటి యువతకు కార్పొరేట్ విద్యా సంస్కృతి వలన కలుగుతుందనే ఆలోచన ఇందులో కలిగిస్తాడు కవి. బాల్యాన్ని బంధీ చేయకండి, బడిలో విత్తండి, మొక్కయై మొలిసి మహావృక్షమై దేశానికి మంచి ఫలాలనూ, నీడను ఇస్తుంది అనే కాన్సెప్టతో "కోల్పోతున్న మూల్యం' అనే కవితను రాశారు కవి.

"వసంతం వలసపోయినట్లు

విద్యా, విజ్ఞానం, మార్కెట్ సరుకులై

వారి దరిద్రంతో పరాచికాలాడితే

వారి కలల ప్రపంచం

కుప్ప కూలిపోకేం చేస్తుంది"[7] అంటారు. చివరకు బాల్యం కోల్పోయిన బాలకార్మికుల వలన దేశానికి ఎంత నష్టమోననే భావన కలిగిస్తూ..

"నీవు కోల్పోయిన బాల్యం

ఈ దేశం చెల్లించలేని మూల్యం" అంటాడు. మూఢ విశ్వాసాలను, సంప్రదాయ సంకెళ్లను ఆచారాల అంధత్వాన్ని ఎత్తి చూపుతూ, మనిషిని ప్రేమించే స్వభావం కోసం, ప్రతిభను గుర్తించే జ్ఞానం కోసం

"మనువుని కాదు" 'మార్క్సని' చదవండి

కౌటిల్యుని కాదు 'ప్లేటో'ని చదవండి

భారత రాజ్యాంగం అర్థం కావాలంటే

అంబేద్కర్ ను చదవండి. అంటారు.

"సౌందర్య రాహిత్యంలో..." అనే కవితలో పల్లెలు ఏవిధంగా చితికిపోయాయో ఎంతో గొప్పగా కళ్లకు కట్టినట్లు చూపించాడు''[6]

"అమాయకత్వానికి

అచ్చమైన ఆకృతిలా

ఇక్కడో పల్లెపట్టు వుండాలి

ఇప్పుడు కన్పించేదేమిటి"? అంటూ పల్లెలోని యువత పనుల కోసం వలస పోవడం వలన ముసలి తల్లిదండ్రులు ఎదురుచూచే తీరును ఎంత గొప్పగా ఆవిష్కరించారో చూడండి.

"ఇక్కడే ఈ చీలిన కాలిబాటలో

ఓ మాతృమూర్తి నిలబడి

తన నుదురుకు చేయి అడ్డం పెట్టుకొని

పనికోసం పట్నంపోయిన

కన్న పేగుకోసం ఎదురుచూసేది"[6] కంటి చూపు మందగించిన వృద్ధులు నుదుటి మీద చేయి పెట్టుకొని ఎదురు చూసే తీరు చిత్రీకరించారు రాధేయ. ఆ ముసలి తల్లిని మన మనసుల్లో బొమ్మ కట్టిస్తాడు.

స్త్రీవాదాన్ని సమర్థిస్తూ రాసిన కవిత "సజల నేత్రసాక్షిగా"

"చరిత్ర పుటల్లో దాగిన

ఓ దీర్ఘకాలిక వ్యధ

లింగ వివక్ష కారణంగా

మౌన హింసను భరిస్తూ
స్వీయ మరణాన్ని
స్వయంగానే కలవరిస్తోంది"

అంటూ పురుష స్వామ్య వివక్షలో మగ్గి అరిగిపోయే ఓ చాకిరీ యంత్రంగా స్త్రీని వర్ణిస్తాడు కవి. ప్రశ్నించే స్వరం స్త్రీకి అవసరమనే చైతన్యాన్ని నూరిపోస్తాడు. ఆత్మవిశ్వాసమే అభిమాన ధనంగా బతికే విధానాన్ని వర్తమాన మహిళ అలవరుచుకోవాలనేది ఆకాంక్ష.

"నిశ్శబ్దాల్ని పీల్చడం తెల్సినవాడు
అక్షరాల్ని సృష్టించగలడు
దుఃఖాన్ని తట్టిలేపితే
ఎడారి విస్తరిస్తుంది
కన్నీళ్లను కవ్వించావో

సముద్రమే మేల్కొంటుంది" అంటూ "అవిశ్రాంతం" అనే కవితలో తన సాహిత్య కృషిని ప్రస్తావిస్తూ.

"మరణించాక జీవించడం
మరణాన్ని జయించడం
ఒక్క కవికే సాధ్యం

జనన మరణాల రహస్యం కవిత్వమే". అంటూ కవికి కవిత్వానికి ఉన్న బాధ్యతను గుర్తు చేస్తాడు.

"మనిషి వ్యక్తిత్వాన్ని
మార్కెట్లో రూపొందించి
ఖరీదైన కలల కొనుగోలు శక్తికి
దాసోహం చేసింది
గ్లోబలైజేషన్
క్రీడలు
మన తార్కిక జ్ఞానాన్ని

ఎగతాళి చేస్తున్నాయి

ధ్వంసమౌతున్న సమస్త విలువలకూ ఈ జీవితం ప్రత్యక్ష సాక్ష్యమైంది" అంటూ "ఎడారి వసంతం" అనే కవితలో సమస్త జీవన రంగాల్లో గ్లోబలైజేషన్ నీడలు సామ్రాజ్యవాదం కంటే ప్రమాదకరంగా అభివర్ణిసాడు కవి.

శిల్పం మీద పట్టు, శబ్దం మీద సాధికారత, లోతైన భావాల్ని అన్వయ కాఠిన్యం లేకుండా పదచిత్రాలుగా మలచి కవిత్వం 'అవిశ్రాంతం'లో ఆరవోసిన రాధేయ అభినందనీయుడు.

సుకుమారమైన భావాల్ని, అనుభూతుల్ని గుండెలోని మృదువైన చోట్ల తగిలేటట్లుగా నందిని సిధారెడ్డి రాస్తాడు.

"వొంగిన వేపచెట్టు

ఆకురాల్చినప్పుడు

అలకదిలినంత సున్నితంగా నిశ్శబ్దంగా

నేను కదులుతుంటాను -

నన్ను ముట్టుకొని చూడొచ్చు-

తడిగా తగుల్తానేమో

జీవితంలో తడిసిన

సలిలవలిపాన్ని గదా

జలజలారాలుతుంటాను"[8] అంటూ కొత్తకొత్త భావాలను కూర్చాడు.

**4.7.కవిత్వంలో సమాజం:** ఆధునిక తెలుగు కవిత్వానికి సమాజానికి చాలా దగ్గర అవినాభావ సంబంధం ఉంది. సమాజంలో గూడు కట్టుకొనియున్న ఆకలి, దరిద్రత, వ్యాధులు, అసమానత మున్నగునవి తొలగిపోయి అది వర్గరహిత స్వర్గముగా వెలుగొందవలెనని అభ్యుదయకవుల హార్దిక లక్ష్యాన్ని వెల్లబుచ్చారు.

ప్రాచీన సాహిత్యానికి అనుబంధంగా ఆధునిక సాహిత్యం వెలసింది. ఆధునిక కవిత్వం వెల్లువులా వెలసింది. తెలుగు ప్రాంతాలైన ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల కరువులుచే ఉద్విగ్న భరితమైన కవిత్వాన్ని, క్షామగీతులను ఆకలిపాటలను రచించిరి.

"ఆకలి వేస్తోందమ్మా అన్నం పెట్టమ్మా

స్వర్ణారుణ సస్యశ్యామలమగు

ఈ జగతిని ధరిద్రమున ఆకలితోచావలేను"[9] ఆక్రందించు ప్రజవాలి ఆర్తరావములను తమ..........మూఖరింపజేసిరి. రాయలసీమలో కలిగిన దుర్భిక్షమును ఉద్దేశించి...

"గుండెల్లో జివత్తైల మెండిపోవ

మండిపోయెరా ఆకలి దివిటీలు.

నరాల్లో పరిచిన నెత్తురు తెరల

కత్తెరించిరా కరువు కత్తెరలు".[9] అని దీనముగా ఆక్రందించిరి.

సమాజములో నాటుకొనియున్న ఆకలి దారిద్ర్యము మున్నగు భయంకర వ్యాధులకు కారణము సమాజ వ్యవస్థయే యని ప్రపంచీకరణ నేపథ్యంలో కవులు గ్రహించి కవిత్వరూపంలోకి తీసుకొచ్చారు. అందువల్లనే కవులు ఆకలి పాటలతో చేతులు దులుపుకొనక ప్రస్తుత సాంఘిక వ్యవస్థలో మార్పురావలెనని, వర్గబేధములతో కుల్లిపోయిన నేటి సమాజము స్థానములో సరిక్రొత్త సమాజము మొలకెత్తవలెనని కాంక్షించిరి ఆధునిక కవులు.

"వృద్ధజగతి సమాధిపై సమధర్మం ప్రభావించును

నిద్దుర చీకటి వెలుపల వేకువ మెలుకువ పుట్టును"

అని భాష్యము చెప్పిరి రానున్న సమాజములో "శాంతికొరకు యుద్ధమనే స్వార్థపరుల నినాదాలుండవని" "రూపాయికి విలువలేని రోజు వస్తుందని" మతాలకై మరణించు అమాయకులు ఎవరు ఉండబోరని గలానికై విలపించే మృతభావులు కానరారని ఆశా సంగీతము ఆలపించిరి. భవిష్యత్ సమాజంలో ప్రతీవ్యక్తి ముఖం మీద లక్ష ఉదయాలు మొలుస్తాయని శ్రమకు, కళకు ఫలితం సమరీతిగ లభించునని భావన చేసిరి. పెద్ద చేప చిన్న చేపను తిను న్యాయము ముందుండబోదని లాఠీలు, మెడ బండలు, భేరసారాలు ఉరికొయ్యలు అంతమౌనని తెలుగు సమాజ ఔన్నత్యాన్ని లేవనెత్తారు ప్రస్తుత కవులు.

"వ్యక్తులు పరిపాలించే శక్తి నశించింది నేడు
రక్తంలో అణువణువూ శక్తి గడించింది నేడు"

అని సమాజంలో కలిగిన పీడిత వర్గ చైతన్యం నుగ్గడించి పాలక పాలిత భేదం లేని "వర్గరహిత స్వర్గమును స్థాపించుటకు గళమునే కాహళగా జేసుకొని ప్రబోధించిరి.

2004 లో ఆవంత్స సోమసుందర్ రచించిన అక్షర నాదం అనే కవితా సంపుటిలోని కొన్ని పదచిత్రాలను గమనించినట్లయితే వీరి ప్రతిభ, వీరేవిధంగా రెండు తరాలకు వారధిగా ఉన్నారనే విషయం సుస్పష్టమౌతుంది.

"గ్లోబలైజేషన్ తో ఈ భూమి రజస్వలై
నవవరాన్వేషణలో మిటకరిస్తుంది......
హ్యూమన్ జెనిటిక్ ఇంజనీరింగ్ తో
అవతరించిన క్లోనింగ్ కోడె దూడ
"అంబా" అని అరవడం గ్రాంథికమని నిషేదిస్తుంది.[11]

"నేడు నా ముని వాకిట
పూచిన గులాబి పరిమళం నిండా
బాంబుల విషధూమం
నింపింది పడమటి గాలి"[11]

"వంకవంకల వయ్యారాలతో
తల్లిలా పవళించిన ఏటి ఒడిలో
నిటారుగా నిలచిన కొబ్బరి తోట....
రేగిన జుత్తుతో ఊరికే మారాంచేసే
పిల్లవాడి వెర్రి ఊగిసలాట......"[11]

వీరి కవిత్వంలో సరళత, అదే సమయంలో అర్థ గాంభీర్యతా , ఉదత్తమైన లోతైన భావాలు, మానవత్వపు పరిమళాలు పుష్కలంగా పొర్లాడుతుంటాయి. బానిసల దేశం, గోదావరి ప్రళయం, రక్తాక్షి, హిరోషిమా, రక్షరేఖ, సీకింగ్ మై బ్రోకెన్ వింగ్, వంటి వీరి రచనలలో ఆయా సంఘటనలకు,

సందర్భాలకు ఒక కవి తన హృదయమంతటితోనూ స్పందించిన విధానాన్ని దర్శించవచ్చు. అంధురాలి కోసం బిథోవెన్ సృష్టించిన వెన్నెల, సౌరాష్ట్రంలో జరిగిన నరమేధం, ఎన్నటికీ పూర్తికాని సోమశిల ప్రోజెక్టూ, ఖజురహో శిల్ప విన్యాసం, సోమాలియాలో అన్నార్తులూ, సైగల్ గానమాధుర్యం ఇవీ వీరి కవితా వస్తువులు. వీటిలో ఏ ఒక్కటీ కూడా ఈ మట్టిని , గాలిని విడిచి సాము చెయ్యవు.

**4.8.ఆధునిక తెలుగు కవిత్వంపై - ప్రపంచీకరణ ప్రభావం :** తెలుగు సాహిత్యంలో ఏ కొత్త ధోరణి వచ్చినా, అది కవిత్వంలోనే ముందుగా ప్రతిఫలిస్తుందని, ఇప్పటి వరకూ వచ్చిన వాదాలు, ఉద్యమాలన్నీ తేటతెల్లం చేస్తున్నాయి. కాల్పానిక ప్రభావం వాళ్ళ భావకవిత్వం వచ్చినా, తర్వాత వచ్చిన వాదాలు, ఉద్యమాల్లో చెప్పుకోదగిన, వైవిధ్యమున్న వాటిల్లో అది వాస్తవిక, దిగంబర, మార్మిక, ప్రతీక, స్త్రీ, దళిత, మైనారిటీ వాదాల్ని చూసినా ఇది అర్థమవుతూనే ఉంది. కవిత్వ చరిత్రలే, మన సాహిత్య చరిత్రలుగా రూపొందడానికి ఈ చారిత్రిక నేపథ్యాన్ని కూడా ఆలోచించవలసి ఉంటుందనిపిస్తుంది. ఈ ఆధునిక జీవన విధానంలో ప్రభావం చూపిస్తున్న అన్ని రంగాలను కవులు, కవయిత్రులు కవిత్వమై ప్రవహిస్తున్నారనీ, ఏ ఇతర భాషకూ తీసిపోకుండా సమకాలీన సమాజాన్ని అవగాహన చేసుకొని, గమ్యనిర్దేశం చేస్తున్నారని చెప్పటానికే. ఇంతవరకూ పేర్కొన్నట్లు వర్తమాన సాహితీవాదాల్ని, ప్రభావాల్నీ సొంతం చేసుకున్నట్లే ప్రపంచీకరణ ప్రపంచ వ్యాప్తంగా చూపిస్తున్న ప్రభావాన్ని కూడా మన తెలుగుకవులు కవిత్వీకరిస్తున్నారు.

1990ల తర్వాత ప్రపంచంలో ముఖ్యంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ, రాజకీయ, ఆర్థికరంగాల్లోనూ విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఒకవైపు అవసరాల్ని తీర్చడంలో అనాయాస పరిస్థితులు సృష్టించినా, మరోవైపు ప్రతిక్షణం భయం గుప్పెట్లో ప్రాణాల్ని ఇచ్చుకోవల్సిందిగా శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందాయి. ప్రపంచంలో ఏ మూల ఏమి జరిగినా నిమిషాలు, సెకన్ల మీద ప్రపంచమంతటకీ తెలిసిపోయే కమ్యునికేషన్ వ్యవస్థనీ శాస్త్ర, సాంకేతిక రంగాలు అందించాయి.

రాజకీయంగా కొన్ని దేశాల్లో నేటికీ రాజరికాలు కొనసాగుతుంటే, మరికొన్ని సమాజాల్లో 'సంఘువ్యవస్థ' రూపొందనివి ఉన్నాయి. వాటిని అనాగరిక సమీక్షలని కొంతమంది పిలుస్తున్నా, నాగరిక సమాజాలని పిలవబడుతున్న దేశాల్లో కూడా ఒకవైపు ప్రజాస్వామ్యం, మరోవైపు

నియంతృత్వం, వీటన్నింటిపైన సామ్రాజ్యవాదం అలుముకొని, కొన్ని దేశాల్లో, తమకున్న శాస్త్ర, సాంకేతిక, ఆర్థికరంగాలవల్ల తమ గుప్పెట్లో పెట్టుకోవడం, నిరసనలు జరుగుతూనే ఉంది.

శాస్త్రసాంకేతిక రంగాల అభివృద్ధి 1980లకు ముందు అభివృద్ధి చెందినా దేశాలలోను 1990ల తర్వాత అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందుబాటులోకొచ్చేసింది. 2000ల తర్వాత ఇది మరింత గ్రామస్థాయిలోకి చొచ్చుకొని పోవడానికి ప్రయత్నిస్తోంది. ఈ ఇంటర్నెట్, సెల్ఫోన్లు,వెబ్ఫోన్ సిస్టం, వీడియో, టెలీకాన్ఫ రెన్స్ వంటి వన్నీ కొంతమందిని ఆధునికుల్ని చేశాయి.

ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పుల్లో ప్రధానంగా శాస్త్ర, సాంకేతిక, ఆర్థికరంగాల్లో వచ్చిన మార్పులే అన్ని దేశాల్నీ, సమాజాల్ని గమ్యనిర్దేశం చేస్తుండడం వల్ల, కొన్ని తప్పనిసరి పరిస్థితుల వల్ల భారతీయ సమాజంలోను వీటి ప్రవేశాన్ని నిరోధించలేని పరిస్థితి ఏర్పడింది. ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా దీని ప్రభావం గట్టిగానే పనిచేస్తూ చివరికి 'అస్తిత్వాన్నే' ప్రశ్నించుకోవలసిన స్థాయికి చేరుతుందని కవులు, కవయిత్రులు కలాన్ని ఆయుధాలుగా సంధించడానికి సిద్ధపడ్డారు. వారి కలం అనేక వాదాలను స్ఫురిస్తూ ప్రపంచీకరణ కవిత్వం వైపు మళ్ళించారు.

డంకెల్ ప్రతిపాదనలు, గాట్ నిబంధనలు రైతులకు శాపంగా మారడం, విత్తనాలు పునరుత్పత్తి కోల్పోయి. పూర్తిగా విదేశీయులు సరఫరా చేసే విత్తనాలపైనే ఆధారపడవలసి రావడం వల్ల, అధికోత్పత్తులు సాధించడం కంటే, టెర్మినేట్ సీడ్స్ పట్ల వ్యతిరేకత వ్యక్తమయ్యింది. పేటెంట్ హక్కులు కోల్పోవడం కంటే, తమ దేశంలో తాము పండించే పంటలకు, విదేశీ కంపెనీలు ఉత్పత్తి చేసి పంపిణీ చేసే విత్తనాలకై ఎదురు చూడవలసి రావడం వల్ల ధరలు ఆకాశానికెగిరిపోవడం, తమ పంటలకు సరైన గిట్టుబాటుధర రాకపోవడం సహజంగానే జరుగుతుంది. ఇవన్నీ రైతుల్ని మరింత బానిసల్ని చేస్తాయని భావించారు. ఇక్కడనుండే బహుళజాతి కంపెనీల, గుత్తాధిపత్య దేశాల పెత్తనంపై మేధోపరమైన వ్యతిరేకత ఎదురైంది. ఇది చాలా వరకు మన తెలుగు కవిత్వంలో ప్రతిబింబమైంది. తొలిసారిగా కవిత్వంతో ప్రారంభమై తర్వాత కథ, నవల మొదలగు రూపాలలోఇది మరింత శక్తివంతమైంది.

ఈ పరిణామాల దృష్ట్యా వెలువడిన కవితా సంపుటి గ్లోబలైజేషన్.ఇది వివిధ కవులు, కవయిత్రులుచే రచింపబడింది. ప్రజాస్వామ్యపు తీరు తెన్నులను వివరిస్తూ.....

"ప్రజాస్వామ్యం ముసుగేసుకున్న

కొత్తయంత

గుర్రమెక్కి జనం మీదికి

దౌడు తీస్తున్న వర్తమానం

..............................

జెండాల ఎరుపులో

కొత్త రక్తం నిండింది". అంటాడు.

ప్రపంచీకరణ వల్ల, ప్రతీది తమ ముంగిట నిలబడిందనే విషయాన్ని గుర్తుచేస్తూ, తాకట్టు పెట్టడానికి ఇంకేముందని ప్రశ్నిస్తూ ఆవేదనను వ్యక్తం చేస్తున్న అప్సర్ 'గ్లోబలిటీస్' కవితలో ....

"అన్ని ముంగిటికొచ్చాయి

వాకిలి ముందే

ప్రపంచం సంతలా

అన్నీ రుపాయిలైపోయాయి.

వొక్క నేను తప్ప

అన్నీ అమ్మకానికి సిద్ధం

తనఖా పెట్టడానికి

ఇంకేముందని అడుగుతుంది

తడిమాటలతో తడిసి

గొంతునొక్కే

అందమైన కత్తులు

నాట్యమాడుతున్నాయి.

చుట్టూరా.....”[12] ప్రపంచం నవనాగరికతలో మునిగిపోయిందని, కొత్త శతాబ్ధంలో అడుగుపెట్టిన సమకాలీన సమాజంలో అస్తవ్యస్తంగా ఉన్న ప్రభుత్వపు పనితీరు, మనుషుల్లో మమతలు, మమకారాలు తెగిన గాలిపటాల్లా ఏ మూలకో విసిరివేయబడ్డాయని, సగటు మనిషి మనుగడే కష్టంగా మారిన తీరును వర్ణిస్తున్న కవితే అద్దంకి శ్రీనివాస్ “కొత్త శతాబ్దం వెంటాడుతోంది”

“కళ్ళు ఎంత విప్పార్చినా లాభం లేదు

పెరుగుతున్న ధరల బరువులను గుండెలు మోయలేకపోతూ

మ్రింగుడు పాడనీ సమస్యాత్మక గరళపు ముద్దల్ని

.............................................................

రాబందుల రాజ్యంలో

రైతు రైతుగానే మిగలాలంటే

డంకెల్ సూత్రాలు, ఉల్ఫెన్ సోన్ ల ఉవాచలు బట్టీ

పేయాలి

లేకపోతే

పెన్నెముకలన్నీ దేశానికి దిష్టి బొమ్మలై మిగులుతాయి.”[13]అని ప్రపంచీకరణ నేపథ్యంలో సామాన్య ప్రజల గాధల్ని వర్ణిస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు భారమైపోతున్న తరుణంలో ప్రజల్ని ఉత్తేజపర్చడంలో ఈ కవిత ఎంతగానో ఉపయోగబడుతుంది.

“ఇదేమి సంధ్య

ఇనుప ముక్కుల్తో రక్కి

నెత్తుటి బుగ్గగా మార్చిన

నిశ్శబ్ద బీభత్సం".[14] పెయిన్ బ్రెయిన్ కు పర్యాయమైన నా శరీరం నన్ను దాటి పోతున్నది. ఇనుప పాళీలతో ఒప్పందాలను కుదుర్చుకొని ప్రపంచాన్ని బీభత్సంగా మార్చిన వైనమే ప్రపంచీకరణకు ఆరంభమని

"ఒక అసహజ యూనిఫార్మిటీ
ఒక అసంబద్ధ అసమక్రమబద్ధీకరణ
జీవతం/వెయ్యి ఆకులుగా పగిలిపోయి
ఆర్తనాదాలను చిమ్ముతున్నది.
వాణిజ్యం సూదులు ఎంత మెత్తగా దిగినా
లోనికి వెళ్ళేది విషమే.
హ్యూమన్ రోబోలు లేస్తున్నాయి.
రేపటి నుంచి వాటికే మన సెల్యూట్లు"[14]

డా.ఎన్. గోపి భావిస్తున్నారు.మరోకవితలో కవి దృక్పథం ప్రపంచీకరణ అనేది అసహజం, అసంబద్ధం,అసమక్రమబద్ధీకరణ.వాణిజ్యం స్వేచ్ఛా వ్యాపారం పేరిట జరిగినా దాని వెనుక ప్రమాదం పొంచి ఉంటుంది. మానవ శరీరం, మెదడు కొత్త లాట్ లో యంత్ర మానవులుగా తయారవుతున్నారు. కంప్యూటరీకరణ యాంత్రిక జీవనానికి మూలమయ్యింది.

కాలప్రవాహంలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన కొలదీ ఒకవైపు వెనకబాటు తనంతోపాటు త్వరితగమనం కూడా ఏర్పడుతుంది. ఈ సంధియుగంలో సరితూగలేక సతమతమయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. ఈ పరిస్థితులకు మార్పనే సంధియుగమే కారణంగా కనిపిస్తుంది. వేగవంతమైన జీవితంలో సమయంలేక పోవటం వలన అసహజ జీవనానికి గురవుతున్నారు.

ఎంత గొప్ప మేధావులను, పండితులను ఈ పరిజ్ఞానం తయారుచేసినా తడిలేని గుండెలు ఎదురవుతున్నాయి. సమాజంలో ఎదురయ్యే ప్రతీమార్పుకు ప్రపంచీకరణకే ముడిపెడుతున్నారు.

"కంప్యూటర్ల అరణ్యాలలో తప్పిపోతున్న
కన్నీళ్ళను వెతకండి.
క్యాలెండర్లను తిని బలిసిన కాలానికి

గమనమే తప్ప గమ్యం లేదు.
మనుషుల మధ్య ప్రవహించే
ఎడారుల గురించే బాధ”.[15]

కంప్యూటర్ అరణ్యాలలో తప్పిపోయిన మానవ జీవనాలను గురించి వ్యధ చెందుతూ మనుష్యుల మధ్య ప్రవహించేది ప్రేమ వాత్సల్యాలు కావని శుష్కించిన ఎడారి క్రోటను జీవనాలను వర్ణించారు. క్రోటను పిచ్చి పువ్వైనా పూయదు. ఫలితం లేని గమనం వ్యర్థం. ఆ విధంగానే గ్లోబలీకరణ కూడా వ్యర్థం అని గోపి అంటున్నారు.

“మా చెరువు నీళ్లు
ఏ శూన్యాల్లోకి ఇంకి పొయ్యాయో !
ఎముకలు తేలిన ఛాతిలా కొట్టుకుంటుంది.
ఇప్పుడు దీనిని తవ్వితే
బతుకమ్మలు దొరుకుతాయా![16]

ఊరు తన ఉనికిని స్వభావాన్ని కోల్పోయిందని వాతావరణం మునిపటిలా లేదని ఎముకలు తేలిన చెరువులు ప్రత్యక్షమవుతున్నాయని పల్లె కళలను కోల్పోయిందని ఈనాడు బతుకమ్మలు లేవని తల్లి లేని పల్లెను గుర్తుచేసారు.

జీవితం ఒక ఉద్యమం. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్నాడో ముసలాయన. కాదు కాదు రోడ్లు స్టేడియంలూ డిస్కో థెక్కులన్నది ప్రపంచ బ్యాంకు. విలువలన్నీ ప్రశ్నార్థకాలయ్యాయి. ప్రాధాన్యాలన్నీ తారుమారయ్యాయి. ప్రాజెక్టుల కన్నా  ఫ్లై ఓవర్లు, ఫాక్టరీల కన్నా ప్రైవేటీకరణ ముఖ్యమయ్యింది అని ఎన్వీ సత్యనారాయణ ‘ఇవాళటి గాలి’ అనే కవితలో మారిన దేశ పరిస్థితిని వర్ణించారు.

ఈ కాలం కొత్త ఆర్థాలతో నిండిన నిఘంటువు. దీని భారాన్ని వదిలించుకుందాం/ రేపటి కోసం సంకల్పం చెప్పుకుందాం అని అంటూ అభివృద్ధి, సుపరిపాలన,ప్రజాస్వామ్యం, జన జీవనం స్రవంతి, ప్రగతి, రాజకీయం, ప్రజాభిప్రాయం, మేధావి, మొనగాడు, విజేత వంటి పదాలకు నేడు అర్థాలు మారాయని నవ్యార్థాలను వివరించారు. సంకల్పం అనేది ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది.

హైటెక్ యుగంలో మానవ సంబంధాలు లుప్తమై విలువలు మారిపోతున్న సమయంలో కొత్త పారిభాషిక పదకోశాలను రూపొందించమంటున్నారు.[17]

"కోటి రూపాయల ఖర్చుతో కొన్న
విజన్ కాగితం
విండోస్ లోంచి చూస్తే
రెండు వేల ఇరవై కనిపిస్తుందా?[18]

సంస్కరణలంటే నోట్లో మట్టి కొట్టడమా? జన్మభూమి అంటే పేగుబంధం కాదా? పల్లెల కడుపులు కొట్టి నగరాలు బలవడమా? ఇప్పుడు మార్కెట్ ఒక్కటే పరమ సత్యం - మనీ సంపాదనే పరమ లక్ష్యం.[18]

"విద్య, వైద్యం, ఉద్యోగం ఒకటేమిటి
ప్రజా సంక్షేమ కార్యక్రమాలన్నీ ప్రైవేటీకరింపబడ్డాక
విద్యుత్ తీగలపై సామాన్యుడి సంపదంతా ఉరితీయబడ్డాక
మంచినీటిని నమ్ముకున్న చేపల్ని మొసళ్ళు వేటాడ్డం మొదలెట్టాక"[19]

అమెరికా వంటి సంపన్న దేశాల దోపిడీకి గురై మూడుకోతుల బొమ్మగా ముడుచుకుపోయిన విధానం, ప్రపంచ బ్యాంకుదే పెత్తనమంతా, అప్రజాస్వామిక శక్తులదే పాలనంతా అని వివరిస్తున్నాయి. ప్రపంచీకరణ జనజీవన స్రవంతిగానే నిర్వచింపబడింది.

మొన్న "విముక్తి పోరాటాలే ప్రజల గుండె జండాలు
స్వేచ్ఛా నినాదాలే పత్రికల శీర్షికలు
త్యాగాలు ఎత్తిన పిడికిళ్ళ కొడవళ్ళు
చెమట చుక్కలు నడుస్తున్న చరిత్రలు
ప్రజల జీవితాలు పదిలపరుచుకోదగిన పవిత్ర ఇతిహాసములు".

నిన్న "గుత్త కుబేరుల బీరువాలు ప్రజల గుండెలు
విశృంఖల విహారాలు పత్రికల పతాక శీర్షికలు
పిడికిళ్ళ నుండి విడిపోయి విరిగిపోయిన కొడవళ్ళు
చరిత్ర గతి తప్పిన పుస్తకం.

ఇతిహాసాలన్నీ నిరుడు కురిసిన హిమ సమూహాలే!

నేడు "ప్రతి విధ్వంసమూ ఒక విప్లవమే

పరాయీకరణమే ప్రగతికి గీటు రాయి

బానిసత్వమే అభ్యుదయం

సంక్షోభాలన్నీ సంస్కరణలే

పాలకవర్గాల ప్రతి వికృత కదలికా

ఒక మహాద్భుతం".

ఇప్పుడు ఏదీ తప్పు కాదు

"వచించడం.... వంచింపబడడమే

నేటి జనజీవన స్రవంతి

మరోసారి దగాపడడమే ఇవాల్టి ఫలశ్రుతి".[20] అంటూ కవి కమ్యూనిజం పోయి కేపిటలిజమ్ పోయి విధ్వంసం నిలిచింది అని అంటారు. ప్రపంచీకరణ ఒక స్ట్రీమ్ లా ఒక స్రవంతి లా గడచిపోతుంది.

**ముగింపు:** ఆధునిక తెలుగు కవిత్వం ఎన్నో ఉద్యమాల్లో సజీవంగా ఉంది. ఉద్యమాల వడిలోనే పెరిగింది. బలహీన పడినప్పుడు, ఎన్ని విధాలైన భావధారాలు స్వేచ్ఛగా ప్రవేశించిన, సామాజిక చైతన్యం మాత్రం ఎప్పుడూ పచ్చగానే ఉంది. కవిత్వం ఎన్ని ధోరణులలో వచ్చిన మూలాన్ని మరువలేదు. కాలానికి అనుగుణంగా కొత్త పుంతలు తొక్కుకుంటూ కొత్తగా వచ్చిన వాటిని తనలో మమేకం గావింకుంటూ ఇప్పుడది ప్రపంచీకరణ కోణంలో నడుస్తుంది.

ఉద్యమ స్ఫూర్తితో, సమ్యగవగాహనా చైతన్యంతో, విస్పష్ట రాజకీయ దార్శనికత్వపు జెండా రెప రెపలతో పిడికిలి బిగించి హోరెత్తి నినదించిననాడు ప్రపంచీకరణ ఎత్తుగడలు నీటి బుడగలవుతాయని ముక్త కంఠంతో తెలుగు కవులు చెప్పారు.

## పాదసూచికలు

1.బోజంకి వెంకట రవి - తడినిప్పు; పుట.17

2.బెల్లంకొండ రవికాంత్ - ఒంటరి దుఃఖం కవిత్వ సంపుటి

3.శ్రీశ్రీ కవిత వార్త పత్రిక (12.08.11)

4.ఆవంత్స సోమసుందర్ - మానవ మంతం కవిత; పుట.7

5.రాధేయ - కవిత్వమే తోడునీడగా; పుట 34

6.రాధేయ - అవిశ్రాంతం ; పుట.43

7.సిధారెడ్డి - భూమి స్వప్నం; ;పుట.22

8.సి.నారాయణరెడ్డి - ఆధునికంధ్రకవిత్వం సంప్రదాయాలు ప్రయోగాలు; పుట.574

9.సి.నారె - అదేపుట

10.ఆవంత్స సోమసుందర్ - అక్షరానాదం కవితా సంపుటి

11. సోమసుందర్ ;అదే.పుట.

12.అప్సర్ - గ్లోబలిటీస్; పుట.29

13.అద్దంకి శ్రీనివాస్ - కొత్త శతాబ్దం వెంటాడుతుంది; పుట.54

14.గోపి - 'గ్లోబల్ స్వామ్యం'(అక్షరాల్లో దగ్ధమై) పుట.38,39

15.క్రోటన్స్- కాలాన్ని నిద్రపోనివ్వను; పుట.18

16.గోపి - మరోసారి మావూరు; కవితా వార్షిక,2004,పుట.116

17.ఎస్.వి.సత్యనారాయణ - నిఘంటువు; జీవితం ఒక ఉద్యమం; పుట.12

18.కొత్త అర్థాలు; పుట.77

19.ఇది నేటి ముఖచిత్రం - జనకవనం; పుట.165

20.గుమ్మం దాటిన శతాబ్దం - పుట.415

# 5. ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం నిర్మాణం

**5.పరిచయం:** 20వ శతాబ్దపు చరమ దశాబ్దం అభివృద్ధి చెందుతున్న దేశాలను అన్ని రకాలుగా కుదిపివేసింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవితాలలో ఊహించని పరిణామాలు సంభవించాయి. సాంకేతికమైన పురోభివృద్ధి, సామ్రాజ్యవాద ధోరణి మొదలైనవి దీనికి కారణాలు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయ చిత్రపటాలు సమూలంగా మారిపోయిన దశాబ్దమిది. జాతీయ, ప్రాంతీయ ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయరంగంలో, వ్యవసాయ కార్మిక రంగంలో అసంఘటిత కార్మిక వ్యవస్థలో, చేతివృత్తుల రంగంలో పొడసూపిన దుష్పరిణామాలు అన్నిరంగాలలోను ప్రతిఘటనకు దారితీశాయి. ఈ దశాబ్ది ఆరంభంలో కేంద్రప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు కొన్ని వ్యవసాయదారుల జీవితాన్ని ప్రత్యక్షంగా, మధ్యతరగతి ప్రజల జీవితాన్ని పరోక్షంగా ప్రభావితం చేశాయి.

ప్రపంచీకరణ క్రమంలో బహుళజాతి సంస్థలు సహజ వనరులను నిర్మూలించడం, ప్రజల ఆరోగ్యానికి కీడుచేసే రసాయనిక పదార్థాలను ఉత్పత్తి చేయడం, వ్యవసాయరంగంలో కృత్రిమ ఎరువుల వాడకం, అనేక కారణాల వలన వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగడం మొదలైన వాటివల్ల ఏర్పడుతున్న దుష్పరిణామాలను కవులు వస్తురూపంలో ఎత్తి చూపారు. పర్యావరణ స్పృహ పెరిగింది. రూపురేఖలు మారిపోతున్న గ్రామీణ జీవన చిత్రాన్ని గమనించిన కవులు కలతచెంది తమ బాల్యాన్ని, గ్రామీణ జీవితాన్ని తలచుకుంటూ కవిత్వం రాశారు. గ్రామీణ జీవితాన్ని గ్లోరిపై చెయ్యడానికి ప్రయత్నించారు. గ్రామీణ జీవితంలో అభివృద్ధి జరగాలి కాని గ్రామాలు, జీవన విధానము, సంస్కృతి మారకూడదనడంలోని వైరుధ్యాన్ని కొందరు కవులు ఎత్తి చూపారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక కవిత్వంలో ఆత్మగౌరవ పోరాటాలు, ప్రపంచీకరణ, అమెరికనైజేషన్, సాంస్కృతిక కాలుష్యాలు, ఆధిపత్యాలకు ప్రతిగా స్థానీయతా స్పృహ పెరిగింది. మగువుల మానసిక భౌతిక సంఘర్షణలతో పాటు, పురుషుని సంఘర్షణలు, 'తల్లి'తో పాటు 'తండ్రి' ఆవేదనలూ కవితా వస్తువులైనాయి. ఈ దశాబ్దంలో చిత్తశుద్ధి కలిగిన కొత్త కొత్త కవులు, కళాకారులు కొత్తకొత్త వస్తు, శిల్పాలను వెలుగులోకి తీసుకొచ్చారు.

ప్రపంచీకరణ ఏయే రంగాలపై ప్రభావం చూపిందో రెండో అధ్యాయంలో చెప్పాను. ఆయా రంగాలపై వచ్చిన కవితాసంపుటిలోని వస్తు,రూప,శిల్పాలలో కవులు తీసుకున్న అంశాలను నా

వంతు ప్రయత్నంగా విశ్లేషణ చేశాను. కవిత్వం సృజనాత్మక ప్రక్రియ కావటం వలన ఆర్థిక, సాంస్కృతిక అంశాలతో ముడిపడి ఉన్న ప్రపంచీకరణను కవిత్వీకరించటంలో కొన్ని సమస్యలున్నాయి. అయినా కొందరి కవితలు, కొన్ని సంపుటాలు, సంకలనాలు పరిశీలిస్తే తెలుగు కవి స్థూలంగా ప్రపంచీకరణను భాగానే అర్థం చేసుకున్నాడని తెలుస్తుంది.

5.1.**వస్తువు:** వస్తువుని ఆంగ్లంలో 'content' అంటారు. "ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా, నియమబద్ధంగా ఉన్న మూలకాల, క్రమవిధానాల మొత్తమే వస్తువు. మనిషి, మానవ సంబంధాలు, సామాజిక జీవితం వస్తువు అవుతుంది. కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధానమైన 'concept'ని వస్తువుగా చెప్పుకోవచ్చు.

సాహిత్యం మానవీయమైన ఒకచైతన్య రూపం. ఉత్పత్తి సాధనాల మీద వాటిని ఉపయోగించే సామూహిక శ్రమ మీదా మనిషి అనుభూతితో కూడిన సంబంధం పెట్టుకున్నప్పుడు సాహిత్యరూపాలు ఏర్పడ్డాయి. ఆత్మరక్షణ, ఆహార సంపాదనల నుండి ఆరంభమైన సాంఘిక జీవనక్రమం సాహిత్యంలో వస్తువైంది అని సాహిత్యంలో వస్తువుని వివరిస్తూ విమర్శకులు అభిప్రాయబడ్డారు.

### 5.1.1. వస్తువు - నిర్వచనాలు:

- ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా, నియమబద్ధంగా ఉన్న మూలకాల క్రమ విధానాల మొత్తమే వస్తువు[1]
- "కవిత్వేతివృత్తం కవిత్వం దేన్ని గురించి రాస్తామో అది కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధానభాగం వస్తువు"[2]
- సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భాగాన్ని వస్తువు అనవచ్చు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు.[3]

కవిత్వంలో వస్తువూ, రుపమూ విడదీయరానివి. స్వతంత్ర వ్యక్తిత్వం లేనివి - వస్తువు నాశ్రయించి రూపమూ, రుపాన్నాశ్రయించి వస్తువూ ఉంటాయి.

ఎర్నెస్ట్ ఫిషర్ - form and content' అనే వ్యాసంలో రూపం - వస్తువును గురించి ఇలా అంటాడు.

“Always and everywhere, the form, structure or organization that has already been attained offer résistance to the new and everywhere the new content bursts the confines of old forms and creates new ones”[4]

### 5.1.2.వస్తువు - లక్షణాలు:

1. ఒక భావనను తీసుకోవటం ప్రధానం. దీన్నే కొంతమంది ఇతివృత్తం అంటారు.
2. తీసుకున్న భావన లౌకిక, అలౌకికమైన దానిలో ఏదైనా కావచ్చు.
3. వస్తు కళాత్మకత పొందటానికి ఆధారమవటం.
4. వస్తువు రూపంలో కలిసి ఉంటుంది. వీటి మధ్య వైరుధ్యం లక్షణమై పరస్పర విరుద్ధమైన రెండు విడదీయరానివిగా ఉంటాయి.
5. వస్తువు రూపం, రూపాన్ని వస్తువు అధిగమించే స్థితి కవి అభివ్యక్తిని బట్టి కలుగుతుంది.
6. వస్తువు సరిగా వ్యక్తం కావాలంటే సరైన రూపం ఉంటేనే సాధ్యమవుతుంది.[5]

**5.1.3.వస్తువు-రూపం:** వస్తువు రూపం కథాత్మకంగా, కళాత్మకంగా పెనవేసుకొని రూపుదిద్దుకున్నపుడు మాత్రమే అది “సాహితకళ” అవుతుంది. సాహిత్యం జీవితం నుంచి ప్రజాజీవితం నుంచి వస్తువును తీసుకుంటుంది. ఆ వస్తువే రూపాన్ని నిర్ధేశిస్తుంది. అలా నిర్ధేశింపబడిన రూపం వస్తువును కళాత్మకంగా మలచి పాఠకలోకానికి అందిస్తుంది. వస్తువు ముడిపదార్థం వంటిది. అది కళాకృతి పొంది పాఠక హృదయలోకాన్ని రసాత్మకంగా పరవశింపజేస్తుంది.

**5.1.4. కవిత - వస్తువు నవ్యత:** రాయప్రోలు, గురజాడ, శ్రీశ్రీ గొప్ప కవులుగా మారడానికి వస్తువైవిధ్యమే కారణం. రాయప్రోలు ఖండకావ్యాలలో కొత్తదనం, గురజాడ కవిత్వంలో ఆధునికత, శ్రీశ్రీ కవిత్వంలో అభ్యుదయం ఆనాటి కాలంలో వస్తు వైవిధ్యానికి నిదర్శనం. ఆరుద్ర, తిలక్, కుందుర్తి కవితల్లో వస్తునవ్యత, అభివ్యక్తి, ప్రయోగవాదాలు - వారిని గొప్ప కవులుగా మార్చేశాయి. విప్లవ, దిగంబర కవుల కవిత్వంలో వస్తువైవిధ్యం తీవ్రంగా ఆలోచింపజేసింది. అయితే సిద్ధాంతాలు, నిబద్ధత, మార్క్సిజం ఒక్కటే అన్ని సమస్యలకూ పరిష్కారం అన్న పీడితవాదం, వర్గపోరాటమే సమస్త సమస్యలకు విముక్తి అన్న భ్రమావరణ నిర్ణయాలు నాటి కవిత్వంలో వస్తు వైవిధ్యానికి కొంత వరకు అవరోధాలుగా నిలిచాయి. నిరంకుశుడైన కవి, క్రాంతదర్శి అయిన కవి - కొత్త వస్తు దర్శనం కన్నా,

ఇజాల ఇనుప చట్రాల్లో ఇరుక్కుని పోరాటాల ప్రేరణ కవిత్వం రాయాల్సిన వాడిగానే మిగిలిపోయాడు. కాస్త తిలక్‌లా అనుభూతి కవితా వస్తువులను ఎంపిక చేసుకొని కవిత్వం రాసినా, దాని వల్ల సామాజిక ప్రయోజనం ఏది లేదన్న విమర్శలకు సమాధానం చెప్పలేకపోయారు. అయితే 1980 తర్వాత వచ్చిన దళిత, స్త్రీవాద, మైనారిటీ కవిత్వంలో అస్తిత్వం ప్రధాన వస్తువైనప్పటికీ అనేక వస్తువుల్లో అస్తిత్వాన్ని పరోక్షంగా నిక్షిప్తం చేసి బలమైన అభివ్యక్తితో కవిత్వం పండించారు.

ఉద్యమాలు, విప్లవాలు, అస్తిత్వాలకన్నా, ప్రపంచీకరణ దుష్ప్రభావాలు కళ, సాంస్కృతిక, సామాజికాంశాలపై ప్రగాఢ ముద్ర వేయడంతో కవులు విభిన్న అంశాలపై కవితలల్లుతూ, అభివ్యక్తి నవ్యత, కవితానిర్మాణ పద్ధతుల్లో కొత్త పోకడలు పోతూ, అద్భుత కవిత్వపు వర్షంతో తెలుగు సాహితీ కేదారాన్ని సుసంపన్నం చేస్తున్నారు. అలాంటి కవుల కవిత్వంలో వస్తువైవిధ్యం ప్రస్తావించవలసిఉన్నది.

ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం పుష్కలంగా ఉన్న కవి కె. శివారెడ్డి. విప్లవ కవిత్వానికి చిరునామా అయిన అతని ఆత్మ వస్తువైవిధ్యం- గాఢతాత్త్వికత, అనుభూతి తీవ్రతతో ఎన్నో అద్భుత కవితలను ఆవిష్కరించింది. విప్లవం, వర్గ పోరాటం, సామాజిక చైతన్యం ముసుగులో వీర విహారం చేస్తున్న శిల్ప రహిత ఆ కవిత్వ మలినాన్ని ప్రక్షాళనం చేసిన శిల్ప స్ఫటికం శివారెడ్డి కవిత్వం.

> "అక్కడ ఆ బిందువు వద్దే ఆగిపోతే/ మరణిస్తే
>
> ఇప్పుడు అవధుల్లేని దుఃఖాతీత మోహార్ణవమేమిటి
>
> తొడిమ ఊడిన దగ్గర పువ్వు పుట్టటమేమిటి
>
> గడచిన వేళల్లో గగనపుదారుల్లో
>
> గడిచిపోయిన కాలం తీరులోనే ఒక విశేషముంది"[6]

ఈ కవిత చదివాక 'కవి పిండుకున్న తాత్త్విక బిందువే కవిత్వమన్న శేషేంద్ర మాట గుర్తొస్తుంది. భారతీయ రససిద్ధాంతం ప్రకారం కవి బహిర్జగత్తును ఆత్మీకృతం చేసుకోవడం చేతనే, తద్రూపక ఆత్మ కళను సిద్ధింపచేసుకోవడం వల్లనే అతడికి కవిత్వం సిద్ధిస్తుందంటారు. ఆ తాత్త్విక వస్తు శిల్ప రహస్య రస సిద్ధులేవో శివారెడ్డికి సిద్ధించాయేమో! సమర్థుడైన విలుకాని చేతిలో బాణం గురి తప్పదన్నట్టు,

ప్రతిభావంతుడైన కవి దేనిమీదైనా అద్భుత కవిత్వం రాసి మెప్పించగలడు. ఆ కోవకు చెందిన కవి ఎండ్లూరి సుధాకర్ వస్తు వైవిధ్యంతో ఎన్నో అంశాలపై కవిత్వం రాశారు. దళిత కవిత్వమే కాకుండా మానవీయ బంధాలు, మనోహర నగరాలపై, భాషా ఔన్నత్యాలపై కవిత్వమల్లారు. మనువును నిరసించి, మానవుణ్ణి ప్రేమించే ఎండ్లూరి సుధాకర్ అంత కన్నా గొప్పగా తెలుగు వాళ్లను ప్రేమిస్తారు.

"మారిషస్ తెలుగువారు సామాన్యులు కారు కారు

వేలమైళ్లు దాటివచ్చి అద్భుతాలు చేసినారు

తెలుగంటే లక్ష రుచుల ఇక్షురస్ (చెరకురసం)

మారిషస్! మారిసస్! తెలుగు భాషపీయూష్(అమృతం)

కులంలేని దేశమా! మారిషస్

అందుకో మా అందరి ఆశీస్"[7]

ప్రతి అంశంలోనూ కవి తన కవిత్వంలో తనదైన ముద్ర వేసుకుంటూ వచ్చాడు.

"పాప నది వీచే ప్రతి అలనూ

ఓ పాఠంగా పాడుకుంటుంది

చిరునగవు నగలతో మెరుస్తూ

చదువు సూరీడు పాప కనుపాపలపై

లేలేత కిరణాలను..

వెన్నెల పూల కేసరాలుగా జారవిడుస్తాడు

ఆమె ముఖ పందిరికింద

నక్షత్రాలు ద్రాక్ష గుత్తుల్లా వ్రేలాడుతాయి!

పెదాలు పున్నమి కొమ్మలు పూచినజాబిల్లు"[8]

అలను పాఠంగా పాడుకోవడం, చిరునగవును నగల నిగనిగలతో పోల్చడం, వెన్నెలపూల కేసరాల పదబంధాలను సృష్టించడం, ముఖాన్ని పందిరిగా అభివర్ణించడం, నక్షత్రాలను ద్రాక్షగుత్తులుగా ఊహించడం - భావనవ్యతగా భావించవచ్చు. "ఏరచనలో అర్థం మోయలేని శబ్దభారం, శబ్దం మోయలేని అర్థభారం ఉండక అర్థానికి తగిన శబ్ద ప్రయోజనం ఉంటుందో అదే ఉత్తమ రచన" అంటారు వాల్టర్ పీటర్. మల్లెల కవిత్వంలో శబ్దార్థాలతో పాటు పదబంధాలు, భావచిత్రాలు రసరమ్యంగా భావస్ఫోరకంగా ఉంటాయి. అంతేకాదు, కరవు సీమలో (అనంతపురం) జలస్వప్నం, శిల్పతరంగిణిలను సృష్టించడంలోనే ఎంతో వస్తు వైవిధ్యం ఉంది.

కవిత్వం ఆత్మకళ. అనుభూతి అల. నయనేంద్రియం కన్న వస్తువుకు అనుభూతి సౌందర్య లేపనం అద్ది భావుకతతో సరి కొత్త శిల్ప నిర్మాణంతో అద్భుత కవితా శిల్పంగా మార్చే హృదయ సౌందర్యం కవి కుంటుంది. దృశ్యమాన ప్రపంచాన్ని కవిత్వంలో అందంగా అభివ్యక్తి నవ్యతతో కొంత తాత్త్వికతను అద్ది మరీ మురిపెంగా, ముద్దుగా, కాస్త రసాత్మక పదవిన్యాసాలతో కళాత్మక భావచిత్రాల సొబగులతో, పసిపిల్లలా కవిత్వాన్ని ముస్తాబుచేసి మన ముందుంచగలడు. అలాంటి కవే రామా చంద్రమౌళి.

"ఎండిన రావి ఆకు రాలుతూ...

పసి చినుకు కూడా రాలుతూ

రాలడం, వాలడం..

సకల సమస్త జ్ఞాతాజ్ఞాత జగత్తును

గాజుకళ్లతో చూస్తూ చూస్తూ డోలనమై ఊగీ ఊగీ

అసలు చూపుఏది..

అనుభూతించే హృదయం ఏది ఆత్మ ఏది

అన్వేషణతో పాదాలు, గాజు ముక్కలపై

రక్తాలోడ్తూ సాగు తున్న వేళ

అన్నీ ఫ్లాష్‌బ్యాక్‌లు, ఫాస్ట్ ఫార్వార్డ్‌లే

సలసల కాగే కలల కాసారంలో.."[9]

ఎండిన ఆకురాలడం.. చినుకు వాలడం రెండూ ఒకటేనా? రాలడం, వాలడం అనటంలోనే ఈ కవి తీసుకున్న వస్తువులో  ప్రతిభ దాగుంది. అంతేగాదు, భౌతిక ప్రపంచాన్ని మనం ఎలా చూస్తున్నాం, గాజు కళ్లతో అంటారు. అందుకే చూపు ఏది? అనుభూతి ఏది? అను భూతించే హృదయం ఏది? ఆత్మ ఏది? అన్నతాత్త్వికమైన ప్రశ్నలతో కవితా నిర్మాణం సాగింది. ఈ పాదాలు చదివాక 'భావనా ప్రపంచం గొప్పదని, భౌతిక ప్రపంచం భావాల అభాస మాత్రమే' నన్న ప్లేటో (రిపబ్లిక్) మాట గుర్తొస్తుంది.

కవి భౌతిక ప్రపంచంలో ఉన్నా, అందరిలా సమస్త జ్ఞాతాజ్ఞాతమైన జగత్తును గాజు కళ్లతో చూడలేదు. అనుభూతించే హృదయం లేకుండా బతకలేదు. అందుకే రామా చంద్రమౌళి 'అంతర్దహనం', 'ఒక దేహం అనేక మరణాలు' వంటి వస్తువైవిధ్య కవిత్వం రాస్తున్నారు. కవిత్వంలో అనుభూతి వస్తుగతంగా ఉంటుందా? శిల్పపరంగా ఉంటుందా? అభివ్యక్తిలో దాగుంటుందా? అన్న తర్కాన్ని పక్కనపెట్టి దేహంలో అంతటా ప్రాణం దాగున్నట్టు కవిత్వంలో అంతర్లీనంగా అనుభూతి దాగుంటుంది. అనుభూతిలో ఆత్మ, జగత్తూ ఏకమవుతాయి. అనుభూతి మూలకమే కవిత్వం.

"నింగితల్లి నీలిమబ్బుల తెరమాటున

జాబిలి కూనకు తలంటు స్నానం చేయించిందా అన్నట్టు

ఈ రాత్రి ఇక్కడ కుండ పోతగా వర్షం కురిసింది

మేఘబాల నడుం చుట్టూ తళుక్కున

మెరిసిన మెరుపు తీగ వడ్డాణం నుంచి

జారిపడ్డ చిరుగజ్జెల్లా..

జల జలా రాలి పడిన చినుకుల ముత్యాలు

ఆకాశపుటరణ్యంలో చీకటి కొండల

పొదలచాటున దాక్కున్న

ఉరుముల వేటగాని వడిసెల నుంచి

దూసుకొచ్చిన వడగళ్ల దెబ్బలకు

అదిరిపడ్డ దిశా సుందరి వాలు జడ నుంచి

రాలిపడిన చినుకుల మల్లె మొగ్గలు"[10]

ఇలాంటి అనుభూతిని వర్షం ఓ హృదయంలో కలిగించిందా? లేక కవి అనుభూతిలో వర్షం అలా కనిపించిందా అన్నది ఇక్కడ ప్రశ్న కాదు. జాబిలి కూనకు స్నానం చేయించడం ఒక కొత్త ఊహ. శ్రీశ్రీ ఒంటరి ఒంటెలాగుంది జాబిల్లి అనడం లాంటిది. మెరుపు తీగను వడ్డాణంగా ఊహించడం, ఉరుముని వేటగానిగా భావించడం, వాడివడిసెల్లో వడగళ్ళను రాళ్ళుగా భావించి దిశా సుందరిపై విసరడం, అదిరిపడ్డ దిశాసుందరి వాలుజడ నుంచి చినుకుల మల్లె మొగ్గలు రాలిపడడం- ఇవన్నీ మెటాఫర్లని, భావచిత్రాలని అనడం కన్నా- ఓ కవి అనుభూతి ఇలా అందమైన కవితగా మారిందనుకోవడం ఆనందాన్నిస్తుంది. ఇక్కడ, కవిత్వానికి ఆత్మీకరణ ప్రధానమన్న మాట మరచిపోరాదు. రసగంగాధరకర్త జగన్నాథుడు కూడా 'భగ్నావరణ చిద్విశిష్టస్థితి' అని అన్నది ఇందుకోసమే! చిత్ అన్నది చైతన్యం, దాన్ని చుట్టుకొని ఉన్నది బయటి జీవితం అంటే జగత్తు. అదే ఆవరణ. ఈ ఆవరణను భగ్నం చెయ్యడం అంటే అందులో కవి లీనం కావడమే. చినుకుల వనం అనే ఆవరణలో కవి మనసు లగ్నం కావడమే కాదు, అదొక మయూరమై పురులు విప్పినర్తిస్తే కాని.. ఇలాంటి కవిత్వం రాదు కదా! కవికి సామాజిక పరిణామ సమగ్ర అవగాహనకు లోతుల్లోకి పోయే సూక్ష్మ దృష్టి ఉండాలి. ఆ దృష్టి స్కైబాబకు ఉంది ఒక కవి ఎలా మానవ మనస్తత్వాన్ని ఉత్తేజితం చేసి, ప్రభావితం చేసి దృక్పథాన్నే మారుస్తాడో స్కైబాబ 'సహచరం' చదివితే ఇట్టే అర్థమవుతుంది.

"దేహ ఖండాలేకమైం తర్వాత

అగ్గిపుట్టడమే కాదు

ఘనీ భవించడమూ ఉంటుంది

జీవితం సహచరమనే పర చేతిలో

పగ్గమై నలిగిపోతుంది

ఒకరి ఆధీనంలోకి,

హద్దులోకి నడవడం

నాలో నదులు నదులుగా ప్రవహిస్తున్న

చైతన్యాన్ని ఉప్పు సముద్రంలో కలపడమే"[11] మంచి ముగింపు దొరికినప్పుడే కథ అల్లుకుంటాను అంటారు చిలుకూరి దేవపుత్ర. కథల్లో మంచి ముగింపు, మలుపు, లేదా ఒక సంఘటన ఎలా పాఠకుని ఊపిరిని, మనసును తేలిక పరుస్తుందో, కవితలో మెరుపు లాంటి ముగింపు పాఠకుణ్ణి భావోన్మత్తునిగానో, రసోన్మత్తునిగానో చేయగలగాలి. అలాంటి కొసమెరుపుల టెక్నిక్ ఏదో స్కై బాబలాంటి కొందరు కవులకు మాత్రమే తెలుసు. ఎత్తుగడ, ముగింపు, కుందుర్తి నేరేటివ్ పొయెట్రీ స్టైల్ అనిపించినా స్కైబాబ కవితా నిర్మాణంలో తనదైన ప్రత్యేక శైలీ విన్యాసం, అభివ్యక్తి విలాసం, పద బంధాల కూర్పు, స్పష్టత, నవ్యత, వస్తు వైవిధ్యతలు గోచరిస్తాయి. ఇంకా సౌభాగ్య, ఆశారాజు, కందుకూరి శ్రీరాములు, శిఖామణి మొదలైన కవుల కవితల్లో వస్తువైవిధ్యం, భావవైశిష్ట్యం, శిల్పసౌందర్యం, మరెన్నో మెరుపులు ఉన్నాయి. ఆధునిక కవిత్వంలో ఇవాళ వాదాలు, సిద్ధాంతాలు పలుచబడి, వస్తువైవిధ్యంతో విస్తృతంగా అనేక మంది పాతతరం, కొత్త తరం కవులు తమ కలాలకు పదును పెట్టడం ఆనందించతగ్గ శుభపరిణామం.

## 5.1.5.తెలుగు కవిత్వంలో వస్తుపరిణామ క్రమం:

కాదేదీ కవితకనర్హం అన్నాడు శ్రీశ్రీ. దీన్ని బట్టి కవిత్వానికి ఏదైనా వస్తువు అవుతుంది. కవిత్వానికి వస్తువు అనుభూతి కావచ్చు. ఒక వర్గానికి, మరో వర్గానికి మధ్య శత్రుపూరిత సంబంధం కావచ్చు, కవికీ సమాజానికీ మధ్య జరిగే సంఘర్షణ కావచ్చు, కవిలో జరిగే అంతస్సంఘర్షణ కావచ్చు, ఒక సామాజిక వర్గానికి, మరో సామాజిక వర్గానికి మధ్యగల సామాజిక అంతరాలు కావచ్చు. వస్తువు లోకాధీనం, కాలాధీనం, రచయిత హృదయ భావన. అంటే కవితా వస్తువు అనంతమైందనేదిగా మనం అర్థం చేసుకోవాలి. వస్తువుకు, ఇతివృత్తానికి మధ్య తేడా తెలియక చాలామంది కొట్టుమిట్టాడుతుంటారు.

వస్తువు ముడిసరుకు అయితే, దాన్ని శిల్పంగా మార్చడానికి వాడే ఇతరేతర కవిత్వ పరికరాలతో కలిపి అది ఇతివృత్తమవుతుంది. వస్తువు కేంద్రమైతే, దాన్ని కళాత్మకంగా వ్యక్తం చేయడానికి అవసరమైన సామాగ్రి, వాతావరణం మొదలైనవి కలిపి ఇతివృత్తమవుతుంది. కాగా, వస్తుగత బాహ్య వాస్తవికతకు సంబంధించిన మన భావనను ప్రముఖ విమర్శకుడు త్రిపురనేని మధుసూదనరావు వస్తువుగా చెప్పారు. కవి భావన అంటే కవి దృక్పథమని చెప్పుకోవచ్చు. ప్రముఖ పాశ్చాత్య విమర్శకుడు క్రిస్టఫర్ కాడ్వెల్- వస్తుగత బాహ్య వాస్తవికతను సైన్స్ అన్నాడు. అంతర్గత వాస్తవికత కళ అవుతుందని చెప్పాడు. అంటే, ఇతివృత్తాన్ని కూడా కలిపి కాడ్వెల్ వస్తువుగా భావిస్తున్నాడని అనుకోవచ్చు. అలా చూసినపుడు వస్తువు అంటే మనకు కనిపించే పదార్థమే కాదు, దాన్ని కళాత్మకంగా వ్యక్తం చేసే కవి దృక్పథం కూడా అని ప్రస్తుత కాలంలో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అలా చూసినప్పుడు తెలుగు కవిత్వంలో వస్తువు పరిణామక్రమాన్ని బేరీజు వేయడానికి వీలవుతుంది.

ప్రాచీన కవిత్వం నుంచీ భావకవిత్వం నుంచీ అభ్యుదయ వస్తువువైపు కవి దృష్టి మళ్లడం శ్రీశ్రీతో ప్రారంభమైందని అనుకున్నా దానికి ముందు కొంత కసరత్తు జరిగింది. ఒక వస్తువును వెనక్కి నెట్టి మరో వస్తువు కేంద్రంగా మారడానికి పాత వస్తువును నెగేట్ చేసే కవిత్వం వస్తుంది. అలాంటి సందర్భాల్లో ఆ కవిత్వం కూడా కవిత్వంగా చెలామణిలోకి వస్తుంది. నిజానికి, ఆ కవిత్వమే కవిత్వమవుతుంది. భావ కవిత్వాన్ని నెగేట్ చేస్తూ పఠాభి కవిత్వం వచ్చింది. భావ కవిత్వాన్ని తన వచన పద్యాలనే దుడ్డుకర్రలతో కొడతానన్నాడు. నేను భావకవిని కాను, నేనహంభావ కవిని అని ప్రకటించుకున్నాడు. అశ్లీలం అనుకునే పదాలతో కూడా అతను ప్రయోగాలు చేశాడు. అదే క్రమంలో శిష్ట్లా, నారాయణరావు కవిత్వాలు వచ్చాయి. శ్రీశ్రీ చేతిలో అభ్యుదయ కవిత్వం పూర్తిగా రూపుదిద్దుకుంది. అయితే, శ్రీశ్రీ కూడా పాత వస్తువును నెగేట్ చేసే పని పెట్టుకున్నాడు. ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణమంటూ పాత వస్తు స్థితిని వ్యతిరేకించాడు. ఈ కవిత వస్తు మార్పిడి సూచిస్తుంది. మహాప్రస్థానం కవితలు అభ్యుదయ కవిత్వాన్ని ప్రతిబింబిస్తాయి.

సామాజిక పరిణామక్రమాలు కవిత్వంలో వస్తు మార్పిడికి దోహదం చేస్తాయి. అప్పటివరకు ఉన్న సామాజిక పరిస్థితులు, విలువలు మారినప్పుడు, మొత్తంగా సంపూర్ణ సామాజిక మార్పునకు అప్పటివరకు జరిగిన ఉద్యమాలు, పరిణామాలు సరిపోవనే భావన ఏర్పడినపుడు, లేదంటే కొత్త

సామాజిక పరిణామాన్ని ఆధిపత్య వర్గాలు సంలీనం చేసుకున్నప్పుడు కవిత్వం వస్తువు మారాల్సి వస్తుంది. ఆ సంఘర్షణ నుంచి కొత్త వస్తువు రంగం మీదకి వస్తుంది. ముందే చెప్పినట్లు ఈ సంధి దశలో వస్తు మార్పిడికి ధిక్కార కవిత్వం దోహదం చేస్తుంది.

అభ్యుదయ కవిత్వానికి ఆలంబనగా మారిన మార్క్సిస్టు ఉద్యమాలు నెహ్రూ సోషలిజాన్ని ఆలింగం చేసుకున్నాయి. పోరాటమార్గాన్ని వదిలేసి రాజీమార్గాన్ని అనుసరించాయి. ఈ పరిణామం మనకు సాహిత్యంలో కన్నా తెలుగు సినిమాల్లో బలంగా కనిపిస్తుంది. మంచి జమీందారుకు, రైతుకూలీకి మధ్య సమన్వయాన్ని, సామరస్యాన్ని నెలకొల్పిన సినిమాలు అప్పట్లో చాలా వచ్చాయి. ఇటువంటి సందర్భంలో తెలుగు కవిత్వంలో వస్తుమార్పిడి అవసరం ఏర్పడింది. తెలంగాణ సాయుధ పోరాట వైఫల్యం ఆ అవసరాన్ని మరింత తెలియజేసింది. ఆంధ్ర, హైదరాబాద్ విలీనం వల్ల తెలుగులో ఆ దశను చాలా ఆలస్యంగా పసిగట్టారని చెప్పవచ్చు. విశాలాంధ్ర ఏర్పాటుతో కలలోనైనా వాస్తవం కనిపించకుండా పోయే పరిస్థితి వచ్చింది. అభ్యుదయవాదం పూర్తిగా పార్లమెంటరీ పంథాకు తీసిపోని రీతిలో ముందుకు రావడం తెలుగు కవిత్వాన్ని తీవ్రంగానే ప్రభావితం చేసింది.

తెలుగు ప్రజలు భౌగోళికంగా కలిసిపోవడంవల్ల అభివృద్ధి, సాంస్కృతిక వికాసం, సామాజిక సమానత్వం సిద్ధిస్తుందనే భావనకు సామాన్య ప్రజానీకంతోపాటు మేధావులు, కవులు కూడా గురయ్యారు. అందుకే, తెలంగాణకు చెందిన సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి, కాళోజీ వంటివారు కూడా రెండు విభిన్న సమాజాల విలీనానికి సముఖంగా వ్యవహరించారు. అలాంటి సమాజం వస్తుందనే ఆశ తెలుగు కవిత్వంలో పాత వస్తువును చేసే ప్రక్రియను జాప్యం చేసింది. కలలూ ఆశలూ ఆశయాలూ కరిగిపోతున్న విషయాన్ని పసిగట్టి వారు ఈ సందర్భంలో దిగంబర కవులు మిగతా కవులకన్నా ముందుచూపున్నవారు మాత్రమే సంధి దశలో దాన్ని బద్దలు కొట్టడానికి క్రియాశీలక పాత్ర పోషిస్తారు. అలాంటి పాత్రను పోషించినవారు దిగంబరకవులు. నన్నయ్యను నరేంద్రుడి బొందలో తోసియండి వంటి తీవ్రమైన వాక్యాలు దిగంబర కవిత్వంలో చోటుచేసుకున్నాయి. అభ్యుదయ కవిత్వాన్ని ప్రశ్నించే కవిత్వం నగ్నముని నుంచి వచ్చింది. వీరిలో కాస్తా దారి దొరికినవాడు చెరబండరాజు. వందేమాతరం కవితలో అది వ్యక్తమైంది. అది దారి కాదనుకున్నవారు ఆ సమయంలో బలమైన కవిత్వం రాసిన మహాస్వప్న తర్వాతి కాలంలో నిష్క్రియాపరుడు కావడానికి కవిత్వం

సామాజిక పరిణామక్రమంలో ఉత్ప్రేరక పాత్ర వహిస్తుందని నమ్మకపోవడమే. దిగంబర కవిత్వం వినిపించిన ధిక్కార స్వరం నుంచి విప్లవ కవిత్వం ముందుకు వచ్చింది.

తెలుగు కవిత్వంలో మరోమారు వస్తు మార్పిడికి తెలంగాణ కవిత్వం అంటే స్థానీయ కవిత్వం కొండ గుర్తు అవుతుంది. తెలంగాణ నుంచి వచ్చేదంతా తెలంగాణ కవిత్వమని చెప్పకూడదనేది కొత్త నిర్వచనాన్ని తెలంగాణ భౌగోళిక ఉద్యమం ఇచ్చింది. ప్రాంతీయతను లేదా స్థానికతను ఆలంబనగా చేసుకుని ఈ కవిత్వం వచ్చింది. సామాజిక పరిణామక్రమాన్ని మలుపు తిప్పే లక్ష్యంతో ఈ కవిత్వం వచ్చింది. రెండు భిన్న తెలుగు సమాజాల మధ్య అసమానహోదాలు, అసమానావకాశాలు, వివక్ష తెలంగాణకవిత్వానికి వస్తువులయ్యాయి. అంటే వాటికి సంబంధించిన భావనలు వస్తువుగా ముందుకు వచ్చాయని చెప్పాలి. అయితే, తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ కవిత్వానికి భౌగోళిక తెలంగాణా రాష్ట్ర సాధన ఒక పార్శ్వంకాగా, ప్రపంచీకరణ వ్యతిరేకత దాని ప్రాపంచిక దృక్పథం. భౌతిక ఆధిపత్యం అవసరం లేకుండానే సాంస్కృతిక ఆధిపత్యం ద్వారా సామ్రాజ్యవాదం పెత్తనాన్ని వ్యతిరేకించే లక్షణం తెలంగాణ ప్రాంతీయ ఉద్యమంలో ఉంది, అదే కవిత్వంలోనూ వ్యక్తమవుతోంది. స్థానికోద్యమాలు మాత్రమే సామ్రాజ్యవాదానికి అత్యున్నత రూపమైన ప్రపంచీకరణకు సమాధానం చెబుతుందనే ఎరుక తెలంగాణ సాహిత్యకారులకు ఉంది. తద్వారా ఇది సాంస్కృతిక ఉద్యమ అవసరాన్ని గుర్తుచేస్తుంది.

దళిత ఉద్యమం నిజానికి ఈ దిశలో సాగాల్సి ఉండింది. ఇప్పుడు తెలంగాణ ప్రాంతీయ ఉద్యమం ఆ దారి పట్టింది. దానివల్ల వివక్షను ప్రశ్నించడం, ఆధిపత్య వర్గాలపై విమర్శలు చేయడం నుంచి తెలంగాణ ప్రాంతీయ కవిత్వం తన సాంస్కృతిక, సామాజిక ఔన్నత్యం గురించి మాట్లాడుతోంది. స్త్రీ, దళితవాద కవుల మాదిరిగానే ఆత్మగౌరవం గురించి, సమాన హోదా గురించి, సమాన హక్కులగురించి మాట్లాడుతూనే సామ్రాజ్యవాదులకు, వలస పాలకులకు నడుమ మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న సెక్షన్లను ప్రశ్నిస్తోంది. తెలుగు కవిత్వంలో వస్తు పరిణామక్రమాన్ని పరిశీలించినపుడు శిల్పం కూడా మారినట్లు మనం గమనిస్తాం. వస్తువు దానంతటదే శిల్పాన్ని నిర్ణయిచుకుంటుందనే మాటలోని అర్థం అదే. వస్తువు మారినప్పుడు తప్పకుండా నిర్మాణం, పాత వ్యక్తీకరణ పద్ధతులు, అభివ్యక్తి మారాల్సి వస్తుంది. అలాంటప్పుడు తప్పకుండా శిల్పం మారి తీరుతుంది. అంటే, వస్తువును కళాత్మకంగా వ్యక్తం చేయడానికి అవసరమైన పనిముట్లను కొత్తగా తెచ్చుకుంటుంది.

కవిపై ప్రపంచీకరణ ప్రభావం ఉన్నా లేకపోయినా దానికి సంబంధించిన స్థూల అవగాహన అవసరమవుతున్న తరుణం ఇది. ప్రపంచీకరణ పరిజ్ఞానాన్ని కవులు/రచయితులు తప్పక పొందవలసిన పరిస్థితి ఏర్పడింది. అమ్మను, ఊరిని, ఇంటిని, ఉత్తరాన్ని, వస్తువుగా చేసుకుని కవిత రాస్తే పాతికేళ్ళ క్రితం అనుభూతి కోణం నుంచి వ్యాఖ్యానించారు. ఇప్పుడు ప్రపంచీకరణ కోణం నుంచి వ్యాఖ్యానించక తప్పడం లేదు.

**5.1.6. ప్రపంచీకరణ కవిత్వంలో వస్తువు:** కవిత్వంలో వస్తువు అన్నపుడు కవి తీసుకున్న ప్రధాన విషయం. అది కథ, వర్ణన, వాదన ఏదైనా కావచ్చు. సామాజిక వస్తువుకు, సాహిత్య వస్తువుకు మధ్య ఒక ప్రత్యేక భేదం కన్పిస్తుంది. రచయిత తాత్త్విక దృక్పథం, మానవ సంబంధాల గురించిన అవగాహన, చారిత్రక, భౌతిక, సామాజిక అంశాలను కవితా వస్తువులుగా స్వీకరిస్తారు. భూదేవి, దేశం, అమ్మ, రైతు, వృత్తి ఔన్నత్యం, రైతు జీవితం, పత్తిపంట, పురుగుమందు, ఆత్మహత్యలు, రైతు కుటుంబాల దీన స్థితి కరువు, వర్షం కోసం ఎదురు చూపులు, రాయలసీమ గ్లోబలైజేషన్, అంతర్జాతీయ ఒప్పందాలు, బహుళజాతిసంస్థల నియంతృత్వం రైతు స్త్రీల అధోగతి, ముఖ్యంగా రైతు ఆత్మహత్య నేపథ్యంలో. భూమిని తల్లిగా భావించటం పాత వాడుకే. ఈ కవితల్లో అమ్మకీ భూమికీ తేడా లేనట్టు చెప్పిన పోలిక బలంగా ధ్వనిస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో గ్లోబంతా మారిపోయింది. విలువలు, నమ్మకాలు అదృశ్యమవుతున్నాయి. ఈ సందర్భంలో సున్నిత మనస్కుడైన కవికి ప్రతీది కవితా వస్తువు అవుతుంది.

తెలుగు నేలపై వచ్చిన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక మార్పులకు రచయితలు ఎప్పటికప్పుడు స్పందిస్తూనే ఉన్నారు. కవులు నిర్దిష్ట అంశాలపై కవిత్వం రాస్తూనే ఉన్నారు. ప్రపంచీకరణ ఇవాల్టి కవితా వస్తువైంది. “ప్రపంచీకరణను నిరశిస్తూ చాలా కవిత్వం వచ్చింది. ప్రముఖ కవుల నుంచి కొత్తగా కలం పట్టిన కవుల వరకు దాదాపు ప్రతి కవీ ప్రపంచీకరణను ప్రతిఘటిస్తూ కవితలు రాయటం విశేషమని” నందిని సిధారెడ్డి అన్నారు. ప్రపంచీకరణను వ్యతిరేకించే కవులలో ఎవరి శైలి వారికుంది. కొందరు అమెరికా వెళ్ళే యువతపై కోపంతో కవిత్వం రాస్తున్నారు. ఇలాంటి నిందలు వలన ప్రక్రియకు ప్రయోజనం చేకూరదు.

మరికొందరు కంప్యూటర్ను, వెబ్ సెంటర్లను తిడుతూ రాస్తున్నారు. అయితే ఎంపిక చేసుకున్న వస్తువుకున్న బహుముఖాలను వివిధ రూపాలలో చెప్పటం వలన కవిత్వానికి చిక్కదనం వస్తుంది. అమెరికాను, డాలర్ ను తిట్టిందల్లా కవిత్వం కాదనే విషయాన్ని కొందరు కవులు గుర్తించాలి.

ప్రపంచీకరణకు వ్యతిరేకంగా వచ్చిన కవిత్వంలో అవసరమైన నిరసన ఉంది. ఆనిరసన క్రమపద్ధతిలో కూడా ఉండటం, ఈ కాలం కవి పరిపక్వతను చూపెడుతుంది.1995 నుంచి ప్రారంభించి ఈనాటి వరకు ఈ కవిత్వం వస్తున్నది. వందలాది కవితా సంకలనాలు, దీర్ఘకవితలు వచ్చాయి. అయితే చాలా సంకలనాలలో కవిత్వం వచనమై తేలిందని చెప్పక తప్పటం లేదు. 70 సంకలనాలు వరకు ఈ పరిశోధన కోసం పరిశీలించాను. వాటిలో ప్రపంచీకరణను ఓ ఎత్తుకు ఎగసి పడేలా చేసే రచనలలో వస్తు శిల్పాలను మాత్రమే చూడటం జరిగింది. ఎన్నుకున్న వస్తువు పట్ల స్పష్టమైన అవగాహన ఉంది శిల్ప నైపుణ్యం ఉన్న కవితా సంపుటాలను పరిశీలనకు ఎన్నుకున్నాను.

ప్రపంచీకరణ నేపథ్యంలో కవులు స్వీకరించిన కవితా వస్తువులును పరిశీలిస్తే రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయం గిట్టుబాటు కాకపోవటం, పరిశ్రమలు మూతపడటం, నిరుద్యోగం, పేదరికం, అంతరించిపోతున్న మానవ సంబంధాలు, పండుగలు, జానపద నృత్యకళారుపాలు, స్నేహం, ప్రేమ మొదలగు సాంస్కృతిక పరమైన అంశాలు అన్నీ ప్రపంచీకరణ పర్యవసానాలుగా మారాయి. అమెరికాకు జలుబు చేస్తే ప్రపంచమంతటా తుమ్ములొస్తున్నది. ధనిక దేశాలు ఫైనాన్స్ పెట్టుబడులు ప్రపంచమంతటా ఆర్థిక సంక్షోభాలకు కారణమవుతున్నాయి.

నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగటం, ఆహార సంక్షోభం ప్రపంచీకరణ పుణ్యమే. కార్మికుల దోపిడీ పెరిగింది. ఉపాధికి భద్రత లేదు. ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు అవినీతి, కుంభకోణాలను తీవ్రంగా పెంచాయి. ఆరోగ్యం, విద్యాలాంటి కనీస సౌకర్యాలు కూడా అత్యధికులకు అందుబాటులో లేవు. అమెరికా, బ్రిటన్ తదితర ధనిక దేశాలు తమ బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసం యుద్ధాలు చేస్తూ లక్షల మంది ప్రజలను హతమార్చడం వంటి అంశాలు ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వంలో వస్తువులైనాయి.

ప్రపంచీకరణ దుష్ఫలితాలకు ఉత్తరాంధ్ర, తెలంగాణ లాంటి ప్రాంతాలు మరింత చీకటిలోకి వెళితే, కోస్తాంధ్ర లాంటి ప్రాంతాలు, ప్రపంచీకరణ ఫలితాలను అందిపుచ్చుకుని మరింత వెలుగులోకి దూసుకొని పోయాయి.

ఒకే సమాజం, ప్రపంచీకరణ చీకటి వెలుగుల్లోకి నిలువెత్తు అద్దంలాగా నిలచింది. ఈ పరిణామాలను ఉత్తరాంధ్ర తెలంగాణాకి చెందిన కవులు బలంగా పట్టుకున్నారు.

"పల్లెలకు పల్లెలన్ని
వలస పక్షులయి పోతున్నాయి
యింకా ఈడమిగిలేదేముంది?
ఏడిండ్ల కొక్క దీపమే కదా...."[12]

"పంటచేల్లేని పల్లె నుంచి" ఒక అమాయిక పాటగాడు పాడుతున్న దీనాలాపన గురించి చెబుతున్నాడు. పైకి ఆకర్షణీయం చేయబడుతున్న విదేశీ వస్తువుల్ని, ఈ దేశపు సొంతదనాన్ని, ప్రాకృతికతనీ నశింపజేస్తూ, కేవల వ్యాపార దృష్టితో జీవితాన్ని దోపిడీ చేసే వస్తు వ్యామోహాన్ని ధ్వంసం చెయ్యమంటాడు సూర్యభాస్కర్. ముఖ్యమైన అంశాలను పైపైన చెప్పడంగాక, అవగాహన కలిగించే సూక్ష్మాంశాలతో చెప్పాడు. ఇది ఈనాడు కవిత్వానికి చాలా అవసరం. అమూర్తమైన కోపంతో, ఆవేదనతో చాలా కవితలు వస్తాయి. కాని అవగాహన కలిగించేందుకు, వస్తువును లోతుగా, వాస్తవికంగా రూపొందించడం ముఖ్యం. సూర్యభాస్కర్ ఈ కోవాలోకి వస్తాడు. 'రైతు ఆత్మహత్య' కవితలో, అందుకు నేపథ్యమైన అంశాలన్నీ వివరిస్తాడు.

"విత్తనాన్నివ్వని విత్తనాన్ని
విత్తనానికి మారకం చేయొచ్చు....
హై బిల్లింగ్ తో హైటెక్కినా
లోవోల్టేజితో మొరాయించే మోటార్లు
తడారిన ఎడారిపోలాల బీటవేసిన నోళ్ళు..
పెరుగుతున్న ఎరువుల ధరలతో పాటు
చీడపీడల్ని కాక పంటను నాశనం చేసే
కల్తీ పురుగుల మందులు
పాము పోడలో' దోమకాటు వేస్తై
టుంగ్రోవైరస్ను రారమ్మంటై..."[13] ఇలా ఎన్నో వాస్తవికాంశాలను కవితా వస్తువులుగా స్వీకరించాడు కవి.

మరో కవిత 'అందాల అందలం'లో గ్లోబలైజేషన్ ముద్దుబిడ్డల్లోఒకటైన అందాల పోటీలను వస్తువుగా తీసుకున్నాడు. పైకి చాలా ఆకర్షణీయంగా ఇవి సామాన్య ప్రజలకి ప్రసార సాధనాలు మప్పుతున్నై. కాని, వీటి చీకటి కోణాల్లోకి కవి 'శీర్షాసనం' వేస్తే కనిపించే సత్యాలు వేరు. ఈ కవితలో కొన్ని పంక్తులు..

"ఆలోచిస్తే తెలుస్తుంది
గ్లోబలీకరణ మాయాజాలం
ఆర్థిక సంస్కరణల అమలులో
రూపొందిన భామాకలాపం...
అయిదేళ్ళలో రెట్టింపైన బ్యూటీ బిజినెస్
లావోలెన్, మేబెలైన్, ఎలియన్స్, గార్నియర్
ఎక్స్ క్లూజీవ్ 'షో' రూముల
సంపన్న దేశాల బ్యూటీ మార్కెట్ తరలింపు
వీధి వీధిన వెలుస్తున్న
బ్యూటీ పార్లర్లు"[14]

చక్కటి ఉపమానాలతో విత్తనాలపై పేటెంట్ పొందిన సామ్రాజ్యవాద ఈ కవి వ్యక్త పరుస్తున్నాడు.

"వ్యవసాయ అభివృద్ధిలో ప్రత్యేక దశలో ఉన్న సందర్భంలో విత్తనాల ప్రాధాన్యతను గుర్తించి, విత్తనరంగంలోకి సామ్రాజ్యవాద శక్తులు చొచ్చుకొని వచ్చాయి. విత్తనమనేది ఒక ఉమ్మడి వనరు. దీన్నే ఒక సరుకుగా మార్చి విస్తారంగా మార్కెట్ శక్తులు వ్యాపారం చేస్తున్నాయి. మన జీవన వైవిధ్యాన్ని ఈ శక్తులు లూటీ చేశాయి"[14]

**5.2.రూపం - నిర్వచనం:** తెలుగులో 'రూపం' అనే పదాన్ని ఆంగ్లంలో ఫామ్ (form) అనేపదానికి సమానార్థకంలో వాడుతున్నారు. రూపానికి రెండు నిర్వచనాలున్నాయి.

- "విషయాన్ని లేదా వస్తువును కళాత్మకంగా వ్యక్తం చేసే విధానమే రూపం"
- "కవి మనోగతమైన అనుభవం పటిత హృదయంలో జాగృతం చేయగలిగిన లయాత్మకమైన భావాన్ని మోసుకొని వచ్చే వాక్యవృత్తుల చరణ విన్యాసం రూపం"[15]

ప్రకృతిలోని ప్రతి వస్తువు రూపం ద్వారానే కనబడుతుంది. రూపం లేనప్పుడు వస్తువుకు అస్థిత్వం ఉండదు. అందువల్లనే రూపం ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

రూపం అంటే గోర్కి చెప్పినట్లు ...... వాస్తవాలకు మాటలనే ఉడుపులను అమర్చడమొక్కటే కాదు. ఆ ఉడుపు విషయాన్ని బట్టి నిర్ణయించబడినప్పటికి అది ఉదాసీనమైనది కాదు. క్రియాశీలమైనది (not passive but active) సరైన రూపం లేని విషయం చప్పగా శక్తి హీనంగా తయారై జనరంజకత్వాన్ని కోల్పోతుంది.

సరైన రూపం సరైన వస్తువుకు అమర్చినపుడు అది విషయాన్ని మరింత సూటిగా, స్పష్టంగా, అర్థవంతంగా, ప్రయోజనాత్మకంగా విశదపరచగల్గుతుంది. చక్కని వ్యూహం, అందమైన మాటల పొందిక కదిలించే సన్నివేశాలు, స్పందింపజేసే భావచిత్రాలు ప్రాసానుప్రాసలు, అలంకారాలు, జాతీయాలు, నుడికారాలు , చమత్కారాలు మొదలైన అంశాలు రూపానికి వివిధ పార్శ్వాలు.

**5.2.1. రూపం లక్షణాలు:** స్వాతంత్ర్యానంతర తెలుగుకవిత వస్తువు, రూపం, శిల్పం అనే గ్రంథంలో రూప లక్షణాలు ఈ విధంగా చెప్పబడ్డాయి.

1. వస్తువును ఆశ్రయించుకొని రూపం ఉంటుంది. రూపాన్ని ఆశ్రయించుకొని వస్తువు ఉంటుంది. అంటే రెండూ విడదీయలేనంత సంబంధాన్ని కలిగి ఉంటాయి.
2. వస్తురూపాలు విడదీయలేనంత సంబంధాన్ని కలిగివుండి కూడా వైరుధ్య స్థితిలో ఉంటాయి. అంటే ఒక దానిపై మరొకటి ఆధిక్యతను కలిగి ఉంటాయి.
3. రూపాన్ని బట్టి వస్తువును కొన్నిసార్లు, వస్తువును బట్టి రూపం మరికొన్ని సార్లు పాఠకులు ఆకర్షణకు గురవుతుంటారు.
4. 'రూపం' కొన్ని సార్లు 'ప్రక్రియగా' పిలవబడుతుంది. కాని ప్రక్రియ రూపంగా అరుదుగా అంగీకరింపబడుతుంది.
5. కాలానుగుణంగా వస్తువుతో పాటు రూపంలోనూ మార్పు కనిపిస్తుంటుంది. అయితే అది చారిత్రక సంబంధంలోనే కన్పిస్తుంటుంది.[16]

**5.2.2.రూప ప్రాధాన్యత:** ఒక రచన పాఠకునికి చేరడంలో మొదట పనిచేసేది రూపమే. వస్తువు ఎంత అభ్యుదయమైనప్పటికీ దాని అనుగుణమైన రూపం లేనట్లయితే ఆ విషయం వస్తువు నిర్ధేశించిన రీతిలో పాఠకునికి చేరదు. కేవలం వస్తుపే పాఠకుని కదిలించదు. వస్తువు దానికదిగా నిష్క్రియ అంటే శక్తి హీనం.

కవి సృజించిన  కవిత్వాన్ని ఒక రూపంలో చదువుకున్న పాఠకుడు ఆ రచనపట్ల ఆకర్షితుడౌతాడు. రూపం ఆకర్షిణీయంగా ఉండి పాఠకునిచే పూర్తిగా చదివింప చేయాలి. **ఉదా:** నవలలు ఎక్కువగా చదివే వాళ్ళు కవిత్వం చదువవచ్చు. అంటే ఒక ప్రక్రియను చదివితే మరొక ప్రక్రియను చదవవచ్చు. చదవకపోవచ్చు.

అంతేకాదు ఏ వస్తువైనా ఆ పాఠకుడు తనకు ఆసక్తిగల రూపంలో ఉంటే తొందరగా గ్రహించగలడు. స్త్రీవాదం, దళిత వాదంలో వస్తువేదైనాకావచ్చు. కాని ఆ వస్తువును పాఠకుడు పొందే మార్గాలు వేరువేరుగా ఉంటాయి. కొందరు నవల ద్వారా, కథల ద్వారా, మరికొందరు కవిత్వం ద్వారా, ఇంకొందరు పాట ద్వారా వస్తువును పొందుతారు. అందరికీ చేరే వస్తువు ఒక్కటే.

రూపాన్ని బట్టి  ఆ వస్తువుకు అభివ్యక్తి విధానం, క్లిష్టత, సులభత్వం అనేవి మారుతుంటాయి. రూపమనేది అభివ్యక్తి విధానంలో ప్రధాన పాత్ర వహిస్తుందని చెప్పవచ్చు.

**5.2.3. రూప విశిష్టత:** రూప విశిష్టత అన్నది వస్తువుకి అనుగుణంగా ఉంటుంది. కవి ఏ వస్తువుని (లేదా) ఏ రచన ఆధారంగా చేసుకొని కావ్యాన్ని రాస్తాడో, దానికి అనుగుణంగా రూపవిశిష్టత ఉంటుంది. కవి రాసిన కావ్యం పాఠకుడికి చేరుతుంది. పాఠకుడు రూపాన్ని ఏర్పరచాడు.

కావ్యం మరింత విస్తృత రూపం దాల్చాలంటే రూపవిశిష్టత అనేది చాలా ప్రధానం. ఇంకొంత మంది దాన్ని చదివి ఒక మంచి కావ్యంగా నిర్ధారించాలంటే దానికి రూపప్రాధాన్యం, రూపవిశిష్టత రెండూ ఉండాలి. కావున కావ్యానికి రూప విశిష్టత చాలా ముఖ్యం.

**5.2.4.వస్తు రూప సంబంధాలు:** రూపం లేని వస్తువు కాని, వస్తువు లేని రూపం కాని ఉండదు. అందువల్లే ఈ రెండు పరస్పర ఆశ్రితాలు వస్తురూపాలు రెండూ ఎల్లవేళలా కలిసే ఉంటాయి. వస్తువును ఆశ్రయించుకొని సాహిత్యంలో రూపం ఉంటుంది. కాని వస్తువులో వచ్చినంత త్వరితగతిలో మార్పు రూపంలో రాదు.

### 5.2.4.1. వస్తురూప సంబంధాలు రెండూ విధాలు:

1. చారిత్రక సంబంధాలు
2. గతితార్కిక సంబంధాలు

"Form is no value it is the form of its content" **- మార్క్స్.**

వస్తువులో గుణాత్మక మార్పు వచ్చినపుడు ఆ ప్రభావం మీద చూపుతుంది.

"Content is nothing but transformation of form into content, and Form its nothing but transformation of content is form". ఈ రూపాన్ని ఆశ్రయించుకొని అలంకారాలు, ప్రతీకలు, భావచిత్రాలు, శైలి మొదలైన అంశాలు ఆధారపడి ఉంటాయి.

చక్కని రూపాన్ని అందించడంలో తెలుగు ఎవరి ప్రతిభని వారు నిరూపించుకున్నారు. ఆధునిక కవిత్వంలో రూపానికి చాలా ప్రాధాన్యత ఉంది. ఈ క్రింది కవితను పరిశీలిస్తే.......

"ఒక్క చినుకు రాలితే బాగుండు
ఒకే ఒక్క చినుకు....
మబ్బుల్ని ఇంద్రధనస్సుగా మార్చి
మనసుని తేలికపరిచే చినుకు
నిద్రపట్టని కాళరాత్రి
తెల్లకాగితమ్మీద కవిత్వమై మెరిసే
ఒక స్వాతిముత్యపు చినుకు
ఒక్క చినుకు రాలితే బాగుండు
ఒకే ఒక్క చినుకు...."[17] అంటూ రూప విశిష్టతను చాలా చక్కగా వర్ణించాడు.

**5.3.శిల్పం:** వస్తువు వ్యక్తమయ్యే రూపాన్ని శిల్పం అంటారు. దీనిలో రచయిత సరైన పదాలకోసం, పదబంధాలకోసం, వాక్యవిన్యాసం కోసం కొత్త అలంకారిక వ్యక్తీకరణ కోసం, కొత్త లయకోసం, కొత్త ప్రతీకల కోసం అన్వేషిస్తాడు. కవితను చెప్పదల్చుకున్న తీరుతెన్నులే శిల్పం. ఒక వస్తువుని మనస్సు మీద గాడంగా ముద్రవేయడానికి అవసరమైన నిర్మాణపరమైన అంశాల సమూహారం అంటారు.

శిల్పంలో ఆధునికత భావనలో ప్రతీక గాని, భావచిత్రం గాని కవిత్వంలో సామాజిక వస్తువు కేంద్రస్థానంలోకి వచ్చిన తర్వాత రసావిష్కరణలో భాగంగా కావ్యానందం, రసానందం మొదలగు పూర్వపు అలంకార వినియోగానికి వాడటానికి కాలం చెల్లింది. ఈనాడు వస్తువు సమాజ సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని అలంకరించుకుంది. కవిత్వంలో ఈ వైవిధ్య పూరితమైన, విభిన్న రకాలైన అభివ్యక్తి, వైచిత్రాలకు, అభివ్యక్తికి శిల్పమే మూలమైనది.

వస్తువు - శిల్పం(Contentanttown) కవిత్వంలో వుండే రెండు అనివార్య భాగాలు. కవితా వస్తువు అంటే కవిత్వంలో వినియోగించుకోవడానికి కవి గ్రహించే ఒక పదార్థం, ఒక భావం, ఒక సమస్య, ఒక సందర్భం, ఒక ఆశ్రయం, ఒక సిద్ధాంతం.

ఒక్క మాటలో మనిషి లోపలా, బయట ఆవరించివున్న సమాజాన్ని కళాత్మకంగా అన్ని కోణాలలో ఆలోచించేలా ఆవిష్కరించటం, కవిత్వంలో వస్తువవుతుంది.

"వస్తువును ఉన్నది ఉన్నట్టు చూపడం శాస్త్రాలకు", కన్నది కన్నట్టు చూపడం శిల్పాలకు ప్రధాన లక్షణమని కట్టమంచి వారి అభిప్రాయం.

**శిల్పం నిర్వచనం - లక్షణం:** '**శిల్పం' విషయంలో కవులూ, విమర్శకులూ ఎన్నో నిర్వచనాలను చేశారు. 'శిల్పం' ఆంగ్లంలోని 'Technique' పదానికి సమానార్థకంలో వాడుతున్నాం. 'వస్తువు ఏ రూపంలో అభివ్యక్తం అవుతుందో ఆ రూపాన్ని 'శిల్పం' అంటారు. ప్రక్రియ, భావప్రతిమలు, భాష శిల్పంలో ముఖ్యమైన అంగాలు. ఈ మూడు అంశాల్ని కలిపే 'శిల్పం' అంటారు.

వస్తువుని నలుగురు నాలుగు విధాల దర్శించవచ్చు. దర్శనంలో ఇలా భిన్నత్వం ఉండడం వల్ల వస్తువూ, శిల్పమూ అనే విచక్షణ కలుగుతోంది. ఇది భ్రమ. వస్తువుకి ఆకృతి లేదు. రచయిత దర్శనమే వస్తువుకి ఆకృతి కల్పిస్తుంది. అన్నీ భిన్నమైన నిర్వచనాలే వీటిని అన్నింటినీ విశ్లేషిస్తే శిల్పానికుండే లక్షణాలు అవగతమవుతాయి.

**లక్షణాలు:**

1. కవి సృజన శీలతలోగల గొప్పతనాన్ని బట్టి అభివ్యక్తం కావటం
2. శిల్పాన్ని 'కళ' అని కూడా వ్యవహరించడం
3. వస్తువు, రూపం సరైన రీతిలో అభివ్యక్తం అయ్యేటప్పుడు దానిలో ఏదో ఒక శిల్ప పద్ధతి తప్పకుండా ఉండడం.

4. శిల్పంలో భాష అలంకారాలు, శైలీ, సంవిధానాలు ఇమిడిపోతాయి. కొన్నిసార్లు వాటి ద్వారా కూడా 'శిల్పం' శోభిస్తుంది.
5. కవితలోని వస్తువు, రూపం ఎన్నుకోవటాన్ని బట్టి కూడా శిల్పం ఆధారపడుతుంది. సరైన 'శిల్పాన్ని' ఎన్నుకుంటే ఔచిత్యవంతంగా పాటకునికి చేరి, కవి ప్రయోజనం నెరవేరటంలో సహకరించటం.
6. వస్తువు, రుపాలపైనే శిల్పం ఆధారపడుతుంది. అవి శిల్పంపై ఆధారపడే సందర్భాలు కూడా కనిపిస్తుంటాయి.[18]

**శిల్పం - సాహిత్య విలువలు:** రచనాశిల్పం అంటే రచనా కళాకృతి. ఇతి వృత్తాన్ని కథాత్మకంగా, కళాత్మకంగా. రసాత్మకంగా, మలిచే సాహితీ కళారూపమే శిల్పం. పాత్రలచిత్రణ, పాత్రల మనోవిశ్లేషణ, సంభాషణలు, వ్యక్తీకరణలు, వర్ణనలు, అలంకారాలు, సన్నివేశచిత్రణ, వీటిల్లో ఉపయోగించే భాషాశైలి వంటి పలుకళాసాధనాలు రచనా శిల్పాన్ని సృజిస్తాయి. ఇది ఎన్నో రసాత్మక అంశాల సృజన. పాఠకుల హృదయంలో ప్రవేశించి వికాస రసానుభూతి, చైతన్య రసానుభూతి, వంటి ఎన్నో రకాల రసానుభూతిని కలుగజేస్తుంది. సాహితీకళ అందించే రసాత్మక విలువలనే సాహిత్య విలువలుగా పరిగణిస్తారు.

ప్రతి మహాకవిని పుట్టిచ్చేది శబ్దప్రయోగం. శబ్దం యొక్క బలాన్ని తెలుసుకొని ఉపయోగించటం శిల్పంలో ఒక భాగం. శ్రీశ్రీ లలితమైన భావాన్ని చెప్పేటప్పుడు కోమల పదబంధాన్ని, ఉద్రేకపూరితమైన భావాన్ని చెప్పేటప్పుడు ప్రౌఢ పదబంధాన్ని ఉపయోగిస్తాడు. దీనికి శ్రీశ్రీ రాసిన ఏ కవితా ఖండికైనా ఉదా.గా చెప్పవచ్చు.

"పాపం, పుణ్యం, ప్రపంచమార్గం
కష్టం సౌఖ్యం శ్లేషార్థాలూ
ఏమీ ఎరుగని పూవుల్లారా?
అయిదారేడుల పాపల్లారా !
మెరుపు మెరిస్తే వాన కురిస్తే
ఆకసమున హరివిల్లు విరిస్తే
అవిమీకే అని ఆనందించే

కూనల్లారా?”[19]

ఇది పసిపిల్లలని సంభోదిస్తూ వారి మానసిక స్థాయిలో కావ్యఖండిక. ఇలాగే ఒక మహా ఉద్రిక్త భావాన్ని తీవ్రమైన ఉద్రేకంలో చెప్పేటప్పుడు అతని శైలిలో అపరితమైన మార్పు వస్తుంది.

కవి యొక్క మనోబలానికి, కావ్యగత శిల్పానికి అవినాభావ సంబంధం ఉంది. అతని మనస్సులో ఉన్న భావతరంగాల్లో ఏ భావతరంగం అతని సిద్ధాంతాల్ని నిర్దేశిస్తుందో ఆ భావతరంగమే అతని కావ్యం పొడుగునా ప్రవహిస్తూ ఉంటుంది. అంటే ఆభావాన్ని తీవ్రంగా వ్యక్తం చెయ్యడానికి అనుగుణమైన ఇతివృత్తమే అతని కావ్యానికి ఆలంబనమౌతుంది. ఆ ఇతివృత్తం కావ్యంగా ఆవిష్కరంపబడటానికి కవిచేసే ప్రయత్నఫలమే కావ్యశిల్పం. తనకు పూర్వం మరొక కవిచేసిన ప్రయత్నా ఫలితాన్నే తన కావ్యశిల్పానికి మార్గంగా ఎన్నుకుంటే అతడు సామాన్యకవి.

“ఎంతకురాని నౌకకోసం
ఎదురుచూస్తున్నట్లుంది జీవితం
తీయని కోర్కెలతో మొలచిన తీగమీద
నడుస్తూ సర్కాస్ చేస్తున్నట్లు
గడుస్తున్నది జీవితం”[20]

జీవితం మీద అతనికున్న ప్రగాఢ వాంచల్ని వ్యక్తం చేస్తూ వాటి ప్రక్కనే రాయటంలో కవి చెప్పదలచుకున్న ప్రధాన విషయం వెల్లడవుతుంది.

వైతరణి అనే కవితా సంపుటిలో చాలా విశిష్టమైన సన్నివేశాల్ని యధాతధంగా వర్ణించినపుడు, ఆ వర్ణనలోని, భావక్రమాలు ప్రజలకి బాగా దగ్గరగా ఉన్నపుడు, వేరే శిల్పాలు అవసరం లేకుండా, ఆ వాస్తవికతయే  ఒక శిల్పం ఔతుంది. ఇలాంటి ధోరణి ‘వైతరణి’ నిండా పరుచుకుని ఉంది.

“ఆరోజు కూలీతో
దినవెచ్చం గొనబోతే
పప్పుకు ఉప్పుకు
దీపంలో నూనె బొట్టుకు
మూడురాళ్ల పొయిలో

మండే పుల్లలకు

చంటిదాని చేగోడీలకు

తనుకట్టుకున్నవాడి బీడీలకు

సరిపోని ఈ దినానికి మాత్రం

ఇరవై నాలుగు గంటలున్నై

ఇంకా ఎన్నో సంవత్సరాలున్నై"[20] పై పంక్తుల్లో ఎక్కడా శబ్దాను ప్రాసలకుగాని, భావవైచిత్రికిగాని ఏమాత్రం ప్రయత్నం చెయ్యకుండా, సరైన నుడికారాలతో చెప్పబడింది.

మనిషి సామాజిక విధ్వంసక మూలాల్ని పసిగట్టి యుద్ధ సన్నద్ధమయ్యే చైతన్యాన్ని కలిగించే బావుకత, భాషా సామాగ్రి ఉన్న కవిగా రాధేయను ప్రతి పాఠకుడు గుర్తించగలుగుతాడు. ఈ మధ్య కాలంలో వెలువడిన కవితా సంపుటిల్లో ''అవిశ్రాంతం'' ఓ మంచి కవితా సంపుటి.

వస్తువు, శిల్పం ఈయన కవిత్వంలో జోడుగుఱ్ఱాలు

"ఆకలికి అన్నం తినిపించే అమ్మ

ఎంత రాసిన పూర్తి కాని కావ్యం

అమ్మంటే అనంతం"[21] అని అమ్మ జ్ఞాపకాల్లోకి వెళ్ళినా - చెదిరిపోని 'పచ్చబొట్టు' జ్ఞాపకాలను నెమరువేసుకున్నా - కుల వాయిద్యం 'రుంజ' నాదాల్లోంచి కన్నీళ్ళ బాధను ఆకలి మంటను పల్లె తల్లి దీనావస్థను, తెలంగాణా జీవితంలోని అమాయకత్వాన్ని ఆగ్రహాన్ని 'పర్యాయపదం' బలంగా వ్యక్తీకరించింది. కోల్పోతున్న ఆనవాళ్ళు, గ్రామీణ సంస్కృతి నేపథ్యం, సైబరిజం ప్రభావాలు అడుగంటుతున్న ఆత్మీయతలు, మారుతున్న మానవ సంబంధాలు, బాణాలశ్రీనివాస్ ను వేదనకు గురిచేస్తాయి. పద్యం ఎత్తుగడ, నిర్వహణ ముగింపు విషయంలో బాణాల శ్రీనివాస్ గారిది చేయితిరిగిన నైపుణ్యం, అభివ్యక్తిలో కొత్తదనం. ఇమేజినరీ సృజన లో నవ్య సాచిత్యం, వస్తుసమన్వయ శిల్పం అనుభూతి ప్రాధాన్యం, వైవిధ్యం,సంక్షిప్తం, శబ్దభావుకత లక్షణాలుగా కవిత్వానికి పర్యాయపదంగా బాణాలను అంచనా వేయవచ్చు.

"మాసిపోని మచ్చలు

మనసు మీద పచ్చబొట్లు రాలిపడ్తున్న

కనురెప్పల మీద

జారిపడుతున్న చీకటి పర్వతాలు

వంగిన ఆకు వెన్నుల్లోంచి

జారిపడే మేఘం. నక్షత్రాల్ని మింగే నల్లని పొగపాములు"[22] వంటి భావచిత్రాలు బాణాల భావనాపటిమను రూపుగడతాయి.

ప్రపంచీకరణ సామాజిక వాతావరణాన్ని విషాదంగా మార్చుతున్న సంధర్భంలో ప్రత్యామ్నాయాలు వెదుక్కోవలిసిన అవసరాన్ని 'పర్యాయపదం' గుర్తించమంటుంది. సాంద్రమైన పదబంధాలు, క్లిష్టమైన సమాసాలు ఆధునిక నిర్మాణ పద్ధతులతో సాగి ఆర్ద్రతానుభూతులను కలిగిస్తాయి. పాఠకుడిని కవిత్వ వాతావరణంలోకి లాక్కెల్తాయి . కాల్పనిక, ప్రకృతి ఆరాధన, ప్రేమ , ఒంటరి సంభాషణ బాణాల కవిత్వంలో ప్రత్యేకంగా కన్పిస్తాయి. తాను అధ్యయనం చేసిన ఆంగ్లకవుల భావచాయలు కంటెంట్ లో అక్కడక్కడ దర్శనం అవుతాయి. ఓ ఉదయ సుందరాన' పొద్దుటి పూట ప్రాకృతిక దృశ్యాన్ని రూపుకట్టిన కవిత టైటిల్ పెట్టడంలో ప్రత్యేకత ఉంది. సాధారణంగా అయితే 'ఓ సుందర ఉదయాన' అనాలి. సుద్దాల అశోక్ ఒక బతుకు పాట లో 'శ్రమ సుందరం కన్న మించింది లేదే' అన్నప్పుడు, సినారే ఒక సమావేశంలో యీ పాట 'దేశపతి శ్రీనివాస్ నోట విని' మళ్ళీ పాడించుకొని 'శ్రమ సుందరం ఏమిటయ్యా ముని సుందరం లాగా' అన్న విషయం గుర్తుకు వచ్చింది. నవ్యత కోసం ఆధునిక కవిత్వంలో ఇటువంటి ప్రయోగాలు సర్వసాధారణమే. వోకల్ కార్డ్స్ , ఇన్ ఫినైట్, మోటామార్ఫసిస్, కార్బన్ మొనాక్సైడ్ వాంటి సైన్స్ పరిభాషిక పదాలు, బాణాలకు సైన్సు పట్ల అవగాహనను తెలియజేస్తాయి. అనుభవాల ఘర్షణ, అస్థిత్వవేదన బాణాల కవిత్వాన్ని సంపద్వంతంగా తీర్చిదిద్దాయి.

కులవృత్తుల మీద వచ్చిన కవిత్వాన్ని పరిశీలించినప్పుడు బాణాల శ్రీనివాస్ గారి పద్యం 'కుంపటి' ఉపరిస్థాయిలో ఉంటుంది. బతుకును తీర్చిదిద్దే 'కుంపటి' లో విశ్వదర్శనం చేయిస్తాడు బాణాల.

"కంటికి దూరం కాలికి దగ్గరకు

కుంపటి మా ఇంటి తోటలో పూసే సూర్యపుష్పం

అందులో మేము మెరుపుల్ని చూస్తాం

మేఘాల్ని చూస్తాం

ఉరుముల్ని వింటాం

రకరకాల రంగుల్ని చూస్తాం

ఈ సమస్త విశ్వం తిరిగేది

మా కంసాలోళ్ళ కుంపటి చుట్టే

అది నిరంతర మండే అగ్నిగోళం

మా తురకగూడెమే కాదు

కట్ల డబ్బి తీస్కోని

రామాపురం/రత్నవరం/మునగాల/నడిగూడెం/కొక్కిరేని/ గణపవరం

తిమ్మరెడ్డి గూడెం/బరాఖత్ గూడెం/

కాలినడక తిరిగి పనిచేసిన రోజులు

గతం గూట్లోంచి తొంగి చూసే పురాణజ్ఞాపకాలు"[23]

అస్తిత్వవేదన , భావోద్వేగం, అధివాస్తవికత ముప్పురిగొన్న కమ్మెచ్చులోంచి సాగ దీసిన నిఖార్సైన బంగారు తీగ బాణాల శ్రీనివాస్ గారి "పర్యాయ పదం" కవిత్వం వూటబాయి కూడా!

**5.4.భావచిత్రాలు:** భావచిత్రంలో తన భావధారతో పటితను ముంచెత్తేస్థితిలో అలంకారం ఆకారాన్నిస్తుంది, అనుభూతి జీవశక్తినిస్తుంది. కవిత్వాభివ్యక్తి భావచిత్ర మవుతుంది. అంటే ఒక పదార్థానికి సంబంధించిన పోలికను చెప్పటంలో ఆ పదార్ధ సౌందర్యం దగ్గరే ఆగిపోకుండా అనేక అంశాల సమ్మేళనంలోని నవ్యత వలన సందర్భానికి తగిన ఒక భావనను, ఒక అవస్థను ప్రతిబింబించినట్లయితే అది కేవలం చిత్రం కాకుండా భావచిత్రం అవుతుంది.

భావచిత్రాల్లాంటి రూపకాది అలంకారాల వల్ల అనుభూతిని అందించే అభివ్యక్తిలో సమగ్రత గోచరించదు. భావచిత్ర నిర్మాణం తెలిసిన గొప్ప కవి తిలక్ రాత్రివేళ వినిపించే గానం చీకటి కాగితం మీద ప్లాటినం తీగల ఉన్నదనటం ఒక గొప్ప భావచిత్రం. తెలుగులో గొప్ప భావచిత్రాలను మనకు చూపించిన వారిలో దేవులపల్లి, శ్రీశ్రీ, శ్రీరంగం, నండూరి సుబ్బారావు, గుంటూరి శేషేంద్రశర్మ, అద్దేపల్లి మొదలగు రచనలలో ప్రయోగించిన తీరు కనిపిస్తుంది.[24]

భావ చిత్రాల్ని అడుగడుగునా వచ్చేట్టు రాయడం, వాటిలో లోతైన భావాల్ని నింపుతూ పోవడం, మొదటిసారిగా తిలక్ లో విశ్వరూపం పొందింది. ఇది తిలక్ కవిత్వానికి చాలా చిక్కదనం కలిగించింది.అంతేగాక అతని భావచిత్రాలన్నీ కొత్తదనం కలిగినవి.

"కిటికీ తెరిస్తే
కనబడుతుంది క్షితిజ రేఖ
నాకూ అనంతానికీ మధ్య వాలిన వినీలతమాలశాఖ
నాలోంచి కిటికీ అవతలకి దిగంతాలకి వ్యాపిస్తున్న నేను
బయటి నుండి కిటికీ లోపలకి సంకోచించుకు పోతున్న నేను
ఒకే ఒక కేంద్రంలో కలుసుకున్న ఉద్రిక్త క్షణంలో
ఉన్మదిష్ణువు సృష్టివేణువూదిన రహస్య గానం వినబడింది
ఉత్తాలశిఖరం మీద పగిలిన సూర్యగోళపు కాంతి చెల్లాచెదురైంది
ఊదారంగు మంచుకురిసిన ప్రథమోదయ దృశ్యంగా నాకు కనబడింది"[25]

భావ చిత్రాలను చూపించడంలో అరణ్యకృష్ణ తన ప్రతిభను కనపర్చాడు. తన కవితలో చెప్పే పోలికలూ, ఊహలూ, చిత్రాలూ, అడుగడుగునా కొత్తగానూ, కదిలించేవిగానూ ఉంటాయి. అతని కవిత్వానికి ముఖ్యమైన బలం ఇదే. మెహందీ స్త్రీల పరిస్థితిని ఇలా చెప్తాడు.

"ఎవడైనా బ్రహ్మజెముడు పొదలా మీదపడి
ఆమెను గోరింటాకులా రాసుకొని
కోర్కె పండిన తర్వాత
ఎండు గోరింటాకులా దులుపుకుంటాడు"[26]

మెహందీ స్త్రీని గోరింటాకుతో పోల్చి ఒక భావచిత్రంగా రూపొందించడంలో చాలా తీవ్రత వచ్చింది. కార్మికులు పల్లెల్ని వదిలి బతుకుకోసం పట్టణాలచేత ఆకర్షింపబడి వలసపోయి నష్టపోయే పరిస్థితిని యిలా చెప్తాడు.

"పాలువట్టిపోయిన కన్నతల్లిని వదిలి
కరెంటు తీగ పడ్డ నీటి మడుగు దగ్గరికి
దాహంతో పరిగెత్తే పసిబిడ్డల్లా

పల్లెల్ని వదిలి పట్టణాలకు ఎగబాకారు"[26]

పై పోలికలో 'పాలు' ప్రాకృతిక స్థితినీ, 'కరెంటు తీగ పడ్డ నీటిమడుగు' కృత్రిమత్వాన్ని స్ఫురింపజెయ్యడం వల్ల భావానికి బలం వచ్చింది.

అరణ్యకృష్ణ కవితల్లోని భావచిత్రాలు ప్రతి కవితలోనూ ఆశ్చర్య పరుస్తాయి. వస్తుప్రాధన్యానికి సంబంధించిన నిబద్ధత ఒక విషయం. దాన్ని శక్తివంతంగాఅభివ్యక్తం చెయ్యడం మరో విషయం. ప్రతి భావాంశమూ బలమైన అభివ్యక్తితో సాగిపోతుంది. ఇందులోని భావాలన్నీ కొత్తవైన భావచిత్రాల ద్వారానే చెప్పాడు కవి.

ప్రపంచీకరణ నేపథ్యంలో తమపై జరిగే హింస వల్ల తమలోని అభద్రతా భావాన్ని ఒక పిల్లిగా ప్రతీక చేసి కరీముల్లా చేసిన ధ్వని పూరితమైన రచనకి ఈ క్రింది పంక్తులే ఉదాహరణ.

"నాలోని పిల్లి బయటకి లోపలకీ
గెంతులు వేస్తుంది....
పువ్వొడి రాలుతున్న చప్పుడుతో
అల్లంత దూరంలో ఒలికిన పాలను
తడారిన నాలుకతో చప్పరించి
ప్రచండ గాలులు వీచినా వంగని
గడ్డిపరక గర్వానికి విస్తుపోతుంది
తలుపు ఒరగాతీసిన
నక్షత్ర సమూహాల కాంతుల్లోకి
పాదం మోపి మురిసిపోతుంది"[27] ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేయడానికి చెప్పిన సున్నితమైన భావచిత్రం ప్రశంసనీయం. ఈ కవిత నిండా భావచిత్రాలు ధారాపాతంగా ఉన్నాయి.

ప్రపంచీకరణ మానవ విలువలను మరింతగా దిగాజార్చుతుంది. అపుడు స్త్రీ ఒక వ్యాపార వస్తువుగా మారుతుంది. అంతకంటే గ్లోబలై పురుషుడికి బానిసగా మారుతుంది. పీడితుల జాబితాలో మొదటి పేరుగా ఉంటుంది.

"ఖండాంతరాల చీకటి వెలుతుర్లో
నూతన పదమొక్కటి

ఇనుపగోళ్లకు తేనెముంతలు కట్టుకొని
భూగోలమంతా మొహినిలా నాట్యమాడుతుంది
ప్రపంచీకరణ విషామృతాన్ని
పల్లెల్లో సైతం కల్లాపిగా చల్లుతుంది
ఆనపడ్డ అల్పజీవులు
ఎండుటాకుల్లా రాలిపోతున్నారు"[28]

చక్కటి భావచిత్రాలతో ఈ కవి చిక్కటి కవిత్వాన్ని అల్లారు. ప్రపంచీకరణ వస్తువే ఈ కవిత్వానికి జీవం. 'మోహిని'ని ప్రతీకగా తీసుకొని ప్రపంచీకరణ అనే విషామృతాన్ని పంచుతుందని చెప్పాడు. ఈ విషామృతాన్ని తాగిన ప్రజలు ఎండుటాకుల్లా రాలిపోతున్నారు. పశువుల పేడతో కల్లాపి చల్లి దేశంలో విషాన్ని వాకిట్లో పారించుకునే స్థితి ప్రపంచీకరణ వలన దాపురించింది.

**5.5.ప్రతీక-నిర్వచనం:** కవి చెప్పదలచుకున్న అంశాన్ని సంకేతాల ద్వారా సూచించడాన్ని స్థూలంగా ప్రతీక అని చెప్పవచ్చు. 'అప్రస్తుత వస్తు ప్రాధాన్యాన్ని పొందిన ప్రస్తుత వస్తువే ప్రతీక' మానసిక అనుభూతులకు అందుతూ కల్పనా జగత్తులో సంకేతాలుగా గోచరించే ఆవేశాలు అనుభవాలు భావోద్రేకాలు మొదలగు వానిని ప్రతీకలనవచ్చును.[29]

'symbol' అనే ఆంగ్లభాషా పదానికి మూలం గ్రీకు భాషాపదమైన symbolon అంటే to throw. "ఒక పదార్థాన్ని, ఒక గుణాన్ని లేదా ఒక సంగతిని జ్ఞప్తికి తెచ్చే దాని ప్రతినిధి రూపమైన సంకేతం, లక్షణం, చిహ్నం, గుర్తు సంజ్ఞ ప్రతీక"[30]

" symbol is visible audible sign or emblem of some thought, emotion or experience, interpreting that can be grasped only be the mind and imagination by something which enter the field of observation"[31]

ప్రతీకలో కవి చెప్పాలనుకునే విషయానికి, చెప్పే విషయానికి సంబంధం ఉంటుంది. కవి ప్రతీకగా ఉపయోగించే శబ్దం చెప్పాలనుకునే భావానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రతీకలలో అర్థం కవి స్వేచ్ఛ వలన ప్రయోగింపబడుతుంది. ప్రతీకలలో అర్థగూడత స్పష్టత రెండూ ఉంటాయి.

### 5.5.1. ప్రతీక లక్షణాలు:

1.ప్రాతినిధ్యం

2.సంబంధాలు

3.తత్త్వదర్శనం

4.సాంకేతికార్థం కాదు

5.సామ్యసిద్ధి అతార్కికం

6.అర్ధగూడత స్పష్టతలూ రెండూ ఉంటాయి

7.నిర్థిష్టార్థం లక్ష్యంగా ఉండదు

8.రూఢి

9.భావ సూచనా చేయగల్గడం ప్రతీకలకు సంబంధించి 9 లక్షణాలను సూచించారు.[32]

కవి తాను చెప్పదలచుకున్న విషయాన్ని బొమ్మ కట్టించడానికి భావచిత్రాలను, వస్తుభావ చైతన్యాలను శక్తివంతంగా సూచించడానికి ప్రతీకలను వాడాడు. ఈ రెండు లక్షణాలు ప్రపంచీకరణ కవిత్వంలో కనిపిస్తాయి.

"సింబల్ వలెనే కవి యొక్క దర్శనానుభవ సాంద్రత వ్యక్తమవుతుంది. సింబాలిజంలో ఒకే వస్తువుంటుంది. బయటకు కనిపించేది భౌతిక వస్తువు మామూలు కళ్ళకు కనిపించకుండా లోపల ఉండేది రెండో వస్తువు. అంటే వస్తువు యొక్క భౌతిక తాత్విక రూపాలను కవి గ్రహిస్తాడు. ఒకటి చర్మ చక్షువుతో, రెండోది విజ్ఞాన చక్షువుతో అనేది గుంటూరి శేషేంద్రశర్మగారి అభిప్రాయం"[33]

ప్రతీకవాదకవిత్వం తెలుగులో ఇటీవల కాలంలో ప్రాచుర్యం పొందిన కవితా ప్రక్రియ. ప్రాచీన సాహిత్యంలో కూడా ప్రతీకలున్నాయి కానీ, అని కాలక్రమంలో సంప్రదాయ ప్రతీకలుగా స్థిరపడినవి కనుక ఆనాటి కవిత్వంలో 'ప్రతీకవాదకవిత్వం' అనేది ఒక ప్రత్యేకశాఖగా అభివృద్ధి చెందలేదు. ఈ ప్రతీక కవితకు జనకస్థానం ఫ్రాన్స్. ఫ్రాన్స్ లో 1830లో ప్రారంభమైన రొమాంటిక్ కవిత్వోద్యమం తరువాత, 1857లో బోదిలేర్ తో ప్రారంభమైన కవిత్వోద్యమాన్ని ప్రతీకవాద కవిత్వమన్నారు.

తెలుగు కవిత్వంలో ఆరుద్ర "త్వమేవాహం" ప్రతీకాత్మక కావ్యం. దీని భూమిక తెలంగాణా రైతాంగ విప్లవం. కవి యొక్క మేధను పాఠకుడు అందుకోగలిగితే ఆ కవిత్వం యొక్క

రసానుభూతిని పొందుతాడు. లేకపోతేలేదు. ఇది ప్రతీక కవిత్వంలోని బలము, బలహీనత. గడ్డిపరకను సమాజంలో నికృష్టంగా బతికే ఒక మనిషికి ప్రతీకగా తీసుకున్నాడు.

తెలుగు కవిత్వంలో ప్రతీకవాద ధోరణి నారాయణబాబు కంటె తదనంతర కాలంలోనే ఎక్కువ ప్రచారంలోకి వచ్చినప్పటికీ ప్రతీకవాద కవిత్వానికి బీజాలు శ్రీశ్రీ, నారాయణబాబు ప్రభృతులే వేశారు. నారాయణబాబు ప్రతీకవాద ధోరణిలో రాసిన గేయం గడ్డిపరక.

"నడవండి
నడవండి
నామీంచి నడవండి
గడ్డిపరకను
గడ్డిపరకను"[34]

ఇవి గేయ ప్రారంభంలోని పాదాలు. గడ్డిపరక ఒక్కటి సామాన్య జీవితమైతే దానిమీద నుంచి ధనికవర్గ సమాజం ప్రయాణం చేస్తున్నది. అంటే ధనిక సమాజానికి అవసరమైన, సాఫీయైన మార్గాన్ని సామాన్యుడే నిర్మిస్తున్నాడు.

నేటి సమాజాన్ని గూర్చి పేర్వరం జగన్నాథం వర్ణించిన తీరు మెచ్చదగినది. బలవంతుడు బలహీనుణ్ణి అడుక్కితొక్కేసే విధానానికి ఈనాటి సమాజం ప్రతీక.

"ఈ ఇల్లు కీచకుడు సైరంధ్రికోసం ఎదురు చూస్తూ
ఉబుసుపోకకై కట్టుకున్న
ఇసుకగూడులా ఉంది
బకాసురుడు వండుకుని పారేసిన
పగిలిన కుండలాగుంది."[35]

కీచకుడు, బకాసురుడు ఇద్దరూ ఒక్కొక్కరకమైన దుర్మార్గత్వానికి ప్రతిరూపాలు. కీచకుడు స్వవాంఛ ఫలసిద్ధికోసం సమాజాన్ని సైతం లక్ష్యపెట్టని పరమ దుర్మార్గుడు. బకాసురుడు సమాజసంపద నంతటిని తానొక్కడే అనుభవించాలనుకొనే పరమ భయంకరుడు. ప్రపంచం కీచకునికి ఎంత అల్పంగా కనబడిందో ధ్వనింపజెయ్యటమే 'ఇసుకగూడు' అన్న పదం యొక్క ఉద్దేశ్యం. పగిలిన కుండ ప్రజాజీవితానికి ప్రతీక.

స్పాంటేనిటీ ప్రతీకలను, భావచిత్రాలను సృష్టించిందనుకోవలసిన పనిలేదు. ఒకే ప్రతీక కవిత అంతా భావావేశంతో వ్యాపించి ఉంటుంది. 'ప్రతీక' కవితలో భావతీవ్రత తోసే దర్శనమిస్తుంది.

"అనుభవాల సంతలో
హడావుడిగా తిరుగుతూ
నరాలు మీటుకుసే
మనస్సు అపశ్రుతుల్ని వింటూ
ఎక్కడో జారవిడుచుకున్నాను నా కాలాన్ని"

ఇక్కడ కలం భావానికి ప్రతీక. ఇది మొత్తం కవిత వ్యాపించి ఉంది.

పొంగుతున్న నా రక్తమాంసాల అలలు
నాలోపలి చీకటి పరిధుల తీరాల్లో
తిరుగుతున్న వేళ
ఎక్కడో పారేసుకున్నాను నా కాలాన్ని

జారవిడుచుకోవడం అన్న క్రియలు కవి మనఃస్థితిని చెబుతున్నాయి.[36]

వేల సంవత్సరాలుగా మన ఇంటి ముందు ఉన్న వేపచేట్టుపై పేటెంట్ హక్కు కోసం అమెరికా లాంటి దేశాలు వెంపర్లాడుతున్నాయి.

"నా పెరటి వేప
వేరొకని 'పేటెంట్'
నాగోమాత పంచకం
వంచకుల 'పాలు'
వలసల వలలో నా మేధోపక్షి"[37]

మంచి ప్రతీకలతో వ్యంగ్యంగా కవితను నడిపిన తీరు బాగుంది. కొన్ని చరణాలు వచనమై తేలినప్పటికీ చెప్పిన ధోరణి బాగుంది. ప్రపంచాన్ని దోచుకోవడానికి ధనిక దేశాలన్నీ ఒక కూటమిగా ఏర్పడ్డాయి. దానికి జి-8 దేశాలని పేరుపెట్టుకున్నాయి. దోపిడీ చేయడానికి ప్రపంచీకరణ మార్గమొక్కటే ఎన్నుకున్నాయి.

ప్రపంచీకరణ మనిషి జీవితంలోకి వస్తువులను మోసుకొచ్చింది. ఈ వస్తు వ్యామోహం ఆర్థిక స్థితిగతులను అధిగమించింది. ప్రపంచబ్యాంకు అప్పుల వలన డబ్బు ప్రవాహం పల్లెలోకి పారింది. పల్లెలో అందరి జీవితాలు బాగుపడ్డాయా? అంటే అదీ లేదు. బహుళజాతి కంపెనీలకు అవసరమైన ఒక వర్గాన్ని తయారుచేసుకొని వాళ్ల చేతుల్లోకి ప్రవహింపజేయటం ప్రపంచీకరణలో జరిగిన కుట్ర. ఆ వర్గమే ఆకాశానికి నిచ్చెనలు వేయాలని కలగంటుంది. ఎగువ మధ్యతరగతి పోకడలను అనుసరిస్తుంది. గ్లోబలీకరణలో పాశ్చాత్య కలగంటుంది. ఇపుడు పాటలన్నీ గ్లోబలైజేషన్. ప్రపంచీకరణనే మనషి ఆర్థిక జీవితాన్ని నిర్ధేశిస్తుంది.

"పాడుదాం ప్రియా
గ్లోబలైజేషన్ పాటపాడుదాం
..................................
పొయ్యిలో పిల్లిలేవని ఇంట్లో కలర్ టీవీ
చేతి రుమాలు లేకున్నా పాకెట్లో సెల్ ఫోన్
పార్టీ ఆఫీసుల్లో లాప్ టాప్లు కంపూటర్ల
ఎర్రజెండా కుటుంబాల కేరాఫ్ అడ్రాస్ అమెరికా
డాలర్ ఇవ్వాళ అంతర్జాతీయ పతాక"
............................................
ఇప్పుడు వీస్తున్నది
పడమటి గాలి"[38]

ఈ కవి మూస కవిత్వంగా కాకుండా సాధారణ ప్రతీకలతో అసాధారణ భావాన్ని వ్యక్తం చేశారు. అధ్భుతమైన పోలికలు, సాధారణ పాఠకుడికి అర్ధమయ్యేశైలి. ఇందిరాపార్కు వద్ద అమెరికాకు వ్యతిరేఖంగా ఒక ధర్నా ఒక ఉపన్యాసం. ఆర్టీసి క్రాస్ రోడ్ లో బుష్ దిష్టిబొమ్మ దగ్ధం, కడుపులో పుట్టిన పిల్లలు డాలర్ల వేటలో అమెరికా ప్రయాణం. ఇది ఈ నాటి కొందరి కమ్యునిస్ట్ కుటుంబాల కహాని. గుండెకు హత్తుకొనే వ్యంగ్యం ఈ కవిత నిండా ఉంది. ప్రపంచీకరణ చీకట్లో ఇప్పుడు చాలామంది పడమటి గాలిని శ్వాసిస్తున్నారు. గాలిలో ఎగిరిపోయిన సంతానం తల్లిదండ్రులను కూడా రెక్కలు కట్టుకొని అమెరికాలో వాలమంటుంది.

పేటెంట్ హక్కుల పేరిట వ్యవసాయాన్ని దివాలా తీయించి, తమ సరుకులను అమ్ముకోవడానికి ప్రజలలో వస్తు వ్యామోహాన్ని పెంచే ప్రయత్నం ఇప్పుడు మొదలైంది.

"పట్నాల చుట్టూ నాటుకుంటున్న
డబ్బు చెట్లకి
ఊర్ల నెత్తుటి పారకం
అన్నీ కనిపిస్తున్న కుట్రలే
తడిగుడ్డలై బిగుసుకుంటున్న కుట్రలే"[39]

ఈ కవిత ప్రతీకాత్మకంగా ఉంది. భూమికి ధర పెరిగి కుటుంబంలో కలతలు రేగాయి. ఈ ఘర్షనలే ఒకరిని ఒకరు చంపుకునే స్థితికి వచ్చాయి. తడిబట్టలతో గొంతు కోయటం ప్రపంచీకరణ నైజం, మనిషికి భూమి పోయింది. వృత్తి పోయింది. మిగిలింది మరణమే.

"కార్మికుడు సచ్చిండంటే
చస్తుండంటే....
గ్లోబలైజేషన్ చెత్తిరి కిందనే
ప్రపంచీకరణ
కవరేజేరియాలోనే" (అదే)

"ప్రస్తుతం ఈ ఫోను కవరేజేరియాలో లేదు. లేదా కస్టమర్ స్పందించటం లేదు. కాసేపాగి ప్రయత్నించండ"ని ఒక తియ్యటి గొంతు సమాధానం చెబుతుంది. ఈ ప్రతికతో కవి ఈ ప్రపంచీకరణ కవరేజిరియాలో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని రాశారు. చేతివృత్తులు ధ్వంసమై అగ్గిపెట్టెలో ఇమిడ్చిన చీర ప్రపంచ మార్కెట్లో దిగాలుగా కూర్చొని గ్లోబలైజేషన్ చెత్తిరి కింద ఉరిపెట్టుకుంటున్నది.

**5.6.పాత్రల చిత్రణ:** పాత్రల చిత్రణను పరిశీలించే ముందు సాహిత్యంలో చోటు చేసుకున్న పరిణామాలను, ఉద్యమాల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి వుంటుంది. అప్పుడు పాత్రల చిత్రణ మీద అవగాహన ఏర్పడుతుంది. వ్యక్తివాద సాహిత్యంలో పాత్రలు వ్యక్తులుగానే ఉంటాయి. అవి వ్యక్తుల స్వరూప స్వభావాలను, జీవనశైలినీ, ఆలోచనావిధానాన్ని వ్యక్తుల అరుదైన వ్యక్తిత్వాలను ఆవిష్కరిస్తాయి. అవి వైయుక్తిక నైతిక విలువలును, సంస్కార విలువలను సమాజానికి నేర్పుతాయి.

వాటివల్ల కొందరు వ్యక్తులు ప్రభావితం కావచ్చు. వాటి పరిమితి అది. అవి అంతకంటే ముందుకు పోలేవు. సామాజిక సాహిత్యంలో పాత్రలు అలా కాదు. అవి సామాజిక శకలాలను, వర్గాలను ప్రతిబింబిస్తాయి. ఆ పాత్రల స్వరూప స్వభావాలు సాధారణీకరించి చూస్తే, ఆ వర్గ స్వరూప స్వభావాలకు అతి దగ్గరగా వుంటాయి. అంతేకాదు, ప్రతిభావంతమైన కొద్ది మంది రచయితులు మరో ప్రయోగం కూడా చేశారు. ఆయా వర్గాల లేదా శకలాల సర్వజగత్తునీ సాధారణీకరించి, పాత్రీకరించి, సాహిత్యంలో పాత్రలుగా సృజించారు.

ప్రగతిశీల, అంతేకాకుండా విప్లవ చైతన్య ప్రభావంలోంచి వస్తున్నా సాహిత్యమే స్రవంతిగా వుంటోంది. వర్గస్పృహ, వర్గసంఘర్షణ, వర్గపోరాటచైతన్యం లక్ష్యంగా ఆ సాహిత్యం వస్తోంది. ప్రజాసమస్యల సాహిత్యీకరణ జరుగుతోంది. ప్రజాసమస్యలకు రెండువైపులా, అన్నివైపులా ప్రజలే వుంటారు కాబట్టి ప్రజలే పాత్రలుగా వుంటారు. పీడించే వర్గంలో ప్రముఖంగా కొత్తతరం పెట్టుబడిదారీ వర్గం, ఉన్నత ఉద్యోగవర్గం, రాజకీయవర్గాల వంటి దోపిడీ వర్గాలుంటాయి. పీడింపబడే వర్గాల్లో ముఖ్యంగా చిన్నరైతులు, రైతుకూలీలూ, చేతివృత్తులవారు, పారిశ్రామిక కార్మికులు, పేదలు, పతితులు వంటి అతాధిక ప్రజారాషిని ప్రతిబింబించే పాత్రలూ ఉంటాయి. మధ్యతరగతిలో కొందరు పీడించేవర్గంలో వుంటారు. కొందరు పీడింపబడే వర్గంలో వుంటారు. పాత్రలు ఆయావర్గానికి చెందిన ప్రజల బలం, బలహీనతలు, జీవనశైలి, ఆలోచన విధానం, ఆ వర్గాన్ని నడిపే భావజాలం, జీవన విలువలూ, విధ్వంసక స్వభావం, వర్గస్పృహ, వర్గసంఘర్షణ, వర్గపోరాట చైతన్యం, అలాగే దోపిడి, అవినీతి, అరాచకాలు అక్రమజీవన విధానం ప్రపంచీకరణ నేపథ్యంలోనే వచ్చాయి. వ్యవస్థలో హింస, నేరం, వివక్ష, అసమానత వంటి అన్ని దుర్మార్గాలూ వ్యవస్థీకృతమైనాయి. వాటి నుండి బయట పడేందుకు, చైతన్య స్ఫూర్తిని కలిగించడానికి ప్రపంచీకరణ కవిత్వంలో అనేక పాత్రలు సృష్టింపబడ్డాయి.

ప్రపంచీకరణ ప్రభావంలో మన ప్రజలకు 'ఇద్దరు శత్రువులు' వ్యవస్థ ఏర్పడిపోయింది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ 'పరోక్షశత్రువు' దాన్ని ప్రజల నెత్తి మీద రుద్దుతున్న 'రాజ్యం' ప్రత్యక్ష శత్రువు. ప్రజాజీవితానికి సంబంధించిన ప్రతిశైలిమీద, విధానంమీద, అంశం మీద అది విధ్వంసక ప్రభావం కలిగిస్తోంది. ఆ విధ్వంసం ఎలా జరుగుతోందో చెప్పే పాత్రలతోపాటు, దాన్నుంచి బయట పడేందుకు మార్గాన్ని చూపించి చైతన్య స్ఫూర్తినిచ్చే పాత్రలు కూడా ప్రపంచీకరణ కవిత్వంలో

చోటుచేసుకున్నాయి. ప్రపంచీకరణలో భాగంగా స్త్రీ వాద సాహిత్యంలో కనిపించే పాత్రలు చూస్తే ఏ రకంగా చిత్రీకరించారో తెలుస్తుంది.

"ఒక్కొక్కపోరా
ఒలి చేస్తున్నప్పుడు
ఖచ్చితంగా ద్రౌపది మనసులో ఏం జరిగిందో
భారతం చెప్పదు.
ఏ కీచకుడో జుట్టుపట్టి ఈడ్చినప్పుడు
కణకణమండిన ఆమె నిలువెత్తు శరీరం
ఐదుగురిని పెళ్ళాడి
ఎంత మోసపోయిందో
వ్యాసుడికి సరిగ్గా అంతుపట్టదు
ఏం రాస్తే ఏం మునుగుతుందో
పాతివ్రత్యం ఎక్కడ చెదురుతుందో
కథని ధర్మరాజు వైపు నడిపించేస్తే సరి
మహా రాజకీయవేత్త మహాభారత కర్త
వ్యాసుల వారికి మలుపు తిప్పడం కష్టమా?"[41]

ఒక రచన ఎవరికోణం నుంచి వ్రాయబడుతుందన్నది స్త్రీవాద సాహిత్యం తెచ్చిన ఒక మౌలిక ప్రశ్న. కవితలో పురుషుడి దృక్కోణం నుండి మహా భారత రచన జరిగిందని స్త్రీ పాత్రలకు ప్రాముఖ్యం లేదని ధర్మరాజు వంటి పురుష పాత్రలకు జరిగే ఘటనలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ఉన్నదని అందుకే ద్రౌపదీవస్త్రాపహరణ సమయంలో ఆమె మనసులో ఏం జరిగిందో భారతంలో వ్యాసుడు చిత్రించలేదని సాహిత్య రంగంలో పురుష రచయితలందరూ వ్యాసులేనని వారి రచనలు కూడా పురుష కోణం నుంచి రచించినవేనని ఇక్కడ స్ఫురింపజేసింది. మహాభారత పాత్రల ద్వారా స్త్రీ ఉనికికి గుర్తింపు లేదన్న విషయాన్ని జయప్రభ కవిత్వీకరించారు. సరిగ్గా ఇదే పరిస్థితి సమకాలీన సమాజంలోనూ కొనసాగుతుందని పై పాత్రల ద్వారా వ్యక్తీకరించారు.

"అందుకే

నా విషయంలో

కర్ణార్జునలిద్దరికీ వైరం లేదు

నా ముందర నించున్న

ధర్మరాజుకు దుశ్శాసనునికి బేధం లేదు"[42]

పురుషుని మంచితనమో చెడ్డతనమో స్త్రీ పీడనానికి కారణం కాదు. మంచివారైనా చెడ్డప్రవర్తన కలిగిన వారైనా పురుషుని అధికారానికీ స్త్రీ గురి అవుతుందని ధర్మరాజు దుశ్శాసన పాత్రల ద్వారా వ్యక్తీకరించారు.

**5.7.చమత్కారాలు: "**లోకోత్తరత్వం చ ఆహ్లాదగతశ్చ మత్కార పర్యాయోనుభవ సాక్షికోజాతి విశేషః పునః పునరను సంధానాత్మ" అని రసగంగాధరంలో జగన్నాథ పండితరాయలు పేర్కొన్నాడు. రమణీయార్థం వలన కలుగు లోకోత్తరమైన ఆహ్లాదమునకే చమత్కారమని పేరు. అది అనుభవమువలనే తెలియును. ఈ చమత్కారమును అనుభవించుటకు ఆ రమణీయార్థమును తిరిగి తిరిగి భావించుండవలెను.

ఆసక్తి కలిగించే మాట లేదా పని, అబ్బురపాటు, వింత నేర్పు, చమత్కారంగా, చమత్కృతి, చమత్క్రియ అంటారు. హృదయానికి అనుభూతిని కలిగించే గుణమే చమత్కృతి.

జీవితంపై ప్రేమ, మానవత్వంపైన ఆశ, సమాజం మీద సద్భావన కొందరు కవులు చేత కవిత్వం రాయిస్తై. జీవితం యాంత్రికతతో నిండి పోతున్నపుడు, ఎదురయ్యే సమస్యల్ని చమత్కారాలుగా మలచడంలో అనేక మంది చెప్తున్న ధోరణిలో కవిత్వంలో చమత్కారాలు వచ్చాయి. వాస్తవ జీవితం కనిపించేటట్లు చిత్రించడం శంకరరాజుకి ఇష్టమైన ధోరణి.

కరెంటు విషయాల్ని తీసుకున్న కొన్ని వాస్తవికతల్ని యిలా వర్ణిస్తాడు.

"పగటి విద్యాలయాలు వెలుగు ముందు

రాత్రి విద్యాలయాలు వెలవెల పోతాయి

దొంగ కరెంటు యంత్ర భూపతులు

ఫైనులు కట్టి సురపతులౌతారు

లాభ నష్టాల ప్లస్, మైనస్ వైర్లు కలిసిపోయాయి

కోళ్ళఫారంలో బల్బులు పేలిపోతాయి"[43]

ఒక వృత్తి పనివారి విషాదం వర్ణించడానికి రాసిన కవితలో దృశ్య చిత్రణ విధానం శైలి పై కవితలో కనిపిస్తాయి.

**8.సూక్తులు:** ప్రపంచీకరణ నేపథ్యంలో అనేకమంది కవులు కొత్త కొత్త సూక్తులను ప్రయోగించారు.

1. వెయ్యేండ్లున్నా వేరుదప్పది
   నూరేండ్లు బతికినా సావుదప్పది
2. నీరు ఆంధ్ర సెరుగు
   నిజము తెలంగాణ మెరుగు[44]

మొదటి దాంట్లో ఉమ్మడి కుటుంబం వ్యవస్థలో ఎంతకాలం ఉన్నా, ఎప్పటికైనా వేరుపడాల్సిందే కదా అని గుర్తు చేస్తూ తెలంగాణా ఆంధ్ర ప్రాంత నేపథ్యాన్ని వర్ణిస్తున్నాడు.

రెండో దానిలో ఆంధ్రప్రాంతానికి పూర్తిగా నీటిపారుదల ఉందని తెలంగాణ పరిస్థితి వేరని గుర్తుచేస్తున్నాడు.

**5.9.నుడికారాలు - సామెతలు:** చెప్పదలచుకున్న భావాన్ని ప్రభావవంతంగా, మనస్సుకు హత్తుకునేలా చెప్పడానికి నుడికారాలు, జాతీయాలు వాడతాం. జాతీయాలు, పలుకుబళ్ళు విశిష్ట పడబంధాలు. ఇవి ఒక భాషకు, జాతికి ప్రత్యేమైనవి. ఆ రకంగా చెప్పడం ఆ జాతి, ఆ భాష ప్రత్యేకత. ఒక భాషలో ఉన్న నుడికారం మరో భాషలో ఉండకపోవచ్చు. అందువల్ల వీటిని అనువదించడం అసాధ్యమే కాదు అనవసరం. మన భాషలో కూడా వాటికి సమానార్థకాలు ఉంటే వాడుకోవచ్చు. నుడికారాల్లో ఉండే విడివిడి శబ్దాలకు ఉండే అర్థాలు కలపడం వల్ల ఆ జాతీయం ద్వారా చెప్పదలచుకున్న అర్థం రాదు.

'ఇంగ్లీషోడి విద్య ఒంట బట్టిన పిల్లి' ఇందులో ఆంగ్ల విద్యా ప్రభావం మనపై ఏ విధంగా ప్రభావం చూపిందో తెలుస్తుంది.

'ఎల్లికి ఎగేస్తాడు మల్లికి దిగేస్తాడు' అంటే సవతి తల్లి ప్రేమ చూపించి మనల్ని వాడి కాళ్ళకింద ఏ రకంగా తోక్కేస్తున్నాడో గుర్తు చేస్తున్నాడు కవి.

కళ్లల్లో కారం పోసుంటాడు, కళ్ళు నెత్తికి ఎక్కాయి, కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నాడు, మాట్లాడితే నోటి ముత్యాలు రాలుతాయా, మోకాలికి బట్ట తలకు ముడిపెట్టడం

వంటి నుడికారాలతో ఆ మాటకు ఉన్న అసలు అర్థం వెదికితే లాభం లేదు. ఆ మాటల కలయిక ఒక అర్థాన్ని అందిస్తుంది. నుడికారం ప్రత్యేకత అది. ఇవి ఆ భాష మాట్లాడే వారి సంస్కృతి మీద ఆధారపడి ఉంటాయి.

- "మూలిగే నక్కపై తాటి పండు  పడినట్లవుతోంది".
- "ఇంటిలో ఎలుక దూరిందని ఇల్లు తగలబెట్టాడు" అన్న వెనుకటి సామెతెలాగా ఉన్నది........ మన పరిపాలకుల పద్ధతి...!!!

**5.10.నూతన ప్రయోగాలు:** ప్రపంచీకరణ నేపథ్యంలో కొత్తకొత్త కవులు పుట్టుకొచ్చారు. కొత్తకొత్త పదాలు ప్రయోగించారు. పునాస కవిత్వంలో అంజయ్య వాడిన ప్రయోగాలు చూస్తే.....

"మా వూరంటే
పోరగాండ్లు తాటిమట్టలకు
ముంజకాయల గీరెలు చేసి,
ఆడుకునే బండాట కాదిపుడు"[45]

అంటూ వాడిన ప్రయోగంలో పిల్లలకు వినోదాన్నిచ్చే రామచిలుక జోస్యాలు, కోయిదొరలు చేయి చూసుడు, పోరగాండ్ల తాటి మట్టలకు ముంజకాయలు, గీరెలు చేసి ఆడుకొనే బండాట, పసులుకాడి పిల్లలూగే ఊరవతలి మర్రిచెట్టు మొదలగు అంశాలను వర్ణిస్తున్నాడు.

"ఒక ఇల్లంతా జీవితం"
ఆ యింటిలోంచి లేచిన పొగ
అతడి రూపాన్నే తలపిస్తుంది"[46]

కొత్తకత్త ప్రయోగాలను ప్రయోగించడంలో తైదల అంజయ్య తనదైన ముద్ర వేసాడు.

**కరుదువ:** కొడిగట్టే నూనెదీపం ఎక్కువ పొగ వదులుతుంది. ఆ పొగాకు పైన వో కుండ బోర్లిస్తే పొగ కుండ అంచులుకు పేరుకుంటుంది. ఆ పేరుకున్న పొగే కరుదువ. దీన్ని పాలతో కలిపి  కాటుకు చేసుకుంటారు పల్లెటూళ్ళలో.

**దీగుడు:** దీపం పెట్టుకునే గూడు. ఒక్క ముందు గోడ మాత్రమే ఉండే గుడిసెలో నివసించే వాళ్ళు ఆ గోడకు మధ్యలో దీపం పెట్టుకోవడానికి ఓ చిన్న గూడు లాంటిది చేస్తారు. దాన్నే దీగుడు అంటారు.

ఇలా కవులు కొత్తకొత్త పదాలాను వాడుతూ నూతన ప్రయోగాలను చేశారు.

**5.11.ధ్వని:** చెప్పిన దాంట్లోనించి, చెప్పని అర్థం రావడమే ధ్వని. చక్కని భావచిత్రాల్ని, ధ్వని కోసం వినియోగించుకోవడం వసీరాలో కనిపిస్తుంది. "రొయ్యల చెరువు"ల్ని గూర్చి చెబుతూ ఇలా అంటాడు.

"రొమ్ము విరుచుకొని పొగరుగా
పొలాలను నమిలి నెమరువేస్తూ
మీసాలు దువ్వుకుంటూ
రొయ్యలు పడమటి రోడ్డుకు నడుస్తాయి"

పేదలకు ఆహారమిచ్చే వరిపొలాల స్థానాలు, గొప్ప వారికి ధన వర్షం కురిసే రొయ్యల చెరువులుగా మారడం; ఆ రొయ్యలు పాశ్చాత్య దేశాలకు ఎగుమతి కావడమూ, పై పంక్తుల్లో ధ్వనిస్తుంది. అంతేగాక, 'మీసాలు దువ్వుకుంటూ' అన్నదాంట్లో, ఈ దేశపు పెట్టుబడిదారుల, పాశ్చాత్యదేశపు సామ్రాజ్యవాదుల గర్వమంతా స్ఫురిస్తుంది.

**5.12.ఉపమానాలు:** పసివాణ్ణి చూస్తున్నప్పుడు ఆ ఇంట్లో అందరికీ కలిగే ఆనందాన్ని కుందుర్తి చక్కని ఉపమానాల్లో చెప్పారు.

"పొలంలో ఆయేటి ధాన్యం
పుష్కలంగా పండిన రైతు
కళ్లాన్ని రూపాయలంత కండ్లతో కొలుచుకుంటున్నట్లు
అందరూ పసివాణ్ణి చూసి అదోలా నవ్వుకుంటారు"[46]

పై ఉపమానం వచన కవితా శిల్పానికి అతికినట్లుగా చక్కగా ఉంది.

సరికొత్తవైన ఉపమానాల్ని, రూపకాల్నీ, గొప్పభావాల్ని వ్యక్తం చేసేటట్లుగా నందిని సిధారెడ్డి ప్రయోగించగలరు. అభివ్యక్తి అంతటా ఎక్కువ ధ్వని మార్గంలోనే ఉంటుంది.

"రావి చెట్టుకి తలదువ్వి
పట్టకుచ్చులు పెట్టినట్లు
తెల్లగా భలే అందగా మెరుస్తుంటాయి కొంగలు"[47]

అలాగే ధ్యానం కవితలో కె.వి.ఎస్. రామారావు ఉపయోగించిన ఉపమానాలు చూస్తే.....

"గదిలో
పచ్చటి ఆకు రెక్కలా కిటికీ

తెల్లకాగితమంత సముద్రం"[48]

ఇక్కడ కవి పుట్టిన ప్రదేశాన్ని తనకి దగ్గర సంబంధం ఉన్న కాగితాన్ని సముద్రంతో పోల్చి చెప్పాడు.

ప్రపంచీకరణ క్రమంలో ముఖ్యంగా దళిత కవులు ఉద్వేగభరితమైన గొప్పగొప్ప ప్రయోగాలతో, సంచలన దృష్టితో చేసిన కొన్ని వ్యక్తీకరణలు వివాదాస్పదమైనప్పటికీ, వస్తువైవిధ్యంతోపాటు, శిల్పవైవిధ్యమూ ఈ పదేళ్ళ కవిత్వంలో ఎక్కువే. వస్తునవ్యత, ఉద్వేగాలే ఒక 'కవిత్వ విలువ'గా మారిన సందర్భాలు లేకపోలేదు. కుల, వర్గ, వృత్తిపరమైన భాషలూ, మాండలికాలూ ఈ దశాబ్దంలో అపూర్వమైన సాహిత్య గౌరవాన్ని పొందాయి.

**ముగింపు:** ప్రపంచీకరణ వ్యతిరేక నిర్మాణ కవిత్వంలో కవులు చాలా అంశాలను వస్తువులు తీసుకొని కవిత్వాన్ని రాయటం జరిగింది. కవి స్వీకరించిన వస్తువు సామాజిక చైతన్యాన్ని స్ఫురింప జేసింది. వస్తువుతో పాటు రూప,శిల్పాలు కుడా తగిన విధంగానే పేర్కొన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన కవులు ఎక్కువుగా ఉండటం మూలాన ఇందులో ప్రాంతీయ స్పృహ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. చక్కని భావచిత్రాలు, ప్రతీకలు, పాత్రల చిత్రణతో, చమత్కారాలు, నుడికారాలు, సూక్తులు, కొత్తకొత్త ప్రయోగాలతో, చక్కని ఉపమానాలతో, మంచి వరవడిలో కవిత్వాన్ని రాశారు. ప్రపంచీకరణ ఎలాంటి విధ్వంసాన్ని తీసుకొచ్చిందో పై అంశాలన్నిటిలోను మనకు కన్పిస్తాయి.

## పాదసూచికలు

1.పింగళి లక్ష్మీకాంతం - సాహిత్య శిల్పసమీక్ష;1986.పుట.39

2.చెన్న కేశవరెడ్డి ; పుట.06.1999

3.త్రిపురనేని మధుసూదనరావు; 1999, పుట.06

4.యాభై ఏళ్ళ తెలుగు కవిత్వం - వస్తువైచిత్రి;పుట.07

5.శివారెడ్డి - గడచినా వేళల్లో

6.ఎండ్లూరి సుధాకర్ - మారిషస్ కవితలు

7.మల్లెల - శిల్పతరంగని

8.రామా చంద్రమౌళి - రెండు అవధులు

9.బిక్కికృష్ణ - చినుకుల వనంలో మనసుల మయూరం;పుట.23

10.స్కైబాబా - సహచరం

11.ఎం.డి.అహ్మద్ - ఏడిండ్లకొక్క దీపం

12.సూర్య బాస్కర్ - రైతు ఆత్మహత్య; పుట.46

13.కె.ఆర్.చౌదరి - ప్రపంచీకరణ ఎవరిని ఉద్దరించడానికి?,పుట.4

14.గుమ్మం దాటిన శతాబ్దం. పుట.37

15.ఎం.వీరభద్రయ్య - సాహిత్యంలో వస్తురూప సంబంధాలు; పుట.74,76

16.ఎస్.జ్యోత్స్నారాణి - స్వాతంత్ర్యానంతర తెలుగుకవిత వస్తువు, రూపం,శిల్పం; పుట.26

17.కోడూరి విజయభాస్కర్ - అనేక(అతడు కొన్నిపడవలు - ఒక మణిదీపం,పుట.17

18. ఎస్.జ్యోత్స్నారాణి - స్వాతంత్ర్యానంతర తెలుగుకవిత వస్తువు, రూపం,శిల్పం; పుట.27

19.టి.ఎల్.కాంతారావు - కవితాలోకనం; పుట.38,39

20.సి.వి.కృష్ణారావు - చిత్తడి; పుట.15

21.బాణాల - కుంపటి; పుట.12

22.సాహిత్య ప్రస్తానం - ఏప్రిల్ సంచిక - జులై.2006

23.బాణాల - పర్యాయపదం

24.తిలక్ - అమృతం కురిసిన రాత్రి; పుట.146

25.అరణ్యకృష్ణ - మేహిందీ స్త్రీల స్థితిగతులు

26.అన్వేషి - కాలాలు గళాలు; పుట.1

27.సి.కామేశ్వరీ దేవి - అభ్యుదయ కవిత్వంలో ప్రతీక;1991.పుట.42

28.ఎం.వీరభద్రయ్య - సాహిత్యంలో వస్తు రూప సంబంధాలు;పుట.74,76

29.తెలుగు - తెలుగు నిఘంటువు; పుట.88

30.శేషేంద్రశర్మ - కవిత్వానుశీలనం(సిద్ధాంత వ్యాసం)1998.పుట.64

31.ఎం.వీరభద్రయ్య - సాహిత్యంలో వస్తు రూప సంబంధాలు

32.నారాయణబాబు - గడ్డిపరక

33.సి.హెచ్.లక్ష్మణ చక్రవర్తి - కవిత్వానుసంధానం;పుట.155

34.నుటెంకి రవీంద్ర - జాడ; పుట.38

35.కొత్త అర్థాలు; పుట.77

36.వఝుల - స్వాహతంత్రం; పుట.30

37.ఎస్వీ.సత్యనారాయణ - కాల నిఘంటువు; పుట.56

38.ఆర్.కె.వివిధ - ఆంధ్ర జ్యోతి; 29.05.06

39.వఝుల శివకుమార్ - వివిధ ఆంధ్రజ్యోతి; 14.05.06

40.నుటెంకి రవీంద్ర; పుట.38

41.అందుకేగా వాళ్ళు రుషులు; పుట.17

42.వంటింటి నుంచి వల్లకాటిదాకా; పుట.36

43.బి.శంకరరాజు - వానచూపు;2004,పుట.36

44.అంజయ్య - పునాస

45.అంగలకుర్తి విద్యాసాగర్ - అనేక; పుట.98

46.టి.ఎల్.కాంతారావు - కవితాలోకనం; పుట.44

47.నందిని సిధారెడ్డి - సంభాషణ కొంగలు; పుట.28

48.అనేక ఈమాట - జనకవనం; పుట.340

# 6.ప్రపంచీకరణ కవిత్వం భిన్నధోరణులు

ఆధునిక కవిత్వం అర్థం చేసుకోవాలంటే ఆధునిక జీవితాన్ని అర్థం చేసుకోవాలి. మారుతున్న విలువలను గుర్తించాలి. సాంఘిక పరమైన విలువలను గుర్తించడంలో తెలుగు కవిత్వం తనదైన ముద్రవేసింది. 1970 తర్వాత సాహిత్యంలో చాలా మార్పులు సంభవించాయి. వస్తువులోనూ, శిల్పంలోనూ మార్పు వచ్చింది. కవులు ఉద్యమ నేపథ్యంలో కవిత్వం రాశారు. ఆ కవిత్వం భిన్న ధోరణులలో వెలసింది. కవులు కల్పనలకు ఎక్కువ అవకాశం ఇవ్వకుండా తమ స్వంత గొంతును వినిపించారు. నేడు వచ్చిన ప్రపంచీకరణ కవిత్వం అంతటకు ఆయా ధోరణులు కొత్త రూపాన్ని ఇచ్చాయి.

20వ శతాబ్దం వైజ్ఞానిక యుగంగా మారినప్పటికీ సంస్కృతి, నాగరికతలపై ఎక్కువ ప్రభావం కన్పిస్తుంది. ఆధునిక కవిత్వం ఉన్నట్టుండి ఒక్కసారిగా ఊడిపడలేదు. తెలుగు కవిత్వానికి 900 సంవత్సరాలు ఉజ్జ్వల వారసత్వం ఉన్నది. నన్నయకు పూర్వం నుండి నారాయణరెడ్డి వరకు తెలుగులో కవిత్వం నిరంతర ధారాప్రవాహంతో జీవనదివలె ప్రవహిస్తున్నది. ఈ ప్రవాహంలో ప్రపంచీకరణ కవిత్వం కొన్ని కొత్త ధోరణులు ఏర్పడటానికి దారితీసింది.

ఆధునిక కవిత్వానికి సంప్రదాయ(లేదా)వచనకవిత్వం మార్గదర్శి అయినప్పటికీ కాలానికి అనుగుణంగా వివిధ ప్రక్రియలు రావటం జరిగింది. ఈధోరణిలోనే చూస్తే వివిధ దృక్పథాలు ఏ విధంగా వచ్చాయో తెలుస్తుంది. గత రెండు దశాబ్దాలుగా అనేక కవితా ప్రక్రియలు విభిన్నధోరణులలో ప్రపంచీకరణ కవిత్వం వెలువడింది. అది విప్లవ దృక్పథంతోనూ, దళిత దృక్పథంతోనూ, స్త్రీవాద దృక్పథంతోనూ, ప్రాంతీయ అస్థిత్వవాద దృక్పథంతోనూ, మైనారిటీవాద దృక్పథం మొదలగు ప్రక్రియలుగా వచ్చాయి ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రకంపనలు సృష్టిస్తున్న సాహిత్య ధోరణులన్నీ ప్రపంచీకరణ సాహిత్యానికి ఉద్యమ భావాలని రేకెత్తించాయి. వాటిలో మనకు కనిపించే భిన్నధోరణులు.

**6.విప్లవదృక్పథం:** విప్లవదృక్పథం అనగానే మనకు ముందుగా గుర్తొచ్చేది. **"అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరు"** సాంఘిక అస్తిత్వం మానవ చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. సాహిత్యం మానవ చైతన్యంలో భాగం. అందువల్ల సాహిత్యానికి సమాజంతో

విడదీయరాని సంబంధం ఉంటుంది. సమాజంలో ఏర్పడే కొత్త అవసరాలకు, మార్పులకు మానవులను సంసిద్ధం చేసే సంస్కృతీ సాధనంగా అది కొత్తరూపాలను తీసుకుంటూ కొత్త స్వభావాలను సంతరించుకుంటూ ఉంటుంది. ఆ క్రమం ఉద్ధృతంగానూ, గుణాత్మకంగానూ ఉన్నపుడు అది ఒక ఉద్యమంగా భాసిస్తుంది. తెలుగులో విప్లవదృక్పథం లాంటిదే 1967 నాటికి అంకురించి, మరో మూడేళ్ళలో మొలకై వేరూనుకున్నది.

1970లో (వి.ర.సం.) విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. తరువాత రెమ్మలుగా కొమ్మలుగా విస్తరించి తెలుగుకవితా వస్తువులోను వ్యక్తీకరణలోనూ విశిష్టమైన మార్పును తెచ్చింది.

**6.1. విప్లవ నేపథ్యం:** ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన ఈ విప్లవదృక్పథం ఉద్యమాలకు ఆదర్శంగా నిలిచింది. బ్రిటీష్ వలస పాలనలో అందివచ్చిన నూతన ప్రాపంచిక జ్ఞానం ఎక్కడికక్కడ సామాజిక జీవితాన్ని సంస్కరించుకోవటానికి వివిధ స్థాయిలలో ప్రజల భాగస్వామ్యంతో సంఘాలు ఏర్పరుచుకొని పనిచేయటానికి తక్షణ ప్రేరణ అయింది.

అవి వర్ణ, లింగ, అసమానతలకు వ్యతిరేకంగా నిర్మించబడ్డ జాతీయోద్యమం, భూసంధాలలో మార్పును ఆకాంక్షించిన రైతుకూలీ ఉద్యమాలు, రైతాంగ పోరాటాలు కావచ్చు, జీవన స్థితిగతులలో అభివృద్ధిని ఆశించిన కార్మికోద్యమాలు కావచ్చు. మొదలగునవన్నీ ప్రజాస్వామిక సంస్కృతే ధ్యేయంగా వచ్చిన ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన విప్లవ పరమైన దృక్పథాలే.

నిజానికి బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యతిరేక భారత జాతీయోద్యమం విస్తృతంగా అన్నివర్గాల ప్రజలను సమీకరించుకొని బలమైన శక్తిగా ఎదిగే క్రమంలో సోషలిస్ట్ తరహా ప్రభుత్వ నిర్మాణాన్ని ప్రజలకు వాగ్దానం చేసింది. ప్రపంచీకరణ నేపథ్యంలో విప్లవదృక్పథం అనేది తెలంగాణలో భూమికోసం, భుక్తికోసం, సమకాలంలోనే సాగిన నైజాం వ్యతిరేక పాలనలో చాలా ఉద్యమాలు విప్లవాలు చోటుచేసుకున్నాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలు కవిత్వంలో మార్పులకు కారణమవుతున్నట్లుగానే ఆమార్పులకు అనుకూల ప్రతికూల కారణాలేవో అంతకు ముందరి కవిత్వంలో ఉండే అవకాశం ఉంటుంది. అదే విధంగా ప్రపంచీకరణ నేపథ్యానికి విప్లవ దృక్పథం మార్గదర్శకంగా నిలిచింది. విప్లవమార్గం అనేది సమాజంలోని దుర్మార్గానికి, అమానవీయతకు కదిలి కలం పట్టడమే కాదు. కవిత్వరంగంలో జీవిత వాస్తవికత మృగమై అధికార వ్యామోహ కాలుష్యం

అధికమవుతుంటే భరించలేని వాళ్ళు శ్రీశ్రీ, వరవరరావు మొదలగువారు విప్లవ దృక్పథాన్ని ఎంచుకున్నారు.

“అన్నం ఉన్నవాడికి ఆకలి లేదు

ఆకలి ఉన్నవాడికి అన్నం లేదు” అని సమాజాన్ని వర్గీకరించుకున్న అడిగోపుల, వర్గసమాజ నిర్మూలనకు విప్లవం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదంటారు.

“చావుకు భయపడిన చోట - క్రూరులదే పైచేయి

ఎదిరించి నిలిచిన చోట - వీరులదే పైచేయి”[1]

అని తన కాలం నాటి విప్లవ భావాలను వ్యక్తం చేస్తున్నాడు కవి.

నిరుపేద కూలి మహిళా జీవనసారాన్ని వర్ణించిన కవిత 'ఆకలి అలారం'

“పరుగెత్తే పంటకాల్వతో పందెం వేసిన ఆమె

నిద్రించే పొలానికి మేలుకొలుపు గీతం”[1]

ఇవాళ కవిత్వం రాసే కవి తనకొక సామాజిక బాధ్యత ఉన్నదని భావించే కవి ఎవరైనా సరే, ఎల్.పి.జి(సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) వ్యవస్థను వ్యతిరేఖించకుండా ఉండలేడు. ఎందుకంటే అది ప్రజావ్యతిరేఖ వ్యవస్థ. ఎనభై అయిదు శాతం భారత ప్రజలకు జీవించే హక్కును తిరస్కరించే వ్యవస్థ. రెండు దశాబ్దాలలో భారత ప్రజల జీవనసరళి మీద చావుదెబ్బ కొట్టి బతుకుల్ని పరాయికరిస్తున్న దుర్మార్గమైన వ్యవస్థ. ఎల్.పి.జి వ్యవస్థ ఒక చీకటి వ్యవస్థ. వెలుగు కోసం యుద్ధం చేసే రచయిత దీనిని ఆమోదించరు, ప్రశంసించరు. అని విప్లవ కవులు చాలా గట్టిగా కవిత్వం ద్వారా గర్జించారు.

భారతదేశానికి రైతే వెన్నెముఖ అని చెప్పుకుంటూ, అతను మకుటం లేని మహారాజు అని కీర్తిస్తూ, ఆత్మహత్యకు పురికొల్పుతున్న ఎల్.పి.జి వ్యవస్థను అడిగోపుల వెంకటరత్నం మంచిగా చిత్రీకరించారు.

“పల్లెసంపద ప్రవాహమై పారితే

పట్టణం కడుపు నిండుతుంది”

అని కీర్తిస్తూ, ప్రపంచీకరణ అనే దుర్మార్గమైన రాజనీతి అతన్ని ఎలా నాశనం చేస్తున్నదో వర్ణించారు.

**6.1.2.విప్లవం - నిర్వచనం:** సాధారణంగా విప్లవసాహిత్యం, విప్లవకవిత్వం అనే మాటలకు నిర్దిష్టమైన నిర్వచనం అంటూ లేదు. విప్లవాన్ని సమర్థిస్తూ విప్లవోద్యమ చరిత్రను ప్రతిఫలిస్తుంది. విప్లవభావాలను ప్రచారం చేస్తూ రాసే సాహిత్యం విప్లవసాహిత్యం. రాసేకవిత్వం విప్లవకవిత్వం. ఒక్క మాటలో చెప్పాలంటే విప్లవం వస్తువుగా వచ్చే కవిత్వం విప్లవకవిత్వం అనవచ్చు.

"విప్లవం ఈ నాటి కావ్యానికి స్పందన "[2]

**ఉద్యమలక్షణాలు-విశ్లేషణ:** విప్లవకవిత్వోద్యమం లక్షణాలను ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

1. విప్లవకవిత్వోద్యమం విప్లవచరిత్రతో ముడిపడి ఉంది. నిర్దిష్ట జాతీయ అంతర్జాతీయ సంఘటనలకు ప్రతిస్పందనగా విప్లవకవిత్వం ముందుకు నడిచింది.
2. విప్లవ సిద్ధాంత అవగాహన కలిగించటం విప్లవకవిత్వోద్యమ లక్షణం.
3. విప్లవ వర్గాల ప్రజలను సమీకరించటం, ప్రజల జీవన సమస్యలు వాళ్ళ చైతన్యాన్ని అభివృద్ధి పరిచేవిధంగా కవిత్వీకరించటం.
4. విప్లవనిర్మాణంలో వచ్చే ఆటుపోట్లను గురించి అవగాహన కలిగిస్తూనే సాహసాన్ని జీవశక్తిగా మలచటం విప్లవకవిత్వోద్యమ లక్షణం.
5. సకల మానవ సంబంధాలను విప్లవీకరించటం విప్లవకవిత్వ లక్షణం
6. స్థానిక ప్రజల పట్ల దేశం పట్ల భక్తి గౌరవాలు విప్లవ కవిత్వ లక్షణం[3]

**విశ్లేషణ:** విప్లవ కవిత్వోద్యమ చరిత్రలో ప్రధాన భూమికను పోషించి దీని మార్గదర్శకతకు ముందు నడిచినవాడు శ్రీశ్రీ. అయితే శ్రీశ్రీ కన్నా ముందు విప్లవోద్యమాన్ని చూస్తే సుబ్బారావు పాణిగ్రాహి- నక్సల్బరీ, శ్రీకాకుళం, తెలంగాణాలో ఉద్యమాన్ని గూర్చి చెబుతూ...

"సంతాల్ తెగ బక్క రైతు
గర్జిస్తూ గాండ్రిస్తూ
పైరివంక చూశాడు
శ్రీకాకుళం జిల్లాలో
ఆకలిగొను గిరిజనుడు

అర్జునిలా విల్లుసాచి

బరితెగించి దుమికాడు"[4]

అని పాణిగ్రాహి ఖబడ్దార్ నక్సల్బరీ నిప్పురవ్వ శ్రీకాకుళంలో దహనాలపై మండుతున్న సమకాలీన చారిత్రక వాస్తవాన్ని అభినందిస్తూ పేర్కొన్నాడు. నేడు శ్రీకాకుళంలో ప్రపంచీకరణ తీసుకొచ్చిన కంపెనీలు మందరాడ, సోంపేట ప్రాంతంలో నెలకొల్పేందుకు సుముఖత చూపగా మళ్లీ అగ్ని జ్వాలలు రగిలాయి.

శ్రీశ్రీ విరసం విప్లవకవిత్వంలో భాగంగా.......

"సాయుధ విప్లవ బీభత్సుని సారథినై

భారత కురుక్షేత్రంలో

నవయుగ భగవద్గీతా ఝంఝుని ప్రసరిస్తాను

మంటల చేత మాట్లాడించి

రక్తం చేత రాగాలాపన చేయిస్తాను" అని శ్రీశ్రీ తన విప్లవ మార్గాన్ని ప్రకటించారు.

1970 - 1980 మధ్యకాలాన్ని తెలుగు సాహిత్య చరిత్రలో రచయితల దశాబ్దంగా పేర్కొనవచ్చు. ఈ పదేళ్లలోని విప్లవ కవిత తరువాత 1990నుంచి ప్రస్తుత కాలం వరకు వస్తున్నటువంటి ప్రపంచీకరణ కవిత్వానికి ముందుకు అడుగు బాటలు చూపించడంలో ముఖ్య పాత్ర పోషించింది. విప్లవకవిత్వోద్యమంలో 'విరసం' దాదాపు 20 సంవత్సరాలు అంటే 1980-2000 మధ్యకాలంలో చాలా ఆటుపోట్లను ఎదుర్కొంటున్నప్పటికీ ఒక ఫోర్స్ గా ప్రజల్లోకి చొచ్చుకు పోలేక పోయింది.

20వ శతాబ్ది తెలుగు సాహిత్యంలో విప్లవ కవిత్వం ఒక చారిత్రిక అవసరంగా వచ్చింది. పీడిత ప్రజల పక్షాన నిలిచి విప్లవకవుల లాఠీదెబ్బలు, నిర్బంధాలు, ఇంకా అనేక రకాల చిత్రహింసలు భరించి ఉత్తమ కవిత్వం రచించారు.

**6.1.3.విప్లవంలో ప్రపంచీకరణ దృక్పథం:** 90వ దశకం ఆర్థిక సంస్కరణల దశకం. మనల్ని దోచుకొనేవాడు భుస్వామిలాగానో కంపెనీ యజమాని లాగానో మన కంటే భిన్న దశలో ఉన్న శత్రువును గుర్తించే విధంగా ఇక్కడ కనిపించడు.

భారతదేశాన్ని మొత్తంగా అమెరికా సామ్రాజ్యవాద దాహానికి ఆహారంగా సమర్పిస్తుంటే అది మొత్తం జీవన సంస్కృతిలో మనకు తెలియకుండానే చాపకింద నీరులా ప్రవేశించి విలువలను

విధ్వంసం చేస్తుంటే ఆవిషాదాన్ని గుర్తించి కవిత్వీకరించటం విప్లవకవిత్వోద్యమంలో భాగంగానే జరిగింది. 80వ దశకపు దుర్ఘటన అయిన భోపాల్ యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ విషయాలు లీకేజీ పరిణామాలను ప్రస్తావిస్తూ ఐదేళ్ల తరువాత అరణ్యకృష్ణ రాసిన ('శిలువమీద ఆర్తనాదము' కవిత 03-డిసెంబరు-1989) సామ్రాజ్యవాద ప్రమాదాన్ని గుర్తించింది. భోపాల్ దుర్ఘటనను ఇంపీరియాలిస్ట్ గద్దల అత్యాచారంగా, భోపాల్ నగరాన్ని సామ్రాజ్యవాదంగా అమ్మోరు పోసిన నగరంగా మొత్తం వ్యవహారాన్ని స్వజాతి నేరస్తులతో బహుళజాతి షరాబులు చేసిన కుట్రగా పేర్కొన్నాడు కవి.[5]

గాట్ ఒప్పందం భారత రైతాంగ జీవితంలోకి తెస్తున్న ప్రమాదాన్ని గురించి ఆందోళనపడుతూ

'రూపాయికిక పూర్తి మారకం
బ్యాంకు వడ్డీ తగ్గింపు
పశువులను వదశాలలోకమ్మండి
తోళ్లకు మంచి గిరాకీ ఉంది
మాంసానికి మా మంచిధర పలుకుతుంది.
నాగళ్ళను ఎక్కడికక్కడ నరికి పొయ్యిలోపెట్టి
ఏదో పరిశ్రమను స్థాపించుకోండి
ఇంట్లో కడుపులు గుద్దతూ
బజార్లో వీపు మీద చెయ్యేసి
శభాష్ అంటుంది రాజ్యం.[6]

అని గాట్ ఒప్పందంపై సంతకం చేసిన ప్రభుత్వ వ్యతిరేక వైఖరిని గుర్తించి చెప్పాడు. ఈ దశకాన్ని నాళేశ్వరం శంకరం-"సరళీకృత సంగ్రామ కాలంగా" పేర్కొని కరెన్సీ ఖడ్గచలనం జీవితంలోకి తెచ్చే హింసను సూచించాడు.[7]

అమెరికా ఆర్థిక సామ్రాజ్యవాదం ఉక్కుపాదాల కింద నలుగుతున్న భారతదేశం వేలానికి సిద్ధంగా ఉందని లోలోపల సంఘర్షణ పడుతూ ఆందోళన వ్యక్తం చేశాడు.[8]

ప్రపంచీకరణ పర్యవసానం దైనందిన కార్యకళాపాల మీద కూడా అగ్రరాజ్యాల నియంత్రణగా మారటాన్ని సరుకు, సంస్కృతి అన్నీ కూడా మనిషిని బిగించి కుదించి ఆడించటాన్ని భరించలేని

దేశపతి శ్రీనివాస్ ఆ పరిస్థితిని తుడిచిపెట్టడానికి, మూడవ ప్రపంచ దేశాలలో ఒక గాలివాన కోసం ఆశపడతాడు.

"పరాయితనాన్ని బట్వాడా చేస్తున్న
ఛానల్స్ ని ధ్వంసించకుండా
మనల్ని మనం చేరేదెట్లా
మనకు మాటనిచ్చిన మట్టికి దగ్గరయ్యేదెట్లా"[9]

అని ప్రశ్నిస్తూ, ప్రశ్నల్లోనే కర్తవ్యాన్ని సూచించాడు.

సామ్రాజ్యవాద విస్తరణ నేపథ్యంలో 11 సెప్టెంబర్ 2001 నాడు అమెరికా లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ మీద, పెంటగాన్ మీద జరిగిన దాడిని అమెరికా సామ్రాజ్యవాద దురహంకారం మీద మొదటి దెబ్బగా భావిస్తూ ఈ దాడులకు ప్రతిగా టెర్రరిజం నిర్మూలనకూ అమెరికా ఎంచుకొన్న యుద్ధమర్గాన్ని నిరశిస్తూ వచ్చిన కవితలను "కాగితప్పులి కళ్ళలో భయం" అనే సంకలనంగా ప్రచురించింది.[10]

**6.1.3.1.ప్రాంతీయ అసమానతలు:** సామ్రాజ్యవాద వ్యతిరేకతకు తోడు ప్రాంతీయ అసమానతల గురించిన స్పృహ కూడా తొంభైవ దశకంలో విప్లవ కవిత్వానికి బలాన్నిచ్చింది. సహజ వనరులను సక్రమంగా వినియోగంలోకి తీసుకొని రాకపోవటం, వనరుల అక్రమ పంపిణీ, తరలింపుల ప్రాంతాల వెనుకబాటుతనానికి కారణమవుతుంటాయి.ప్రాంతీయ అసమానతలు గురించి చూసినపుడు ఆంధ్ర-తెలంగాణా జీవితాల మధ్య వ్యత్యాసాన్ని ఇక్కడ గమనించవచ్చు. అయితే ప్రాంతీయ అస్తిత్వ స్పృహ దేశభాషాభిమానం, సంస్కృతీ ప్రత్యేకతలను కాపాడుకోవాలన్న ఆకాంక్ష ఈ కవిత్వంలో గాడంగా కనిపిస్తుంది. వ్యక్తం కావటానికి ప్రాదేశిక సంస్కృతులను విధ్వంసం చేసే ప్రపంచీకరణ పట్ల వ్యతిరేక దృక్పథం కూడా కారణమైంది.

**6.1.3.2.వ్యవసాయ విప్లవోద్యమం**: వ్యవసాయ విప్లవోద్యమానికి సకల పీడిత జనులను సమీకరించుకొని ఐక్యసంఘటన కట్టం మీదనే విప్లవ విజయం ఆధారపడి ఉంది. పీడితలకు తాము పీడితలమని తెలియటం, తమకు మంచికాలం విప్లవోద్యమ విజయం వల్లనే సాధ్యమవుతుందన్న చైతన్యం, వ్యవసాయ కుటుంబాలకి మేలు చేకూరేవిధంగా ఉద్యమం నడవాలి.

విప్లవం అంటే విందు భోజనం కాదు. అదొక నిరంతర యుద్ధం. అందులో గెలుపు ఓటములు ఒకే నాణానికి రెండు ముఖాలు. ఒకడుగు ముందుకు రెండడుగులు వెనకకు నడిచే విప్లవక్రమాన్ని "శివసాగర్" రాసిన "ఏటికి ఎదురీదువాల్లమురా" అనే కవిత ఇందుకు మంచి ఉదా...

"మేరిమి కొండలో మెరిసింది మేఘము
ఉద్యమాల కొండల్లో ఉరిమింది మేఘము"[11]

అని మొదలయ్యే ఈ కవిత మొదటి రెండు భాగాలు సముద్ర జలప్రళయాన్ని వర్ణిస్తాయి.

"తెరకొయ్య విరిగింది, తెరచాప చిరిగింది
పడవ కడుపులోన కలకాలము రేగింది
మొనగాడు తమ్ముణ్ణి మొసలి మింగేసింది
ఎదిగిన తమ్ముణ్ణి ఏరు కాటేసింది
గుండెజారిన దండు గంగాకు మొక్కింది
చేతిలోన తెడ్లను ఏటిలో విసిరింది"[12] పైన కవితలో గుండెలోని ఆశ ఎర్రజెండాగా ఎగరాలి అని చెప్పటం ద్వారా అంతకు ముందు చెప్పిన మెరిసిన మేఘం, ఉరిమిన మేఘం, కురిసిన వర్షం, తమ్ముణ్ణి మింగిన మొసలి, తమ్ముణ్ణి కాటేసిన ఏరు మొదలగు అన్నీ విప్లవోద్యమానికి దమనకాండను సూచించే ప్రతీకలని కవి సూచించాడు.

విప్లవోద్యమం ఆర్థిక అసమానతలను తొలగిస్తూ రాజకీయాధికారం చేపట్టాలన్న లక్ష్యంతో సాగుతున్నదంటే దాన్ని నడిపించే అంతస్సూత్రం మానవాళి మీద ప్రేమ మానవ సంబంధాలను మహోన్నతంగా మలచుకొందామన్న ఆకాంక్ష, విప్లవతత్వం, ప్రేమ ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఒకదానితో ఒకటి గుణాత్మకంగా ప్రభావితం చేస్తూ ఉండటం వల్లనే ఒంటరి యోధుడిని సమూహం అవగాహన చేయగలుగుతుంది. సమూహ ప్రయోజనాలకు ఒంటరి యోధుడు బాధ్యత వహించగలుగుతుంది. సకల మానవసంబంధాలను విప్లవీకరించటం విప్లవకవిత్వ లక్షణమైంది.

**6.1.4.విప్లవ వర్గీకరణ:** ప్రపంచీకరణకవిత్వం అనేది విప్లవ మార్గాన్ని అనుసరిస్తూ వచ్చింది కాబట్టి దాదాపు వందమంది కవులు రాసిన కొన్ని వందల కవితా ఖండికలను వస్తుపరంగానూ రూపపరంగానూ వర్గీకరించి చూస్తేకాని విప్లవకవిత్వ తత్త్వం బోధపడదు.

## 1.విప్లవోద్యమ చారిత్రిక దశలకు చెందిన కవితలు:

A.శ్రీకాకుళం గిరిజనోద్యమ కవితలు

B. కరీంనగర్ జిల్లా రైతాంగపోరాట కవితలు (లేదా) జగిత్యాల జైత్రయాత్ర కవితలు

C. ఆదిలాబాదు జిల్లా గిరిజన రైతాంగ పోరాట కవితలు

## 2. సమకాలీన సామాజిక ఉద్యమకవితలు:

A. దళిత సమస్యాత్మక కవితలు

B. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనను నిరశించే కవితలు

C. స్త్రీ సమస్యాత్మక కవితలు

D. రామజన్మభూమి వివాద కవితలు

E. తెలంగాణా ప్రాంతీయ చైతన్య కవితలు

**3. జీవిత సమస్యల చిత్రణాకవితలు:** జీవితం భిన్న వర్గాల వారిది కనుక దాన్ని బట్టి ఈ విభాగంలో కవితలను తిరిగి వర్గీకరించాలి.

A. కార్మిక జీవిత కవితలు

B. ఉద్యోగ జీవిత కవితలు

C. కూలీల జీవిత కవితలు

D. చేనేత వృత్తి జీవిత కవితలు

E. స్త్రీల జీవిత కవితలు

F. మాల మాదిగల జీవిత కవితలు

G. విప్లవ సిద్ధాంత తాత్త్విక కవితలు

H. విప్లవోత్సాహాన్ని నిలిపే కవితలు

I. స్మృతి కవితలు

J.దేశభక్తి కవితలు

**6.1.5.వాదోపవాదాలు**:విప్లవ రాజకీయ సంబంధంతో వచ్చేది విప్లవ కవిత్వం అయినప్పుడు విప్లవ కవిత్వానికి రాజకీయాలతో ప్రమేయం ఏ మేరకు ఉండాలనే విషయం మీద చాలా చర్చ జరిగింది. చర్చ నిబద్ధత, నిమగ్నత అన్న రెండు అంశాలను కేంద్రంగా చేసుకొన్నది.

ఝంఝు కవితలో శ్రీశ్రీ .....

"ఆగ్రహం కొరడాని చేబూని
సాయుధ విప్లవ బీభత్సుని సారథినై
భారత కురుక్షేత్రంలో
నవయుగ భగవద్గీత ఝంఝుని ప్రసరిస్తాను
మంటలచేత మాట్లాడించి

రక్తం చేత రాగాలాపన చేయిస్తాను"[12] అని విప్లవ నిబద్ధతను ప్రకటించుకున్నాడు. అంటే రాజకీయాల పట్ల నిబద్ధత ఉంటే సరిపోదు విప్లవ దృక్పథాల పట్ల కూడా నిర్దిష్టంగా ఉండాలని కె.వి.రమణారెడ్డి పేర్కొన్నారు.

స్పష్టమైన రాజకీయ దృక్పథంతో ఈ 35 ఏళ్ళలో విప్లవ కవిత్వం వస్తుశిల్ప వైవిధ్యంతో, విస్తృతితో గొప్ప మానవీయ చైతన్యాభివ్యక్తిగా అభివృద్ధి చెందింది. ఎన్నో కోణాల నుంచి అధ్యయనం చేయవలసిన లోతు, గాడత, నిజాయితీ ఈ కవిత్వంలో కనబడతాయి. మానవజీవిత విలువల పట్ల స్త్రీ, దళితవాద సాహిత్యాలు ప్రత్యేక వికాసానికి బీజాలు ఉన్నాయి. ఆ రెండు సాహిత్యోద్యమాలు ముందుకు తెచ్చిన అంశాలను స్వీకరించి ఆత్మవిమర్శతో మరింత పదునెక్కింది విప్లవకవిత్వం. ప్రపంచీకరణ కవిత్వంలో విప్లవకవిత్వోద్యమ చరిత్రను చేర్చుకున్నప్పుడే దానికి సమగ్రత, సుసంపన్నత ఉంటుంది.

**6.2.దళిత దృక్పథం:** ఆధునిక సాహిత్యయుగంలో ఆకాశంలో విహరించే భావవాద రథాన్ని భూమార్గం పట్టించి, భూకంపం పుట్టిస్తూ భౌతికవాద అభ్యుదయ సాహిత్యోద్యమం ఆవిర్భవించింది. ఈ అభ్యుదయ సాహిత్యోద్యమం విప్లవసాహిత్యోద్యమంగా ముందుకు సాగకుండా మోకాళ్ళ మీద దేకటం మొదలెట్టగానే యథాతథ వాద రివిజనిస్టు శక్తులకు, విప్లవవాద శక్తులకు మధ్య వైరుధ్యం బద్దలై విప్లవ శక్తుల సామాజిక పునాదితో విప్లవ సాహిత్యోద్యమం విప్లవ ప్రభంజనమై వికసించింది. కానీ పరిణామక్రమంలో విరసం నాయకత్వం విభిన్న సామాజిక శక్తుల వైరుధ్యాల వాస్తవికతను,

ప్రత్యేకతను గుర్తించటంలో, సామాజిక విప్లవదళిత సాహిత్యోద్యమాన్ని నిర్మించటంలో విఫలమై, విరసం రసహీనమై విప్లవోత్తేజాన్నిచ్చే తేజస్సు కోల్పోయి నిస్తేజమై నిస్సారమైపోయింది. ఎదిగితెచ్చిన సామాజిక విప్లవ శక్తులకు, యధాతధవాదాన్ని ఆశ్రయించిన సాంప్రదాయ విప్లవవాదులకు మధ్య సంస్థానుగతంగానూ, వ్యవస్థానుగతంగాను వైరుధ్యాలు బద్దలై దళిత, స్త్రీవాద సాహిత్యోద్యమం వెలువెత్తాయి.

**నేపథ్యం:** దళిత సాహిత్యోద్యమం కొత్తదేమీ కాదు. ఇది అరసం, విరసం, అభ్యుదయ, విప్లవసాహిత్యాల వారసత్వం నుండి పుట్టింది. కనుక ఆ ఉద్యమాల్లో అంతర్భాగమే, ఆ ఉద్యమాలకు కొనసాగింపేననే వాదన అరసం-ఎస్వీగారు, విరసం-వరవరావుగారు బలంగా చెప్తున్నారు. దళితసాహిత్యవేత్తలు పేర్కొన్నట్లు.....

దళిత సామాజిక సమస్యల్ని విస్మరించటంలో అరసం వారసత్వాన్నే, విరసం వారసత్వాన్నే మేం స్వీకరించాం అన్నారు. దళితుల నుంచి రచయితలు ఉద్భవించి, దళితుల కోసం రచనలు చేయడం దళితసాహిత్య ఉద్యమానికి గీటురాయి. దళితుల్లో క్రియాశీల శక్తిని పెంపొందించడం ఈ ఉద్యమ లక్ష్యం. వేలాది సంవత్సరాలుగా విద్యకు, విజ్ఞానానికి, కనీస అక్షర జ్ఞానానికీ నోచుకోని దళితులు ఇప్పుడు విద్యావంతులై, రచనాశక్తిని అలవరచుకొని దళితసాహిత్యానికి నడుము బిగిస్తున్నారు. ఇదొక గొప్ప పరిణామం.1967వరకు దళిత సాహిత్యం తన సైద్ధాంతిక బలాన్ని సమకూర్చుకుంటూ వచ్చింది. జ్యోతిబాపులే, శాహుమహారాజ్, కారల్ మార్క్స్ సిద్ధాంతాలు, నీగ్రో సాహిత్యంలోని తిరుగుబాటుతత్త్వం తన సైద్ధాంతిక పూర్వరంగంగా స్వీకరించింది.

ఆంధ్రదేశంలో దళిత ఉద్యమ రథసారథుల్లో ఒకరైన బొజ్జాతారకం కూడా దళితులని చైతన్య పరిచే “నది పుట్టిన గొంతుక” అనే కావ్యం రాశారు.

“పుట్టుకతోనే పెట్టుబడి పెట్టి
బ్రతుకులను విపణివీధిలో పెట్టిన
వ్యాపారరణ్యాన్ని నరుక్కుంటూ
మనిషి మనిషికి తేడాతీసిన
కులమతాల గోతులు పూడ్చుకుంటూ
నీకోసం బాటలు వేసుకొస్తున్నాను

సూర్యుడిలా నువ్వు"[13]

అంటూ దళితుల్లో ఆత్మవిశ్వాసాన్ని, తిరగబడే చైతన్యాన్ని, పోరాడే స్పృహను పలికిస్తున్నారు. ప్రపంచీకరణ సాహిత్యంలో పోరాడే శక్తులుగా కార్మికులు, కర్షకులు, గిరిజనులు, హరిజనులు, పీడితులు, తాడితులందరూ వర్ణించబడుతున్నారు. మార్క్స్ చూపించిన వర్గపోరాటాల దృక్పథం వీరి రచనల సిద్ధాంత పునాది. దళిత జీవుల్ని విప్లవ పోరాటంలోకి నడిపించిన తొలి దళిత విప్లవ పోరాట కవిగా సుబ్బారావును పేర్కొనవచ్చు.

"కొండలు పక్కన బండలు కొట్టే
గిరిజనుడా ఇటు రావయ్యా
ఓ గిరిజనుడా ఇటు రావయ్యా
పుట్టల పక్కన కట్టెలు కొట్టే
గిరిజనుడా ఇటు రావయ్యా

ఓ గిరిజనుడా ఇటు రావయ్యా"అని ఎలుగెత్తి పిలిచి 'ఎర్రజెండా' గీతం **'జనత మేల్కొంది' మేలుకో** తూర్పుజెండా మొ.. గీతాల ద్వారా ఆదివాసి ప్రజల ఆలోచనలను పదునుబెట్టి కదనరంగానికి నడిపించినది సుబ్బారావు పాణిగ్రాహి.

దళిత కవుల్లో గద్దర్ కి ఒక ప్రత్యేకత ఉంది. విప్లవానికి దళిత గర్జన వినిపించిన మహనీయుడు. ఈయన "యాలరో ఈ మాదిగ బతుకు" అంటూ గద్దర్ చేసిన గర్జన తెలుగులో దళిత సాహిత్యోద్యమంలో నూతన శకాన్ని ప్రారంభించింది.

**6.2.1.ప్రతిఘటన చైతన్యధార దళితసాహిత్యం**: దళితసాహిత్యం దళితవాదం నుండి పుట్టింది. దళితవాదం దళితజీవిత వాస్తవికత నుండి ఆవిర్భవించింది. అంటరానితనం, సాంఘిక అణచివేత, ఆర్థికపీడన, రాజకీయ అణచివేత, మనుషులుగా పరిగణించకపోవటం-దళితవాస్తవికత. భారతీయ సాహిత్యంలో మొట్టమొదటిసారిగా జ్యోతిరావుపూలే దళితవాదాన్ని, దళిత తాత్త్వికతనూ ప్రతిపాదించాడు. పూలే సిద్దాంత వారసత్వాన్ని అందుకొని డా.బి.ఆర్.అంబేడ్కర్ దళిత సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పోరాటాలకు అవసరమైన తాత్వక నేపథ్యాన్ని సంతరించి పెట్టాడు. దళితులు నేడు విద్యావంతులు అవుతున్నారు. హక్కులకోసం పోరాడుతున్నారు.

భారతీయ సమాజంలో వేళ్లానుకుని ఉన్న కులవ్యవస్థను నిరశిస్తూ, సామాజిక న్యాయం కోసం, సమసమాజ నిర్మాణం కోసం దళిత కవులు, రచయితలు, కళాకారులు బలమైన గళగర్జనలు వినిపిస్తున్నారు. సమాజాన్ని చరిత్రను, సంస్కృతిని, సాహిత్యాన్ని దళితుల దృక్పథం నుండి విశ్లేషించే అంతర్ దృష్టిని దళితసాహిత్యం ఆధునిక తెలుగుసాహిత్యానికిచ్చింది. విభిన్న నిమ్నవర్ణాల ప్రజల జీవితానుభవాలను సంవేదనలనూ, సంఘర్షణలనూ, ఆగ్రహాన్ని, ఆకాంక్షలను నేటి దళితసాహిత్యం వ్యక్తీకరించింది. కమ్మరి కులములు కవిత్వమై మండుతున్నాయి. కుమ్మరిచక్రాలు కథలను రూపొందిస్తున్నాయి. సాలేలమగ్గాలు నవలల్ని నేస్తున్నాయి. జాలరి పగ్గాలు కళారూపాలు ఏడుస్తున్నాయి. ఇది నేటి సాహిత్యపరిణామం.

### 6.2.2. దళితకవిత్వం : "పడినచోట వెతుక్కుంటున్న వాళ్లం"

చండాలురు, పంచములు, అవర్ణులు, అంటరానివారు, నిమ్నజాతివారు, మాలమాదిగలగానూ, హరిజనులుగాను పిలవబడుతున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో అగ్రవర్ణాల దౌర్జన్యాలకు బలి అవుతున్నవారు దళితులు. దళితుల బాధల్ని అవసరాల్ని తెలిపేది దళితకవిత్వం. దళితులకు సాంఘిక బంధాల నుండి విముక్తిని, సమాజంలో ఇతరులతో సమానత్వాన్ని కోరేది దళితకవిత్వం.

ప్రపంచీకరణ నేపథ్యంలో దళితులపై జరుగుతున్న అరాచకాల వలన దళిత ప్రజలు ఉద్యమాలు చేయడానికి పూనుకున్నారు. అది 1980నాటికి తీవ్రరూపం దాల్చింది. ఈ ధోరణిలో చూసినపుడు కుసుమ ధర్మన్న హరిజనశతకం ఒక మైలురాయి వంటిది.

"మాలవాడని యవనంబుగావించి
పంచముడని పరువు పారదోలి
ఆదిమాంధ్రుడవని నోదెజెప్పిరిగాదె?
ఆలకింపుమయ్య హరిజనుండ"

అంటూ పలికిన పలుకులు ధర్మన్న "మా కొద్దీ నల్లదొరతనము" పాటలో అగ్నిజ్వాలలు రగిలించారు. దళితుల బాధలను వెల్లడించే కవిత్వం, పోరాటాన్ని ప్రేరేపించేకవిత్వం ఎక్కువగానే వచ్చింది.

"వుండర్రా మాలపేట
ఆవూరు సివర
కష్టాలు వున్న సోటా" - వంగపండు ప్రసాదరావు

"యాలరో ఈ మాదిగ బతుకు

మొత్తుకుంటే దొరకదురా మెతుకు" - గద్దర్

మొదలగునవి పల్లెపల్లెనా మారుమ్రోగాయి దళిత నేపథ్యంలో పల్లెపట్టులపైన ప్రపంచీకరణ నేపథ్యం అనేది చాలా ఎక్కువగా కనిపిస్తుంది.

"గొడ్లు గాయటకు కొని

పాడి మాట లేదు"[14] - ముద్దూరి నగేష్ బాబు

"పల్లెపల్లెగా పుట్టుటకు మనో పతకమై పోనట్లు రచ్చబండల ముందు తలదించిన మచ్చవుతుంది. సినిమాల్లో కాలుతగిలనందుకో, నోరులేని బర్రెగొడ్డు పొరపాటుగా చెరువులో దిగినందుకో " పల్లె మీదికి ఎగసిపడుతుంది.

"మాదికాదు మాదికాదు - ఈ వ్యవస్థ మాదికాదు

దొంగలది దళారులది - దోపిడీ దుర్మార్గులది

దళితుల రక్తం తాగే - దగాకోరు రాయులది"[14] అంటూ దళిత నిరసన, ఆవేదన, ఆక్రోశం - ఆవేశం రూపంలో ఉరికింది. అగ్రవర్గాలను వెన్నుపోటు పొడిచింది.

ప్రపంచీకరణ నేపథ్యంలో దళితులు కనీసహక్కుల్ని కోల్పోయిన క్రమాన్ని గూర్చి మరోకవి 'ఎండ్లూరి సుధాకర్' తన 'సెత్తుటి ప్రశ్న'లో

"వేదం విన్న నా చెవుల్లో సీసం పోసినప్పుడు

అదేదో భాష మాట్లాడితే నాలుక తెగ్గోసినప్పుడు

నా వీర్యం తీర్చిన దాహానికి నా తల నరికేసినప్పుడు

నన్ను చెట్టుక్కట్టి గొడ్డులా చావగొట్టినప్పుడూ

నేనప్పుడే శవమైపోయాను"[14] అంటాడు.

ఈ దేశంలో సకల సంపదని సృష్టిస్తూ, దేశానికింత తిండిపెడుతూ నిజమైన శ్రామికులుగా బతుకుతున్నది దళితులేననే అవగాహనతో కొందరు దళిత కవులు కవితా వస్తువుల్ని దృశ్యీకరిస్తూ ముందుకొచ్చారు.

వారిలో 'జూలూరి గౌరీశంకర్' అనే కవి -

"శరీర దారులంటి పారే చెమటను

మాగానాలకు పంపుతూ

ఆకలి పేగులతో మేడిని బిగబట్టిన

చేతులు దళితులవే"[14]. అంటూ.... 'ఊర్లూ, నగరాలూ, నాగరికతలూ నిలబడి తలలెత్త గలగడానికి దళితులే కారణం' అని ప్రకటించాడు.

**6.2.2.1.దళిత సంఘీభావ కవిత్వం** : దళితసాహిత్యం ఒక ఉద్యమంగా తలెత్తుతున్న తరుణంలో దళితులంటే ఎవరు, ఎవరు రాసింది దళితకవిత్వం ప్రపంచీకరణ నేపథ్యంలో దళిత దృక్పథం ఎలా ఉంది అనేది చూసిరి. తొలి దళిత కవిత అయిన చిక్కనవ్వుతున్నపాట సంపాదకీయంలో SC, ST, BC, మైనారిటీలందరికి దళితలు గానే పేర్కొన్నారు. దళిత దృక్పథం నుంచి అగ్రకుల హిందూ ప్రగతి వాదులు రాసిన కవిత్వం ఇంకా తెలుగులో రావల్సి ఉంది.

**6.2.2.2.దళిత కవిత్వం వాదోపవాదాలు**: 1980వ దశకం నుంచి చెదురుమదురు వస్తువు దళిత కవిత్వం 90ల నాటికి ఒక నిర్థిష్ట రూపాన్ని తీసుకుంది. తొలి రోజుల్లో ఆవేశపూరితంగా సాగిన కవిత్వం ఆతరువాత ఆలోచనాత్మకంగా సాగింది. తెలుగులో దళిత కవిత్వం అనేది కొంత వివాదాస్పదానికి దారితీసింది. ప్రపంచీకరణ నేపథ్యంలో దళితకవులు, ప్రజలు ఎదుర్కొన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు చాలా ప్రభావాన్ని చూపాయి. దళితకవిత్వం రాకతో తెలుగు సాహిత్యంలో సరికొత్త వస్తు రూపాలు ప్రవేశించాయి. దళితసాహిత్యం వస్తురూపాల్లో ప్రారంభదశల్లోని విమర్శకులను దాటి ఒకరకంగా ఎదుర్కొంటూ రూపవాదులకు, రసవాదులకు ధీటుగా తమ సొంత ఉనికిని ఏర్పరచుకుంది.

దళిత సాహిత్యం వస్తురూపంగా విభిన్న కోణాల నుంచి దళిత సంస్కృతిని దళిత జీవితాన్ని శక్తివంతంగా ఆవిష్కరిస్తుంది. పతనమైపోతున్న దళితుల జీవితాలు ప్రపంచీకరణ పెనురక్కసి చేతుల్లో నలిగిపోతున్నాయి. ధ్వంసమైపోయిన దళితుల జీవితాలు మళ్లీ ఒక ఉద్యానవనంల వికసించినట్లు మళ్లీ సమాజంలో దళితలు చిరునవ్వులు చిందిస్తారు.

"జీవితంపట్ల అసహజంగా, అవాస్తవికంగా, పెద్దగా స్పందించి. జీవితాన్ని పట్టి పీడిస్తున్న 'కుల'మనే ప్రధాన సమస్యనీ, సమాజంలో అత్యధికుల అవమానాలకీ, అనిశ్చితత్వానికీ, అభద్రతకీ, భయాలకీ, బాధలకీ కారణమైన కులాన్ని విస్మరించకుండా గొప్ప రచయితలుగా, వాస్తవిక రచయితలుగా, మౌలిక వాదులుగా పేరుతెచ్చుకున్న రచయితలే మనకు ఎక్కువ"... అని ప్రపంచీకరణ నేపథ్యంలో చాలా వేగంగా దూసుకొచ్చారు.

**6.3.స్త్రీవాద దృక్పథం పరిచయం:** తెలుగు సాహిత్యం క్రీ.శ11వ శతాబ్దిలోనే ప్రారంభమైనప్పటికీ, స్త్రీల గొంతు వినబడటం క్రీ.శ 20వ శతాబ్దిలోనే ప్రారంభమైంది.15వ శతాబ్దంలో తాళ్లపాక తిమ్మక్క నుండి 19వ శతాబ్దంలో తరిగొండ వెంకమాంబ వరకు చెదురుమదురుగా తెలుగు కవయిత్రులు కనిపిస్తారు. అయినప్పటికీ ఉద్యమ రూపం విజృంభించిన సంవత్సరం 1900సం. స్త్రీలు హత్యలకి గురికావడం బానిసవ్యవస్థ, చిన్న వయసులో వివాహాలు మొదలగు అన్నింటిలో ప్రపంచీకరణ ఉద్యమ దృక్పథం కన్పిస్తుంది.

స్వాతంత్ర్యానంతరం తెలుగు సాహిత్యంలో వచ్చిన వాదాల్లో స్త్రీవాదం ఒకటి. ఇది సాహిత్యంలోనూ, సమాజంలోనూ తెచ్చిన మార్పు సామాన్యమైంది కాదు. స్త్రీవాదం అనే భావన ఎప్పటినుండో ఉన్నప్పటికీ అది ఒక వాదంగా, ఉద్యమంగా గుర్తించబడింది మాత్రం 1980దశకం తర్వాతే. 1960 - 1970 దశకంలో యూరప్ లో స్త్రీ విముక్తి ఉద్యమాలు ఒక సైద్ధాంతిక నేపథ్యంలో బయలుదేరి, అవి భారతదేశం పై ప్రభావాన్ని చూపాయి. ఆంగ్లేయ విద్యావిధానం వల్ల స్త్రీలు కుడా విద్యను అభ్యసించడంతో వ్యక్తిస్వేచ్ఛలో భాగంగా స్త్రీవాదం ఉద్యమ స్థాయికి చేరుకుంది. స్త్రీలు చదువుకోవటంతో వారిలో ఆలోచన పెరిగింది. పితృస్వామిక భావజాలం ఎంతగా అణచివేతకు గురిచేస్తుందో గమనించగలిగారు.

పితృస్వామ్యం శారీరకమైన కారణాల వల్ల స్త్రీని కొన్నింటికే పరిమితం చేయడమే కాకుండా అది క్రమేపి అణచివేతకు, అవమానాలకు దారితీసే విధంగా రూపాంతరం చెందింది. ప్రాచీన కాలం నుండి, ఆదర్శాలు, పతివ్రత ధర్మాలు, దాంపత్య సర్దుబాట్లు మొదలైన గొప్ప గొప్ప పదాలతో కొనసాగిన అణచివేత క్రమేపి ఆత్మగౌరవం నాశనం చేసే స్థాయికి చేరుకోవడంతో స్వతంత్ర వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలనే కాంక్ష చదువుకున్న స్త్రీలలో బాగా వ్యక్తమయింది. అదే స్త్రీవాదాన్ని ఉద్యమ స్థాయికి తీసుకువచ్చింది.

**6.3.1.నేపథ్యం :** సంఘసంస్కరణ ఉద్యమ ప్రభావం వలన సమాజంలో స్త్రీలలో రావలసిన చైతన్యాన్ని సూత్రప్రాయంగా రావడానికి బీజాలు నాటిన కవితాదృక్పథం స్త్రీవాదం. తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమం, కాల్పనిక, అభ్యదయ, విప్లవ కవిత్వోద్యమాల తర్వాత అత్యంత ప్రభావం చూపిన ఉద్యమం స్త్రీవాద కవిత్వోద్యమం.1975 తరువాత రూపుదిద్దుకొని 1985 నుంచి స్థిరపడి క్రమంగా అన్ని ప్రక్రియలకు విస్తరించిన ఉద్యమం స్త్రీవాద కవిత్వోద్యమం.

**6.3.2.స్త్రీవాదం నిర్వచనం:** "సమాజంలోనూ, కుటుంబంలోనూ, పనిలోనూ స్త్రీలు గురౌతున్న అణచివేత, దోపిడీకి సంబంధించిన అవగాహన కలిగి ఉండి,ఈ పరిస్థితిని మార్చటానికి స్త్రీలు, పురుషులు చేపట్టే చైతన్యవంతమైన కార్యక్రమమే స్త్రీవాదం." - Feminist study circle.

స్త్రీవాదకవిత్వం వ్యవస్థను ప్రశ్నించడంతో ప్రారంభమైంది. పితృస్వామ్య వ్యవస్థ కారణంగా సమాజంలో వేళ్ళూనుకున్న ద్వంద్వ ప్రమాణాలను, స్త్రీ పురుషుల అసమానర్థం అతి సహజమని పరిగణించే ఆలోచనా విధానాన్ని, దాన్ని మార్చనవసరం లేదని భావించే జడత్వాన్ని ఈ కవిత్వం ప్రశ్నించింది.

ప్రస్తుత వ్యవస్థను ప్రశ్నించడం, దిక్కరించడం, కొత్తదృక్పథాలను ప్రతిపాదించడం స్త్రీవాద కవిత్వం శక్తివంతంగా చేసిన పని. ప్రపంచీకరణ నేపథ్యంలో స్త్రీవాదకవిత్వం దృక్పథాన్ని చూడటమంటే స్త్రీల జీవితాన్ని, సమాజాన్ని, ప్రపంచంలో స్త్రీల దృక్పథం నుంచి చూడవలసిన అవసరాన్ని స్త్రీవాద కవితా దృష్టితో చూడాలి.

**6.3.3.స్త్రీవాదనేపథ్యం:** తెలుగులో స్త్రీవాద సాహిత్యోద్యమం 1970 దశకం వరకూ రూపుదిద్దుకోనప్పటికి ప్రపంచ వ్యాప్తంగా, ఇది సామాజిక ఉద్యమంగా ప్రారంభమై 200సం. దాటింది.

1. 1789 ఫ్రెంచి విప్లవం ద్వారా స్వేచ్ఛ సమానత్వం, సోదరత్వం అనే నినాదాలతో ఫ్రాన్సులో మహిళలు తమ హక్కుల పోరాటం ప్రారంభించారు.

2. 1870 రష్యన్ విప్లవం వ్యక్తి స్వాతంత్ర్యాన్ని చర్చిస్తున్నప్పుడు, స్త్రీ విప్లవ శక్తికి ప్రాధాన్యత చేకూరింది.

3. 1889 పారిస్ లో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో స్త్రీ పురుషుల సమాన హక్కుల ప్రస్తావన వచ్చింది,

4. అమెరికాలో 1841లోనే ఫ్యాక్టరీలో పనిచేసే స్త్రీలు తాము సామూహికంగా కార్యక్రమాలు చేపట్టాలని గుర్తించారు.

ఇంటి చాకిరీకి జీతం ఉండాలనే నినాదం కూడా 1970 తరువాత అమెరికాలో ఉద్యమరూపం దాల్చింది. ఓటుహక్కు, విద్యాహక్కు, ఎన్నికల్లో పోటీచేసే హక్కు, గర్భస్రావం హక్కు వీటన్నింటిని ప్రపంచ స్త్రీలు పోరాటాల ద్వారానే సాధించారు.

## 6.3.4.స్త్రీవాద కవిత్వంలోని ప్రధాన వస్తువులు :

1.వ్యక్తిగా, రచయితగా తమ ఉనికి

2.మాతృత్వం

3.లైంగిక వివక్ష

4.శారీరక స్పృహ

5.వివాహ వ్యవస్థ

6.కుటుంబంలో హింస

7.సామూహికజీవితం

8.ప్రపంచీకరణ

స్త్రీవాద కవిత్వంలో వస్తువిభజన స్థూలంగా కనిపించినప్పటికీ, మళ్ళీ అంతర్విభజనలుండవచ్చు. మొత్తం మీద చూసినట్లయితే ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతీ అంశంపైన ప్రపంచీకరణ దృక్పథం కన్పిస్తుంది.

స్త్రీ జీవితంలో పితృస్వామ్య వ్యవస్థ స్పృశించని భాగం కానీ, అంశం కానీ లేదని, ఈ పితృస్వామ్య భావజాలం మూలాలు గుర్తించి, వాటి నుంచి తమ అస్తిత్వాన్ని పరిరక్షించుకోవటం కొత్త విలువలను అన్వేషించటం. ఆ అన్వేషణను వ్యక్తిగతంగా కాక సామూహిక చైతన్యంగా మార్చటం స్త్రీవాద కవిత్వోద్దేశ్యం.

**1.ఉనికి(లేదా)అస్తిత్వం :** స్త్రీల అస్తిత్వమంటే వాళ్ల శరీరాలనే భావనను స్త్రీవాద కవిత్వం ఖండించింది. స్త్రీగా పుట్టటమే శాపమని భావించేలా ఈ పితృస్వామ్య వ్యవస్థ చేస్తుంది. కనుక తమ ఉనికి నిషిద్ధమని చెబుతూ......

"శ్రీమతి

'నేనమ్మలో ఉన్నపుడు
నేను కావాలని అమ్మ కోరుకున్నట్లు
నాన్నకు తెలియగానే
ఈడ్చి చెంప పగలగొట్టిన నాన్నదెబ్బకి
నేనెవరో నాకు తెలిసింది
నేనొక స్త్రీని
మొన్నటిదాకా నా నవ్వు నిషిద్ధం
నిన్న నా చదువు నిషిద్ధం
నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే.' స్త్రీ స్త్రీగా మాట్లాడడాన్ని సహించలేకపోవడం కూడా ఆమె అస్తిత్వాన్ని నిరాకరించడమే.

**2.మాతృత్వం :** మాతృత్వభావన గురుంచి పితృస్వామ్యవ్యవస్థ కల్పించిన అలౌకిక భావనను, ఆదర్శీకరణను స్త్రీవాదకవిత్వం భావించింది. మాతృత్వంలోనే ఆనందాన్ని అంగీకరిస్తూనే దాని వెనుక ఇమిడి ఉన్న శరీర హింసను స్త్రీల నిర్ణయాలతో, అభిప్రాయాలతో ప్రమేయంలేని మాతృత్వస్థితిని స్త్రీవాద కవయిత్రులు అద్భుతంగా చిత్రించారు.

కొండేపూడి నిర్మల **'లేబర్ రూం'** కవితలో.....

'లేబర్ రూంలో అడుగు పెడితే చాలు
మీరంతా చెబుతున్న తెల్లచీర మల్లెపూలు పాలగ్లాసు,
పరిశీలనలో బానిస కన్నీరు ద్వీపాంతర వాసం. . .
కాళ్ళనలా ఎడం చేసి దీనంగా హీనంగా నీచాతినీచంగా
ఒక హింసాతల పరాకాష్ట కోసం ఎదురు చూడనుంటే
రైలుపట్టామీద నాణెం విస్తరించిన బాధ'

పునరోత్పత్తి హక్కుల గురించి మాట్లాడకుండా,
స్త్రీని "సంతానాన్ని కనే యంత్రంగా"[15] చూడటాన్ని స్త్రీవాద కవిత్వం నిరసించింది.

**3.లైంగిక వివక్ష :** స్త్రీ, పురుషుల మధ్య బాల్యం నుంచి చూపే వివక్ష, ఆడపిల్లను పుట్టుకముందే చంపడం వరకూ విస్తరించింది, అంటూ జయప్రభ ఇలా అంటుంది.

"విక్రమించే వామనుడి
మూడో పాదమై పెరిగి పెరిగి
ఆడ జాతిపై
ఆఖరు అడుగు పెట్టబోతుంది
అది
అక్కడ మాత్రమే జరుగుతున్నదికాదు
విశ్వ వ్యాప్తంగా
గర్భంలో పెరిగే శిశుదశనుంచీ
ఆడతనంపై హత్యాచారం"[16]

**4.శరీర స్పృహ :** పురుషులు తరతరాలుగా తమ సాహిత్యంలో చేసే స్త్రీ శరీర వర్ణనకీ, స్త్రీలు చేసే వర్ణనకి చాలా వ్యత్యాసం ఉంది. స్త్రీ శరీర సౌందర్యం వెనుక ఉన్న హింసనూ, శరీరం వల్ల స్త్రీ పొందే బాధలను స్త్రీవాదులు చిత్రించారు. శరీరానికి సంబంధించిన కవితల్లో రజస్వల కావటం, అబార్షన్ చేయించుకోవటం, భోగ్యవస్తువుగా భావించడం, సంభోగ శృంగారంలో ఆనందం పొందడం అనే అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. స్త్రీ శరీర హింసను, మనస్సుకు ఉన్న సన్నిహితమైన సంబంధాన్ని అబార్షన్ స్త్రీలో కలిగించే ఆ వ్యక్తి వేదనను అద్భుతంగా చిత్రించిన కవిత 'లో......

"నాలోని అమ్మని పాతిపెట్టుకొని
చెరకు పిప్పిపై పారిపోతూ
కంసుడి కత్తిలాంటి ప్లాస్టిక్ బకెట్ మింగిన
ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముద్దలాంటి నిన్ను చూసి
మళ్ళీ నా పొత్తిళ్ళలో పొదుగు కోవాలని అంటూ.
'అయ్యో,
పాలింకి పోవడానికున్నట్లు
మనసింకి పోవడానికీ
మాత్రలుంటే ఎంత బావుండు"[17]

అని అగాధమైన ఆర్తినీ ఆవేదననూ కవితాత్మకంగా వ్యక్తీకరిస్తుంది. స్త్రీవాదానికి ముందు సాహిత్య చరిత్రలో కన్పించదు. శృంగారంలో స్త్రీ ఆనందాన్ని రసవంతంగా వర్ణించటం స్త్రీవాదులు చేసిన సాహసం.

**5.వివాహవ్యవస్థ:** పితృస్వామ్య వ్యవస్థలో అణచివేత విశ్వరూపం దాల్చింది వివాహ వ్యవస్థలోనే 'పెళ్లి' అనే రెండక్షరాల మాట ఎలా 'శిక్ష'గా పరిణమిస్తుందో మన సంస్కృతిలో అనునిత్యం వాడే మాటలే. పెళ్ళంటే ఆడపిల్లకు 'శిక్ష' అనే భావాన్ని ఎలా కలిగిస్తున్నాయో  చిత్రించిన కవిత స్త్రీవాద కవితా స్వభావాన్ని పూర్తిగా అందిపుచ్చుకున్న తొలి కవితగా విమర్శకులు భావించారు.

"పాటం ఒప్ప చెప్పకపోతే పెళ్లి చేస్తానని
పంతులు గారన్నప్పుడే భయం వేసింది
ఆఫీసులో నా మొగుడున్నాడు
అవసరమొచ్చినా సెలవివ్వడని
అన్నయ్య అన్నప్పుడే అనుమానం వేసింది
'వాడికేం మగమహారాజని '
ఆడామగా వాగినప్పుడే అర్థమైపోయింది.
మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని
మనం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తుందని"[18]

వివాహం, దాంపత్యం అనే పదాలున్న ఊహాజనితమైన, ఆదర్శప్రాయమైన అర్థాలు, దాని చుట్టూ అల్లుకున్న మిథ్యావరణం వాస్తవిక జీవితంలో ఎక్కడా సరిపోలవని స్త్రీవాద కవిత్వం స్పష్టం చేసింది. వివాహానంతరం స్త్రీ ఎన్ని రకాల అవతారాలు ఎత్తవలసి వస్తుందో చెప్తుంది మందవరపు హైమావతి...

"కుక్కర్ విజుల్స్ లోనే
మనోజ్ఞ సంగీతం వింటాను
పతిదేవుని టేబుల్ పై
కాఫీ కప్పుగా, మీల్స్ కారియర్ గా
పిల్లల లంచ్ బాగ్స్ లాగా

బహు పాత్రాభినయం పోటీలో

నా చేతులకేప్పుడు ఫస్ట్ ప్రైజో"[19]

వివాహం తరువాత స్త్రీ తన ఉనికిని కోల్పోయి, కుటుంబ విధుల్లో తన అస్తిత్వాన్ని మెరుగుపరచడాన్ని ఈ కవితలో చూడవచ్చు.

**6.కుటుంబహింస :** కుటుంబంలో స్త్రీ నిర్వహించవలసిన అనేక పాత్రలు, ఆమెపై వాటి ప్రభావాలు, స్త్రీవాద కవితకు ప్రధాన వస్తువులయ్యాయి. కుటుంబ వ్యవస్థలో కనిపించీకనిపించని అణచివేత, దౌర్జన్యం, స్త్రీ అస్థిత్వాన్ని నిర్మూలించే వైనం స్త్రీవాద కవిత్వంలో చూస్తున్నాము.

ఇంటి చాకిరీ స్త్రీ జీవితాన్ని ఎలా పరిమితం, సంకుచితం చేస్తుందో, ఆమె అస్థిత్వాన్ని ఎలా హరిస్తుందో 'వంటిల్లు' కవితలో విమల వంటింటి ఆటలో స్త్రీబాల్యం ప్రారంభమవుతుందని చెబుతూ......

"మా అమ్మ మా అమ్మమ్మా

ఇంట్లో అమ్మలంతా ఇక్కడే స్త్రీలయ్యారట

భయం భయంగా, నిశ్శబ్దంగా, నిరాశగా

మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ

అసలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా వుంటుంది

ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మేరాణి

అయినా, చివరకు వంటింటి గిన్నెలన్నింటిపైనా

మా నాన్న పేరే"[20]

స్త్రీవాద స్పృహతో ప్రారంభమై, వంట ఇళ్లను, స్వంత ఆస్తిని కూల్చేద్దామన్న నినాదంతో, మార్క్సిస్టు దృక్పథంతో ఈ కవిత అంతమవుతుంది.

**7.సామాజిక జీవితం :** ప్రపంచీకరణ ప్రభావం సామాజిక జీవనంలో వివిధ వృత్తుల్లో ఉన్న స్త్రీల బాధలకు కూడా స్త్రీవాదులు అద్దంపట్టారు. ఇంటి నుంచి బయటకి వచ్చిన స్త్రీ ఎదుర్కొనే సమస్యలు, పురుషాధిక్య సమాజం, వారిని కించపరచి, అవమానించి, అణచివేసే విధానాలు కవితా వస్తువులయ్యాయి.

సమాజంలో అన్ని వర్గాల పురుషులకు స్త్రీ ఎలా పెట్టుబడి అవుతుందో మందవరపు హైమావతి "నీలి కవితలే రాస్తాము" లోఆమె తన బాధలను చెబుతూ...

"కవికీ చిత్రకారుడికీ
నా శరీరమే గదా
వర్ణనీయ వస్తువు
చలన చిత్రాలకు
వ్యాపార ప్రకటనలకు
పెట్టుబడి నా శరీరమే కదా!"

పితృస్వామ్య సమాజంలో స్త్రీల ఆత్మహత్య కూడా ఒక నిరసన అంటుంది. రావులపల్లి సునీత సామాజిక జీవితాన్ని వస్తువుగా స్వీకరించిన కవయిత్రుల్లో ఇంకా రెంటాల కల్పన, కె.గీత, పసువులేటి గీత, అనిశెట్టి రజిత మొ.. వారున్నారు.

**6.3.5.స్త్రీవాద ప్రపంచీకరణ:** మారుతున్న సామాజిక, ప్రాపంచిక జీవితాలతో పాటు తమ అవగాహనా పరిమితిని, అనుభవాల పరిధిని విస్తృతం చేసుకొని, కొత్త వస్తువులను ఎప్పటికప్పుడు స్వీకరించడం స్త్రీవాద కవయిత్రుల రచనలలోని వైశిష్ట్యం.

ప్రపంచీకరణలో భాగమైన అందాల పోటీలు, శారీరక సౌందర్యం కాపాడుకోవడం కోసం ఈనాటి యువతులు పడే యాతన, ఇవన్నీ స్త్రీ పురుషుల సహజ సంబంధాలలో తీసుకు వచ్చిన కృత్రిమత్వం కొండేపూడి నిర్మల "మల్టీ నేషనల్ ముద్దు" లో దర్శనమిస్తాయి. 'కల్లెత్తి చూసినా కనకాబిసేకాల్లేవు' అని ఎంకి పాటను గుర్తు చేస్తూ ప్రారంభమయ్యే కవితలు.

సామ్రాజ్యవాద దేశాలు, భారతదేశం వంటి వర్ధమాన దేశాలను ఎలాంటి ప్రలోభాలకు గురిచేస్తున్నాయో వాటిని అనుకరిస్తూ మనం అసహజంగా జీవిస్తున్నామో ఈ కవితలో నిర్మల గారు అద్భుతంగా ఆవిష్కరించింది.

"మొగ్గల్లోంచి పువ్వు బైటకొచ్చినంత సహజంగా
నోట్లోంచి మాట రావడం మానేసింది
చెమట చర్మం మీదికి రాకుండా
ఫౌండేషన్ క్రీమ్ కాపలా

కంటిచెమ్మ రెప్పకు తెలియకుండా

కప్పుకున్న వెలాష్ కాపలా.....

పెడిక్యూర్ అనుకుంటూ

పరాయి మార్కెట్ పాద సేవకు

చేతులిచ్చిన దాసిని నేనే"[21] అంటూ నేటి వినిమయ వస్తువుల యుగంలో స్త్రీకి కూడా 'మారకపు విలువ' ఉందని అంటుంది నిర్మల.

మేధోవలసలు, డాట్ కామ్, ఇంటర్నెట్ సంస్కృతులపై రెంటాల కల్పన, కుప్పిలి పద్మ వంటి వారంత కవిత్వం వ్రాశారు. స్త్రీవాదకవిత్వం స్త్రీలు ఎదుర్కొంటున్న అణచివేతనూ దౌర్జన్యాలను, వీటన్నింటిని ప్రశ్నించేవారు స్త్రీవాదులు.

"దోపిడీ సంస్కృతి

నా వ్యక్తిత్వాన్ని శవంగా చేసి

దానిపైన కప్పిన తెల్లదుప్పటీ పైట!

నేను నడిచే శవాన్ని కాకుండా వుండాలంటే

ముందుగా పైటని తగలెయ్యాలి" - జయప్రభ

'తెగబడిన మా కళల ప్రపంచంలో' విమల

"శరీరమో- కన్నీళ్ళో అని

అర్థం చెప్పబడిన

స్త్రీలు-

మెరుపుల పిడికిళ్ళు ఎత్తిన

పోరాట ప్రచండ ఘోషను

తెగబడిన దృశ్యాన్ని.....

నీవిప్పుడు వినక చూడక తప్పుదు అని హెచ్చరించింది.

నేటి కాలపు రచయిత్రులు అన్ని రకాల అంశాలనూ చూస్తున్నారు. వీరిలో స్త్రీలను నడిచే గాయాలుగా, లేబర్ రూంల బాధలుగా భావించి అద్భుత కవిత్వం రాసిన స్త్రీవాద కవయిత్రి కొండేపూడి

నిర్మల. ఇప్పటికీ ఆమె వస్తు వైవిధ్యంతో రాస్తున్నప్పటికీ స్త్రీవాద కవిత్వపు ఛాయలు ఆమె కవిత్వంలో విధిగా కనిపిస్తుంటాయి.

"నడవడం కోసం పుట్టానో,

నడిపించడం కోసం పుట్టానో

ఎప్పుడూ ఆలోచించలేదు

మొత్తానికి ఏదో ఒక మగవాణ్ణి నడిపించడం కోసం

ఏదో ఒక దూరం దగ్గర చెయ్యడం కోసం

నడవాలనే అనుకుంటున్నాను

ఎందుకంటే నానడక నేనింకా మొదలుపెట్టలేదు"[22]

సుందర ప్రకృతిని గాని, ఏదో దృశ్యాన్ని గాని చూసిన వెంటనే కవికి మెరుపు లాంటి ఓ భావరేఖ హృదయసీమలో తళుక్కున మెరుస్తుంది. అప్పుడు జ్ఞానేంద్రియాలు ఒకరకమైన అలజడికి గురవుతాయి. ఆ అలజడిని యథాతథంగా కాకుండా దానికింత అనుభూతిని జోడించి వ్యక్తీకరించడాన్ని స్మృతివాదం (ఇంప్రెషనిజం) అంటారు. డా. జ్యోత్స్న కవిత్వంలో ఇంప్రెషనిజం ఛాయలు కనిపిస్తాయి.

"గరిక పోచ చివర మెరిసే

తెలి మంచు బిందువుని

తొలి కిరణం తాకగానే

ఏడు వన్నెలతో విరిసే

ఆ నీటి చుక్క చెలి

అనురాగాల పాటలని

నా కవితలతో కలిపి

అల్లుకుంటాను నేను”[23] యాంత్రికంగా జీవించవద్దు. సవ్యతలేని జీవితాలు రంగుల్లో స్నానం చేయాలనుకోవడం కేవలం భ్రమ. సాదా జీవితాల్లోకి ఊదారంగులు కావాలి. కానీ అవి వక్రంగా కాదు. సక్రమంగా రుజురేఖలాంటి నిజాయితీతో రావాలి అంటారు జ్యోత్స్నప్రభ. వస్తువులు క్యూబిక్ చిత్రకారుడి దృష్టిలో రేఖలుగా రూపాంతరం చెందినట్టు కవితావస్తువేదైనా కొండపల్లి నీహారిణి కవితా నిర్మాణంలో అక్షరాలుగా అమరి భావచిత్రాలు కాస్తా ఛాయాచిత్రాలుగా మారుతాయి.

“సంజ్ఞలన్నీ చేతిలో ముద్రలై

చిత్రంలో వర్ణాలై

వ్రాతల్లో వచనాలై

చిందర వందర పరాయికరణకు

పలుకుతుంది ఆహ్వానం”[24]మనిషి శరీరం ఊహల్లో తేలేదై, మస్తిష్కంలో రిమోట్ అవుతున్న సత్యాన్ని చక్కగా కవిత్వీకరించారు.

గ్లోబలైజేషన్ కళలను, కవిత్వాన్ని కబ్జా చేశాక, ఇక కవయిత్రులు అంతర్ముఖులై ఆత్మ శోధనలో గతానుభూతుల్లో ఆనందాన్ని, సౌందర్యాన్ని ఆస్వాదించాలనుకోవడం తరుచుగా జరుగుతుంటుంది. కవికి జన్మతః అలవడిన సంస్కారమే అద్భుతమైన కవితాశిల్పాన్ని వ్యక్తీకరిస్తుంది కానీ ఒకరిని చూసి అనుకరించడమన్నది వీలుపడని పని. కవి అంతర ప్రకృతి, సమాధి స్థితి ఉత్తమ కవితకు కారణాలు అంటాడు అరిస్టాటిల్. శీలా సుభద్రాదేవి ఇటీవల రాసిన ‘కొత్త మజిలీ’ కవిత వోర్టిసిజమ్‌ను గుర్తు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా వచ్చే ప్రకంపనలు శబ్ద తరంగాల ద్వారా కావచ్చు, మానసికమైన నిశ్శబ్ద సమస్యా తరంగాలు కావచ్చు. మనిషికి మెదడు కన్నా కళాకారుల మేధస్సు అత్యంత సున్నితం కాబట్టి ముందుగా వాళ్ళు ప్రభావితులవుతారు. ప్రపంచీకరణ దుష్ప్రభావాల ప్రకంపనలు ఈ కవయిత్రిని చలింపచేశాయి. అద్భుతకవితా సృజనకు కారణమయ్యాయి.

"ఇంట్లోకి అడుగు పెడుతుండగానే
మనసు వెక్కిళ్ళు పెట్టింది
ఎదురుగ్గా పచ్చదనాల మధ్య కుదురుగా
వీణాపాణి కొలువుతీరిన అరుగు శూన్యమైపోయింది
లోలోన అంతటా ఎటు చూస్తే అటు శూన్యమే!
కళలు దిద్దుకున్న గోడలన్నీ

ఇప్పుడు అక్షరాలు రాయని తెల్లకాగితాలు![25] ఇంకా మళ్ళీ జీవన ప్రయాణంలో చరమాంకానికి చేరిన ఈ కొత్త మజిలీలో కొత్త కలల్ని కొంగ్రొత్తగా కనక తప్పదని ఈ కవితలో విచారం వ్యక్తం చేశారు సుభద్రాదేవి. ఇటలీ దేశస్థుడైన బెనడిటో క్రోచె అభివ్యక్తి వాదాన్ని కనిపెట్టాడు. ఆత్మలోతుల్లో చిన్న కదలిక ఏర్పడడానికి కావలసింది చైతన్యం. ఆ చైతన్యానికి మూలం అనుభూతి. ఆ అనుభూతి కళాభ్యాసంలోనుంచి పుట్టేదే కవిత్వమన్న విషయాన్ని స్పష్టీకరించాడు. అనుభూతిని బహిర్గతం చేయడానికి కావలసిన సాహితీ చైతన్యమే శిల్పం. ఆ శిల్ప వ్యక్తీకరణమే ఉక్తి. అదే అభివ్యక్తి. కవితకదే ప్రాణం. సాహితీ మిత్రులతో కలిసి పాపికొండల్ని చూసొచ్చాక పసుపులేటి గీత ఒక అద్భుతమైన అభివ్యక్తితో కవితరాసింది.

"ఎక్కడి నీళ్ళో
ఫ్రీజర్‌లో ఐస్‌క్యూబ్‌ల గ్రాండ్ కాన్యాన్‌గా మారి
వైన్ గ్లాస్‌ల్లో అమెజాన్లని నిద్ర లేపుతాయి
చేల గుండెల్లో చేపుకొచ్చి ఊపిరి పొదుగు
లైన నీళ్ళు
ఇక వల్లమాలిన నిండుదనంతో
ఒట్టిపోయిన కాలకూట పుటల సూళ్ళు
అణువణువునా ఆక్వా ఫోబియా!"[26]

నిజం, నీళ్ళిప్పుడు భయపెడుతున్నాయి. తాటి ముంజె లాంటి గాజు నది మీద ఎవరో ఎగరేసిన గాలిపటంలా ఆకాశం' అంటూ సరికొత్త అభివ్యక్తితో గీత పరాయికరణ మయ్యే నీటి గురించి, నేల గురించి, నదీ రేవు గురించి మంచి కవిత రాశారు.

**6.3.6.మహిళలపై ప్రపంచీకరణ దుష్ఫలితాలు:** ప్రపంచీకరణతో మహిళల బతుకులు చిన్నాభిన్నమవుతున్నాయని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి సుధా సుందర్ రామన్ అన్నారు. హైదరాబాద్ వచ్చిన సందర్భంగా మహిళా ఉద్యమం ఎన్నో విజయాలు సాధిస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లు కూడా వస్తున్నాయని, ప్రపంచీకరణ సమస్య కూడా అటువంటిదే. ప్రేమ పేరుతో జరుగుతున్న వేధింపుల నుండి, మహిళల జీవితాలను ఒక పార్శ్వానికే పరిమితం చేయడం వరకు ప్రపంచీకరణ ప్రభావం చూపుతుంది. స్పష్టంగా చెప్పాలంటే మహిళల జీవితాలు కుదించుకుపోతున్నాయి.

ప్రపంచీకరణ ప్రారంభమైన తరువాత వేతనాల్లో వ్యత్యాసాలు పెరిగాయి. హింస, లైంగిక వేధింపులు పెరిగాయి. అయితే పెరుగుతున్న ఈ అంతరాలకు, హింసకు పెద్దగా ప్రచారం లభించడం లేదు. దానికి భిన్నంగా ప్రపంచీకరణతో ఉద్యోగవకాశాలు పెరుగుతున్నాయని, ఆదాయం పెరుగుతోందని, మహిళలను నమ్మిస్తున్నారు. అధికజీతాలు, మెరుగైన వేతనాలను ఎరగా చూపించి అభం శుభం తెలియని బాలికలను అక్రమంగా తరలిస్తున్నారు. బీహార్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఈ పరిస్థితి చాలా ఎక్కువుగా కనబడుతుంది. ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాలో కూడా ఇదే రకమైన పరిస్థితి ఉంది. భ్రూణహత్యలు పెరగడం ప్రపంచీకరణలో అంతర్భాగంగానే జరుగుతున్నవి.

స్త్రీలు తమ స్వీయ అస్థిత్వాన్ని నిరూపించుకోవాలని ఆరాటపడుతూ, తరతరాలుగా జరుగుతూ వచ్చిన అన్యాయం పట్ల న్యాయమైన క్రోధంతో ఆత్మాశ్రయ కోణం నుంచి, ఆ క్రోధాన్ని వెళ్ళగ్రక్కిన క్రమంలో స్త్రీవాద కవిత్వం హృదయాలను తాకింది. 1960 – 1980 దశాబ్దులలో కథలు నవలలు కవిత్వం స్త్రీల సమస్యలను గూర్చి చర్చించాయి. కాని స్థిరపడలేదు. స్త్రీవాదులు తీసుకున్న ప్రధాన అంశాలు స్త్రీ విద్యకు సంబంధించేవే.

“ఆధునిక మహిళలు భారతదేశ చరిత్రను తిరగరాస్తారు” అన్న ఆశాభావాన్ని అప్పట్లోనే వెలిబుచ్చారు గురజాడ. గురజాడ తర్వాత ఆ నేపథ్యాన్నికథనరంగంలో చూపించిన కవి చలం.

సాహిత్యంలో స్త్రీవాద కవయిత్రులు ఆధునిక కాలంలో గొప్ప ప్రయత్నాలు చేసినప్పటికీ స్త్రీవాదం నిలవకపోవడం బాధాకరమైన అంశంగానే భావించవచ్చు.

ప్రపంచీకరణ అనే పెనురక్కసి చేతిలో స్త్రీలు తమ మానాలని కోల్పోతున్నారు. బానిసలుగా బతకవలసిన దుస్థితి ఏర్పడుతుంది. దాదాపు 1990 తరువాత చాలా మంది దానిని తీవ్రంగా వ్యతిరేకించారు. విమర్శలను, నిందలను, నిర్హేతుకమైన ఆరోపణలకు లొంగిపోకుండా, స్త్రీవాద కవయిత్రులు తమ సంఖ్యను తమ రచనా వస్తువులో నవ్యతను చేర్చుకుంటూ ముందుకు సాగారు. స్త్రీవాదులు తమ లక్ష్యాన్ని చెప్పారు. స్త్రీ పురుషుల మధ్య అధికార సంబంధాలు పోయి, పరస్పరం గౌరవించుకునే, సమస్థాయి సంబంధాలు ఏర్పచడమే తమ లక్ష్యమని స్త్రీవాద కవిత్వం నిరూపించింది.

ఈ నేపథ్యంలో 'వసీర' -

"అతనెవరో బియ్యపు గింజమీద
ఇందిరా గాంధీని చూపించాడట.
నేను అదే బియ్యపు గింజ మీద
మహబుబ్ నగర్, కలహందీ ఆకలిచావులు
చూపించగలను.
..............................................
అన్నం మెతుకు లేత బుగ్గలమీద రక్తం చారికల్ని
గోధుమ గింజ గొంతులో గన్ పౌడర్ని
బీడీ ఆకు హరిత కణాల్లో
బిగిసిన విల్లంబుల్నీ చూపించగలను"[27]

అంటూ ఉటంకించారు. అసలు స్త్రీలే లేరనుకొన్న కవితారంగంలో చెప్పుకోదగ్గ సంఖ్యలో కవయిత్రులు ప్రపంచీకరణ నేపథ్యంలో పుట్టుకొచ్చారు.

స్త్రీ పురుషుల మధ్య వుండే సాన్నిహిత్యంలోని అంతరాన్ని 'బానిస' కవిత కరుణార్ద్రంగా మన ముందుంచుతుంది.

"నీవు నా పక్కనే వున్నా

నీకూ నాకూ మధ్య దూరం అందుకోలేనంత

నీ మనసు విప్పి ఏదీ చెప్పవు

అహం మరచిసే ఏదీ అడగను

...................................

నీ జీతమెంతో నాకు చెప్పవు

ఐనా

నా జీవితమంతా నీకే జీతం లేని బానిసనే"[28]

ఈ కవిత సూటిగా హృదయాన్ని తాకి ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది.

"విలువ లేని చోట

స్త్రీ బతుకు

నిలువునా పాతేసినట్టే"[29]

సమాజపరంగానూ, కుటుంబపరంగానూ స్త్రీలపై జరుగుతున్న అణచివేతను నిరశిస్తూ... ఆ అణచివేతను ఖండిస్తూ, అణచివేత నుంచి స్త్రీ పొందేందుకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విధానాలలో మార్పులను సూచించే విధంగా ఉండేదే 'స్త్రీవాదం'. అంతేగాని ప్రకృతి సహజంగా స్త్రీలకు గల మానసిక, శారీరక బాధల్ని వివరిస్తూ వాటిని చాలా మంది ప్రపంచీకరణలో భాగంగా కవితావస్తువులు చేసి వాటన్నిటికీ పురుషుడే కారణమంటూ ప్రపంచీకరణ కోణంలో పురుషజాతిపై ధ్వజమెత్తడం అనిపించుకుంటుంది తప్ప స్త్రీవాదం అనిపించుకోదు. కాబట్టి స్త్రీవాద సాహిత్యానికి ఇటువంటి కళంకం చేరకుండా కాపాడే బాధ్యత స్త్రీవాద ధోరణిలో రచనలు చేసే, చేస్తున్న సాహిత్యకారులందరిపైన ఉంది. వీరు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించినప్పుడే 'స్త్రీవాద ధోరణి'కి ఓ సార్థకత చేకూరే అవకాశముంది.

**6.4.మైనారిటీవాద దృక్పథం:** ఏవాదమైన అణచివేతల్లోంచి పుట్టుకొస్తుంది. తామనుభవించే కష్టాల్ని, దుఃఖాల్ని, ఎదుర్కొన్న అవమానాల్ని ఆ వ్యక్తులు చెప్పుకుంటేనే అందులోని గాఢత, తీవ్రత, నిజాయితీ అర్థమౌతుంది. ఎవరి సంస్కృతి గురించి వారు చెప్పినంత బలంగా, హృదయానికి హత్తుకొనేలా చెప్పటం వేరే సంస్కృతి వారికి కష్టసాధ్యమౌతుంది. ముస్లింలు తమ సమస్యల్ని, తమ

ప్రత్యేకమైన సంస్కృతిని, తరతరాలుగా అనుభవిస్తోన్న పరాయికరణని, వెలివేతని, దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న నిర్లక్ష్యాన్ని గొంతెత్తి చెప్పే ప్రయత్నంలోంచి పుట్టిందే ముస్లింవాదం.

లింగవివక్షకు వ్యతిరేకంగా స్త్రీవాదం అగ్రవర్ణాల అణచివేత, అమానవీయ ప్రవర్తనకు నిరసనగా దళితవాదం ఆవిర్భవిస్తే, ఒక మతానికి సంబంధించిన వ్యక్తులమీద సంధించబడుతున్న అనేకానేక విమర్శనాస్త్రాలకి, అనుమానపు చూపులకి, అపహేలనలకి సమాధానంగా ముందుకు వచ్చిందే ముస్లింవాదం.

ప్రపంచీకరణ నేపథ్యంలో ముస్లిం కవులు తాము ముస్లింలైన తమ రక్తంలో ప్రవహించేది భారతీయతే అని ప్రతి సందర్భంలోనూ చాటుకోవాల్సిన అగాయిత్యం ఏర్పడింది. దేశాద్రోహులనే బురదని కడుక్కోవడానికి కన్నీళ్ళనే కాదు తమ రక్తాన్నీ ధారపోయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో ముస్లిం రచయితలు తమ కష్టాల్ని, కన్నీళ్ళని, ఆవేదనని, ఆక్రోశాన్ని బలంగా చెప్పడానికి మైనారిటీకవిత్వం ఆవిర్భావం ఒక చారిత్రిక అవసరమైంది.

“ఎక్కడెవరు నూకలు చల్లినా, పావురాలు గుంపే బలవుతుంది. గుజరాత్ లో కాలుతున్న వేల శవాల ఒంటరి కఫన్ నేను'' అంటుంది షాజహానా.

ప్రపంచీకరణ నేపథ్యంలో ముస్లింలు సంఖ్యాపరంగానే కాక ఆర్థికంగా, సామజికంగా, రాజకీయంగా బలమైన వర్గం చేతిలో అమాయికమైన, బలహీనమైన పేద ముస్లింలు ఎలా బలౌతారో గుజరాత్ లో అల్లర్లు ప్రత్యక్షంగా చూసాక ముస్లిం హృదయాలు భగ్గుమన్నాయి. గుజరాత్ గాయంలోంచి వేనవేల కొత్త గొంతుకలు విచ్చుకున్నాయి.

తెలుగు సాహిత్యంలో ముస్లింలు, క్రిస్టియన్లు చాలా కాలంగా ఉన్నారు. వజీర్ రహ్మాన్ కవిత్వం అర్ధశతాబ్దం కిందటనే తెలుగువారికి పరిచయం. చిక్కనైన తన కవిత్వం గుబాళింపులను కవితా పాఠకులు మరచిపోలేరు ఈ కవిత్వంలో తను ఎక్కడా మైనారటీనన్న స్పృహ కనిపించదు. వజీర్ రహ్మాన్ సోదరుడు జగమెరుగనికవి.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ'లో వినిపించిన స్వరం తెలుగుసాహిత్య ప్రపంచాన్ని కుదిపేసింది. ఇది ఒక దీర్ఘకవితగా 1991-ఫిబ్రవరిలో అచ్చయింది. మనుషులుగా, ఈదేశ పౌరులుగా తమ అస్తిత్వానికి సంబంధించిన మైనారిటీల తొలి ప్రకటన. తమపై వివక్షకు కారణమేమిటని ప్రశ్నించింది. ఆత్మగౌరవంతో జీవించడానికి అనువైన అస్తిత్వం

తమకు ఉండాలన్న డిమాండును ముందు పెట్టింది. ఈ కవిత మైనారిటీలకు చెందిన కవుల్ని రచయితల్ని మేల్కొలిపింది. సాహిత్యంలో, సమాజంలో తమ ఉనికిని చాటుకోవాల్సిన అవసరాన్ని గుర్తింపజేసింది.

ప్రపంచీకరణ నేపథ్యంలో హిందూ-ముస్లింల మధ్య మాట చాందసవాదం విస్తరించింది. మైనారిటీ వ్యతిరేకభావాన్ని ప్రోదిచేసింది. బాబ్రీమసీదు విధ్వంసానికి దారితీసి, మైనార్టీల మనుగడను ప్రశ్నార్థకం చేసింది. స్థూలంగా చెప్పుకోవాలంటే ఖాదర్ 'పుట్టుమచ్చ'తో ఆరంభమైన మైనార్టీకవిత్వ ప్రయాణం 06 డిసెంబర్ 1992 తరువాత స్పష్టమైన నిర్దిష్టతను సంతరించుకుంది. మైనారిటీ చైతన్యంగా, వాదంగా రూపుదిద్దుకుంది.

ఆధునిక సాహిత్యంలో తొలి ముస్లిం కవులు తాము మైనారిటీలమన్న స్పృహను వ్యక్తం చేయలేదు. అయితే 1985 ల తరువాత మైనారిటీ వాదానికి ఇక్కడ పునాదులు పడ్డాయి. అనేక మంది కవులు మైనారిటీ మార్గాన్ని అనుసరించారు. ఈ నేపథ్యంలో తెలుగు కవిత్వంలో మైనారిటీవాదం బలమైన పాయగా రూపొందటానికి దారితీసింది.

విప్లవ సాహిత్యోద్యమంలో మైనారిటీల జీవిత చిత్రణ, వారి మనోభావాల వ్యక్తీకరణ కనిపించదు. ఈ ఉద్యమంలో ముస్లింలు ఉన్నప్పటికీ వారు మొత్తం సమాజపు విముక్తి గురించి మాత్రమే రాసారు గాని తాము మైనారిటీలుగా ఎదుర్కొంటున్న వివక్ష గురించి స్పందించలేదు.06 డిసెంబర్ ముస్లిం సమాజంలో పెనుకంపనల్ని సృష్టించింది. వారిని దేశద్రోహులుగా, పరాయివాళ్లగా చిత్రించే దోపిడి పెరిగింది. వాళ్ళ అస్తిత్వం, సంస్కృతీ సంప్రదాయాలు ప్రశ్నార్థకమయ్యాయి. తీవ్రమైన అభద్రతకీ అసహానానికి లోనవుతున్న తమ జాతి ఆందోళనను ముస్లిం కవులు వ్యక్తం చేసారు.

నా దేశంలో నేనొక కాందిశీకున్ని(ఖాదర్) అన్న ముస్లిం కవి వ్యక్తీకరణలో ఉనికికి సంబంధించిన ఆందోళనను స్పష్టంగా చూడొచ్చు.

"అప్పుడెపుడో దండెత్తివచ్చిన నా పూర్వీకుడిఖడ్గం
ఇప్పుడు నా పౌరసత్వం పక్కన నిలిచిందా?.....
నాదేహం మీద పర్షియన్ మట్టి రేణువులింకా ఉన్నాయా
ద్రవిడ హంతకుడా
నా రంగు చూడు

వింధ్య చిహ్నాలలో పుట్టిన అరవర్ణాన్ని"సికిందర్ అంటూ తమ గురించి చెప్పారు.

"ఈ దేశపటాన్ని చుట్ట చుట్టి నీ మీద పెట్టుకోవటానికి

అది నీ అయ్య జాగీరు కాదు

అంగట్లో దొరికే కుంకుమ కాదు దేశభక్తి

తెగిన దేశసరిహద్దు రేఖని

అతికిన వీరజవానుల్లో మేమూ ఉన్నాం"[30] అంటూ అస్తిత్వాన్ని గురించి మైనారిటీ కవి ప్రకటిస్తున్నాడు.

మైనారిటీ కవిత్వంలో భిన్నమైన కోణాలు ఎన్నో ఆవిష్కృతమయ్యే తొలుత ముస్లిం కవి ఆత్మన్యూనత భావంతో తన ఉనికిని గుర్తించమంటూ మొరపెట్టుకునే రీతిసే కవిత్వం రాశాడు.

"ఇక ఎలాంటి కుట్ర చెల్లుబాటుకాదు

ఏ నీతి నన్ను 'డెమోక్లీస్' చెయ్యదు

ఇప్పుడు నేను ఇయామ్ ను - రసూల్ ను"[31] అను కచ్చితమైన స్వరంతో ముస్లిం కవి ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాడు.

"రాయి పడితే చాలు

తల ముడుచుకునే తాబేలును కావలెను

ఈ పాకుడు బండలపై కూడా

అడుగు తప్ప కుండ సాముచెయ్యగలను" -(సయ్యద్ గఫర్)

ఈ చైతన్యమే మైనారిటీవాద కవిత్వానికి బలం చేకూరింది. ప్రపంచీకరణ నేపథ్యంలో తమ అలవాట్లు, తమ పెళ్ళిళ్ళు, తమ పిల్లల పెంపకం, తమ జీవన విధానం వెక్కిరింతలకు వెలివేతలకు గురికావడాన్ని మైనారిటీకవులు ఆగ్రహంతో ప్రశ్నిస్తున్నారు,

"ఈ మట్టి నీ ఒక్కరి దేహమేనని బుకాయిస్తూ

ఈ భూమిపై నా అస్థిత్వాన్నే

అనుమానిస్తున్నంత కాలం

అవ్ అవ్ కచ్చితంగానే కాందిశీకున్నే (గౌస్) అంటున్నారు.

ఎవరెన్ని కుట్రలు చేస్తున్న...

"విభజించి పాలించే నా శత్రువుల్లారా

నన్నెవ్వరూ రెండుగా చీల్చలేరు

నా కనుపాపల్ని ఎవరూ పేల్చలేరు" (అఫ్సర్)

అంటూ తమ దృక్పథాన్ని వ్యక్తం చేస్తున్నారు. మైనారిటీవాదంలోని నిర్దిష్టతకి ఇది దాఖలా.

మతపెద్దలు అనుసరించే అన్ని రకాల అవకాశవాదాల్ని నిరసించడమే కాదు సంస్కరణల్ని కూడా ఇవాల్టి మైనారిటీ కవులు కోరుతున్నారు. అంటే ఒకవైపున హిందుత్వశక్తులు ఆధిపత్యాన్ని వ్యతిరేకించడం, మరో వైపున తమ మతంలో సంస్కరణల్ని ఆశించడం, ఏకకాలంలో ఈ రెండు రకాల స్వరాల్ని వినిపిస్తున్న కవులు చాలామందే ఉన్నారు.

"వజూ నీళ్ళతో దేహాన్నే కాదు

నామత రీతుల్ని శుభ్రపరుస్తాను" (ఖదీర్)

మైనారిటీవాదులు ప్రపంచీకరణ నేపథ్యంలో మహిళల పరిస్థితి మెరుగుపడాలని ఆశిస్తున్నారు. స్త్రీవాద కవిత్వం ఇచ్చిన ఆలోచనల ప్రభావం మైనారిటీవాదం మీద ఉంది.

"నీ జీవితకాలపు చీకటి

దేహం సాక్షిగా

నాకు అర్థం కాని చూపులు

విసిరే ఆ రెండు కళ్ళమీదా

ఎవరో కప్పిన సేహరా సాక్షిగా

నువ్వెప్పుడైనా ఎదురుపడితే

నేను గుర్తుపట్టగలిగేది కేవలం

నీ రెండు కళ్ళను మాత్రమే"(ఖాజా)

అన్న స్వరంలోని విషాద తీవ్రత పాఠకున్ని విచలితున్ని చేస్తుంది.

"ఈక్షణమే

నా నిశ్శబ్దాన్ని మీకు బదలాయిస్తున్నా

బురఖా దుపట్టాల్ని

పీలికలుగా చేసి నీ మీదికి విసిరేస్తున్న

కలసి బొంత కట్టుకుని పోర్లుకో"(షాజహానా)అంటున్న కంఠంలోని నిరసనను గమనించవచ్చు. మైనారిటీవాద కవిత్వం ఓకొత్త స్వరాన్ని సంతరించుకంది.

ఆధునిక తెలుగు కవిత్వంలో వచ్చిన వివిధ దృక్పథాలతో ప్రపంచీకరణ నేపథ్యంలో ఒక ప్రత్యేక కోణంలో బయటపడిన ప్రక్రియ మైనారిటీవాదం. మైనారిటీ వాదం పదునెక్కింది 06-12-1992 పుట్టుమచ్చ కవిత ద్వారానే అలాగే బాబ్రీ మసీదు విధ్వంసం నేపథ్యంలో చాలా మంది ముస్లిం కవులు కవిత్వం రాశారు. ఇతరుల నుంచి కూడా మైనారటీల సంఘీభావ కవిత్వం చాలానే వచ్చింది.

బాబ్రీమసీదు విధ్వంసం తరువాత గుజరాత్ లో జరగిన మారణకాండ మైనారిటీ కవుల్ని పెద్దఎత్తున కదలించింది. గుజరాత్ సంఘటనల నేపథ్యంలో విస్తృతంగా కవిత్వం వచ్చింది. హనీఫ్ 'ముజౌటా, ఆలీ జఖమ్ కవితా సంకలనాలు వెలువడ్డాయి. మైనారిటీ వాదం బలపడ్డాక దేవిప్రియ మంచి కవిత్వం రాశారు.

అఫ్సర్ కవితా సంపుటి 'వలస'లో ముస్లింవాద కవిత్వం అధికం. ముస్లిం మహిళల్లో ఈ మైనారిటీవాద చైతన్యంలో కవిత్వం రాసేవారు. మహిళలకు మతం చేస్తున్న అన్యాయాన్ని ఖాజా, స్కైబాబా లాంటి కవులు పూరిస్తున్నారు. కవిత్వభాష, శిల్పం రీత్యా చూసినపుడు మైనారిటీ కవిత్వం తెలుగు కవిత్వాన్ని సంపద్వంతం చేసిందనడంలో సందేహం లేదు. సరికొత్త ఉపమానాలు, పలుకుబడులు, డిక్షన్ కవిత్వంలో చేరాయి. ఏ విధంగా చూసినా మైనారిటీవాదం సామాజిక జీవనంలో లౌకిక, ప్రజాస్వామిక విలువలు పొందుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసింది. కనుకే తెలుగు కవిత్వ స్రవంతిలో మైనారిటీవాదం విడదీయరాని భాగమైంది.

తాము పరదేశీయులు కాదనీ, తామూ ఈ దేశం వాళ్లమేనని తమ దేశభక్తిని నిరూపించుకోవడం ముస్లిం కవిత్వంలో ఎక్కువుగా కనిపిస్తోంది.

"నా రక్తం 'భరతమాత' నుదిటి
తిలకమవుతుంది, పూజా 'కమల'మవుతుంది." అనటంలోనూ
"క్రికెట్ మేచ్ నా దేశాభక్తికి
తునికా, కొలమానవుతుంది
నేను నా దేశాన్ని
ఎంతగా ప్రేమిస్తున్నాన్నది కాదు

ఏయే పరాయి దేశాల్ని
ఎంతెంతగా ద్వేశిస్తున్నానన్నదే
నా దేశభక్తికి ఎంతెంత ఆధారమవుతుంది"[32]

'పుట్టుమచ్చ'లో కవి ఖాదర్ మొహియుద్దీన్ తమ దేశభక్తి శంకిస్తున్న తీరుని నిరసిస్తున్నాడు.

"ఈ మట్టిని 'కన్నతల్లి' అని గొంతెత్తి పిలిచిన వాణ్ణి
నా జీవన పుష్పాన్ని ఈ మట్టి రేణువుల్ని పుప్పొడిగా
అద్దినవాణ్ణి"[33] అని తన దేశభక్తి ఎటువంటిదో చెప్తున్నాడు.

ఏది ఏమైనప్పటికి ముస్లింవాద కవులు తమ గళాన్ని చాలా గట్టిగా వినిపించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ముస్లిం సోదరుల జీవితాలు ఏ విధంగా చిన్నాభిన్నమవుతున్నాయో వాళ్ల సంస్కృతి ఎలా నాశనం అవుతుందో చాలా చక్కగా వ్యక్తం చేశారు.

**6.5.ప్రాంతీయ అస్తిత్వవాదం:** తెలుగు సాహిత్యంలో కులం, మతం, జెండర్ మాత్రమే కాదు ప్రాంతం కూడా ప్రబలమైన పాత్ర నిర్వహిస్తుంది. దాదాపు మూడు దశాబ్దాల కిందట 'కళింగాంధ్ర కథలు' అనే సంకలనాన్ని చాసో తీసుకువచ్చారు. తొలిసారిగా ఒక ప్రాంత జీవితాన్ని సాహిత్యాన్ని ప్రతిఫలించే సాహిత్యం కథరూపంలో వచ్చింది. ప్రాంతీయ స్పృహలో తమను అణచివేస్తున్న ఆధిపత్యవర్గాలపై ఆగ్రహం ఉంటుంది. పాలకులు వలసవాదులు చూపిస్తున్న వివక్షపై నిరసన ఉంటుంది. తమ ప్రాంత సంస్కృతి సంప్రదాయాలపై ఆత్మగౌరవంతో కూడిన ప్రకటన కూడా ప్రాంతీయ స్పృహలో విడదీయరాని భాగం. కాని అణిచివేతకు గురవుతున్న ప్రాంతానికి చెందినవారు ఉనికికోసం చేసే పెనుగులాటను వ్యక్తీకరించే సాహిత్యం భిన్న రూపాల్లో ఉంటుంది.

ఇతర వాదాల మాదిరిగానే తొలుత కవిత్వంలోనే ప్రాంతీయ అస్థిత్వవాదం రూపుదిద్దుకుంది. ఆంధ్రదేశంలో తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలున్నాయి. కోస్తాంధ్ర తప్ప మిగతా మూడు ప్రాంతాలు నిర్లక్ష్యానికీ, వివక్షతకు లోనయ్యాయి. అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలుగా మిగిలిపోయాయి. వీటిలో తెలంగాణా ప్రాంతం నీటిపారుదల తక్కువ కావటం మూలాన కొంత అన్యాయానికి గురయింది. కనుకనే ప్రాంతీయ అస్థిత్వవాద కవిత్వమంటే తెలంగాణ కవిత్వమనే భావన ఏర్పడింది. నిజానికి ఉత్తరాంధ్ర కూడా నేటికి వెనుకబడిన ప్రాంతమే అయినప్పటికీ కథల్లో ప్రాంతీయతత్వం వచ్చినంతగా కవిత్వంలో రాలేదు. రాయలసీమ సైతం వివక్షతకు గురైన ప్రాంతమే.

రాయలసీమ ప్రాంతజీవితం కథలరూపంలోనే బయటికి వచ్చింది. ఇటు ఉత్తరాంధ్రలోను, అటు రాయలసీమ ప్రాంతంలోనూ ప్రాంతీయ చైతన్యం తీసుకురావాలంటే అది కవిత్వం ద్వారా మాత్రమే సాధ్యం. ప్రాంతీయ అస్తిత్వవాదకవిత్వం రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఆర్థికంగా, సాంస్కృతికంగా ఇతరులు ఆధిపత్యాలలో ఉన్న ప్రాంతాలు స్వయం ప్రతిపత్తి కోసం డిమాండ్ చేయడం, తమ ప్రాంతంపై అధికారం తమకే ఉండాలని ఆశించడం సహజం. ఇందుకోసం జరిపే ఆందోళనల్ని ప్రాంతీయ ఉద్యమాలుగా పేర్కోవాలి.

### 6.4.1. ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వంలో ఉండే ప్రధానాంశాలు

1. తమ ప్రాంతజీవితం నిసర్గ సౌదర్యంతో వ్యక్తం కావడం
2. భాషలో జీవద్భాష, అంటే గ్రామీణ ప్రాంతాల మాండలికంలో కవిత్వం రాయడం.
3. భౌగోళికత ప్రతి ఫలించడం.
4. సంస్కృతీ సాంప్రదాయాల వ్యక్తీకరణ.

ఈ అంశాలు ప్రాంతీయ కవిత్వానికి సొగసును ఇచ్చాయి. ఈ కవిత్వ ఇతివృత్తం నిఖార్సయిన తెలంగాణా జీవితం. అప్పటివరకు ఉపేక్షించిన అనేకానేక విషయాల్ని కవిత్వంగా మలచడంలో ఈ ప్రాంత కవులు సఫలమయ్యారు.

తెలంగాణా పల్లె ఎలా ఉందో అన్నవరం దేవేందర్ మాటల్లో చూస్తే కనుకోణల నుంచి రాలుతున్న సముద్రం.......

“తెలంగాణ పల్లె
ఇది కన్నీల్లకోనేరు
ఒక వైపు ఉడుకుతున్న నెత్తుటి సంగీతం
మరోవైపు రివ్వుమంటున్న బుల్లెట్లవాన
ఊగుతున్న ఉరితాళ్ళ చప్పుడు
బక్క చిక్కిన బతుకుల్లో ఆత్మహత్యల సన్నివేశాలు”

తెలంగాణ పల్లెల్లో ఒకవైపు నిర్బంధం, ఎన్కౌంటర్లు, మరోవైపు ఆకలి చావులు. చెరువులు ఎండిపోయాయి. గుక్కెడు నీళ్ళకోసం మైళ్లకు మైళ్ళు వెళ్ళిన తప్పని స్థితి. వర్షాలు లేక భూములు

బీడుపడ్డాయి. తమ పక్కనుంచే కృష్ణా, గోదావరి నదులు పోతున్న తమ పంటపొలాలు ఎడారులుగా మారేదుస్థితి. ఇలాంటి స్థితినే

"దగాబడ్డ నేల

కమ్ముకుంటున్న

కరువు ఎక్కిళ్లమధ్య

కొన ఊపిర్లు నరుక్కుంటుంది" (కందుకూరి దుర్గాప్రసాద్) అంటూ ఈ ప్రాంత వాస్తవికతను చెబుతున్నాడో కవి. గ్రామాల్లో వ్యవసాయం మాత్రమే కాక కులవృత్తులు కూడా దెబ్బతిన్నాయి. చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గ్రామం స్వరూపం మారిపోయింది. గ్రామం పరాధీనగా మారింది. ఇవాళ బతకగలమన్న భరోసా లేనప్పుడు వలసపోతున్నారు. ప్రపంచీకరణ తీసుకొచ్చిన కొత్తరకపు పద్ధతులకి నేడు సామాన్య ప్రజలు వలస దారి పట్టడం తప్పడం లేదు. ముఖ్యంగా ఆంధ్రా ప్రాంతంలో చాలా జిల్లాల ప్రజలు బతుకు తెరువు కోసం భిన్న ప్రాంతాలకి తరలిపోతున్నారు.

**6.4.2.ప్రపంచీకరణ ప్రభావం:** తొంభైల ఆరంభంలోనే సరళీకృత ఆర్థిక విధానాలు అమలు ఆరంభమయ్యింది. గ్లోబలైజేషన్ క్రమం దీన్ని తీవ్రతరం చేసింది. ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలోకి నెట్టబడ్డారు. కుమ్మరి వాళ్లు, స్వర్ణకారులు, వడ్రంగి పనులు చేసేవారు ఇంకా ఇతరులు అనేకమంది ఉపాధిని కోల్పోయారు. చేనేతే కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలు కూడా ఉన్నాయి. ప్రపంచీకరణ తెచ్చిపెట్టిన ముప్పు పట్టణాల్లో బతుకుతున్న వారి జీవితాల్లోనూ చిచ్చు రగిల్చింది. సరికొత్త జీవిత నమూనాలు ప్రాంతీయ వాదానికి అంతుపట్టని వలయాలుగా మారాయి. అభివృద్ధికి సంబంధించిన నమూనాలు తమ ప్రాంతీయ అవసరాల్లోంచి రూపుదిద్దుకోవాలన్న ఆకాంక్ష బయలుదేరింది. వీటికి కవిత్వరూపం ఇవ్వడం ప్రాంతీయ అస్థిత్వావాదం కవిత్వంలో కీలకమైన అంశం. గ్లోబలైజేషన్ వల్ల వాటిల్లో ముప్పును ఎదుర్కోవడం అవసరమన్న అవగాహన ఏర్పడింది. ఈ అవగాహన లోంచే అనేక మంది ప్రాంతీయ వాద కవుల పాటలు వచ్చాయి. తన నీటి మీద, తన ఊరు ఇతరుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించడం ప్రాంతీయవాద కవిత్వంలో ప్రబలమైన అంశం. ఈ విషయాన్నే బెల్లి, యాదయ్య ఇలా చెబుతున్నాడు.

"ఇప్పుడు

నాకు నా నేల కావాలి

నాకు నా గాలి కావాలి

నాకు నా నీరు కావాలి

నాకు నా ఊరు కావాలి"

ఇలాంటి విస్పష్టమైన ప్రకటనలు నేటి ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వంలో కనిపిస్తాయి. తను చెప్పదలుచుకున్న విషయాన్ని శషభిషలు లేకుండా చెప్పడం ఈ కవిత్వనైజం. దాగుడు మూతలకు తావుండని కవిత్వమిది. అస్పష్టమైన పదాడంబరాల చాటున దాక్కోవడం ఎరుగని కవిత్వమిది. తాము ఏమిటో, తమ ఆవేదనలేమిటో నీళ్ళు నమలకుండా చెప్పే పద్ధతిని ప్రాంతీయ స్పృహతో కూడిన కవిత్వంలో ఆవిష్కృతమవుతుంది. ముఖ్యంగా గత అయిదారేళ్ళగా ఈ తరం కవులు రాస్తున్న అంశాల్లో ఈ ధోరణి ఉంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో మన మూలాలను రక్షించుకోవాలన్న స్పృహ అధికమవుతూ ఉంది. అది భాష విషయంలో కూడా వ్యక్తమవుతూ ఉంది. సామ్రాజ్యవాదం చేసే హడావుడిలో సంస్కృతి నాశనం కూడా ఒక భాగం. అందుకే 'సంస్కృతి' మూలంగా ఉండే అంశాలలో ఒకటైన భాషను గూర్చి కూడా కవులు మాట్లాడవలసిన పరిస్థితి ఏర్పడింది. యాస కాదు భాషల అస్తిత్వమే మృగ్యమవుతూ ఉండడాన్ని ఈ కవులు ప్రశ్నిస్తారు. తమ గొప్పదనాన్ని చాటుతారు.

"అదొక అద్భుత త్రిలింగదేశం

ఒకే భాష మూడు యాసలు

ఒకే ప్రజా మూడు ప్రవృత్తులు

ఒకే గుండె మూడు చప్పుళ్ళు"[34]

అని లంకా శివప్రసాద్ అంటారు. ఇది ప్రాంతీయతను గుర్తిస్తూనే ఐక్యతను సూచించేగుణం. ఈ లక్ష్యం ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన కవిత్వానికుంది.

తెలుగు కవిత్వంలో స్థూలంగా చూసినప్పుడు ప్రపంచీకరణ నేపథ్యాన ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వానికి ప్రాధాన్యం పెరిగింది తమ స్థానిక సంస్కృతుల పరిరక్షణ గ్లోబలైజేషన్ వ్యతిరేక పోరాటంలో ప్రధాన భాగమైంది. అందులో భాగంగానే భాషకు సంబంధించిన శృంఖలాన్ని కూడా కవులు తెంచుకున్నారు.

ఒక విధమైన తెగింపు, నిర్దిష్టత, ఆత్మవిశ్వాసం ప్రాంతీయ స్పృహతో కూడిన ధోరణులు కవిత్వంలో తొణికి సలాడుతాయి. ఇది ప్రాంతీయ అస్థిత్వాన్ని జవసత్వాల్ని ఇస్తుందనేది నిస్సందేశం. ఈ కారణంగా తెలంగాణ నుంచి వస్తున్నా ప్రాంతీయ అస్థిత్వవాదం కవిత్వానికి నిండుదనం చేకూరింది.

## 6.5.ఆధునికానంతర వాద కవిత్వ దృక్పథం :

**"భిన్నత్వంలో ఏకత్వం లేదు; ఉన్నదంతా భిన్నత్వమే"**

పోస్ట్ మోడర్నిజం(postmodernism) అనే ఆంగ్లపదాన్ని తెలుగులో రచయితలు ఆధునికోత్తర వాదము, ఉత్తర ఆధునికవాదము, ఆధునికానంతర వాదము అని వేర్వేరు పేర్లతో వ్యవహరిస్తున్నారు. చాలమంది తెలుగులో కూడా 'పోస్ట్ మోడర్నిజం' అనే అంటున్నారు. పాశ్చాత్య దేశాలలో 1965 నుండి సాహిత్య, కళారంగాలలో బహుళవ్యాప్తిలోకి వచ్చిన పోస్ట్ మోడర్నిజం శతాబ్దాంతానికి సమసిపాయింది. తెలుగు సాహిత్యంపైన ఆధునికానంతరవాద ప్రభావాన్ని గూర్చిన పరిశీలన, చర్చ 20వ శతాబ్దపు చివరలో ప్రారంభమైంది.

**6.5.1.ఆధునికం;ఆధునికత:** "మనిషి నాగరికంగా ఉండటానికి అన్నికాలాల్లోనూ ఉబలాటపడ్డాడు,పడతాడు. అలా ఉండటం ఒక గొప్ప అనుకుంటాడు". జుట్టుముడి పిలకవదిలేసి క్రాఫింగ్ చేయించుకోవటం; ధోవతి, ఉత్తరీయాలు మానేసి ప్యాంటు, షర్ట్ వేసుకోవటం; చద్దన్నం బదులుగా కాఫీ తాగటం ఆధునిక లక్షణాలే. సాహిత్యంలో వచ్చే మార్పులు కూడా ఆధునికతను సూచిస్తాయి. "ఆంగ్ల నాటకాల అనువాదం/ప్రదర్శన ఆ రోజుల్లో పౌరాణిక నాటకాలంటే మనకి ఆధునికం, కన్యాశుల్కం మరీ ఆధునికం. భావకవిత్వం ఆధునికం, శ్రీశ్రీ కవిత్వం దానికంటే ఆధునికం. దిగంబర కవిత్వం మరీ ఆధునికం. పైవన్నీ ఆధునికం పేరుమీదే వచ్చాయి. కాని వాటి తత్వాలు లక్ష్యాల్లో భేదముంది. వాటి కాలాల్లో అంతరం వుంది".

"ఆధునికత దైనందిన జీవితాల్లోని ఒక ఆచరణ అనుసరణ విధానం. అది అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ నూతనం, నిరవధికం. ఆధునికతావాదం(modernism) అలాంటిది కాదు. అదొకవాదం- దృక్పథానికీ మేధకీ సంబంధించినది"

"ఆధునికత అనేది మానవుడు విజ్ఞానరంగంలో సాధిస్తున్న అనూహ్యమైన విజయాలతో ముడిపడి వున్నది." "సమకాలికులంతా ఆధునికులు కారు" అంటాడు టి.ఎస్.ఇలియట్. ఈ కాలంలో జీవిస్తూ కూడా విజ్ఞాన విషయాలను పట్టించుకోకుండా నరబలులను. సహగమనాలను సమర్థించే

వారున్నారు. అస్పృశ్యత తప్పేమీకాదని వాదించేవారున్నారు. స్త్రీ స్వాతంత్ర్యం అక్కరలేదనే వారున్నారు. భారతదేశం పూర్తిగా ఆధునికం కావటానికి ఇంకా చాలా  కాలం పడుతుందని సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

బ్రిటన్ లో రాజరికపు పునఃస్థాపన జరిగిన క్రీ.శ. 1660 నుండి 1789 దాకా అంటే ఫ్రెంచి విప్లవ కాలం వరకు ఉన్న కాలాన్ని బ్రిటీష్ చరిత్రకారులు 'వికాసయుగం(Classical Age) అంటారు. దీన్ని Age of enlightenment గా కూడా గుర్తిస్తారు. ఈ యుగంలో న్యూటన్, కేవండిష్, ప్రీస్టీ జేమ్స్ వాట్సన్ కనుగొన్న శాస్త్ర సత్యాలు మానవ విజ్ఞాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నాయి.

ఫ్రెంచి విప్లవ కాలం నుండి అంటే 1789 నుండి 1890 దాకా వున్న కాలాన్ని 'కాల్పనికయుగం'(romantic age) అని చరిత్రకారులు పేర్కొంటారు.1890 నుండి 1965 వరకు వున్నకాలాన్ని ఆధునిక యుగంగా చరిత్రకారులు తలుస్తారు. 1965 తర్వాత కాలాన్ని 'పోస్ట్ మోడర్నిజం' (ఆధునికానంతరవాద కాలం)గా గుర్తిస్తారు.

### 6.5.2.ఆధునికతావాదం; గతితార్కిక భౌతికవాదం:

మార్క్స్ ఎంగేల్స్ లు ప్రవచించిన గతితార్కిక భౌతికవాదం అంతకు ముందు వచ్చిన తత్త్వశాస్త్ర సిద్ధాంతాలకు భిన్నంగా ప్రపంచ స్వరూపాన్ని మార్చాలనుకున్నది. ఆధునిక పేరిట చలామణిలో ఉన్నదంతా ఆమోదయోగ్యం కాదని గతితార్కిక భౌతికవాదులు అభ్యంతరం తెలిపారు. ఇరవైయవ శతాబ్దంలో ప్రయోగావాదులు సాహిత్య కళారంగాలలో తీసుకువచ్చిన surrealism (అధివాస్తవికత) abstract art (నైరూప్య కళ) లను మార్క్సిస్టులు గర్హించారు-"ఆధునికతావాదాన్ని క్షీణవాదామని, తిరోగమనవాదమని మార్క్సిస్టులు విమర్శించారు.....

పెట్టుబడిదారీ విధాన తాత్త్విక కళాసాహిత్య, సామాజిక, సాంఘికరూపంలో ఆధునికతావాదాన్ని అతితీవ్రంగా తిరస్కరించింది". గతితార్కికవాదం వ్యక్తి స్వేచ్ఛను అడ్డుకుంటుందనీ, అందువల్ల సాహిత్య కళారంగాలు 'కొత్తదనం' లేక వెల వెలబోతాయని ఆధునికతావాదులు గతితార్కిక గ్రంథాలు, కళాఖండాలు అన్న ఒక మూసలోంచి తీసినట్లుంటాయని, జీవరహితంగా ఉంటాయని ఆధునికతావాదులు గతితార్కిక భౌతికవాదానికి తమ నిరసన తెలిపారు.

1960 నాటికి మార్క్సిజాన్ని నమ్మిన సోవియాట్ రష్యా, చైనాలు, బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలలాగా ప్రపంచపు అగ్రరాజ్యాలైనాయి. శాస్త్రసాంకేతిక రంగాలలో చాల అభివృద్ధిని

సాధించాయి. "సమృద్ధ పాశ్చాత్యదేశాల సామాజిక, సాంఘిక, సాంస్కృతికరంగాలు అరవైల నాటికల్లా సంక్షోభానికి గురయ్యాయి. అస్థిరత, అనిశ్చిత, విచ్ఛిన్నత, నిస్సంగత, నిస్సహాయత, వైయుక్తికత, విశృంఖలత యౌవనకాంక్షల్ని అక్కడి సకల సంపదలూ తప్పించలేకపోయాయి. కనక ఆ పాశ్చాత్య దేశాల్లోని అప్పటి ఆధునికతావాదాన్ని ఎదిరిస్తూ వచ్చారు. అక్కడి పోస్టుమోడర్నిస్టులు అని గూడశ్రీరాములు పోస్టుమోడర్నిజం ఆవిర్భవించిన సంగతి సందర్భాలను వివరించారు.

**6.5.3.ఆధునికానంతరవాదం:** ఆధునికానంతర వాదాన్ని స్పష్టంగా నిర్వచించటం కష్టం. కొన్ని లక్షణాలను బట్టి దాన్ని ఆధునికానంతరవాదంగా అర్థం చేసుకోవచ్చు. 'మిసిమి' మాసపత్రిక పోస్టుమోడర్నిజంపై ప్రత్యేక సంచికను ప్రచురించింది (నవంబర్, డిసెంబర్ - 2000). నవీన్ (అంపశయ్య) వ్యాసం "పోస్టుమోడర్నిజం- ఒక పరిచయం"లో తెల్పిన విధంగా దాని లక్షణాలను ఈ క్రింది విధంగా క్రోడికరించవచ్చు.

ప్రచారంలో ఉన్న ఏ సిద్ధాంతాన్నీ అంగీకరించకపోవటం. అన్ని సిద్ధాంతాల్ని ఎద్దేవా చేయటం. భావాల్ని వ్యక్తం చేయటానికి భాషకు పరిమితులున్నాయని భావించటం. పైకి కన్పించే భావంలో కన్పించని గూడార్థం దాగివున్నదని తలచటం.

1.భిన్నత్వంలో ఏకత్వాన్ని అంగీకరించకపోవటం. ఉన్నదంతా భిన్నత్వమేనని తలచటం.

2.ఏ భూమిక లేకపోవటమే వీరి తాత్విక భూమిక.

3.ఏ నిర్మాణములేని రచనల్ని లేదా ఏ నిర్మాణానికి కట్టుబడని రచనలు చేయటం.

4.రూపం లేదా నిర్మాణాన్ని ధ్వంసం చెయ్యాలనటం.

5.ప్రతీదీ యాదృచ్ఛికంగా జరిగేటట్లు తోపింపజేయటం.

6.రచనలో తటస్థతను పాటించకపోవటం. రచయిత అడుగడుగునా జోక్యం చేసుకోవటం.

7.దేన్నీ ఇదామిత్థంగా తేల్చకపోవటం. ప్రతీదాన్నీ సందేహాత్మకంగా వదిలెయ్యటం.

8.రచనలపట్ల అపనమ్మకాన్ని వొదులుకోవద్దనటం.

9.ప్రతీది ఒక జోక్ అన్నట్టుగా చెప్పటం.

10.విమర్శకుల సహాయం లేకుండా ఏ తరహా సాహిత్యం అర్థం కాకపోవటం.

11.కొన్ని సాంప్రదాయికమైన, సామాజిక విలువల్ని భ్రష్టు పట్టించటం.

12.నమ్మశక్యంగాని ఊహలు దృశ్యాలు రచనల్లో ఉండటం.

13.“మాజిక్ రియలిజం” ఇందులో భాగంగా ఉండటం.

14.దేశదిమ్మరులు, తాగుబోతులు, సంఘ బహిష్కృతులు, సెక్స్ వర్కర్స్ మొదలైన సమాజం చీదరించుకునే వాళ్లు ప్రధాన పాత్రలుగా ఉండటం.[35]

“ఉత్తర ఆధునికతావాద సాహిత్యం పూర్తిగా రచయిత వ్యక్తిగతమైన ఊహలమీద, కళల మీద, మనస్తత్వం మీద ఆధారపడి సృజింపబడుతుంది. ఈ ఊహలు చాల పిచ్చిగా భయంకరంగా, జుగుప్సను కలిగించేవిగా ఉండొచ్చు. పాఠకుల్ని చాల రెచ్చగొట్టేలా, ఎద్దేవ చేసేవిగ ఉండవచ్చు. పదిమందికీ తెలిసిన ఒక చారిత్రిక వాస్తవాన్ని కూడా ఈ రచయితలు వక్రీకరిస్తారు.[35]

ఏ సిద్ధాంతమైనా కొంత కాలం వరకే కొన్ని సమాజాలకే వర్తిస్తుందని, అన్ని కాలాలకూ అన్ని సమాజాలకూ పనికి వచ్చే సిద్ధాంతమేది ఉండదని ఆధునికనంతరవాదులు భావిస్తారు. మార్క్సిజం వీరి దృష్టిలో కాలం చెల్లిన సిద్ధాంతం.

“ఆధునికానంతరవాదం ప్రతి సిద్ధాంతపు అస్థిరత, అనిశ్చితిత, తాత్కాలికతని నమ్ముతుంది. ఆధునికానంతరత విముక్తి గురించి స్వయం నిర్వచనం, స్వయం నిర్ణయాధికారం, గుర్తింపు, విభిన్నత మొదలయిన వాటిని ముందుకు తెస్తుంది” అంటారు. - బి.తిరుపతిరావు

వామపక్ష ఉద్యమాల అభివృద్ధి క్షీణతలను సరిగా గమనించకుండా కమ్యూనిజానికి కాలం చెల్లినట్లేనని భావించటం సరైన ఆలోచనావిధానం కాదు. అలాగే అభ్యుదయ, విప్లవ కవిత్వాలు మొదలగునవి వచ్చినప్పుడల్లా వాటి పని అయిపోయిందని, కొత్తగా వచ్చిన, వస్తున్న ఆధునికానంతరవాద కవిత్వానికి ఉజ్వల భవిష్యత్తున్నదని భావించటం ఒక వింత ఆలోచనా ధోరణి మాత్రమే. సరికొత్తగా వచ్చిన ‘ట్రెండ్’ తమకు తెలియకపోతే ఎక్కడ వెనుకబడతామో అని కొందరు సాహిత్యవేత్తలు ఆధునికానంతరవాద కవిత్వంపై అమితాసక్తిని కనబరుస్తున్నారు.

### 6.5.4.ఆధునికానంతరవాదం;తెలుగు కవిత్వం :

ఆధునిక కవులలో పేగుంట మోహన ప్రసాద్, సీతారాం, సిద్ధార్థ మొదలైన కొద్దిమంది కవులపైన మాత్రమే ఆధునికానంతరవాద ప్రభావం కన్పిస్తుంది.

**మోహన ప్రసాద్ కవిత్వంలో వినిర్మాణపు జాడ:** “వినిర్మాణమంటే విధ్వంసం కాదు. విధ్వంస సంలీన పునర్ నిర్మాణం. వినిర్మాణక కేంద్రక రచన కొలాజ్ వంటిది. చించిపోగులుపెట్టటం కాదుగానీ

ఆ చించిన ముక్కల్నే మళ్లీ కళాత్మకంగా అంటించటంలాంటిది. అతర్కాన్నీ అక్రమబద్ధాన్నీ మరో రూపంలో తర్కబద్ధమూ క్రమబద్దము చేయటం" అని మోహనప్రసాద్ భావిస్తారు.

'అర్ధసత్య' అనే కవితలో వినిర్మాణం ఎట్లా ఏర్పడింది ఆయన విశ్లేషించి చూపారు. ("నా కవిత్వంలో వినిర్మాణపు జాడ" - మిసిమి - ప్రత్యేక సంచిక - నవంబర్, డిసెంబర్-1999) ఈ విశ్లేషణ తర్వాత 'అర్ధసత్య' చదివితే కొంత అర్థమవుతుంది గాని - వినిర్మాణవాదులు పదాలకు స్వయం భూతమైన శాశ్వతమైన అర్థాలేమీ ఉండవంటారు. అప్పుడు కవిత చదివిన పాఠకులు చదివినప్పుడు తమకే అనుభూతి కలిగిందో దానితోనే సరిపెట్టుకోవాలి.

"వినిర్మాణవాద విమర్శకుడు హెరాల్డ్ బ్లూమ్ చెప్పిన "a poem's meaning is a poem's complaint. A poem's meaning is the moaning" మో దీనిని ఫిర్యాదు అంటాడు సామాజిక బీభత్సం మొత్తాన్ని అంగీకరించుకొని, దానికి వ్యతిరేకంగా మళ్లీ కవిచేసిన ఫిర్యాదులే 'మో' కవిత. ఇది కవి వైయక్తిక బాధకాదు. సామాజిక బాధాసందర్భాల్ని వైయక్తీకరించుకుంటున్న కరం. ఇందులో ఎవరిసైనాను వాళ్లు వెతుక్కొని గుర్తుంచుకోవాల్సిందే తప్ప ఆ మొత్తం కవి సొంత గొడవగా భావించకూడదు" అని - బి.తిరుపతి రావు 'మో' కవిత్వాన్ని అర్థం చేసుకోవలసిన తీరును తెలిపారు.

'మో' కావ్యాలు 'చీతిచింత'; 'రహస్తంత్రి'; 'సాంధ్యభాష స్వీయ చరిత్రాత్మకం'; 'బతికిన క్షణాలు'- ఆధునికానంతరావాద కవిత్వానికి ఉదాహరణ ప్రాయమైనది.

అర్థాన్ని అనర్థంగా భావించిన ఇటువంటి కవిత్వం బుద్ధి జీవుల పరిధిలోనే ఉండిపోతుంది; సహృదయులందరికి చేరదు.

**"నవ్వే దుఃఖం"; సీతారాం :** సీతారాం కవిత్వంలో కన్పించేది "తీయ తేనీయ తాలూకు కవిత్వం" కాదు. "మృత్యువు, నిరాశ, కన్నీళ్లు" కావాలంటే సీతారం కవిత్వం చదవాలి. "ఇదిగో...ఇక్కడి దాకే" "s/o మాణిక్యం" ఈయన కావ్యసంపుటాలు.

సీతారాం "కొండకింద ఇల్లు; నేనూ నువ్వూ; శవమా" కవితల్లో మోహనప్రసాద్ కవితల ప్రభావం కన్పిస్తుంది. "కాంక్రీట్ భావాలను ఏబ్ స్ట్రాక్ట్ గా సాదృశ్యం చేయటం ఇతని వ్యసనం" కవిత్వంలో ఇతనుకొన్ని చోట్ల వినిర్మాణవాదిలాగా తన అర్థాన్ని చెపుతాడు/చెప్పడు. నిర్ధారిస్తాడు/నిర్ధారించడు. అలాగే తన అర్థం నిరర్థమై మళ్లీ కొత్త కవిత్వాన్ని సృష్టించే ఆవేదన సీతారాంలో ఉంది", "అబ్సర్డిటీ , సర్రియలిజం, ఫైలాలజీ కలగలసిన కాక్టెయిల్ నిషా సీతారాం కవిత్వం"

ఇటువంటి కవిత్వాన్ని చదివి ఆనందించగల పాఠకలోకం తెలుగులో ఇప్పుడు తక్కువగా ఉన్నది. ముున్ముందు వీరి సంఖ్య పెరుగుతుందని కూడా చెప్పలేం.

"ఎవరికైనా నా అరుపు వినిపిస్తే ఎవరో నన్ను పిలిచారని వాళ్ళయినా వెతుక్కుంటే నేను వెళ్లిపోయానని తెలుసుకొని వాళ్ళని విడిచిన వాసనని పీల్చుకొని రోదించకపోతారా నేను నువ్వే దుఃఖంగా వాళ్ళ మనస్సుల్లో నిలవకపోతాన" అని తలచే కవి అల్ప సంతోషి. అటువంటి అల్ప సంఖ్యాక సీతారాంలాంటి కవులకు ఎప్పుడూ ఉంటుంది.

**అగంతకుని ఆత్మకథ; సిద్ధార్థ :** "సిద్ధార్థ కవిత్వంలో పెనోర్మిక్ దృశ్య చిత్రాలు విరివిగా కన్పిస్తాయి. వాక్యనిర్మాణం అన్ ట్రెడీషనల్ గా వుండి భాషాపరమైన వినూత్న పదబంధాలతో తారసపడుతుంది" "దీపశీల" ఈయన కావ్యసంపుటి.

సిద్ధార్థ కవిత్వం అస్పష్టంగా ఉండదు, స్పష్టాస్పష్టంగా ఉంటుంది. చాలా కవితలు ప్రయత్నిస్తే అర్థం చేసుకోవటానికి వీలుగా ఉంటాయి. అర్థం విషయంలో సిద్ధార్థ ఆధునికానంతర వాదులకి కాస్త దూరమే. ఏ సిద్ధాంతాన్ని అంగీకరించకపోవటం వంటి కొన్ని అంశాల్లోనే ఈయనకు ఆధునికానంతరవాద కవులతో పోల్చగలం.

**6.5.5.ఆధునికనంతర వాద ప్రభావం:** ఆధునికానంతరవాదం అధివాస్తవికత(surrealism) లాగే తెలుగు కవిత్వంపై కొంత కాలం మాత్రమే తన ప్రభావాన్ని చూపగలదు. మరొక కొత్త 'ట్రెండ్' రాగానే ఇది పాతబడిపోతుంది. దీని ప్రభావం. ఆధునిక సాహిత్యంలో భాగంగా 1970 నుంచి తెలుగు సాహిత్యాన్ని ఒక కుదుపు కుదిపి ప్రభావితం చేస్తున్న సాహిత్యోద్యమం "విప్లవ సాహిత్యం" సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికారాన్ని కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో రైతాంగ పోరాటాల ద్వారా విముక్తిని సాధించాలన్న ధ్యేయంతో కొనసాగుతున్న విమోచనోద్యమాలకు అద్దంపడుతున్న సాహిత్యాన్ని విప్లవసాహిత్యం అంటున్నాము. విప్లవదృథం ప్రపంచీకరణ (లేదా) సామ్రాజ్యవాదంపై విపరీతప్రభావం చూపింది.

తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణ ప్రభావం మహిళాలోకాన్ని స్త్రీ చైతన్యం కోసం స్త్రీలే కాక పురుషులు సహితం జేజేలు పలికారు. గత దశాబ్దకాలంగా తెలుగు సాహిత్యంలో ప్రకంపనలు సృష్టిస్తున్న సాహిత్య ధోరణి స్త్రీవాదసాహిత్యం.

చరిత్రను, సంస్కృతిని, సాహిత్యాన్ని స్త్రీల దృక్కోణం నుంచి విశ్లేషిస్తున్న స్త్రీవాద సాహిత్య సమాజంలోని వివక్షతలను ప్రశ్నిస్తుంది. స్త్రీల అణచివేతను పీడనను ప్రతిఘటిస్తుంది. ప్రపంచీకరణ నేపధ్యంలో స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం ప్రాతిపదికగా గల మానవ సంబంధాలను, అణచివేతలకు తావులేని నూతన విలువలనూ ఆకాంక్షిస్తున్నది. గణనీయమైన కృషి జరుగుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో గత రెండు దశాబ్ధాలుగా యావత్భారతదేశాన్ని, భారతీయ సాహిత్యాన్ని, అందులో భాగంగానే తెలుగు సాహిత్యాన్నే ఒక కుదుపు కుదుపుతున్న సాహిత్యధోరణి దళిత సాహిత్యం సమాజాన్నీ, చరిత్రనూ, సంస్కృతిని, సాహిత్యాన్నే దళితుల దృష్టిపధం నుంచి పరిశీలించే లోచూపును కలిగించిన కొత్త ధోరణి దళితసాహిత్యం. ఇక వోతే తొలిదశలో మైనారిటీ కవులు దళితులతో సంఘీభావాన్ని ప్రకటిస్తూనే తమ సమస్యలనూ కవిత్వీకరించారు.

బాబ్రీమసీదు కూల్చివేత (06-12-1992) మతతత్వ రాజకీయాల నేపథ్యంలో పేదరికానికి, వెనుకబాటుతనానికి, అభద్రతా భావానికి మూలాల అన్వేషణలో ఏకకాలంలో తాము 'ఇంటా', 'బయటా' ఉద్యమించాల్సి ఉందని మైనారిటీ కవులు ప్రపంచీకరణ దృక్పథాన్ని గుర్తించారు. తమ సమస్యలలోని ప్రత్యేకతా, భిన్నత్వమూ, ఆవేదనలో అంతరాలూ ఉన్నాయని గుర్తించిన మైనారిటీ కవులు, రచయితలు ప్రత్యేకంగా మరో వేదిక ఏర్పాటు చేసుకున్నారు. వలస ఆర్థిక, వ్యాపార పద్ధతులవల్ల క్రమంగా పెరుగుతున్న ప్రాంతీయ అసమానతల ఫలితంగా ప్రాంతీయ అస్తిత్వవాద ఆందోళనలో ఊపిరిపోసుకున్నాయి. ఇలా రూపొందిందే ప్రత్యేక తెలంగాణ చైతన్యం ఇందులో భాగంగా రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, భాషా సాహిత్యాది రంగాలు ఏ విధంగా అణచివేతకు, పక్షపాతానికి గురైనాయన్న అంశాలను ఏ విధంగా ఎలుగెత్తి చాటుతున్నారు.

గత దశాబ్దంలో అనేక కవితా ప్రక్రియాలలో రచనలు వచ్చినప్పటికీ 1990 తరువాత ప్రపంచీకరణ క్రమంలో బహుళజాతి సంస్థలు సహజవనరులని నిర్మూలించడం, ప్రజలు ఆరోగ్యానికి కీడుచేసే రసాయనిక ఎరువులు వాడకం, అనేక కారణాల వల్ల వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగడం మొదలైన వాటి వల్ల వాతావరణంలో దుష్పరిణామాలును కవులు ఎత్తి చూపారు. ఏది ఏమైనా ఇరవయ్యవ శతాబ్దంలోని చివరి దశాబ్దం ఇరవై ఒకటవ శతాబ్దానికి ప్రవేశ ద్వారంగా అమరింది.

**6.7.ప్రపంచీకరణ కవిత్వంలో వివిధ ధోరణులు ముగింపు:** ఆదునిక సాహిత్యంలో భాగంగా 1970 నుంచి తెలుగు సాహిత్యాన్ని ఒక కుదుపు కుదిపి ప్రభావితం చేస్తున్నసాహిత్యోద్యమం విప్లవ సాహిత్యం సాయుధ పోరాటం ద్వారా రాజ్యాదికారాన్ని కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో రైతాంగ పోరాటాల ద్వారా విముక్తిని సాధించాలన్న ధ్యేయంతో కొనసాగుతున్న విమోచనోద్యమాలకు అద్దంపడుతున్న సాహిత్యాన్ని విప్లవసాహిత్యం అంటున్నాము. విప్లవ దృక్పథం ప్రపంచీకరణ (లేదా)సామ్రాజ్యవాద కవిత్వానికి ప్రేరణని ఇచ్చింది.

తెలుగు సాహిత్యంలో ప్రమంచీకరణ ప్రభావం మహిళాలోకాన్ని, స్త్రీ చైతన్యం కోసం స్త్రీలే కాక పురుషులు సహితం జేజేలు పలికారు. గత దశాబ్దకాలంగా తెలుగు సాహిత్యంలో ప్రకంపనలు సృష్టిస్తున్న సాహిత్య ధోరణి స్త్రీవాద కవిత్వం.

చరిత్రను, సంస్కృతిని, సాహిత్యాన్ని స్త్రీల దృక్కోణం నుంచి విశ్లేషిస్తున్న స్త్రీవాద సాహిత్య సమాజంలోని వివక్షతను ప్రశ్నిస్తుంది. స్త్రీల అణచివేతనూ, పీడనను ప్రతిఘటిస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో స్త్రీ,పురుషుల మధ్య సమానత్వం ప్రాతిపదికగా గల మానవ సంబంధాలను, అణచివేతలకు తావులేని నూతన విలువలను ఆకాంక్షిస్తుంది. గణనీయమైన కృషి జరుగుతూ ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో గత రెండు దశాబ్దాలుగా యావత్ భారతదేశాన్ని ఒక కుదుపు కుదుపుతున్న మరో సాహిత్య ధోరణి దళిత కవిత్వం. అటు సమాజాన్ని ఇటు సాహిత్యాన్ని, చరిత్రను, సంస్కృతిని, సాహిత్యాన్నే దళితుల దృష్టితో పరిశీలించి వచ్చిందే దళిత కవిత్వం. ఇక పోతే తొలిదశలో దళితులతో సంఘీభావం తెలుపుతూనే మైనారిటీ వాదుల సమస్యలను వ్యక్తపరిచారు.

బాబ్రి మసీదు కూల్చివేత(06.12.1992) మతతత్వ రాజకీయాల నేపథ్యంలో పేదరికానికి, వెనుకబాటుతనానికి, అభద్రతా భావానికి మూలాల అన్వేషణలో ఏకకాలంలో తామూ ఇంటా, బయటా ఉద్యమించాల్సి ఉందని మైనారిటీ కవులు మైనారిటీ దృక్పథాన్ని గుర్తించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో వాళ్ల సమస్యలని ఏకరువుకవులు, రచయితలు పెట్టుకున్నారు.

వలస, ఆర్థిక, వ్యాపార పద్ధతులవల్ల క్రమంగా పెరుగుతున్న ప్రాంతీయ అసమానతల ఫలితంగా ప్రాంతీయ అస్తిత్వవాద ఆందోళనలో ఊపిరిపోసుకున్నాయి. ఇలా రూపొందిందే ప్రత్యేక తెలంగాణా చైతన్యం ఇందులో భాగంగా రాజకీయ, సామాజిక, సాంస్కృతిక భాష సాహిత్యాది రంగాలు ఏ విధంగా అణచివేతకు, పక్షపాతానికి గురైనాయో అనేది కవులు ఎత్తి చూపారు.

ఏది ఏమైనా ఇరవయ్యో శతాబ్దంలోని చివరి దశాబ్దం ఇరవై ఒకటవ శతాబ్దానికి ప్రవేశ ద్వారంగా అమరింది.

## పాదసూచికలు

1.అడిగోపుల వెంకటరత్నం - విప్లవానికి పురిటి గది

2.వరవరరావు - జీవనాడి కవితా సంకలనం; పుట 15

3.తెలుగు కవితోద్యమాలు - తెలుగు అకాడమి ప్రచురణలు

4.అగ్నికణాలు - అక్టోబర్; సోషలిస్ట్ పబ్లికేషన్స్ విజయవాడ; పుట.9,12

5.నెత్తురోడుతున్న పదచిత్రం ; పుట.20,23

6.జూకంటి జగన్నాథం - ఇండియా ప్రైవేట్ లిమిటెడ్;నయనం ప్రచురణలు, పుట.2

7.దూదిమేడ - మార్చి.1997; పుట.31,33

8.జూకంటి జగన్నాథం - గంగడోలు; డిసెంబర్.1998.పుట.6,128

9.దర్భశయనం శ్రీనివాసాచార్య వ్యాసం

10.విరసం;2001.

11.వరవరరావు - ఉద్యమం నెలబాలుడు విరసం.1983

12.శ్రీరంగం శ్రీనివాసరావు - ఝంఝ కవిత

13.బోజ్జాతారకం - నది పుట్టిన గొంతుక

14. తెలుగు కవితోద్యమాలు - తెలుగు అకాడమి ప్రచురణలు;పుట.57

15.కొండేపూడి నిర్మల - లేబర్ రూం కవిత

16.జయప్రభ - వామనుడి మూడోపాదం

17.పాటిబండ్ల రజని - అబర్షన్ స్టేట్ మెంట్ కవిత

18.సావిత్రి - బందిబోట్లు

19.మందవరపు హైమావతి  కవిత

20.విమల - వంటిల్లు

21.కొండేపూడి నిర్మల - మల్టీనేషనల్ ముద్దు; పుట.37

22.కొండేపూడి నిర్మల - నడక;పుట.19

23.డా.జ్యోత్స్న ప్రభ - సవ్వడి; పుట.24

24.కొండపల్లి నీహారిక కవిత; ఆంధ్రజ్యోతి,పుట.05

25.శీలా సుభద్రాదేవి - కొత్తమజిలీ; పుట.46

26.పసుపులేటి గీత - ఆక్వాఫోబియా కవిత;

27.అరుణ జ్యోతి - 50వసంతాల తెలుగుకవిత వస్తువు,రూపం,శిల్పం; పుట.97

28.వొడ్నాల సూర్య - వొడ్నాల సూర్య కవితలు; పుట.07

29.50 వసంతాల తెలుగు కవిత; పుట.97

30.ఖాదర్ మొహియుద్దీన్ - పుట్టుమచ్చ; పుట.30

31.యం.డి. యాకుబ్ పాష కవిత

32.ఖాదర్ మొహియుద్దీన్ - పుట్టుమచ్చ కవిత;పుట.41

33.యాకూబ్ - కాలహాళిక;పుట.23

34.లంకా శివప్రసాద్ - గజేంద్ర మోక్షం కవిత.

35.పోస్ట్ మాడర్నిజం - ఒక పరిచయం; నవీన్ మిసిమి. నవంబర్,డిసెంబర్

# 7. ముగింపు

ఆధునిక తెలుగు సాహిత్యం వివిధ ప్రక్రియలతో సర్వాంగ సుందరంగా వర్ధిల్లుతుంది. కథ, కథానిక, నవల వంటి ప్రక్రియలు ఎన్నివున్నా కవిత్వానికే అగ్రతాంబులం. ఈమాట ప్రాచీన అర్వాచీన కవిత్వాల రెండింటి విషయంలోనూ అన్వయిస్తుంది.

ఆధునిక తెలుగు కవిత్వం గురజాడ కలంబలంతో తొలి అడుగు వేసి ముత్యాలసరాల్ని అలంకరించుకొని, పుత్తడిబొమ్మలా సింగారించుకొని, చకచకా నడిచేసింది. రాయప్రోలును రమ్యంగా ఆలోకిస్తూ, కృష్ణశాస్త్రి సెలయేటి పాటలో వియోగ మధుర మురళీనాదాన్ని వినిపిస్తూ, వేదుల వారి దీపావళి వేడుకల్ని చూసి తరించింది. శ్రీశ్రీ విప్లవ శంఖంతో బాటు సింహగర్జన చేసి, కవితా శరధి దాశరథి సారధ్యంలో జలపాతంలా చెంగున దూకుతూ, బైరాగితో బేటీ చేసి తిలక్ చేత తిలకం దిద్దించుకుంది. శేషేంద్రుని చేత సెబాష్ అనిపించుకుంది. కల్పవృక్షమై విశ్వంభరను సృష్టించింది. జ్ఞానపీఠ్ ను అధిష్ఠించింది. మనోమందిరాల్లో దీపం వెలిగించి "స్మైల్" చేస్తూ అగ్నిసరస్సును వజ్రాన్ని వికసింప చేసింది.

ఆధునిక తెలుగు కవిత్వం అత్యాధునికత లేక ఆధునికానంతరత అనే సరికొత్త రూపంతో మునుముందుకు సాగిపోతుంది. స్త్రీవాద కవిత్వంగానూ, దళిత, మైనారిటీ, సైన్సు కవిత అత్యాదునికత మోసులెత్తింది. గేయ, మినికవిత్వ, హైకూ, ప్రపంచీకరణ కవిత్వంగా నినదించింది. ఇలా ప్రపంచీకరణ కవిత్వంగా తన బాణీని వినిపిస్తూ విజయవిహారం చేస్తోంది.

ఆధునిక తెలుగు కవిత్వానికి నూరేళ్ళ నిండబోతున్నాయి. ఇరవయ్యో శతాబ్దమంతా ఆధునిక తెలుగు కవిత్వయుగం. నవ్యాంధ్ర కవితా శకపురుషులుగా గురజాడ, రాయప్రోలులను పరిశోధకులు చెప్పారు. యుగకర్తల నుండి నేటివరకు అవిచ్ఛిన్నంగా సాగుతున్న ఆధునిక కవితా ప్రస్థానంలో ఎందరో లబ్ధ ప్రతిష్టులైన కవి వతంసులున్నారు.

ప్రపంచాన్నంతా ఒకే సంతలాగ మార్చి వస్తువులు, మేధస్సు, సంస్కృతిని ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవటమే ప్రపంచీకరణ అని అగ్ర దేశాలకు ఉపయోగపడే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ అసమాన ప్రపంచీకరణ భారతదేశంలోని ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక రంగాలను ప్రభావితం చేసి చెడు ఫలితాలను ఇచ్చింది. ప్రపంచీకరణ విధానాలకు తలొగ్గిన మన పాలకులు వ్యాపారం చేసే కార్పోరేట్ వ్యవసాయాన్ని అమలు చేశారు. విదేశీ వస్తువులను అమ్ముకోవడానికి వీలుగా దేశీయ

పరిశ్రమలను మూసేశారు. సామ్రాజ్యవాద దేశాలు వ్యాపారం, అణ్వస్త్రం పేరుతో మనదేశంలో రాజకీయ జోక్యం చేసుకుంటున్నాయి. మన జీవితాన్ని మనం మర్చిపోయేటట్లు వివిధ ఛానళ్ళ ద్వారా విదేశీ సంస్కృతిని దిగుమతి చేస్తున్నారు. ఇట్లా వచ్చిన ప్రపంచీకరణకు వెనక ఉన్న ఆర్థిక, రాజకీయ సూత్రాలను పరిశోధనలో విశ్లేషించాను.

సమాజంలో ప్రపంచీకరణ సృష్టించిన ప్రకంపనల్ని చైతన్యవంతులైన తెలుగు కవులు, రచయితలు వ్యతిరేకిస్తూ సాహిత్య సృష్టి చేసారు. 90వ దశకం నుంచి ప్రారంభించి ఈనాటి వరకు వివిధ రూపాలలో నిరసన కవిత్వం వచ్చింది. వస్తువు, రూపంలో ఎంతో వైవిధ్యంతో కూడిన కవిత్వం ఈ కాలపు కవులు రాశారు. సృజనాత్మక ప్రక్రియ కుండే వెసులుబాటు వలన కవిత్వంలోకి కొత్త పోలికలు, భావచిత్రాలు, ప్రతీకలు వచ్చాయి.

ప్రపంచీకరణ కవిత్వంలో విభిన్న ధోరణులలో వచ్చిన విప్లవ, దళిత, స్త్రీవాదం, మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వవాదాలలో వచ్చిన కవిత్వాన్ని పేర్కొన్నాను. అందులో ఆయా ప్రక్రియలు వాటి నేపథ్యంలో వచ్చిన కవితా స్పృహను వెల్లడించాను. ప్రపంచీకరణ ప్రభావాన్ని ఎండగడుతూ అన్ని సమూహాల నుంచి సాహిత్యం వస్తున్నది. ప్రపంచీకరణ పైన కేవలం తెలుగు కవులు మాత్రమే కాకుండా అనేక మంది విజ్ఞాన వేత్తలు, తత్వవేత్తలు కూడా కవిత్వం రాస్తున్నారు.

ప్రపంచీకరణ క్రమంలో వస్తువు, శిల్పం విషయంలో కూడా లోతైన పరిశోధన చేసాను. ఇందులో ఆయాకవులు పేర్కొన్న కవితలలో ఉన్న వస్తుశిల్పాలను గూర్చి పేర్కొన్నాను. ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ తెలంగాణ నుంచి భాగా వ్యతిరేక కవిత్వం వచ్చింది. ఈ ప్రాంతం యువకవులలో స్పృశించే ప్రాంతీయ అస్తిత్వవాదాన్ని బలంగా వినిపించారు. వారి భావాలను చాలా స్పష్టంగా వెల్లడించారు. కవిత్వం భావావేశానికి సంబంధించిన ప్రక్రియ కనుక తెలంగాణ ప్రాంతంలో కవులులో ఆవేశం వలన వ్యతిరేక కవిత్వం వచ్చింది.

మానవత్వపు విలువలను మంటగల్పడం ప్రపంచీకరణ లక్ష్యం. ఆరోగ్యవంతమైన మానవ సంబంధాలను వస్తు వినిమయ సంబంధాలుగా మార్చి పరిమార్చటం ప్రపంచీకరణ ధ్యేయం. ఇది మానవత్వం మూలుగులను పీల్చే వైరస్. ఎయిడ్ గంజాయి ధూపంతో వర్ధమాన దేశాలకు మత్తెక్కించి ప్రపంచ పటంలో వాటి ఉనికిసే రూపుమాపే ఎయిడ్స్ మహమ్మారి ప్రపంచీకరణం. అగ్రరాజ్య దురహంకార విషవలయం ప్రపంచీకరణం. బడుగుదేశాల బతికే హక్కును ఆట కట్టించే

అగ్రరాజ్యాల దుష్ట చదరంగం ప్రపంచీకరణం. మనుషుల్లో కత్తి వైరాన్ని పెంచి మరణ మృదంగ ధ్వానాలకు తలలాడించి తన్మయత్వం చెందే వెయ్యి తలల సర్వం ప్రపంచీకరణం.

2000 సంవత్సరం నుండి 2009 సంవత్సరం వరకు తెలుగు సమాజంలో కవిత్వం తిరిగిన మలుపులను దాదాపు 200 మంది కవుల గొంతుకలలో వినిపిస్తూ, ఈ సందర్భాలన్నింటిని చరిత్రగతిలో మరుగున పడకుండా 'అనేక' సంకలనం ప్రచురించడం కోసం అఫ్సర్, వంశీకృష్ణలు పడ్డ శ్రమ వృధా కాలేదు. ఈ పదేళ్ళలో, సమాజంలో చోటుచేసుకున్న అసమానతలు, అనేక విధాలైన అస్థిత్వవాదాలుగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో, వెయ్యి ముఖాలుగా విస్తరించిన కవిత్వ అస్థిత్వవేదనను బలంగా అభివ్యక్తికరిస్తూ, ఈ అనేక కొత్త గొంతుకలు చెప్పే కొత్తకొత్త విషయాలు మనల్ని తన్మయత్వంలోకి తోస్తూనే మనలో ఆలోచనలు రేకెత్తిస్తాయి. ఈ పదేళ్ళలో కవిత్వం సమాజంలోని స్థితిగతుల్ని స్పృశిస్తూ ప్రపంచీకరణ నీడలో అభ్యుదయ ప్రేరకమై, సమాజహితకరం అయిసాగిందా అన్నప్రశ్నకు కూడా సమాధానం ఈ సంకలనంలో దొరుకుతుంది. తరతరాల మానవ శ్రమ సంచిత సంస్కృతి అతలాకుతలం కాబోయే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. భిన్నరూపాల్లో అన్నిరంగాల్లో చాపకింద నీరులా కాళ్ళకింద నాచులా పరుచుకుంటున్న ప్రపంచీకరణ దుష్ప్రభావాన్ని పసిగట్టాలి. నడుం కట్టాలి.

ఉద్యమ స్ఫూర్తితో, సమ్యగవగాహనా చైతన్యంతో, విస్పష్ట రాజకీయ దార్శనికత్వపు జెండా రెపరెపలతో జనరాసులు పిడికిళ్ళు బిగించి హోరెత్తి నినదించిననాడు ప్రపంచీకరణ ఎత్తుగడలు నీటి బుడగలవుతాయి.

2001-2010... తెలుగు సాహిత్యానికి సంబంధించి కథలైనా, కవిత్వమైనా నాలుగు అస్తిత్వ ప్రధాన స్రవంతులు కులం, లింగం, మతం, ప్రాంతం ప్రాతిపదికలుగా విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన, వస్తున్న కవులు తమ వైయుక్తికం మరియు సామాజిక అనుభవాలను, అభ్యంతరాలను పూనికతో అక్షర రూపంలో పొదిగిన దశాబ్దం ఇది. ఇదే సమయంలో దారి దీపమయ్యే ఏ సైద్ధాంతిక భావజాలాన్ని, తమతమ వాదనల్లో పొందుపర్చుకుని, తమ దృక్పథాలను సంపన్నమూ, బలోపేతము చేసుకునే ప్రయత్నాలు లేకుండానే, తమతమ సమస్యలకు ఒక పరిష్కారం ఎక్కడి నుంచో లభ్యమవుతుందనే దృష్టి కలిగి వుండడం విచిత్రం. ప్రపంచీకరణ వినాశకర ప్రభావం మొత్తం దేశం మీదే వుండగా ఈ సామాజిక వర్గాలేవీ దానికి

అతీతం కావు. 2000 నుంచి 2010 వరకూ ప్రపంచీకరణ విజృంభణ ఎంతటిదో, మొత్తంగా ఒక కవిత్వ సంపుటిలో అదే ప్రధానవిషయంగావచ్చింది.

చివరగా, కవులు తమ కలాలను కాలాలకు అనుగుణంగా ప్రతీమలుపు దగ్గర సానబట్టుకుంటూ, సమకాలీన పరిస్థితులకు దర్పణమై జీవితాన్ని అన్నికోణాల నుండి చూస్తూ, సమాజానికో దిక్కూ, దిశా నిర్దేశించే దిశగా కదులుతున్నారని ''అనేక'' సంకలనం నిరూపిస్తుంది. అంతేకాకుండా ఈ పదేళ్ళలో తెలుగు సాహిత్యం తన ఉనికిని తానే ప్రశ్నించుకుంటూ అస్థిత్వ స్పృహతో పూర్తి పరిపూర్ణత సంతరించుకుని కొత్తపుంతలు తొక్కుతున్నది అన్నది కూడా ప్రపంచీకరణ కవిత్వం ద్వారానే వ్యక్తమౌతుంది.

# ఉపయుక్త గ్రంథసూచి


1.రామమోహనరావు.అద్దేపల్లి: విలోకనం;సూర్య ప్రచురణలు.హైదరాబాదు-2009

2.కాంతారావు.టి.ఎల్: కవితాలోకనం,సాహిత్య విమర్శ వ్యాసాలు.వి.ప.హౌస్ హైదరాబాదు,2010

3.అప్సర్/మురళీకృష్ణ (సం): అనేక-పదేళ్ళ కవిత్వం, 2000-2009; సారంగా పబ్లిషర్స్

4.డా.ఎస్.శరత్ జ్యోత్స్నా రాణి: స్వాతంత్ర్యానంతర తెలుగుకవిత-వస్తువు,రూపం,శిల్పం; జ్యోత్స్నా కళాపీఠం;హైదరాబాదు.ఆగస్టు-2003

5.డా.వి.వీరాచారి: సాహిత్యంలో వివిధశాస్త్రంశాల ప్రతిఫలనాలు; సాహితీకళానిలయం, వరంగల్-2009

6. అశోక్ కుమార్: వ్యూహం, విజయవాడ; చినుకు ప్రచురణలు ; జూన్ - 2006

7. ఆశారాజు : సర్వాంతర్యామి , హైదరాబాద్ ; ఝురీ పోయెట్రీ సర్కిల్; డిసెంబర్ - 2005

8. ఎబికె : పరాధీన భారతం, హైదరాబాద్; పర్ స్పెక్టివ్స్; మే - 1993

9. కవల్జిత్ సింగ్ : ప్రపంచీకరణను ప్రశ్నిద్దాం, హైదరాబాద్;ప్రజాశక్తి బుక్ హౌస్; నవంబర్ - 06

10. కుటుంబరావు కొడవటిగంటి : సాహిత్య వ్యాసాలు, ఆంధ్రప్రదేశ్, విరసం; మే - 2001

11. కృష్ణజయంతి : 50 వసంతాల తెలుగు కవిత, హైదరాబాద్;జయంతి పబ్లికేషన్స్; 2001

12. కె.వి.ఆర్ : అక్షర తుణీరం, ఆంధ్రప్రదేశ్; విరసం; జనవరి - 1999

13. కె.వి.ఆర్ : ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర, ఆంధ్రప్రదేశ్; విరసం; నవంబర్ - 1992

14. కె.ఆర్.చౌదరి : WTO వలలో రైతాంగం విలవిల,హైదరాబాద్;ప్రజాశక్తి బుక్ హౌస్;2001

15. కె.ఆర్.చౌదరి : ప్రపంచీకరణ ఎవరిని ఉద్ధరించటానికి, ఆంధ్రప్రదేశ్; ఎ.బి.కె:ఏప్రిల్ - 2005

16. గుడిపాటి : ఇతివృత్తం, విజయవాడ; ఋషి ప్రచురణలు; ఏప్రిల్ - 2003

17. గుడిపాటి : గ్లోబలైజేషన్, హైదరాబాద్; మొలక ప్రచురణలు; జూన్ - 2002

18. జేమ్స్ పెట్రాస్ : గ్లోబలైజేషన్, ప్రపంచీకరణ వ్యతిరేక వేదిక

19. జింబో : గుండెతడి, హైదరాబాద్; ప్రోజ్ పోయెట్రీ ఫోరమ్; డిసెంబర్ - 2005

20. జనార్ధన్ జె : మూసీకోలా, హైదరాబాద్; విరసం; జనవరి - 2004

21. జగన్నాథం జూకంటి: వాస్కోడిగామా.కామ్,సిరిసిల్ల;నయనం ప్రచురణ,డిసెంబర్-2000

22.జయప్రభ : నాలుగో గోడ, హైదరాబాద్; చరిత ప్రచురణలు; 1992

23. జాన్ పెర్కిన్స్.(మూలం): ఒక దళారీ పశ్చాత్తాపం, హైదరాబాద్; వీక్షణం పబ్లికేషన్స్;

దిలీప్ కొణతం (అనువాదం) జనవరి - 2006
24. జనార్ధన్ వల్లభాపురం : పహారా కాస్తున్న రాత్రి, మహబూబ్ నగర్; ప్రజాసాహిత్య వేదిక; మార్చి- 2000
25. దేవేందర్ అన్నవరం : నడక, కరీంనగర్; నూతన సాహితి; అక్టోబర్ - 2003
26. దేవేందర్ అన్నవరం : తొవ్వ, కరీంనగర్; నూతన సాహితి; నవంబర్ - 2001
27. దేవరాజ్ తుమ్మల : కచ్చురం, ఆదిలాబాదు;మానస సాహితీ ప్రచురణలు;2004
28. డా. లక్ష్మణ చక్రవర్తి : కవిత్వానుసంధానం; కవిత్వ విశ్లేషణ వ్యాసాలు;ఆగస్టు-2012
29. ఉమ్మిటి శివలింగం : (సాహితీ వ్యాసాలు; జులై- 2002)
30. నాగయ్య . జి : తెలుగు సాహిత్య సమీక్ష, తిరుపతి; నవ్య పరిశోధక ప్రచురణలు, 1999
31. నారాయణరెడ్డి : దాలి, నల్లగొండ ; తెలంగాణా సాంస్కృతిక వేదిక ; జులై - 2001
32. నారాయణరావు వేల్చేరు : తెలుగు కవితా విప్లవాల స్వరూపం, హైదరాబాద్;1987
33.ప్రభాకర్ రెడ్డి.టి: తెలుగు విప్లవకవిత్వంలో ప్రతీక, అనంతపురం;ప్రభాకర్ ప్రచురణలు,
34. ప్రసాద్ ఎ. బి. కె. : సర్వసమర్పణం, హైదరాబాద్; ప్రజాశక్తి బుక్ హౌస్; మార్చి - 2002
35. ప్రభు: పారిపోలేం, కాకినాడ; అనల ప్రచురణ; జూన్ - 2005
36. ప్రసేన్: ప్రసేన్ సర్వస్వం, ఖమ్మం; యోగి పబ్లికేషన్స్, నవంబర్ - 2005
37. ప్రసాద్ వంగపండు: డంకెల్ భాగోతం; ఎపిపికెఎం
38. ప్రజాశక్తి బుక్ హౌస్ : రాజకీయ తరగతులు, హైదరాబాద్; జనవరి - 2006
39. ప్రజాశక్తి బుక్ హౌస్ : క్లింటన్ పర్యటన ఎవరి కోసం, హైదరాబాద్ - 2002
40. బాలాజి పలమనేరు : మాటల్లేని వేళ, పలమనేరు; పవిత్ర ప్రణీత ప్రచురణలు;ఫిబ్రవరి - 2007
41. భార్గవీరావు : తూర్పుగాలి, హైదరాబాద్; పంచజన్య పబ్లికేషన్స్; డిసెంబర్ - 2005
42. మంజులత ఆవుల(సం.): తెలుగులో కవిత్వోద్యమాలు, హైదరాబాద్; తెలుగు అకాడమి, 2003
43.మంజులత.ఆవుల: ఆధునిక తెలుగుసాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు; హైదరాబాద్; తెలుగు అకాడమి; 2005
44. మధుసూదనరావు త్రిపురనేని : సాహిత్యంలో వస్తు శిల్పాలు, హైదరాబాద్; పర్ స్పెక్టివ్స్
45. మధుసూదనరావు త్రిపురనేని : కవిత్వం చైతన్యం, ఆంధ్రప్రదేశ్; విరసం; జూన్ - 2006

46.రామమోహనరావు అద్దేపల్లి: పొగచూరిన ఆకాశం,కాకినాడ;అద్దేపల్లి సాహిత్య ఫౌండేషన్;
47. రవి తెలకపల్లి. : జనకవనం, వరంగల్; ఆహ్వాన సంఘం; జూలై - 2005
48. రామకృష్ణ ఎ.యస్: విద్య ఆధారాలు, గుంటూరు; న్యూయెరా పబ్లికేషన్స్, 2004-05
49. రాఘవేంద్రరావు యార్లగడ్డ:ముంత పొగ, హైదరాబాద్; శ్రావ్య పబ్లికేషన్స్; అ.2001
50. రవీంద్ర నూటెంకి : జాడ, ఆదిలాబాదు; జీవనది ప్రచురణలు; నవంబర్ - 2003
51. రవికాంత్ బెల్లంకొండ : ఒంటరి దుఃఖం, లింగగిరి; నేహ పబ్లికేషన్స్, 2003
52. రాములు బి.ఎస్. : పాలు, హైదరాబాద్; విశాల సాహితీ అకాడమి; 2004
53. రామారావు.ఎస్వీ: తెలుగులో సాహిత్య విమర్శ, హైదరాబాద్; పసిడి ప్రచురణ - 1974
54. వేణుగోపాల్ ఎన్ : అమ్మకానికి ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్; విశ్లేషణ ప్రచురణ - 1999
55. వెంకటేశ్వరరావు కారుమంచి : ప్రపంచీకరణ నూతన దశ, గుంటూరు; లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్
56. వెంకటేశ్వర్లు.లంకా : సమకాలీనకవిత్వంలో ప్రతీకలు-భావచిత్రాలు,
హైదరాబాద్;విప్లవ కంప్యూటర్ సర్వీసెస్; 2005
57. వంశీకృష్ణ : Meanings, హైదరాబాద్; స్పృహ సాహితీ సంస్థ, ఫిబ్రవరి - 2005
58. శివప్రసాద్ వల్లూరి : హింసధ్వని, గుంటూరు; అరసం; జనవరి - 2000
59. సుమతి నరేంద్ర.పి: వర్తమానసాహిత్యం-చైతన్యం, హైదరాబాద్; తెలుగుశాఖ,ఒ.యూ
60. సుబ్రమణ్యం.జి.వి: వాఙ్మయి, హైదరాబాద్; పి.ఎస్.టి.యు. జూలై - 2004
61. సుధాకర్ ఎండ్లూరి : 'ఆట'జనికాంచే, రాజమండ్రి; మానస మనోజ్ఞ ప్రచురణలు;జూ.2006
62. శివశంకర్ పాపినేని(సం) : కవిత - 2004, విజయవాడ; సాహితి మిత్రులు; మే - 2005
63. శివశంకర్ పాపినేని(సం) : కవిత - 2005, విజయవాడ; సాహితి మిత్రులు;మే - 2006
64. శివశంకర్ పాపినేని(సం) : కవిత - 2006, విజయవాడ; సాహితి మిత్రులు;మే - 2007
65. శివశంకర్ పాపినేని : సాహిత్యం మౌలిక భావనలు, గుంటూరు; పాపినేని జనవరి - 1996
66. సత్యనారాయణ.ఎస్వీ: గ్లోబలైజేషన్ కథలు,హైదరాబాద్;వి.పబ్లిషింగ్ హౌస్;మార్చి- 2003
67. సత్యనారాయణ ఎస్వీ.(సం) : ప్రపంచీకరణ ప్రతిధ్వని, హైదరాబాద్;వి.ప.హౌస్;2003
68.సత్యనారాయణ.ఎస్వీ.(సం):కవితా దశాబ్ది(1991 - 2000)హైదరాబాద్;వి.ప.హౌస్; 08
69.సత్యనారాయణఎస్వీ.(సం): తెలుగులో కవిత్వోద్యమాలు, హైదరాబాద్;తె.అకాడమి,2003

70.సత్యనారాయణ ఎస్వీ.(సం): జీవితం ఒక ఉద్యమం, హైదరాబాద్;అరసం.ప్ర.లు; 2005

71. వరవరరావు : అంతస్సూత్రం, హైదరాబాద్; నవోదయ ప్రచురణలు; జూన్ - 2006

72. విరసం : కాగితప్పులి కళ్ళలో భయం, హైదరాబాద్; విరసం నవంబర్ - 2001

73. శ్రీరాములు పై. : చేయిచాచిన వెన్నెల, అనంతపురం; శ్రీ ప్రచురణలు; సెప్టెంబర్ - 2005

74. సాహితి స్రవంతి : మార్పు, పాల్వంచ; సెప్టెంబర్ - 2002

75. శ్రీనివాసరావు బాణాల : పర్యాయపదం, ఫిబ్రవరి - 2005

76. శివకుమార్ వఝల. : దాఖలా, హైదరాబాద్; పోయెట్రీ ఫోరం ప్రచురణ; సెప్టెంబర్- 2004

77. సత్యభాస్కర్ ఎ. : కలాలు, గళాలు, హైదరాబాద్; సాహితి స్రవంతి; జనవరి - 2006

78. శ్రీరాములు కందుకూరి : పీఠభూమి, హైదరాబాద్; ఝురీ పోయెట్రీ సర్కిల్; జ.2005

79. శ్రీరాములు కందుకూరి : కవ్వం, హైదరాబాద్; ఝురీ పోయెట్రీ సర్కిల్; అక్టోబర్ - 2002

80. శ్రీరామమూర్తి దేనువకొండ : వల్మీకం, హైదరాబాద్; రజనీ ప్రచురణలు, 2003

81. సుధామూర్తి(మూలం): డాలర్ కోడలు, విజయవాడ,అలకనంద ప్రచురణలు;జ-2006

82. సీతారాం : అదేపుట, ఖమ్మం; పాజిటివ్ పబ్లికేషన్స్; ఫిబ్రవరి - 2007

83. సుబ్రహ్మణ్యం జి.వి. : సివిల్ సర్వీసెస్ మెయిన్స్, హైదరాబాద్; హైదరాబాద్ స్టడీ సర్కిల్

84. సుదేరా కె. : పౌలికేక, విశాఖపట్టణం; కనకమేడల పబ్లికేషన్స్

85. మురళి.అట్లురి: ప్రపంచీకరణ పదేళ్ళ అనుభవాలు 1991-2001,

సుందరయ్య విజ్ఞాన కేంద్రం,హైదరాబాద్;జనవరి - 2003

86. హనుమంతరావు వి. : సంక్షోభంలో సంస్కరణలు, హైదరాబాద్; ప్రజాశక్తి బుక్ హౌస్

87. హెచ్చార్కె : నకులుని ఆత్మకథ, నవ్యసీమ ప్రచురణ; జూన్ - 2004

## పత్రికలు(సంచికలు)

1.అరుణతార : ప్రసాద్ చలసాని (సం),విరసం ప్రచురణ ; మార్చి - ఏప్రిల్, 2007

2.ప్రజాసాహితి : రవిబాబు కొత్తపల్లి(సం),నవంబర్ - 2002 సంచిక

3.ప్రజాసాహితి : రవిబాబు కొత్తపల్లి(సం),నవంబర్ - 2005 సంచిక

4.ప్రగతి : జీవన్ (సం), సెప్టెంబర్ - అక్టోబర్ - 2004 సంచిక

5.ప్రస్థానం : రవి తెలకపల్లి (సం), జనవరి - మార్చి - 2005 సంచిక

6.ప్రస్థానం : రవి తెలకపల్లి (సం), ఏప్రిల్ - జూన్ - 2005 సంచిక

7.ప్రస్థానం : రవి తెలకపల్లి (సం), మే - 2007 సంచిక

8.మిసిమి :

## దినపత్రికలు

1.ఆంధ్రజ్యోతి

2.ఆంధ్రభూమి

3.ఆంధ్రప్రభ

4.ఈనాడు

5.ప్రజాశక్తి

6.వార్త

7.సాక్షి

## ఉపయోగించిన పుస్తకాలు


1. అంజయ్య తైదల : పునాస, సిద్ధిపేట; మంజీర రచయితల సంఘం; జూన్-2006

2. కుమారస్వామి పిల్ల : ప్రపంచీకరణ పై పోటెత్తిన కవితా సంద్రం,

అనంతపురం : సాహితి స్రవంతి, అక్టోబర్ -2004

3. గుడిపాటి : గ్లోబలైజేషన్, హైదరాబాదు; మొలక ప్రచురణలు ; జూన్ - 2002

4. జగంటి జగన్నాధం : గ్లోబల్ ఖడ్గం, హైదరాబాద్; అక్షరం; జులై - 2001

5. వడ్లమూడి రంగారావు: భారతీయ భావాలు; గ్లోబల్ హ్యూమన్ సొసైటి పేజి 123,124

.6అశోక్ కుమార్ :వ్యూహం 2006 - జూన్ ; చినుకు ప్రచురణలు ;విజయవాడ ,

.7ఆశారాజు : సర్వాంతర్యామి డిసెంబర్ ;ఝురీ పోయెట్రీ సర్కిల్ ; హైదరాబాద్ ,- 2005

.8ఎబికె : పరాధీన భారతం మే ;పర్ స్పెక్టివ్స్ ;హైదరాబాద్ ,- 1993

.9కవల్జిత్ సింగ్ : ప్రపంచీకరణను ప్రశ్నిద్దాం;హైదరాబాద్ ,ప్రజాశక్తి బుక్ హౌస్ నవంబర్ ;-06

.10కుటుంబరావు కొడవటిగంటి :సాహిత్య వ్యాసాలు మే ;విరసం ,ఆంధ్రప్రదేశ్ ,-2001

.11కృష్ణజయంతి : ;జయంతి పబ్లికేషన్స్;హైదరాబాద్ ,వసంతాల తెలుగు కవిత 50 2001

.12కెఆర్.వి. :అక్షర తుణీరం జనవరి ;విరసం ;ఆంధ్రప్రదేశ్ ,-1999

ఆర్.వి.కె .13 : ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర;విరసం ;ఆంధ్రప్రదేశ్ , నవంబర్ -1992

.14కెచౌదరి.ఆర్. : వలలో WTO రైతాంగం విలవిల,హైదరాబాద్2001;ప్రజాశక్తి బుక్ హౌస్;

.15కెచౌదరి.ఆర్. : ప్రపంచీకరణ ఎవరిని ఉద్ధరించటానికికె.బి.ఎ ;ఆంధ్రప్రదేశ్ ,:ఏప్రిల్ -2005

.16గుడిపాటి :ఇతివృత్తం ఏప్రిల్ ;ఋషి ప్రచురణలు ;విజయవాడ ,- 2003

.17గుడిపాటి :గ్లోబలైజేషన్ జూన్ ;మొలక ప్రచురణలు ;హైదరాబాద్ ,-2002

.18జేమ్స్ పెట్రాస్ :గ్లోబలైజేషన్ ప్రపంచీకరణ వ్యతిరేక వేదిక ,

.19జింబో :గుండెతడి డిసెంబర్ ;ప్రోజ్ పోయెట్రీ ఫోరమ్ ;హైదరాబాద్ ,-2005

.20జనార్దన్ జె :మూసీకోలా ,హైదరాబాద్ జనవరి ;విరసం ;- 2004

.21జగన్నాధం జూకంటి 2000-డిసెంబర్,నయనం ప్రచురణ;సిరిసిల్ల,కామ్.వాస్కోడిగామా :

.22జయప్రభ :నాలుగో గోడ 1992 ;చరిత ప్రచురణలు ;హైదరాబాద్ ,

.23జాన్ పెర్కిన్స్ :(మూలం).ఒక దళారీ పశ్చాత్తాపం ;పబ్లికేషన్స్ వీక్షణం ;హైదరాబాద్ ,

దిలీప్ కొణతం (అనువాదం)జనవరి 2006 –

.24జనార్ధన్ వల్లభాపురం పహారా :కాస్తున్న రాత్రి ;మహబూబ్ నగర్ ,

ప్రజాసాహిత్య వేదిక ;మార్చి2000 -

.25దేవేందర్ అన్నవరం :నడక అక్టోబర్ ;నూతన సాహితి ;కరీంనగర్ ,- 2003

.26 దేవేందర్ అన్నవరం :తొవ్వ నవంబర్ ;నూతన సాహితి ;కరీంనగర్ ,- 2001

.27దేవరాజ్ తుమ్మల ;ఆదిలాబాదు ,కచ్చురం :మానస సాహితీ ప్రచురణలు;- 2004

2820 : కడియాల రామమోహనరాయ్ .డా .వ శతాబ్ది తెలుగు కవిత్వంయు.టి.ఎస్.పి ,2003 ;

29 ప్రయోగములు :సంప్రదాయము - ఆధునికాంధ్ర కవిత్వము : నారాయణరెడ్డి.సి.డా .-1967

.30 నాగయ్య . జి : తెలుగు సాహిత్య సమీక్ష;తిరుపతి , నవ్య పరిశోధక ప్రచురణలు 1999 ,

.31నారాయణరెడ్డి ,దాలి : నల్లగొండ తెలంగాణా సాంస్కృతిక వేదిక ; జూలై ;- 2001

.32నారాయణరావు వేల్చేరు 1987- నవంబర్;హైదరాబాద్ ,తెలుగు కవితా విప్లవాల స్వరూపం :

.33ప్రభాకర్ రెడ్డి.టి: తెలుగువిప్లవకవిత్వంలో ప్రతీక,అనంతపురం;ప్రభాకర్ ప్రచురణలు 1987

.34ప్రసాద్ ఎ. బి. కె మార్చి ;ప్రజాశక్తి బుక్ హౌస్ ;హైదరాబాద్ ,సర్వసమర్పణం : .- 2002

.35ప్రభు: పారిపోలేం జూన్ ;అనల ప్రచురణ ;కాకినాడ ,- 2005

.36ప్రసేన్ :ప్రసేన్ సర్వస్వం నవంబర్ ,పబ్లికేషన్స్ యోగి ;ఖమ్మం ,- 2005

.37ప్రసాద్ వంగపండు :డంకెల్ భాగోతం ఎపిపికెఎం ;

.38ప్రజాశక్తి బుక్ హౌస్ జనవరి ;హైదరాబాద్ ,రాజకీయ తరగతులు :- 2006

.39ప్రజాశక్తి బుక్ హౌస్ హైదరాబాద్ ,క్లింటన్ పర్యటన ఎవరి కోసం :- 2002

.40బాలాజి పలమనేరు ;పలమనేరు ,మాటల్లేని వేళ : పవిత్ర ప్రణీత ప్రచురణలు ఫిబ్రవరి;- 2007

.41భార్గవీరావు డిసెంబర్ ;పంచజన్య పబ్లికేషన్స్ ;హైదరాబాద్ ,తూర్పుగాలి :- 2005

.42మంజులత ఆవుల:(.సం) తెలుగులో కవిత్వోద్యమాలుతె ;హైదరాబాద్ ,.అకాడమి 2003,

.43మంజులత ,ఆధునిక తెలుగుసాహిత్యంలో ప్రక్రియలు :ఆవుల.ధోరణులు ;హైదరాబాద్ ;
తెలుగు అకాడమి 2005 ;

.44మధుసూదనరావు త్రిపురనేని పర్ స్పెక్టివ్స్ ;హైదరాబాద్ ,సాహిత్యంలో వస్తు శిల్పాలు :

.45మధుసూదనరావు త్రిపురనేని జూన్ ;విరసం ;ఆంధ్రప్రదేశ్ ,కవిత్వం చైతన్యం :- 2006

.46రామమోహనరావు అద్దేపల్లి పొగచూరిన : ఆకాశం,కాకినాడ;
అద్దేపల్లి సాహిత్య పౌండేషన్ 2005 ;

.47రవి తెలకపల్లి జూలై ;ఆహ్వాన సంఘం ;వరంగల్ ,జనకవనం : .- 2005

.48రామకృష్ణ ఎవిద్య :యస్. ఆధారాలుగుంటూర ,ు2004 ,న్యూయెరా పబ్లికేషన్స్ ;-0 5

.49రాఘవేంద్రరావు యార్లగడ్డ :ముంత పొగ అక్టోబర్ ;శ్రావ్య పబ్లికేషన్స్ ;హైదరాబాద్ ,- 2001
.50రవీంద్ర నూటెంకి  నవంబర్ ;జీవనది ప్రచురణలు ;ఆదిలాబాదు ,జాడ :- 2003
.51రవికాంత్ బెల్లంకొండ  2003 ,నేహ పబ్లికేషన్స్ ;లింగగిరి ,ఒంటరి దుఃఖం :
.52రాములు బి 2004 ;విశాల సాహితీ అకాడమి ;హైదరాబాద్ ,పాలు : .ఎస్.
.53రామారావుహై ,సాహిత్య విమర్శ తెలుగులో :ఎస్వీ.దరాబాద్ పసిడి ప్రచురణ ;- 1974
.54వేణుగోపాల్ ఎన్  విశ్లేషణ ప్రచురణ ;హైదరాబాద్ ,అమ్మకానికి ఆంధ్రప్రదేశ్ :-1999
.55 వెంకటేశ్వరరావు కారుమంచి  లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ;గుంటూరు ,ప్రపంచీకరణ నూతన దశ :
.56వెంకటేశ్వర్లు.లంకాసమకాలీనకవిత్వంలో:ప్రతీకలు-భావచిత్రాలు,హైదరాబాద్విప్లవ కంప్యూటర్ ; 2005 ;సర్వీసెస్
.57వంశీకృష్ణ  ఫిబ్రవరి ,స్పృహ సాహితీ సంస్థ ;హైదరాబాద్ ,Meanings :- 2005
.58శివప్రసాద్ వల్లూరి  :హింసధ్వని జనవరి ;అరసం ;గుంటూరు ,- 2000
59. సుమతి నరేంద్ర.పి ,తెలుగుశాఖ ;హైదరాబాద్ ,చైతన్యం-వర్తమానసాహిత్యం :ఉస్మానియా విశ్వవిద్యాలయం
.60సుబ్రమణ్యం.యు.టి.ఎస్.పి ;హైదరాబాద్ ,వాఙ్మయి :వి.జి. జులై - 2004
.61సుధాకర్ ఎండ్లూరి ' :ఆట'జనికాంచే జూన్ ;మానస మనోజ్ఞ ప్రచురణలు ;రాజమండ్రి ,- 2006

.

## పత్రికలు(సంచికలు)

1. అరుణతార : ప్రసాద్ చలసాని (సం),విరసం ప్రచురణ ; మార్చి - ఏప్రిల్, 2007

2. ప్రజాసాహితి : రవిబాబు కొత్తపల్లి(సం),నవంబర్ - 2002 సంచిక

3. ప్రజాసాహితి : రవిబాబు కొత్తపల్లి(సం),నవంబర్ - 2005 సంచిక

4. ప్రగతి : జీవన్ (సం), సెప్టెంబర్ - అక్టోబర్ - 2004 సంచిక

5. ప్రస్థానం : రవి తెలకపల్లి (సం), జనవరి - మార్చి - 2005 సంచిక

6. ప్రస్థానం : రవి తెలకపల్లి (సం), ఏప్రిల్ - జూన్ - 2005 సంచిక

7. ప్రస్థానం : రవి తెలకపల్లి (సం), మే - 2007 సంచిక

8. మిసిమి :

## దినపత్రికలు

1. ఆంధ్రజ్యోతి
2. ఆంధ్రభూమి
3. ఆంధ్రప్రభ
4. ఈనాడు
5. ప్రజాశక్తి
6. వార్త
7. సాక్షి